www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

రామాయణంలో భరతుడిలా పాలిస్తా!

కేజ్రీవాల్ మళ్లీ సీఎం అయ్యేదాకా ఆయన కుర్చీ అలాగే ఉంటుంది

ఢిల్లీ ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన ఆతిశీ వ్యాఖ్యలు

సీఎం ఆఫీసులో రెండో కుర్చీ

2



మంగళవారం | 24-9-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 65 సంచిక (Issue) : 160 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్షరుతువు, బాధ్రపదమాసం, బహుళపక్షం; తిథి: సప్తమి మ. 12.39 తదుపరి అష్టమి; నక్షత్రం: మృగశిర రా. 9.54 తదుపరి ఆర్ద్ర; వర్జ్యం: లేదు; దుర్ముహూర్తం: ఉ. 8.31-9.19, రా. 10.02-10.49; అమృతఘడియలు: మ. 1.10-2.45; రాహుకాలం: మ. 3.00-4.30; సూర్యోదయం: 6.07; సూర్యాస్తమయం: 6.05 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



తిరుమలలోని లడ్డూ, నెయ్యి నిల్వ కేంద్రాల్లో కుంభప్రోక్షణ

శాస్త్రోక్తంగా శాంతిహోమం

శ్రీవారి లడ్డూ నెయ్యిలో కల్తీకి పరిహారం

ఆలయం సహా లడ్డూ, నెయ్యి నిల్వ కేంద్రాల్లో కుంభప్రోక్షణ

ప్రసాదాలు, నైవేద్యాలకు ఇక దోషాలు ఉండవని ప్రధాన అర్చకుడు, ఈవో స్పష్టీకరణ.. అన్ని ఆలయాల్లోనూ శుద్ధి: మంత్రి

తిరుమల, ద్వారకాతిరుమల, ఆత్మకూరు, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): తిరుమల క్షేత్రంలో శాస్త్రోక్తంగా శాంతిహోమం జరిగింది. శ్రీవారి లడ్డూ ప్రసాదం నెయ్యిలో జంతువుల కొవ్వు కలిసిన నేపథ్యంలో పరిహారంగా ఈ హోమం చేపట్టారు. సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు ఆగమ పండితులు సోమవారం ఉదయం 6 నుంచి 10 గంటల మధ్య శాంతిహోమాన్ని నిర్వహించారు. లడ్డూప్రసాదాలు, ఇతర నైవేద్యాల పవిత్రత, దైవత్వాన్ని పునరుద్ధరింపజేసేందుకు ఆలయంలోని బంగారుబావి వద్ద ఉన్న యాగశాలలో వైఖానస ఆగమోక్తంగా శుద్ధి, శాంతిహోమాలను నిర్వహించారు. ముందుగా రుత్వికులు సంకల్పం, విష్వక్సేనారాధన, పుణ్యాహవచనం, వాస్తుహోమం, కుంభప్రతిష్ఠ, పంచగవ్య ఆరాధన, వాస్తుశుద్ధి, కుంభజాల సంప్రోక్షణ వంటి వైదిక కార్యక్రమాలను శాస్త్రోక్తంగా చేపట్టారు. పూర్ణాహుతి తర్వాత కుంభప్రోక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. శ్రీవారి ఆలయంలోని ఉప ఆలయాలతో పాటు ముడిసరుకులు ఉంచే ఉగ్రాణం, లడ్డూ వితరణ కేంద్రం, లడ్డూ బూందీ తయారీ కేంద్రం, అర్చక నిలయం, వరాహస్వామి ఆలయం, పుష్కరిణి, బేడి ఆంజనేయస్వామి

మిగతా 11వ పేజీలో...

స్పెషల్ దందా

'సూపర్ స్వామి' వైవీ హయాంలో ప్రత్యేక దర్శనాల జాతర



లోపలి పేజీల్లో..

నాలుగేళ్లలో **3.60** లక్షల మందికి స్పెషల్ దర్శనాలు

వీఐపీ సేవ పేరిట నాడు వ్యాపారం ఏమైనా చేశారా?

చైర్మన్ కోటా	వైవీ స్పెషల్	భూమన వంతు
రోజుకు 6 నుంచి 12 మందికే చాన్స్	రోజుకు సగటున 364 మందికి వీవీఐపీ దర్శనాలు	రోజుకు సగటున 172 మందికి అవకాశం

వైసీపీ హయాంలో వెంకన్న సన్నిధిని 'సూపర్ స్వామి' వైవీ సుబ్బారెడ్డి తన జాగీరుగా మార్చుకున్నారు. కొండపై సొంత సామ్రాజ్యం ఏర్పాటుచేసుకుని అడ్డగోలు వ్యవహారాలతో చెలరేగిపోయారు. టీటీడీ చైర్మన్‌గా ఆయన అరాచకాలకు పరాకాష్ఠ వీవీఐపీ దర్శనాల వ్యవహారం! టీటీడీ నిబంధనల ప్రకారం చైర్మన్ కోటా కింద రోజుకు సగటున ఆరు నుంచి 12 మందికి మాత్రమే వీవీఐపీ దర్శనం కల్పించాలి. ఒక్కో సిఫారసు లేఖపై ఆరుగురిని ఈ దర్శనాలకు అనుమతిస్తారు. వైవీ సుబ్బారెడ్డి జమానాలో మాత్రం.. రోజుకు సగటున 60 సిఫారసు లేఖలు ఇచ్చి 364 మందికి వీవీఐపీ దర్శనాలకు వీలు కల్పించారు. చైర్మన్‌గా నాలుగేళ్ల కాలంలో 3,60,338 మందికి దగ్గరుండి దర్శనాలు చేయించారు. సుబ్బారెడ్డితో పోల్చితే కొద్దికాలమే భూమన కరుణాకర్‌రెడ్డి చైర్మన్‌గా ఉన్నారు. కానీ, ఆ పదవిలో ఉన్న 9 నెలల కాలంలోనే ఏకంగా 43 వేల మందికి ప్రత్యేక దర్శనాలు కల్పించారు. అంటే సగటున రోజుకు 172 మందికి దర్శనాలు చేయించారు. దీనివెనక మర్మం ఏమిటి? దర్శనాల పేరిట ఏమైనా వ్యాపారం చేశారా? సిఫారసు లేఖలకూ ధరకట్టి అమ్ముకున్నారా? అన్న అనుమానాలు కలుగుతున్నాయి.

సిఫారసు లేఖలకు ధరలు కట్టి అమ్ముకున్నారా?

కుటుంబం, సొంత మనుషుల్లో ఎంతమందికి ఇచ్చినా రోజుకు సగటున మరీ 60 లేఖలు ఎలా ఇస్తారు?

చైర్మన్‌గా భూమన కరుణాకర్‌రెడ్డిదీ నాడు ఇదే వరస

జగన్ ప్రభుత్వ చైర్మన్ల తీరుపై సర్వత్రా అనుమానాలు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

జగన్‌కు ఐదేళ్ల అధికారం ఇస్తే ఏం చేశారో రాష్ట్రం యావత్ కళ్లారా చూసింది. పంచభూతాలను గుప్పిటపట్టి ప్రతిదీ ఓ వ్యాపార సరుకుగా మార్చేశారు. ఇసుక వ్యాపారమే ఇందుకు నిదర్శనం. జగనే ఇలా చేస్తే, ఆయన బాబాయి, 'సూపర్‌స్వామి' వైవీ సుబ్బారెడ్డి ఇంకెలా చేసి ఉంటారు? అబ్బాయిని ప్రసన్నం చేసుకుని తిరుమల పుణ్యక్షేత్రాన్ని దక్కించుకున్న ఆయన, అంతకుమించి చేయగలను అన్నట్లుగా దందా సాగించారు. సాక్షాత్తూ దేవదేవుడు తిరుమల

మిగతా 11వ పేజీలో...

భూమన అత్యుత్సాహం

రాజకీయాలు మాట్లాడనంటూనే ఉల్లంఘన

టోల్‌గేట్ వద్దే ఆయనకు పోలీసుల నోటీసులు

అఖిలాండం వద్ద కొబ్బరికాయ కొట్టి వ్యాఖ్యలు

'లడ్డూ నెయ్యి'పై కలుషిత రాజకీయ వ్యక్తులు దారుణంగా ప్రవర్తిస్తున్నారని విమర్శలు

బలవంతాన తిరుపతికి తరలింపు.. కేసు నమోదు

పంది కొవ్వు బంగారమట!

లడ్డూ రాగి చెంబు అట.. పొన్నవోలు భాష్యం

కిలో నెయ్యి రూ.319.. పందికొవ్వు రూ.1,200

బంగారంలో రాగి కలుపుతారు గానీ.. ఇత్తడిలో పుత్తడి కలుపుతారా అంటూ వ్యాఖ్యలు

లడ్డూపై సుప్రీంలో 4 పిటిషన్లు

ఏఆర్ ఫుడ్స్‌కు కేంద్రం నోటీసులు

విజిలెన్స్ నోటీసులకు వివరణ ఇవ్వండి

వైవీ సుబ్బారెడ్డికి హైకోర్టు ఆదేశం



ఆస్కార్ బరిలో.. లాపతా లేడీస్

భారత్ నుంచి అధికారిక ఎంట్రీగా ఎంపిక

తెలుగు సహా పలు భాషలకు చెందిన 29 చిత్రాల నుంచి షార్ట్ లిస్ట్

8



చైల్డ్ పోర్న్ చూడడం నేరమే..!

డౌన్‌లోడ్ చేసి భద్రపరచుకోవడమూ పోక్సో, ఐటీ చట్టాల ప్రకారం శిక్షార్హమే

సర్వోన్నత న్యాయస్థానం సంచలన తీర్పు

మద్రాస్ హైకోర్టు ఇచ్చిన తీర్పు కొట్టివేత

చైల్డ్ పోర్న్ డౌన్లోడ్ చేసిన యువకుడిపై క్రిమినల్ కేసు పునరుద్ధరణకు ఆదేశాలు

న్యూఢిల్లీ, సెప్టెంబరు 23: చిన్నపిల్లల నీలిచిత్రాలను (చైల్డ్ పోర్న్) చూడడం, డౌన్‌లోడ్ చేసి భద్రపరచుకోవడం పోక్సో (ప్రొటెక్షన్ ఆఫ్ చిల్డ్రన్ ఫ్రమ్ సెక్సువల్ అఫెన్సెస్), ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐటీ) చట్టాల కింద నేరమేనని సుప్రీంకోర్టు తేల్చిచెప్పింది. చైల్డ్ పోర్న్ కంటెంట్‌ను ఇతరులకు పంపించే ఆలోచన లేకుండా కేవలం ఫోన్‌లో భద్రపరచుకోవడం పోక్సో, ఐటీ చట్టాల కింద నేరం కాదంటూ ఈ ఏడాది జనవరిలో మద్రాస్ హైకోర్టు ఇచ్చిన తీర్పును ఘోర తప్పిదంగా అభివర్ణించింది. అసలు చిన్నపిల్లల నీలిచిత్రాలను చూడడం అనే చర్యలోనే.. చిన్నపిల్లలను లైంగికంగా వాడుకోవాలన్న కోరిక

మిగతా 2వ పేజీలో...



టీటీడీ ఆస్తుల రక్షణ ప్రభుత్వ బాధ్యత

11

గత పాలకులు ప్రభుత్వ ఆస్తులనే తనఖా పెట్టేశారు

టీటీడీ, దేవాదాయ శాఖ ఆస్తుల జోలికి వెళ్లకుండా ఉంటారా?

నిరర్థక ఆస్తులంటూ శ్రీవారి ఆస్తులకే ఎసరు పెట్టాలనుకున్నారు

శ్రీవాణి ట్రస్టు నిధులు మళ్లించేశారు

గత పాలక మండళ్ల నిర్ణయాలపై సమగ్ర విచారణ చేయాలి

సీఎం చంద్రబాబుకు డిప్యూటీ సీఎం పవన్ విజ్ఞప్తి

జెత్వానీ కేసులో ఆ ముగ్గురు

ఎఫ్ఐఆర్‌లో ఐపీఎస్‌ల పేర్లు నమోదు

మరో ఇద్దరు పోలీసు అధికారుల పేర్లు

న్యాయవాది, డాక్యుమెంట్ రైటర్ కూడా

విజయవాడ కోర్టుకు ఎఫ్ఐఆర్ కాపీ

ఏ1 విద్యాసాగర్‌కు 4 వరకు రిమాండ్

5 రోజుల కస్టడీకి పోలీసుల పిటిషన్





ఏ2 పీఎస్ఆర్ ఆంజనేయులు



ఏ3 కాంతిరాణా తాతా



ఏ6 విశాల్ గున్నీ

విజయవాడ, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ముంబై నటి కాదంబరి జెత్వానీ కేసులో తాజాగా ఏ2గా అప్పటి ఇంటెలిజెన్స్ డీజీ పీఎస్ఆర్ ఆంజనేయులు, ఏ3గా నాటి విజయవాడ పోలీసు కమిషనర్ కాంతిరాణా, ఏ6గా నాటి విజయవాడ డీసీపీ విశాల్‌గున్నీ పేర్లను చేర్చారు. ఈ ముగ్గురు ఐపీఎస్ అధికారులతో పాటు ఏ4గా ఏసీపీ హనుమంతరావు, ఏ5గా అప్పటి దర్యాప్తు అధికారి ఎం.సత్యనారాయణ, ఏ7గా న్యాయవాది, ఏ8గా నకిలీ డాక్యుమెంట్‌ను రాసిన రైటర్ పేర్లను పెట్టారు. ఈ ఎఫ్ఐఆర్ కాపీని విజయవాడలోని నాలుగో అదనపు చీఫ్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్‌కు అందజేశారు. ఈ కేసులో ఇదివరకే ఏ1గా చేర్చిన విద్యాసాగర్‌ను న్యాయాధికారి ఇంటి వద్ద ఆదివారం అర్ధరాత్రి హాజరుపరిచారు. జెత్వానీ


మిగతా 12వ పేజీలో...

దర్యాప్తునకు సహకరించండి

ఐపీఎస్ కాంతిరాణాకు హైకోర్టు ఆదేశం

నేటి వరకు చర్యలపై ఊరట

హజ్ యాత్రకు లక్ష



మైనార్టీ సంక్షేమ పథకాల పునరుద్ధరణ

త్వరలోనే ఇమామ్‌లు, మౌజన్లకు గౌరవ వేతనం

మైనార్టీలకు లబ్ధి జరిగేలా వక్ఫ్ భూముల అభివృద్ధి

సత్వరం కడప హజ్‌హౌస్, గుంటూరు క్రిస్టియన్ భవన్

నూర్ బాషా కార్పొరేషన్ ఏర్పాటుకు అంగీకారం

3

మైనార్టీ సంక్షేమ శాఖపై సమీక్షలో సీఎం చంద్రబాబు

కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటు!

తీర్మానం చేసి కేంద్రానికి పంపుతాం.. జూనియర్ లాయర్లకు నెలకు 10 వేలు

అమరావతిలో 100 ఎకరాల్లో ఇంటర్నేషనల్ లా స్కూల్: సీఎం

3

అనర్హులు స్వచ్ఛందంగా పింఛన్లు వదులుకోవాలి

తప్పుడు సర్టిఫికెట్లతో పింఛను పొందితే అర్హులకు నష్టం చేసినట్లే

12

దివ్యాంగుల పింఛను రెట్టింపు చేశాం.. దీర్ఘకాలిక రోగులకు 15 వేలు ఇస్తున్నాం

విశాఖలో 30 ఎకరాల్లో దివ్యాంగుల స్పోర్ట్స్ సెంటర్: చంద్రబాబు



ఉల్లి ధరలకు కళ్లెం!

2

4.7 లక్షల టన్నుల బఫర్‌స్టాక్ విడుదలకు కేంద్రం నిర్ణయం



పాలస్తీనా అధ్యక్షుడు అబ్బాస్‌తో ప్రధాని మోదీ కరచాలనం

మానవత్వంతోనే విజయం.. యుద్ధాలతో కాదు

ప్రపంచ శాంతికి ఉగ్రవాదంతో పెను ముప్పు

ఐరాస సర్వసభ్య సమావేశంలో ప్రధాని మోదీ

'ఒక భూగోళం.. ఒక కుటుంబం.. ఒక భవిష్యత్తు'పై నినాదం

పాలస్తీనా అధ్యక్షుడితో ప్రధాని మోదీ సమావేశం

2

దద్దరిల్లిన లెబనాన్



ఇజ్రాయెల్ భీకర దాడిలో 274 మంది మృతి!

వెయ్యి మందికి పైగా తీవ్ర గాయాలు

పేదల భూములతో బంతాట!



చేతులు మారిపోయిన అసైన్డ్ భూములు

వైసీపీ హయాంలో ఇష్టానుసారంగా రిజిస్ట్రేషన్లు

భారీగా జీవో 596 ఉల్లంఘనలు.. సర్కారుకు రెవెన్యూ శాఖ నివేదిక

చట్టంతో సంబంధం లేదు. రూల్స్‌తో పని లేదు. రికార్డుల అవసరమే లేదు. కోరుకున్న వారికి అసైన్డ్ భూములు రాసిచ్చేశారు. భూములపై కన్నేసిన వారికి రిజిస్ట్రేషన్లు చేసిపెట్టారు. గత ఐదేళ్లూ రెవెన్యూ అధికారులు, వైసీపీ నేతలు కుమ్మక్కై చేసిన ఈ నయా భూ దందాలో పేదలే సమిధలయ్యారు. రెవెన్యూ, రిజిస్ట్రేషన్‌శాఖల అధికారులు కొందరు అడ్డగోలు అక్రమాలకు పాల్పడ్డారు. పేదల భూములతో బంతాట ఆడుకున్నారు. రెవెన్యూ శాఖ తేల్చిన వాస్తవాలివి.

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

మదనపల్లె సబ్‌కలెక్టర్ కార్యాలయాన్ని వైసీపీ నేతలు తగలబెట్టించిన నేపథ్యంలో అసలు అసైన్డ్ భూముల్లో ఏం జరుగుతోందో తెలుసుకునేందుకు సర్కారు ఆరు జిల్లాల పరిధిలోని ఆరు మండలాల్లో అసైన్డ్ భూములకు హక్కులు కల్పించడం, వాటికి జరిపిన రిజిస్ట్రేషన్లపై సమగ్ర విచారణ చేయించింది. దీనికోసం స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ నేతృత్వంలోని అధికారులతో రెండు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసింది. ఆ బృందాలు విచారణ జరిపి రెవెన్యూశాఖకు నివేదికలు ఇచ్చాయి. ఆ నివేదికలను రెవెన్యూశాఖ క్రోడీకరించి ప్రభుత్వానికి నివేదిక అందజేసింది. విశ్వసనీయ సమాచారం ప్రకారం రెవెన్యూ బృందాలు విచారణ జరిపిన ప్రతి మండలంలోనూ అసైన్డ్ భూములు చట్టవిరుద్ధంగానే చేతులు మారాయి. కొందరు రెవెన్యూ అధికారులు అక్రమార్కులతో చేతులు కలిపి భూములను పరాధీనం చేశారు. రిజిస్ట్రేషన్‌శాఖ అధికారులు కూడా తందానా అని నిషేధ జాబితాలో ఉన్న భూములకూ రిజిస్ట్రేషన్ చేసేశారు. ఆరు జిల్లాల్లోని

మిగతా 12వ పేజీలో...

పెట్టుబడులపై పచ్చి అబద్ధాలు

గోబెల్స్‌ను తలదన్నేలా జగన్ రోత మీడియా

ఆర్టీఐ 'సాక్షి'గా వైసీపీ సర్కారు నిజస్వరూపం ఇప్పటికే బట్టబయలు

12

అయినా రోత పత్రికలో అవే కట్టుకథలు

171 ప్రాజెక్టులతో 61,295 కోట్ల పెట్టుబడులట

179 భారీ పరిశ్రమలు ఉత్పత్తి మొదలెట్టాయట

అవి ఎక్కడెక్కడ నెలకొల్పారో చెప్పరు

ఎందరికి ఉపాధి కల్పించారో కూడా చెప్పరు

విశాఖ సదస్సు ఒప్పందాలపైనా అదే డబ్బా

తప్పుడు కథనాలపై పారిశ్రామికవేత్తల విస్మయం

వాయవ్య భారతం నుంచి నైరుతి నిష్క్రమణ

2

నేడు బంగాళాఖాతంలో అల్పపీడనం

కోస్తా, రాయలసీమలకు వర్షసూచన



చదువు పూర్తికాగానే ఉద్యోగం!

అందుకు అనుగుణంగా కరిక్యులమ్‌లో మార్పులు

పరిశ్రమల అవసరాలకు తగ్గట్టు శిక్షణ

3

పారిశ్రామికవేత్తలతో వర్సిటీలకు బోర్డ్ ఆఫ్ గవర్నెన్స్

ప్రతినెలా నియోజకవర్గాలవారీగా జాబ్ మేళాలు

ఉన్నత విద్యా శాఖపై మంత్రి లోకేశ్ సమీక్ష

ఉల్లి ధరలకు కళ్లెం!



» 4.7 లక్షల టన్నుల బఫర్‌స్టాక్ విడుదలకు కేంద్రం నిర్ణయం

న్యూఢిల్లీ, సెప్టెంబరు 23: ఆకాశాన్నంటుతున్న ఉల్లి ధరలను అదుపులోకి తెచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఇది వరకే సేకరించి పెట్టిన (బఫర్ స్టాక్) ఉల్లి నిల్వను హోల్ సేల్ మార్కెట్లోకి విడుదల చేయాలని నిర్ణయించింది. ఈ మేరకు 4.7 లక్షల టన్నుల బఫర్ స్టాక్‌ను విడుదల చేయాలని నిర్ణయించినట్లు వినియోగదారుల వ్యవహారాల కార్యదర్శి నిధి ఖరే పేర్కొన్నారు. ఎగుమతులపై ఆంక్షలు తొలగించడంతో ఉల్లి ధరలు అంతకంతకూ పెరుగుతున్నాయని, బఫర్‌స్టాక్‌ను బయటకు తేవడం ద్వారా, వానాకాలం సాగు ఉత్పత్తులతో ఉల్లి ధరలు అదుపులోకి వస్తాయన్నారు. టమాటా ధరలనూ గమనిస్తున్నామని, అవసరమైతే జోక్యం చేసుకుంటామని చెప్పారు.

కేరళ వ్యక్తిలో అతి ప్రమాదకర మంకీపాక్స్

న్యూఢిల్లీ, సెప్టెంబరు 23: కేరళలో గతవారం మంకీపాక్స్ కేసు నమోదైన సంగతి తెలిసిందే. ఇటీవల యూఏఈ నుంచి తిరిగొచ్చిన మలప్పురం జిల్లాకు చెందిన ఓ 38 ఏళ్ల వ్యక్తికి ఈ వైరస్ సోకింది. అయితే ఆ వ్యక్తికి సోకింది ప్రపంచ ఆరోగ్య అత్యయిక స్థితికి దారితీసిన క్లేడ్-1బీ రకం మంకీపాక్స్ వైరస్‌గా వైద్యులు తాజాగా నిర్ధారించారు. భయపడాల్సిందేమీ లేదని ప్రస్తుతం అతడి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని వెల్లడించారు.

హత్యకేసులో ఏడుగురికి రెండు యావజ్జీవాలు

» శివారెడ్డి హత్యకేసులో అనంతపురం సెషన్స్ కోర్టు సంచలన తీర్పు

అనంతపురం క్రైం, సెప్టెంబరు 23: ఆరేళ్ల క్రితం అనంతపురం జిల్లాలో సంచలనం సృష్టించిన దెయ్యం శివారెడ్డి హత్యకేసులో ఏడుగురికి అనంతపురం జిల్లా సెషన్స్ కోర్టు రెండు జీవిత ఖైదుల శిక్ష విధించింది. ఒక్కొక్కరికీ రూ.30 వేల జరిమానా కూడా విధించింది. ఈ మేరకు జిల్లా న్యాయాధికారి శ్రీనివాస్ సోమవారం తీర్పు వెలువరించారు. శిక్ష పడిన వారిలో ఐదుగురు అన్నదమ్ములు ఉన్నారు. వీళ్లందరిపైనా రౌడీషీట్ ఉంది. ముద్దాయిల్లో సాకే బాలకృష్ణ, సాకే రమేశ్‌పై నాలుగు హత్య కేసులు, నాలుగు అత్యాచారం కేసులు, బాంబు కేసులు ఉన్నాయి. మరో ముద్దాయి సాకే అశోక్ పోక్సో కేసులో నిందితుడు. అనంతపురం రూరల్ మండలం కందుకూరు గ్రామానికి చెందిన దెయ్యం శివారెడ్డిని ఈ ఏడుగురు హత్య చేసినట్లు నేరం రుజువైంది. కందుకూరు గ్రామానికి చెందిన దెయ్యం శివారెడ్డి వైసీపీ తరఫున గతంలో వార్డు మెంబరుగా గెలిచాడు. 2017 అక్టోబరు 10న కందుకూరులో పీర్ల పండుగ జరిగింది. అక్కడ జరిగిన గొడవలో సాకే బాలకృష్ణ పంచె ఊడిపోవడంతో అవమానంగా భావించి శివారెడ్డిని చంపాలని నిర్ణయించుకున్నాడు. 2018 మార్చి 30వ తేదీ సాయంత్రం 5.30 గంటల సమయంలో శివారెడ్డి, అతని కుమారుడు భాను ప్రకాశ్‌రెడ్డి పొలం నుంచి బైక్‌పై వస్తుండగా.. సాకే బాలకృష్ణ, అతని చిన్న తమ్ముడు విక్రమ్ బైక్‌పై ఎదురుగా వచ్చి అడ్డుకున్నారు. బాలకృష్ణ తమ్ముళ్లు రమేశ్, అశోక్, సూర్యనారాయణ మరో బైక్‌పై వచ్చి భానుప్రకాశ్‌రెడ్డి మోటర్‌సైకిల్‌ను ఢీ కొట్టారు. కిందపడిన శివారెడ్డిని బాలకృష్ణ, విక్రమ్, సూర్యనారాయణ వేటకొడవళ్లతో విచక్షణారహితంగా నరికి చంపారు. ఈ ఘటనపై భానుప్రకాశ్‌రెడ్డి ఇటుకలపల్లి పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు మొత్తం 12 మందిపై చార్జిషీటు దాఖలు చేశారు. వీరిలో ఇద్దరు బాలలు కావడంతో వారిపై జువైనల్ కోర్టులో కేసు నడుస్తోంది. మిగిలిన పది మందిపై సెషన్స్ కోర్టులో విచారణ జరిగింది. సాకే బాలకృష్ణ, సాకే రమేశ్, సాకే అశోక్, సాకే భాస్కర్, సాకే విజయ్‌కుమార్, తలారి సూర్యనారాయణ, తలుపురి మహేంద్రపై నేరం రుజువైంది. వీరికి కోర్టు రెండు జీవిత ఖైదుల కఠిన కారాగార శిక్ష విధించింది. సాకే ఓబుళమ్మ, బుక్కే ప్రభాకర్ నాయక్, బొగ్గు ప్రసాద్‌పై కేసును కొట్టివేశారు. ప్రాసిక్యూషన్ తరఫున రాచమల్లు హరినాథ్‌రెడ్డి వాదనలు వినిపించారు.

వరద బాధితులకు దాతల బాసట

అమరావతి, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): వరద బాధితులను ఆదుకునేందుకు ప్రభుత్వం పిలుపుతో దాతలు పెద్ద సంఖ్యలో ముందుకు వస్తున్నారు. సీఎం రిలీఫ్‌ఫండ్‌కు విరివిగా విరాళాలిస్తున్నారు. సోమవారం అమరావతి సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబును పలువురు దాతలు కలిసి, విరాళాల చెక్కులు, డీడీలు అందజేశారు. వారిని సీఎం అభినందించారు. మధుసూదన శివప్రసాద్ పండా రూ.51 లక్షలు, ఆనంద్ గ్రూప్ చైర్మన్ యు.కాశీవిశ్వనాథ రాజు రూ.50 లక్షలు, రాజాం ఎమ్మెల్యే కోండ్రు మురళి నియోజకవర్గ టీడీపీ శ్రేణుల తరఫున రూ.50 లక్షలు, విమ్టా ల్యాబ్స్ తరఫున హరిమాన్ ఉంగల్, విష్ణు రూ.30 లక్షలు, నందమూరి మోహనకృష్ణ రూ.25 లక్షలు, భద్రాచలానికి చెందిన తాళ్లూరి చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు తాళ్లూరి పంచాక్షరయ్య రూ.25 లక్షలు, ఆర్వీ అసోసియేట్స్ ఆర్వీ చక్రపాణి రూ.25 లక్షలు, శ్రీగౌతమీ ఎడ్యుకేషన్ సొసైటీ రూ.25 లక్షలు, మోల్డ్-టెక్ ప్యాకేజింగ్ లిమిటెడ్ రూ.25 లక్షలు, తిరుపతి స్విమ్స్ వీసీ ఆర్వీ కుమార్ రూ.20 లక్షలు, కర్నూలు జిల్లా మిల్క్ పీఎంఏసీ లిమిటెడ్ రూ.20 లక్షలు, హైదరాబాద్‌కు చెందిన బి.అనూప్ తదితరుల తరఫున ఎన్నారై టీడీపీ అధ్యక్షుడు డాక్టర్ వేమూరి రవి రూ.13 లక్షలు, స్పెక్ట్రా ఫుడ్స్ అండ్ బేవరేజస్ సీఎండీ ఆతోట సుధాకర్ రూ.11 లక్షలు, న్యూట్రీషియన్ డాక్టర్ వినీలా కొండపల్లి రూ.10 లక్షలు, విజయవాడ ఆంజనేయ జ్యువెలర్స్ అధినేత వడ్లమూడి వెంకట్రావు రూ.10,01,116, చౌదరి చారిటబుల్ సొసైటీకి చెందిన కె.వెంకట్రాది రూ.10 లక్షలు, విజయవాడ నారాయణ కాలేజీ విద్యార్థులు రూ.9 లక్షలు ఇచ్చారు.

విపత్తు సాయం భారీగా పెంపు

» వరద బాధితులకు ఉపశమనం.. గతం కన్నా మెరుగైన ప్యాకేజీ

అమరావతి, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): భారీ వర్షాలు, వరదల కారణంగా ఆస్తి, పంట నష్టపోయిన బాధితులకు అందించే పరిహారాన్ని భారీగా పెంచుతూ ప్రభుత్వం ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించింది. గత ప్రభుత్వం ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ నిబంధనలతో జారీ చేసిన జీవోను సవరిస్తూ, వరద బాధితులకు ఉపశమనం కలిగించేలా సోమవారం తాజా ఉత్తర్వులు జారీ చేసింది. చేనేతలకు రూ.10వేల నుంచి రూ.25వేలకు, చేనేతల ముడిసరుకు నష్టానికి రూ.5వేల నుంచి రూ.10వేలకు, వలతో చేపలు పట్టే పడవలు పాక్షికంగా దెబ్బతింటే రూ.6వేల నుంచి రూ.9వేలకు, నాన్‌మోటరైజ్డ్ బోటు పూర్తిగా దెబ్బతింటే ఇచ్చే రూ.15వేలను రూ.20వేలకు, మోటరైజ్డ్ బోటు పూర్తిగా దెబ్బతింటే రూ.20వేల నుంచి రూ.25వేలకు పెంచారు. చేపల చెరువుల పునరుద్ధరణ కోసం హెక్టారుకు రూ.18వేలు, పట్టు పరిశ్రమకు రూ.6వేల నుంచి రూ.25వేలకు పెంచారు. ఆవులు, గేదెలు చనిపోతే రూ.37,500 నుంచి రూ.50వేలకు, ఎద్దులకు రూ.32వేల నుంచి రూ.40వేలకు, దూడలకు రూ.20 వేల నుంచి రూ.25వేలకు, గొర్రెలు, మేకలకు రూ.4వేల నుంచి రూ.7,500కు పెంచారు. వరి, పత్తి, వేరుశనగ, చెరకు హెక్టారుకు రూ.17వేల నుంచి రూ.25వేలకు, రాగులు, సజ్జ, కొర్ర, సామ, ఆముదం, జూట్, నువ్వులకు రూ.8,500 నుంచి రూ.15వేలు, మినుము, పెసర, కంది, సోయా, సన్‌ఫ్లవర్, పొగాకు రూ.10వేల నుంచి రూ.15వేలకు, మొక్కజొన్నకు రూ.12,500 నుంచి రూ.15వేలకు పెంచారు. మిర్చి హెక్టారుకు రూ.17వేల నుంచి రూ.35వేలకు, టమాటా, బొప్పాయి, పుచ్చ, పూలు, నర్సరీలకు రూ.17వేల నుంచి రూ.25వేలకు, జామకు రూ.22వేల నుంచి రూ.35వేలకు, మామిడి, దానిమ్మ, సపోట, అనాస, బత్తాయి, కాఫీ, జీడిమామిడి, డ్రాగన్ పండ్ల తోటలకు రూ.22,500 నుంచి రూ.35వేలకు, కొత్తిమీరకు రూ.8,500 నుంచి రూ.25వేల పరిహారం అందించనున్నారు.

వాయవ్య భారతం నుంచి నైరుతి నిష్క్రమణ

విశాఖపట్నం, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): వాయవ్య భారతంలోని పశ్చిమ రాజస్థాన్, కచ్ ప్రాంతాల నుంచి సోమవారం నైరుతి రుతుపవనాలు నిష్క్రమించాయి. రానున్న 24 గంటల్లో రాజస్థాన్, పంజాబ్, హరియాణాలోని కొన్ని ప్రాంతాల నుంచి రుతుపవనాలు వైదొలగనున్నాయని వాతావరణ శాఖ పేర్కొంది. ఈ ఏడాది నైరుతి రుతుపవనాల సీజన్‌లో జూన్ ఒకటో తేదీ నుంచి సోమవారం వరకు 837.7 మి.మీ.లకుగాను 880.8 మి.మీ.లు వర్షపాతం నమోదైంది. కాగా, మధ్య బంగాళాఖాతంలో కొనసాగుతున్న ఉపరితల ఆవర్తనం ప్రభావంతో మంగళవారం పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడనుంది. రానున్న 24 గంటల్లో కోస్తా, రాయలసీమల్లో అనేకచోట్ల వర్షాలు, అక్కడక్కడా భారీవర్షాలు కురుస్తాయని, ఈనెల 25న ఉత్తరకోస్తాలో అనేకచోట్ల, దక్షిణ కోస్తా, రాయలసీమల్లో పలుచోట్ల వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ వెల్లడించింది. మంగళవారం కోస్తాలో మత్స్యకారులు సముద్రంలో చేపల వేటకు వెళ్లరాదని హెచ్చరించింది.

దోషులను ప్రజల ముందు నిలబెడతాం: దూండీ

అమరావతి, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): హిందువుల మనోభావాలను దెబ్బతీస్తే చూస్తూ ఊరుకోబోమని టీడీపీ వాణిజ్య విభాగం రాష్ట్ర అధ్యక్షుడు దూండీ రాకేష్ హెచ్చరించారు. తిరుపతి లడ్డూను అపవిత్రం చేసిన ఘటనలో దోషులను ప్రజల ముందు నిలబెడతామన్నారు. అన్యమతస్తులను టీటీడీ చైర్మన్లుగా నియమించి, తిరుమల ప్రాశస్త్యాన్ని దెబ్బతీశారని అన్నారు.

మానవత్వంతోనే విజయం..
యుద్ధాలతో కాదు



ప్రపంచ శాంతికి ఉగ్రవాదంతో పెను ముప్పు

» ఐరాస సర్వసభ్య సమావేశంలో ప్రధాని

» పాలస్తీనా అధ్యక్షుడు అబ్బాస్‌తో భేటీ

న్యూయార్క్, సెప్టెంబరు 23: సమష్టి శక్తి, మానవత్వంతోనే విజయం సాధ్యమని.. యుద్ధాలతో కాదని ప్రధాని మోదీ ఉద్ఘాటించారు. భారత్ ఇదే సిద్ధాంతాన్ని విశ్వసిస్తుందని వివరించారు. ప్రపంచ మానవాళి ఆకాంక్షలకు అనుగుణంగా ప్రపంచనేతల చర్యలు ఉండాలని అభిప్రాయపడ్డారు. సోమవారం ఆయన ఐక్య రాజ్య సమితి(ఐరాస) సర్వసభ్య సమావేశంలో ప్రసంగించారు. ప్రపంచ దేశాలు భవిష్యత్ గురించి మానవ-కేంద్ర విధానాలను అనుసరించాలని పేర్కొంటూ.. 'ఒక భూగోళం.. ఒక కుటుంబం.. ఒక భవిష్యత్' అని నినదించారు. "మానవ చరిత్రలోనే అతిపెద్ద ఎన్నికల క్రతువు ఇటీవల భారత్‌లో ముగిసింది. ప్రజలు మాకు మూడోసారి అధికారమిచ్చారు. మేం గడిచిన పదేళ్లలో 25 కోట్ల మందిని పేదరికం నుంచి బయటకు తీసుకువచ్చాం. సుస్థిరాభివృద్ధి లక్ష్యాలను సాధిస్తూ.. పేదరికం, మానవాభివృద్ధి, పేదల సంక్షేమం, ఆహార పంపిణీ అనే అంశాలపై ప్రధానంగా దృష్టిసారించడం వల్ల ఈ ఘనత సాధ్యమైంది" అని ఆయన వ్యాఖ్యానించారు. ప్రపంచ శాంతి, భద్రత పాలిట ఉగ్రవాదం పెనుముప్పుగా మారిందని మోదీ ఆందోళన వ్యక్తం చేశారు. సైబర్, మారిటైమ్, అంతరిక్ష రంగాల్లో కొత్త సవాళ్లు, ముప్పులను ఎదుర్కోవాలని పిలుపునిచ్చారు. "టెక్నాలజీ దుర్వినియోగం కాకుండా నియంత్రణ ఉండాలి. భద్రత, బాధ్యతతో కూడిన వినియోగం అవసరం. డిజిటల్ ప్రజావనరులను మంచికే వినియోగించాలి" అని పేర్కొన్నారు. 'ఒక భూగోళం.. ఒక కుటుంబం.. ఒక భవిష్యత్' అనే నినాదానికి తాము కట్టుబడి ఉన్నామని చెప్పారు. అందుకే.. 'ఒక భూగోళం.. ఒక ఆరోగ్యం', 'ఒక సూర్యుడు.. ఒక గ్రిడ్' దిశగా సాగుతున్నామన్నారు. ప్రపంచాన్ని సుసంపన్నం చేసేందుకు భారత్ తన ఆలోచనలను నిబద్ధతతో పంచుకుంటుందని వివరించారు.

మూడో ఆర్థిక శక్తిగా ఎదుగుతాం

భారత్ మూడో ఆర్థిక శక్తిగా ఎదుగుతుందని ప్రధాని నరేంద్ర మోదీ పునరుద్ఘాటించారు. అమెరికా దిగ్గజ కంపెనీల సీఈవోలతో ఆయన ఆదివారం ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఎంఐటీ స్కూల్ ఆఫ్ ఇంజనీరింగ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ఆ విద్యా సంస్థ ప్రొఫెసర్ అనంత చంద్రశేఖరన్ సమన్వయకర్తగా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో పలు సంస్థల సీఈవోలు సుందర్‌పిచాయ్(గూగుల్), జెన్సెన్ హంగ్(ఎన్‌విడియా), శంతను నారాయణ్(అడోబ్), లిసా సు(ఏఎండీ), అర్వింద్ కృష్ణ(ఐబీఎం), ఎన్రిక్ లోర్స్(హెచ్‌పీ) తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మోదీ మాట్లాడుతూ.. ప్రస్తుతం ఐదో ఆర్థిక శక్తిగా ఉన్న భారత్.. 3.9 ట్రిలియన్ డాలర్ల జీడీపీకి చేరుకున్నట్లు వివరించారు. 7% వృద్ధి రేటును స్థిరంగా కొనసాగిస్తూ.. త్వరలో 5 ట్రిలియన్ డాలర్ల జీడీపీతో మూడో ఆర్థిక శక్తిగా ఎదుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కృత్రిమ మేధ(ఏఐ), క్వాంటమ్ కంప్యూటింగ్, బయోటెక్నాలజీ, సెమీకండక్టర్ టెక్నాలజీల్లో భారత్‌కు సహకరించాలని కంపెనీల సీఈవోలను కోరారు.


యుద్ధం ముగియాలి.. శాంతి నెలకొనాలి

ఇజ్రాయెల్-హమాస్ యుద్ధం ముగిసి, గాజాలో శాంతి నెలకొనాలని మోదీ ఆకాంక్షించారు. న్యూయార్క్‌లోని పాలెస్ హోటల్‌లో పాలస్తీనా అధ్యక్షుడు మహమూద్ అబ్బాస్‌తో జరిగిన భేటీ సందర్భంగా ఈ వ్యాఖ్యలు చేశారు. గాజాలో మానవతాసాయానికి భారత్ తన వంతు కృషి చేస్తుందని పేర్కొన్నారు. ఇప్పటికే ఐరాస అనుబంధ సంస్థ యూఎన్‌ఆర్‌డబ్ల్యూఏ ద్వారా రూ.21 కోట్ల(2.5 మిలియన్ డాలర్లు) విలువైన సాయాన్ని అందించామని గుర్తుచేశారు. గాజాలో ప్రస్తుత పరిస్థితులు, మానవ సంక్షోభం, భద్రతపై మోదీ ఆందోళన వ్యక్తం చేశారు. భారత్-పాలస్తీనా స్నేహబంధాన్ని మరింత బలోపేతం చేయాలని ఇరువురు నేతలు ఆకాంక్షించినట్లు విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి జైస్వాల్ వెల్లడించారు.


నేపాల్‌కు రండి.. మోదీకి ఓలి ఆహ్వానం

ప్రధాని మోదీని నేపాల్ రావాల్సిందిగా ఆ దేశ ప్రధాన మంత్రి కేపీ శర్మ ఓలి ఆహ్వానించారు. ఐరాస సర్వసభ్య సమావేశం సందర్భంగా ఇరువురు నేతలు న్యూయార్క్‌లో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా నేపాల్‌కు రావాల్సిందిగా ఓలి ఆహ్వానించగా.. మోదీ సమ్మతించారు. మరోవైపు కువైత్ యువరాజు షేక్ సబా ఖాలిద్ అల్-సబాతోనూ మోదీ భేటీ అయ్యారు.

లోకం తీరు



హమాస్ చీఫ్ సిన్వర్ హతం?



టెల్ అవీవ్, సెప్టెంబరు 23: ఇజ్రాయెల్‌పై గత ఏడాది అక్టోబరు 7న జరిగిన దాడుల రూపకర్త, ఉగ్ర సంస్థ హమాస్ అధిపతి యాహ్యా సిన్వర్ చనిపోయినట్లుగా తెలుస్తోంది. అతడి నుంచి కొంతకాలంగా ఎలాంటి కదలికలు లేకపోవడమే దీనిని నిదర్శంగా భావిస్తున్నారు. ఈ మేరకు ఇజ్రాయెల్ మీడియా కథనాలు ప్రచురించింది. అయితే, ఇవేమీ నిర్ధారణ కాలేదు. ఇజ్రాయెల్ దళాలు హమా‌స్‌కు పెట్టని కోట లాంటి సొరంగాలపై కొన్ని రోజుల కిందట విస్తృత దాడులు చేశాయి. వీటిలోనే యాహ్యా మృతి చెంది ఉంటాడని చెబుతున్నారు. గత నెలలో హమాస్ రాజకీయ విభాగాధిపతి ఇస్మాయిల్ హనియా హతమయ్యాడు. ఇరాన్‌లో జరిగిన ఈ దాడి వెనుక ఇజ్రాయెల్ ఉందని కథనాలు వచ్చాయి. కాగా, యాహ్యా మృతి అంటూ వస్తున్న కథనాలు హమాస్ స్థైర్యాన్ని దెబ్బతీసేందుకు ఇజ్రాయెల్ ఆడుతున్న మైండ్ గేమ్‌లో భాగం అనే కథనాలూ వస్తున్నాయి.

పేజర్ పేలుడుతోనే రైసీ దుర్మరణం?

ఇరాన్ దివంగత అధ్యక్షుడు ఇబ్రహీం రైసీ మే నెలలో హెలికాప్టర్ ప్రమాదంలో చనిపోవడం వెనుక 'పేజర్ పేలుడు' కారణమై ఉండొచ్చని పార్లమెంటు సభ్యుడు అహ్మద్ అర్దెస్తానీ వ్యాఖ్యానించారు. రైసీ పేజర్ వాడేవారని ఆయన పేర్కొన్నారు. దీనిపై దర్యాప్తు చేయాలని కోరారు. కాగా, తాము మద్దతు ఇచ్చే ఉగ్ర సంస్థ హిజ్బుల్లాకు పేజర్ల కొనుగోలులో ఇరాన్ సాయం చేసింది. గత వారం లెబనాన్‌లో వేలాది పేజర్లు పేలి హిజ్బుల్లా మద్దతుదారులు భారీగా మృతి చెందిన సంగతి తెలిసిందే.

దద్దరిల్లిన లెబనాన్

ఇజ్రాయెల్ భీకర దాడిలో 356 మంది మృతి!

» వెయ్యి మందికి గాయాలు.. మృతుల్లో 24 మంది చిన్నారులు



ఇజ్రాయెల్ దాడుల్లో ధ్వంసమైన భవనాలు

బీరుట్, టెల్ అవీవ్, సెప్టెంబరు 23: లెబనాన్ సోమవారం బాంబుల మోతతో దద్దరిల్లింది. దేశంలోని దక్షిణ ప్రాంతంలోని 17 పట్టణాలు, పల్లెలపై ఇజ్రాయెల్ విరుచుకుపడింది. హిజ్బుల్లా ఉగ్రవాదులు తలదాచుకున్నవిగా, ఆయుధాలను భద్రపరిచినవిగా భావిస్తున్న నిర్మాణాలపైన రాకెట్ల వర్షం కురిపించింది. అంతకుముందు ఆ ప్రాంతాన్ని వీడి వెళ్లాలని స్థానికులను హెచ్చరిస్తూ వేలాది ఫోన్ కాల్స్ చేసింది. 11 నెలలుగా ఓవైపు హమా‌స్‌తో యుద్ధం చేస్తూనే మరోవైపు హిజ్బుల్లాతోనూ తలపడుతున్న ఇజ్రాయెల్ ఈ స్థాయిలో దాడులకు దిగడం ఇదే తొలిసారి. సోమవారం చేపట్టిన దాడుల్లో 356మంది ప్రాణాలు కోల్పోగా, వెయ్యి మందికిపైగా తీవ్రంగా గాయపడ్డారు. మృతుల్లో 24 మంది పిల్లలున్నారు. తాజా దాడులతో పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు మరింత పెరుగుతాయని.. మరో పూర్తిస్థాయి యుద్ధం తప్పదనే ఆందోళన నెలకొంది. ఈ నేపథ్యంలో అమెరికా జోక్యం చేసుకుంది. అగ్రరాజ్య రక్షణ శాఖ మంత్రి లాయిడ్ ఆస్టిన్ ఇజ్రాయెల్ రక్షణ మంత్రి గాలంట్‌కు ఫోన్ చేశారు. ఇజ్రాయెల్ ఆత్మరక్షణకు అండగా ఉంటామన్నారు. తమ బలగాలను రక్షించుకోవడానికి సిద్ధంగా ఉన్నామని చెబుతూనే, ఉద్రిక్తతలు మరింత పెరగకుండా ప్రయత్నాలు చేస్తామన్నారు. ఇజ్రాయెల్ లక్ష్యంగా చేసుకున్న ప్రాంతాల నుంచి భారీఎత్తున ప్రజలు తరలిపోతున్న దృశ్యాలు వైరల్ అయ్యాయి. కాగా, ఇజ్రాయెల్ దాడులను అడ్డుకోవాలని లెబనాన్ ప్రభుత్వం ఐక్యరాజ్య సమితి, పెద్ద దేశాలను కోరింది. హిజ్బుల్లా, ఇజ్రాయెల్ ఎవరూ తగ్గడం లేదని వ్యాఖ్యానించిన ఐరాస ప్రధాన కార్యదర్శి గుటెరస్.. లెబనాన్ మరో గాజాలా మారనుందని ఆందోళన వ్యక్తం చేశారు.

'కామ్ కీ బాత్'పై మాట్లాడరేం?

» ప్రధాని మోదీపై రాహుల్ విమర్శలు

» ఆర్డర్ వేయండి.. మీ ముందు నిలబడతా

» కశ్మీర్ వాసులకు రాహుల్ గాంధీ హామీ



శ్రీనగర్, సెప్టెంబరు 23: ప్రధాని మోదీ 'మనసులోని మాటల'ను చెబుతున్నారే తప్ప ఉద్యోగాలు, ఉపాధి కల్పనకు సంబంధించిన 'పనుల మాటల'ను మాట్లాడడం లేదని విపక్ష నేత, కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ విమర్శించారు. శ్రీనగర్‌లో సోమవారం జరిగిన ఎన్నికల ప్రచార సభలో ప్రసంగిస్తూ మోదీ 'మన్ కీ బాత్'కే పరిమితమయ్యారే తప్ప 'కామ్ కీ బాత్'ను పట్టించుకోవడం లేదని అన్నారు. ధరల పెరుగుదలను ప్రస్తావించడం లేదని చెప్పారు. దేశ రాజకీయ పరిస్థితులను ప్రస్తావిస్తూ... మోదీ ముఖకవళికల్లో మార్పులు వచ్చాయని అన్నారు. "గత లోక్‌సభ ఎన్నికల్లో '56 అంగుళాల ఛాతీ' గురించి మీరు వినేవారు. ఆ మాటలు ఇప్పుడు వినబడుతున్నాయా? ఆయన ముఖ కవళికలు, మూడ్ మారాయి. మోదీ మనస్తత్వాన్ని కాంగ్రెస్, ఇండియా కూటములు కలిసి మార్చేశాయి" అని వ్యాఖ్యానించారు. గత పదేళ్లుగా బీజేపీ దేశంలో విభజనను, మత విద్వేషాలను రెచ్చగొడుతున్నాయని విమర్శించారు. జమ్మూ-కశ్మీర్ రాష్ట్ర హోదాను కేంద్రపాలిత ప్రాంతానికి తగ్గించి ప్రజల హక్కులను హరించి వేశారని ఆరోపించారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రాష్ట్ర హోదాను పునరుద్ధరిస్తామని రాహుల్ హామీ ఇచ్చారు. పార్లమెంటులో కశ్మీర్ గొంతుకనవుతానని అన్నారు. జమ్మూ-కశ్మీర్ మన్ కీ బాత్‌ను ఎవరూ వినడం లేదని చెప్పారు. అందుకే "ఏ అవసరం ఉన్నా నాకు ఆర్డర్ వేయండి. మీ ముందు వచ్చి నిలబడుతా. మీతో నాకు ప్రత్యేక అనుబంధం ఉంది. అదేమిటో మీకు చెప్పాల్సిన పనిలేదు" అని వ్యాఖ్యానించారు. మోదీ ప్రభుత్వం 25 పారిశ్రామికవేత్తలకు చెందిన రూ.16లక్షల కోట్ల రుణాలను మాఫీ చేసిందని ఆరోపించారు. తర్వాత రాహుల్ హిందీలో ట్వీట్ చేస్తూ బీజేపీని బహుజన వ్యతిరేకి అని విమర్శించారు. కులగణన అన్న మాటను పలకడానికే ప్రధాని మోదీ భయపడుతున్నారని ఆరోపించారు. బీజేపీ ఎంతగా అబద్ధాలు ప్రచారం చేస్తున్నప్పటికీ ఎట్టి పరిస్థితుల్లోనూ రిజర్వేషన్లకు హాని కలగకుండా చూస్తామని తెలిపారు. సమగ్రమైన కుల గణన జరిపి, దాని ఆధారంగా రిజర్వేషన్లపై ఉన్న 50 శాతం పరిమితిని ఎత్తివేసేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. బహుజనులకు హక్కులు కల్పించడం రాజకీయ సమస్య కాదని, తన జీవితాశయమని స్పష్టం చేశారు.

4 నెలలు భరతుడిలా పాలిస్తా!

» కేజ్రీవాల్ మళ్లీ సీఎం అయ్యేదాకా ఆయన కుర్చీ అలాగే ఉంటుంది

» ఢిల్లీ ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన ఆతిశీ వ్యాఖ్యలు

» సీఎం ఆఫీసులో రెండో కుర్చీ



న్యూఢిల్లీ, సెప్టెంబరు 23: ఢిల్లీ నూతన ముఖ్యమంత్రిగా ఆతిశీ బాధ్యతలు చేపట్టారు. సోమవారం బాధ్యతలు చేపట్టిన ఆమె.. పక్కనే పాత సీఎం అరవింద్ కేజ్రీవాల్ కుర్చీని ఖాళీగా ఉంచారు. ఆయన వాడిన కుర్చీ పక్కనే మరో కుర్చీలో కూర్చొని ఆతిశీ ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడుతూ.. రామాయణంలో సన్నివేశాన్ని ప్రస్తావించారు. రాముడు వనవాసానికి వెళ్లిన సమయంలో భరతుడు రాజ్యాన్ని ఏలాల్సి వచ్చిందన్నారు. అప్పుడాయన రాముడి పాదుకలు సింహాసనంపై ఉంచి బాధ్యతలు నెరవేర్చారని గుర్తుచేశారు. ఇప్పుడు తనదీ అదే పరిస్థితి అని ఆతిశీ చెప్పారు. భరతుడి స్ఫూర్తితోనే తాను నాలుగు నెలల పాటు ఢిల్లీ ప్రభుత్వాన్ని నడిపిస్తానని తెలిపారు. త్వరలో జరగబోయే ఎన్నికల్లో ఢిల్లీ ప్రజలు మళ్లీ ఆమ్ ఆద్మీ పార్టీకే పట్టం కడతారని, అరవింద్ కేజ్రీవాల్ సీఎం అవుతారని ధీమా వ్యక్తం చేశారు. "ఈ కుర్చీ అరవింద్ కేజ్రీవాల్‌దే. ఫిబ్రవరిలో జరిగే ఎన్నికల్లో ఢిల్లీ ప్రజలు మరోసారి ఆయన్నే ముఖ్యమంత్రిగా ఎన్నుకుంటారు. అప్పటి వరకు ఈ కుర్చీ సీఎం కార్యాలయంలోనే ఉంటుంది. కేజ్రీవాల్ పునరాగమనం కోసం ఎదురుచూస్తూ ఉంటుంది" అని ఆతిశీ చెప్పారు. ఢిల్లీ ఎనిమిదో ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన ఆతిశీ (43).. ఈ పీఠాన్ని అధిరోహించిన అతి పిన్న వయస్కురాలు. అలాగే మూడో మహిళ. అంతకు ముందు కాంగ్రెస్ తరఫున షీలా దీక్షిత్, బీజేపీ తరఫున సుష్మా స్వరాజ్‌లు ఢిల్లీ ముఖ్యమంత్రులుగా పనిచేశారు. ప్రస్తుతం దేశంలో ఆతిశీ రెండో మహిళా ముఖ్యమంత్రి. ఇక ఆతిశీతో పాటు ఐదుగురు ఆప్ ఎమ్మెల్యేలు మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేశారు. వారిలో నలుగురు పాతవారు కాగా.. ఒకరు కొత్త ఎమ్మెల్యే. తొలిసారి ఎమ్మెల్యేగా గెలిచిన ముకేశ్ అహ్లావత్‌తో పాటు గోపాల్‌రాయ్, ఇమ్రాన్ హుస్సేన్, కైలాశ్ గహ్లోత్, సౌరభ్ భరద్వాజ్‌లు మంత్రులుగా ప్రమాణం చేశారు. కేజ్రీవాల్ ప్రభుత్వంలో మంత్రిగా 13 శాఖలను చూసుకున్న ఆతిశీ.. ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత కూడా వాటిని తన వద్దే ఉంచుకున్నారు.

ఇది రాజ్యాంగాన్ని అగౌరవపర్చడమే: బీజేపీ

ఢిల్లీ సీఎంగా బాధ్యతలు చేపట్టిన ఆతిశీ తీరును బీజేపీ తీవ్రంగా ఖండించింది. సీఎం ఆఫీసులో ఆమె కుర్చీ పక్కనే కేజ్రీవాల్ కోసం మరో కుర్చీని ఖాళీగా ఉంచడాన్ని తప్పుపట్టింది. ఆతిశీ రాజ్యాంగ నిబంధనలను ఉల్లంఘించారని బీజేపీ ఢిల్లీ శాఖ అధ్యక్షుడు వీరేంద్ర సచ్‌దేవ ఆరోపించారు. తన వ్యవహారశైలితో ఆమె సీఎం కార్యాలయాన్ని అవమానించారన్నారు. సీఎం ఆఫీసు డెస్క్‌లో రెండు కుర్చీలు వేయడం ద్వారా రాజ్యాంగాన్ని అగౌరవపర్చారని ఆరోపించారు. సీఎం ఆఫీసు గౌరవానికి భంగం కలిగించడమేగాక ఢిల్లీ ప్రజల మనోభావాలను కూడా కించపరిచేలా వ్యవహరించారంటూ ఆతిశీపై ధ్వజమెత్తారు.

చైల్డ్ పోర్న్ చూడడం నేరమే



(మొదటి పేజీ తరువాయి)

ఉన్నట్టు స్పష్టం చేస్తూ ఆ తీర్పును తోసిపుచ్చింది. అలాంటి కంటెంట్‌ను తొలగించకపోయినా, దాని గురించి అధికారులకు ఫిర్యాదు చేయకపోయినా.. దాన్ని ఇతరులకు పంపించాలన్న ఆలోచన ఉన్నట్టేనని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్, జస్టిస్ జేబీ పార్దీవాలాతో కూడిన ధర్మాసనం వ్యాఖ్యానించింది. తమిళనాడుకు చెందిన ఎస్.హరీశ్ (28) అనే వ్యక్తి ఫోన్‌లో చిన్నపిల్లల నీలిచిత్రాలు ఉన్నాయంటూ పోలీసులు పోక్సో చట్టంలోని సెక్షన్ 14(1), ఐటీ చట్టంలోని సెక్షన్ 67బి కింద క్రిమినల్ కేసు నమోదు చేశారు. దీనిపై అతడు మద్రాస్ హైకోర్టును ఆశ్రయించాడు. విచారణ జరిపిన న్యాయస్థానం.. చిన్నపిల్లలతో నీలిచిత్రాలను తీసి ఉంటే, చైల్డ్‌పోర్న్‌ను వేరొకరికి పంపిస్తేనే ఐటీ చట్టంలోని 67బి కింద శిక్షార్హులని, అలాగే పోక్సో చట్టంలోని సెక్షన్ 14(1) ప్రకారం లైంగికచర్యలకు పిల్లలను వాడుకుంటే తప్పని.. అంతే తప్ప, చైల్డ్ పోర్న్‌ను కేవలం చూసినంతమాత్రాన నేరం కాదని పేర్కొంటూ అతడిపై పెట్టిన క్రిమినల్ కేసును కొట్టేసింది. మద్రాస్ హైకోర్టు తీర్పుపై 'జస్ట్ రైట్ ఫర్ చిల్డ్రన్ అలయెన్స్' అనే స్వచ్ఛంద సంస్థ సుప్రీంకోర్టును ఆశ్రయించింది. సుప్రీంకోర్టులో విచారణ సందర్భంగా హరీశ్ తరఫు న్యాయవాది.. తమ క్లయింట్ వాట్సా‌ప్‌కు ఆ పోర్న్ వీడియోలు 2019 జూన్ 14న వచ్చాయని, పోక్సో చట్టంలో అలాంటి వీడియోలను కలిగి ఉంటే విధించాల్సిన శిక్షలకు సంబంధించిన సెక్షన్ 15ను 2019 ఆగస్టు 16న చేర్చారని.. కాబట్టి ఆ సెక్షన్ ప్రకారం తన క్లయింట్‌కు శిక్ష విధించకూడదని వాదనలు వినిపించారు. ఆ వీడియోలు కూడా.. వాట్సా‌ప్‌లో ఉన్న 'ఆటో డౌన్‌లోడ్' ఫీచర్ కారణంగా అతడి ఫోన్‌లో డౌన్‌లోడ్ అయ్యాయి తప్ప, వాటిని వేరొకరికి పంపాలన్న ఆలోచనే హరీశ్‌కు లేదని వివరించారు. ఈ పిటిషన్ వేసిన స్వచ్ఛంద సంస్థ తరఫున వాదనలు వినిపించిన సీనియర్ న్యాయవాది హెచ్‌ఎస్ ఫూల్కా.. అతడి ఇంటర్‌నెట్ డౌన్‌లోడ్స్‌ను ట్రాక్ చేస్తే అప్పటికి (2019 నాటికి) రెండు సంవత్సరాలుగా అతడు చైల్డ్ పోర్న్ చూస్తున్నట్టు వెల్లడైందని కోర్టు దృష్టికి తీసుకొచ్చారు. వాదనలూ విన్న సుప్రీం ధర్మాసనం.. మద్రాస్ హైకోర్టు తీర్పును తోసిపుచ్చి, నిందితుడు హరీశ్‌పై పోలీసులు నమోదు చేసిన క్రిమినల్ కేసును పునరుద్ధరించాలని ఆదేశించింది. చైల్డ్ పోర్న్ వీడియోలను వేరొకరి నుంచి అందుకోవడం సెక్షన్ 15 ప్రకారం నేరం కాకపోవచ్చుగానీ.. ఆ వీడియోలను వెంటనే డిలీట్ చేయకపోవడం, లేదా అధికారులకు దాని గురించి ఫిర్యాదు చేయకపోవడం అంటే నిందితుడికి దురుద్దేశాలున్నాయనడానికి నిదర్శనమని స్పష్టం చేసింది. చైల్డ్ పోర్న్ సమస్య ప్రపంచవ్యాప్తంగా అన్ని సమాజాల్లోనూ వేళ్లూనికుని ఉందని.. భారతదేశంలో ఈ సమస్య ఆందోళన కలిగిస్తోందని వ్యాఖ్యానించిన కోర్టు.. 200 పేజీల తీర్పులో పలు కీలక అంశాలను ప్రస్తావించింది.

చైల్డ్ పోర్న్ అనొద్దు.. సీసీఎమ్ అనండి

ఇకపై జ్యుడీషియల్ ఆర్డర్లలో, తీర్పుల్లో చైల్డ్ పోర్నోగ్రఫీ అనే పదాన్ని వాడొద్దని.. దాన్ని 'చైల్డ్ సెక్సువల్ ఎక్స్‌ప్లాయిటేటివ్ అండ్ అబ్యూజ్ మెటీరియల్ (సీఎస్ఈఏఎం(సీసీమ్))'గా వ్యవహరించాలని దేశంలోని అన్ని కోర్టులకూ సర్వోన్నత న్యాయస్థానం సూచించింది. ఈమేరకు పోక్సో చట్టానికి సవరణ చేయాలని కేంద్రానికి కూడా సూచించింది. సీసీమ్ తయారీ క్రమంలో.. చిన్నపిల్లలను కేవలం వస్తువులుగా చూస్తారని, వారిని పెట్టి తీసిన వీడియోలను చూడడంలో అంటే చిన్నపిల్లలపై లైంగిక వేధింపులను ప్రోత్సహించడమేనని జస్టిస్ జేబీ పార్దీవాలా పేర్కొన్నారు. సీసీమ్ పిల్లల ప్రాథమిక హక్కులకు భంగకరమని.. వారికి ఉన్న 'హుందాగా జీవించే హక్కు'ను కాలరాస్తుందని అన్నారు.

లైంగిక విద్య తప్పనిసరి..

దేశంలో లైంగిక నేరాల సంఖ్యను తగ్గించాలంటే.. లైంగిక విద్య ప్రయోజనాలపై సమగ్ర అవగాహన కలిగించాల్సిన అవసరం ఉన్నాయని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. లైంగిక విద్య, గర్భనిరోధక సాధనాల గురించి చెప్పడం వల్ల యువతలో లైంగిక స్వైర వర్తన, బాధ్యతారహిత ప్రవర్తన పెరిగిపోతాయనే తప్పుడు అభిప్రాయాలు చాలామందికి ఉన్నాయని.. పిల్లలతో సెక్స్ గురించి చర్చించడాన్ని తప్పుగా, అనైతికంగా, ఇబ్బందికరంగా భావిస్తున్నారని ధర్మాసనం ఆవేదన వెలిబుచ్చింది. ఆ అవగాహన లేకపోవడంతో పిల్లలు ఇంటర్‌నెట్‌లో ఎలాంటి వడపోతా లేని, తప్పుదోవ పట్టించే వీడియోలను చూసి అనారోగ్యకరమైన లైంగిక అలవాట్లను ఏర్పరచుకుంటున్నారని.. ఈ పరిస్థితిని మార్చాల్సిన అవసరం ఉందని తన 200 పేజీల తీర్పులో స్పష్టం చేసింది. లైంగిక విద్య అంటే కేవలం పునరుత్పత్తి అవయవాలకు సంబంధించిన అంశాలకే పరిమితమన్న తప్పుడు అభిప్రాయం కూడా చాలా మందిలో ఉందని.. ఆమోదం తెలపడం (కన్సెంట్), ఆరోగ్యకరమైన సంబంధాలు, లింగ సమానత్వం, భిన్న అభిప్రాయాలను గౌరవించడం ఇలా చాలా అంశాలు సెక్స్ ఎడ్యుకేషన్ కిందకే వస్తాయని ధర్మాసనం స్పష్టం చేసింది.

వైసీపీ సర్కారు నిర్లక్ష్యం.. బాత్‌రూంలో నివాసం!

- కూటమి ప్రభుత్వం ఆదుకోవాలని ఓ పేద కుటుంబం వేడుకోలు

మడకశిర రూరల్, సెప్టెంబరు 23: గత వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యం పుణ్యమా అని.. ఓ నిరుపేద కుటుంబం బాత్ రూంలోనే నివాసం ఉండాల్సిన దుస్థితి దాపురించింది. శ్రీసత్యసాయి జిల్లా మడకశిర మండలం హెచ్‌ఆర్ పాళ్యం గ్రామానికి చెందిన నరసింహప్పకు భార్య, ఇద్దరు పిల్లలు. కూలి పనులే జీవనాధారంగా ఉన్న ఈ కుటుంబానికి గతంలో ఇక్కడ ఇల్లు ఉండేది. వర్షాలకు ఆ ఇల్లు కూలిపోవడంతో నిలువ నీడలేకుండా పోయింది. మళ్లీ ఇల్లు కట్టుకునే స్తోమత లేని నరసింహప్ప కుటుంబం కూలిపోయిన ఇంటికి సంబంధించిన బాత్‌రూంలోనే నివాసం ఉంటోంది. 2022లో అప్పటి వైసీపీ ఎమ్మెల్యే తిప్పేస్వామి గ్రామంలో గడపగడపకు కార్యక్రమంలో పర్యటించారు. బాత్‌రూమ్‌లో నివాసం ఉంటున్న నరసింహప్ప కుటుంబ పరిస్థితి చూశారు. వెంటనే రెవెన్యూ, హౌసింగ్ అధికారులను పిలిచి, ఇల్లు మంజూరుచేసి.. నిర్మించి ఇవ్వాలని అందరి సమక్షంలో ఆదేశాలు జారీచేశారు. దీంతో నరసింహప్ప కుటుంబ సభ్యులు, గ్రామస్థులు ఎంతో సంతోషించారు. కానీ.. ఇల్లు మంజూరైంది లేదు. కట్టించి ఇచ్చిందీ లేదు. దీంతో ఆరేళ్లుగా ఆ కుటుంబం బాత్‌రూమ్‌లో నివాసం ఉంటోంది. ఈ విషయమై నరసింహప్ప సోమవారం మాట్లాడుతూ.. '2022లో వైసీపీ ఎమ్మెల్యే గడపగడపకు పేరిట వచ్చి, అందరి ముందు గొప్పగా ఇల్లు మంజూరుకు అధికారులను ఆదేశించడంతో ఎంతగానో సంతోషించాం. కానీ అప్పటి నుంచి రెండేళ్లపాటు ఇంటికోసం అధికారులు, సచివాలయం చుట్టూ తిరిగినా ప్రయోజనం లేదు' అని వాపోయారు. కూటమి ప్రభుత్వమైనా ఇల్లు మంజూ చేసి, ఆదుకోవాలని అని వేడుకున్నారు.



బాత్‌రూమ్‌లో నివాసం ఉంటున్న నరసింహప్ప కుటుంబం



పోలవరం కోసం ప్రత్యేక ఖాతా

- రాష్ట్రప్రభుత్వానికి కేంద్రం ఆదేశం..ఇకపై ఇచ్చే నిధులన్నీ ఆ అకౌంట్లోకే
- జగన్ జమానాలో ఇచ్చిన డబ్బంతా దారి మళ్లింపు
- అలా జరక్కుండా ఉండేందుకే ప్రత్యేక ఖాతా

అమరావతి, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): పోలవరం ప్రాజెక్టు కోసం తానిచ్చిన నిధులు దారిమళ్లించకుండా ఉండేందుకు ప్రత్యేక బ్యాంకు ఖాతా తెరవాలని కేంద్రం రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. సోమవారమిక్కడ వెలగపూడి సచివాలయంలో పోలవరం ప్రాజెక్టు చీఫ్ ఇంజనీర్ నరసింహమూర్తి ఆర్థిక శాఖ అధికారులతో సమావేశమయ్యారు. బ్యాంకు ఖాతా తెరిచాక కేంద్రానికి సమాచారం ఇస్తే.. తొలి దశ పనుల కోసం ఇస్తానన్న రూ.12,567 కోట్లను అందులో జమచేస్తుందని తెలిపారు. ఇప్పటికే ఈ మొత్తానికి కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. గత ఐదేళ్లలో పోలవరానికి కేంద్రం ఇచ్చిన నిధులన్నిటినీ నాటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ దారిమళ్లించడంతో.. భవిష్యత్‌లో ఇలాంటివి పునరావృతం కాకుండా ఉండేందుకే ప్రత్యేక ఖాతా తెరవాలని ఆదేశించింది. ప్రాజెక్టు కోసం కేంద్రం విడుదల చేసే నిధులన్నీ ప్రధాన డ్యాం నిర్మించేందుకే వ్యయం చేసేందుకు ఖర్చు చేయాల్సి ఉంటుంది. 2014-19 నడుమ తెలుగుదేశం ప్రభుత్వం వ్యయం చేసిన మొత్తాన్ని 2019-24 మధ్యకాలంలో కేంద్రం రీరింబర్స్ చేసింది. దీనిని ప్రాజెక్టు పూర్తికి ఖర్చు చేయకుండా జగన్ ప్రభుత్వం ఇతర అవసరాలకు వాడేసింది. కీలకమైన డయాఫ్రం వాల్‌పై ఎర్త్ కమ్ రాక్‌ఫిల్ (ఈసీఆర్ఎఫ్) డ్యాం నిర్మించకుండా వదిలేసింది. దీంతో 020లో గోదావరి నదికి వచ్చిన 23 లక్షల క్యూసెక్కుల వరదకు డయాఫ్రం వాల్ దెబ్బతింది. ఫలితంగా ప్రాజెక్టు భవిష్యత్ చిందరవందరగా మారింది. పనులను ఎక్కడి నుంచి మొదలుపెట్టాలో తెలియని గందరగోళం నెలకొంది. కేంద్ర జల సంఘం కొత్త వాల్ నిర్మాణానికి మొగ్గుచూపడంతో రూ.990 కోట్లతో నిర్మించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సిద్ధమయ్యాయి. ఈ తరుణంలో కేంద్రం అంగీకరించిన రూ.12,567 కోట్లను విడుదల చేయాలంటూ కేంద్ర జలశక్తి శాఖకు రాష్ట్ర ఆర్థిక శాఖ లేఖ రాసింది. నిధుల కోసం ప్రత్యేక ఖాతా తెరవాలని జలశక్తి శాఖ సూచించింది. రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక అకౌంట్‌ను తెరుస్తోంది. మరోవైపు.. నవంబరు నుంచి కొత్త డయాఫ్రం వాల్ నిర్మాణాన్ని కొత్తగా నిర్మించేందుకు జలవనరుల శాఖ కార్యాచరణ సిద్ధం చేసింది.

భీమేశ్వరస్వామి హుండీలో రూ.30 లక్షలు వేసిన వృద్ధ రైతు



భీమేశ్వరస్వామి హుండీలో రూ.30 లక్షలు వేస్తున్న భక్తుడు మహాలక్ష్మి

ద్రాక్షారామ, సెప్టెంబరు 23: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జిల్లా ద్రాక్షారామ భీమేశ్వరస్వామివారి హుండీలో రామచంద్రపురం మండలం నెలపర్తిపాడుకు చెందిన ఓ రైతు సోమవారం ఏకంగా రూ.30 లక్షలు వేశారు. అనుసూరి మహాలక్ష్మి అనే ఈ 70 ఏళ్ల భక్తుడు సోమవారం ఆలయ సహాయ కమిషనర్ అల్లు వెంకట గంగాభవానీకి తాను హుండీలో రూ.30 లక్షలు వేయనున్నట్టు సమాచారం ఇచ్చారు. ముందుగా ఆయన భీమేశ్వరస్వామి, మాణిక్యాంబ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం సహాయ కమిషనర్ సమక్షంలో నగదు మొత్తాన్ని హుండీలో వేశారు.

అందరి ముందు క్షమాపణ కోరుతున్నా

- ఒకరోజు ప్రాయశ్చిత్త దీక్షలో కాకినాడ ఎమ్మెల్యే నానాజీ



ప్రాయశ్చిత్త దీక్షలో పాల్గొన్న కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ

సర్పవరం జంక్షన్(కాకినాడ), సెప్టెంబరు 23: 'కాకినాడ ఆర్ఎంసీ వైద్యుడు, ప్రొఫెసర్ ఉమామహేశ్వరరావును బహిరంగంగా అందరి ముందు క్షమాపణ కోరుతున్నా. కాకినాడ ఆర్ఎంసీ గ్రౌండ్‌లో శనివారం జరిగిన సంఘటనపై తీవ్రంగా కలత చెందా. అపరాధ భావంతో క్షమించమని శనివారం రాత్రే డాక్టర్‌ని కోరాను' అని కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ అన్నారు. ఆయన సోమవారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు కాకినాడ రూరల్‌లోని గొడారి గుంటలో ప్రాయశ్చిత్త దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. 'బాధ్యతాయుతంగా మెలగాల్సిన ప్రజాప్రతినిధిగా ఉన్న నేను వాలీబాల్ సమస్య పరిష్కారం కోసం వెళ్లి, కొందరి చెప్పుడు మాటలు విని ఆవేశంతో డాక్టర్‌పై దురుసుగా మాట్లాడి తప్పు చేశాను. భవిష్యత్తులో ఎవరిపట్ల అనుచితంగా ప్రవర్తించను, బాధ్యతాయుతంగా ఉంటాను. తప్పు చేశాననే ఆత్మన్యూనతాభావంతో మానసిక సంఘర్షణకు లోనై ఒకరోజు ప్రాయశ్చిత్త దీక్ష చేపట్టాను. ఎవరో చేసిన తప్పునకు మా అధినాయకుడు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ప్రాయశ్చిత దీక్షకు దిగారు. తప్పుగా మాట్లాడిన నేను ఎందుకు దీక్ష చేయకూడదు? అని ఆలోచించి బాధ్యతాయుతంగా దీక్ష చేపట్టా' అని నానాజీ అన్నారు. దీక్షలో ఉన్న ఎమ్మెల్యే నానాజీని టీడీపీ మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి సత్యనారాయణమూర్తి, మాజీమంత్రి చిక్కాల రామచంద్రరావు, బీజేపీ జిల్లా అధ్యక్షులు, పార్లమెంట్ కన్వీనర్ చిలుకూరి రామ్‌కుమార్, రంబాల వెంకటేశ్వరరావు కలిసి సంఘీభావం తెలిపారు. కాగా, కాకినాడ ఆర్ఎంసీ గ్రౌండ్‌లో శనివారం రాత్రి డాక్టర్ ఉమామహేశ్వరరావుపై కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ దౌర్జన్యానికి పాల్పడిన ఘటనలో ఆర్ఎంసీ కళాశాల ప్రిన్సిపాల్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు సర్పవరం పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు.

ఏపీజీడీఏ ఆధ్వర్యంలో ఆందోళన

జీజీహెచ్(కాకినాడ), సెప్టెంబరు 23: డాక్టర్ కె.ఉమామహేశ్వరరావుపై దాడికి పాల్పడిన కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ, అతడి అనుచరులపై హత్యాయత్నంతోపాటు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు పెట్టి అరెస్టు చేయాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ వైద్యుల సంఘం(ఏపీజీడీఏ) డిమాండ్ చేసింది. శనివారం నాటి దాడి సంఘటనను నిరసిస్తూ ఏపీజీడీఏ ఆధ్వర్యంలో కాకినాడ జీజీహెచ్ ప్రాంగణంలో వైద్యులు, వైద్యవిద్యార్థులు సోమవారం ఆందోళన చేపట్టారు.

వేడుకగా 'సప్తతి'

- 70లోకి అడుగుపెట్టిన స్నేహితులకు వెంకయ్య సత్కారం
- అనుకోని అతిథిగా సినీ నటుడు రజినీకాంత్

సాగర్‌నగర్ (విశాఖపట్నం), సెప్టెంబరు 23: మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు దంపతులు సోమవారం సప్తతి పేరుతో విశాఖపట్నంలోని రాడిసన్ బ్లూ హోటల్‌లో ఓ కార్యక్రమం నిర్వహించారు. 50 ఏళ్లుగా తనతో స్నేహం కొనసాగిస్తున్న ఏడుగురు స్నేహితులు 70వ పడిలోకి అడుగుపెట్టిన సందర్భంగా వారిని ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా నాటి జ్ఞాపకాలను మననం చేసుకున్నారు. మిత్రబృందంలో మిజోరం గవర్నర్ కంభంపాటి హరిబాబు, అట్లూరి అశోక్, తుమ్మల రంగారావు, వీరమాచినేని రంగప్రసాద్, త్రిపురనేని జేజీ ప్రసాద్, బిక్కిన లక్ష్మణరావు, సూర్యదేవర జోగేంద్రదేవ్ దంపతులు ఉన్నారు. కాగా, నగరంలో జరుగుతున్న సినిమా చిత్రీకరణలో పాల్గొంటున్న తమిళ సూపర్‌స్టార్ రజినీకాంత్ ఇదే హోటల్‌లో బస చేశారు. ఈ కార్యక్రమం గురించి తెలుసుకున్న ఆయన మర్యాదపూర్వకంగా వెంకయ్యనాయుడును కలుసుకున్నారు.



వెంకయ్యతో రజినీకాంత్



స్నేహితుల దంపతులను సత్కరించిన వెంకయ్య దంపతులు

చదువు పూర్తికాగానే ఉద్యోగం!

అందుకు అనుగుణంగా కరిక్యులమ్‌లో మార్పులు

- పరిశ్రమల అవసరాలకు తగ్గట్టు శిక్షణ
- పారిశ్రామికవేత్తలతో వర్సిటీలకు బోర్డ్ ఆఫ్ గవర్నెన్స్
- ప్రతినెలా నియోజకవర్గాల వారీగా జాబ్ మేళాలు: లోకేశ్
- ఉన్నత విద్యాశాఖపై మంత్రి సమీక్ష



స్కిల్ డెవలప్‌మెంట్‌పై సమీక్షా సమావేశంలో మంత్రి లోకేశ్, అధికారులు

అమరావతి, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): ఉన్నత విద్య పూర్తిచేసే సమయానికి ప్రతి విద్యార్థికీ రాష్ట్రంలో ఉద్యోగం వచ్చే పరిస్థితి ఉండాలని మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి నారా లోకేశ్ పేర్కొన్నారు. అందుకు తగ్గట్టుగా వచ్చే ఏడాది నుంచి ఉన్నత విద్యా కరిక్యులమ్‌ను మార్చాలని ఆదేశించారు. ఉన్నత విద్యాశాఖపై సోమవారం ఉండవల్లిలోని నివాసంలో ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... కాలేజీలో చదివే సమయాల్లోనే విద్యార్థులకు మార్కెట్ ట్రెండ్‌లకు అనుగుణంగా శిక్షణ ఇవ్వాలని, మళ్లీ ప్రత్యేకంగా శిక్షణ తీసుకునే అవసరం లేకుండా చూడాలన్నారు. సీఎస్ఈ, మెకానికల్ బ్రాంచ్‌లతో పాటు సివిల్ ఇంజనీరింగ్‌లో కూడా శిక్షణ ఇచ్చే అంశాన్ని పరిశీలించాలని నిర్దేశించారు. పరిశ్రమల ప్రముఖులతో చర్చించి వారి అవసరాలకు అనుగుణంగా సంస్కరణలు తీసుకురావాలని పేర్కొన్నారు. ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకింగ్స్‌లో రాష్ట్ర యూనివర్సిటీలు వెనకబడిపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ర్యాంకుల మెరుగుకు విద్యారంగ నిపుణుల సలహాలు తీసుకోవాలని సూచించారు. 2027 నాటికి మెరుగైన ర్యాంకుల కోసం ప్రతి యూనివర్సిటీకి లక్ష్యాన్ని నిర్దేశించాలన్నారు. ఆంధ్రా, నాగార్జున యూనివర్సిటీలు టాప్-10లో ఉండాలని స్పష్టం చేశారు. రాష్ట్రంలోని యూనివర్సిటీల్లో చదివి ప్రస్తుతం కీలక హోదాల్లో ఉన్న ప్రముఖులతో వెబ్‌సైట్ రూపొందించి వర్సిటీలకు బ్రాండింగ్ కల్పించాలన్నారు. ఆంధ్రా యూనివర్సిటీలో చదివిన జోషి పీటీఐ చైర్మన్‌గా పనిచేస్తున్న విషయాన్ని గుర్తుచేశారు. అలా కీలక స్థానాల్లో ఉన్న పూర్వ విద్యార్థులతో అవసరమైతే తాను సమావేశం నిర్వహిస్తానని చెప్పారు. 2030, 2047 నాటికి యూనివర్సిటీలు ఎలా ఉండాలనే దానిపై లక్ష్యాలు నిర్దేశించుకోవాలన్నారు. ప్రతి విద్యార్థికి అపార్ ఐడీ రూపొందించి, డిజీ లాకర్ సౌకర్యం కల్పించాలన్నారు. వంద రోజుల ప్రణాళికలో భాగంగా రాష్ట్రంలో ప్రపంచ స్థాయి ఏఐ యూనివర్సిటీ, స్పోర్ట్స్ యూనివర్సిటీ ఏర్పాటుకు రూట్ మ్యాప్ సిద్ధం చేయాలని ఆదేశించారు. ఉన్నత విద్యనభ్యసించే విద్యార్థులకు స్టూడెంట్ యాప్ ద్వారా సమాచారం, సేవలు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. పారిశ్రామిక వేత్తలతో యూనివర్సిటీలకు బోర్డ్ ఆఫ్ గవర్నెన్స్ ఏర్పాటు చేయాలన్నారు. నైపుణ్య గణన పైలెట్ ప్రాజెక్టులో భాగంగా మంగళగిరి, సీఆర్‌డీఏ ప్రాంతాల్లో నైపుణ్య గణన చేపట్టాలని అధికారులను ఆదేశించారు. పరిశ్రమలతో పాలిటెక్నిక్ కాలేజీల అనుసంధానంపై ఆరా తీశారు. నియోజకవర్గాల వారీగా ప్రతినెలా జాబ్ మేళా నిర్వహణకు క్యాలెండర్ రూపొందించాలని ఆదేశించారు. ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజ్‌పై సమగ్ర నివేదిక సమర్పించాలన్నారు.

వరదల్లో సర్టిఫికెట్లు కోల్పోయినవారికి..

ఇటీవలి వరదల్లో సర్టిఫికెట్లు కోల్పోయిన విద్యార్థులకు వెంటనే అవి అందించేందుకు చర్యలు ప్రారంభించాలని మంత్రి లోకేశ్ అధికారులను ఆదేశించారు. భవిష్యత్తులో సర్టిఫికెట్ల కోసం యూనివర్సిటీలకు వెళ్లకుండా డీజీ లాకర్స్ పూర్తిస్థాయిలో సిద్ధం చేయాలని నిర్దేశించారు. ఏపీపీఎస్సీ పరీక్షలు రాసే అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలనకు ఎక్కువ సమయం పడుతోందని, భవిష్యత్తులో డీజీ లాకర్స్‌ను ఏఐతో అనుసంధానం చేసి సులభంగా సర్టిఫికెట్లు పరిశీలించే విధానం అమలు చేయాలని సూచించారు. గత ప్రభుత్వం రూ.2,473 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు పెట్టిందని అధికారులు మంత్రికి వివరించారు. విదేశీ విద్య పథకానికి మరో రూ.89 కోట్ల బకాయిలున్నాయని తెలిపారు. ఈ అంశాన్ని మంగళవారం జరిగే సమీక్షలో సీఎం దృష్టికి తీసుకెళ్లాలని నిర్ణయించారు. సమీక్షలో ఉన్నతాధికారులు సౌరబ్ గౌర్, పోలా భాస్కర్, జి.గణేష్‌కుమార్, కె.రామ్మోహనరావు, కుమార పురుషోత్తం, ఇమ్మని మోహన్ తదితరులు పాల్గొన్నారు.

హజ్ యాత్రకు లక్ష

మైనార్టీ సంక్షేమ పథకాల పునరుద్ధరణ

- మైనార్టీ సంక్షేమ శాఖపై సమీక్షలో సీఎం చంద్రబాబు

అమరావతి, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మైనార్టీ వర్గాలకు అందించే సంక్షేమ పథకాలను పునర్‌వ్యవస్థీకరించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. హజ్ యాత్రకు వెళ్లే వారికి రూ.లక్ష సాయం, ఇమామ్‌లు, మౌజన్‌లకు గౌరవ వేతనం కింద నెలకు రూ.10వేలు, రూ.5వేలు ఇస్తామన్న హామీలను త్వరలోని అమల్లోకి తేవాలని సూచించారు. మసీదుల నిర్వహణకు రూ.5 వేలు ఇచ్చే కార్యక్రమానికి కూడా త్వరలో శ్రీకారం చుట్టాలని సీఎం ఆదేశించారు. గత తెలుగుదేశం ప్రభుత్వంలో అమలు చేసిన పథకాలు, ఇటీవలి ఎన్నికల్లో ఇచ్చిన హామీల నేపథ్యంలో ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా పథకాల రూపకల్పన చేయాలని సూచించారు. అమరావతి సచివాలయంలో మైనార్టీ సంక్షేమ శాఖపై సీఎం చంద్రబాబు సోమవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత టీడీపీ ప్రభుత్వంలో మంజూరై కొంతమేర నిర్మాణాలు చేపట్టిన షాదీ ఖానాలు, ఇతర నిర్మాణాలను పూర్తిచేయాలని చెప్పారు. ప్రారంభం కాని పనులను రద్దుచేసి వాటిని పునఃసమీక్షించాలని ఆదేశించారు. కడపలో హజ్ హౌస్ కోసం నాడు టీడీపీ ప్రభుత్వం రూ.24కోట్లు మంజూరు చేసిందని, ఆ పనులు 80 శాతం మేర పూర్తయ్యాయని అధికారులు తెలుపగా.. మిగతా పనులు కూడా వీలైనంత త్వరగా పూర్తి చేయాలని సీఎం సూచించారు. అలాగే.. గుంటూరు క్రిస్టియన్ భవన్‌కు గత టీడీపీ ప్రభుత్వం రూ.16 కోట్లు మంజూరు చేయగా 50 శాతం పనులు పూర్తయ్యాయని అధికారులు వివరించారు. ఆ మిగిలిన పనులు కూడా వెంటనే పూర్తిచేయాలని సీఎం ఆదేశించారు. విశాఖపట్నం, గుంటూరు, నంద్యాలల్లో రూ.35 కోట్లు చొప్పున మూడు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) డేటా సైన్స్ ట్రైనింగ్ సెంటర్లు ఏర్పాటు చేయాలని చెప్పారు. నూర్ బాషా కార్పొరేషన్ ఏర్పాటుకు కూడా సీఎం చంద్రబాబు అంగీకారం తెలిపారు. వక్ఫ్ బోర్డు భూముల సర్వేను రెండేళ్లలో పూర్తి చేయాలని అధికారులకు ఆదేశాలిచ్చారు. వక్ఫ్ బోర్డు భూముల అభివృద్ధి పరిచేందుకు అధికారులు చేసిన ప్రతిపాదనలకు సీఎం అంగీకారం తెలిపారు. వక్ఫ్ బోర్డుకు ఆదాయం తేవడంతో పాటు భూముల అభివృద్ధి ఫలాలు కూడా ఆ వర్గానికే అందేలా చూడాలని సూచించారు. కార్యక్రమంలో మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఫరూక్, అధికారులు పాల్గొన్నారు.

కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటు

- తీర్మానంచేసి కేంద్రానికి పంపుతాం
- జూనియర్ లాయర్లకు నెలకు 10వేలు
- అమరావతిలో ఇంటర్నేషనల్ లా స్కూల్
- న్యాయశాఖ సమీక్షలో సీఎం చంద్రబాబు



న్యాయ శాఖ సమీక్షలో సీఎం చంద్రబాబు, ఆ శాఖ అధికారులు

అమరావతి, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉన్నదని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. ఎన్నికల సమయంలో హామీ ఇచ్చిన మేరకు, మంత్రివర్గ సమావేశంలో దీనిపై తీర్మానం చేసి కేంద్రానికి పంపనున్నట్లు వెల్లడించారు. జూనియర్ న్యాయవాదులకు గౌరవ వేతనం కింద నెలకు రూ.10 వేలు అందిస్తామని చెప్పారు. తమ మేనిఫెస్టోలో ఇచ్చిన ఈ హామీని అమలుచేసే ప్రక్రియను ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. సోమవారం అమరావతి సచివాలయంలో న్యాయశాఖపై సీఎం సమీక్ష నిర్వహించారు. రాజధాని అమరావతిలో 100 ఎకరాల విస్తీర్ణంలో బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ట్రస్ట్ ద్వారా ఇంటర్నేషన్ లా స్కూల్ ఏర్పాటుకు ముందుకు తీసుకెళ్లాలని ఆయన సూచించారు. బెంగళూరుకు చెందిన నేషనల్ లా స్కూల్ ఆఫ్ ఇండియా యూనివర్సిటీ, గోవాలోని ఇండియా ఇంటర్నేషనల్ యూనివర్సిటీ ఆఫ్ లీగల్ ఎడ్యుకేషన్ అండ్ రిసెర్చ్‌లాంటి ప్రతిష్ఠాత్మక సంస్థల తరహాలో అంతర్జాతీయ ప్రమాణాలతో అత్యుత్తమ ఇనిస్టిట్యూట్‌ను అమరావతిలో ఏర్పాటుచేసే ప్రక్రియను వేగవంతం చేయాలని కోరారు. జూనియర్ న్యాయవాదులకు శిక్షణ కోసం అకాడమీ ఏర్పాటు అంశంపైనా కసరత్తు చేయాలన్నారు. అనంతరం ప్రాసిక్యూషన్ విభాగంపై అధికారులు ప్రజెంటేషన్ ఇచ్చారు. నమోదైన కేసులు, రుజువైన నేరాల అంశంలో శిక్షపడే శాతం పెరగాలని, దర్యాప్తు వేగవంతంగా పూర్తిచేసే పద్ధతులను అవలంబించాలని చంద్రబాబు సూచించారు. తప్పుచేసినవారికి శిక్షపడుతుందనే నమ్మకం కలిగేలా ప్రాసిక్యూషన్ ఉండాలన్నారు. న్యాయశాఖపై మరింత సమగ్రంగా సమీక్ష చేయాలని, మరిన్ని వివరాలతో రావాలని అధికారులను ఆదేశించారు.

త్వరలోనే నామినేటెడ్ నియామకాలు

- టీడీపీ నేతలకు చంద్రబాబు సంకేతాలు

అమరావతి, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): నామినేటెడ్ పోస్టుల నియామకానికి త్వరలోనే మోక్షం లభించే సూచనలు కనిపిస్తున్నాయి. ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ మేరకు సంకేతాలిచ్చారు. కూటమి ప్రభుత్వ వంద రోజుల పాలన విజయాలను ప్రజల్లోకి తీసుకెళ్లేలా పార్టీ శ్రేణులను కదిలించడానికి ఆదివారం ఆయన పార్టీ నేతలతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. అందులో తానే నామినేటెడ్ పోస్టుల భర్తీ గురించి ప్రస్తావించారు. కొద్ది రోజుల్లోనే నియామకాలు చేపట్టనున్నట్లు చెప్పారు. 'ఈ సమయానికే వచ్చేసి ఉండాల్సింది. అయితే తిరుమల లడ్డూ విషయం ముందుకు రావడంతో ఈ పోస్టుల భర్తీ కాస్త వెనక్కి వెళ్లింది. కొద్ది రోజుల్లోనే వేస్తాం' అని తెలిపారు. ఆయన నోటి నుంచే ఈ మాట రావడం టీడీపీ వర్గాలకు సంతోషాన్నిచ్చింది. ప్రస్తుతం 'ఇది మంచి ప్రభుత్వం' పేరుతో వారం రోజుల కార్యక్రమం రాష్ట్రవ్యాప్తంగా నడుస్తోంది. ఇది 26న పూర్తవుతుంది. ఆ తర్వాత నియామకాలు జరగవచ్చని అంటున్నారు. తొలి విడతలో సుమారు 20 వరకూ పోస్టుల భర్తీ జరగవచ్చని ప్రచారం జరుగుతోంది. ఇందులో కొన్ని జనసేన, బీజేపీలకూ ఇవ్వొచ్చని అంటున్నారు. నియోజకవర్గాల్లో సీట్లు త్యాగం చేసిన వారికి, రాష్ట్ర స్థాయిలో గత ఐదేళ్లు పార్టీ నాయకత్వం తరఫున చురుగ్గా పనిచేసిన వారికి.. చంద్రబాబు అంతరంగిక బృందంలో ఉండి పార్టీ కార్యాలయంలో పనిచేసిన వారికి తొలి విడతలో చోటు లభించవచ్చు. అక్టోబరులో బీసీ కార్పొరేషన్లు, ఫెడరేషన్లను భర్తీ చేయవచ్చని పార్టీ వర్గాలు భావిస్తున్నాయి.

హైకోర్టులో సీబీఐ ఎస్‌పీపీలుగా సురేష్‌కుమార్, శ్రవణ్‌కుమార్



సురేష్ కుమార్



శ్రవణ్ కుమార్

అమరావతి, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): హైకోర్టులో సీబీఐ తరఫున వాదనలు వినిపించేందుకు న్యాయవాదులు పీఎస్‌పీ సురేష్‌కుమార్, మన్నవ శ్రవణ్‌కుమార్‌లు ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్లుగా నియమితులయ్యారు. వీరిద్దరు సోమవారం విశాఖ సీబీఐ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. మూడేళ్లపాటు వీరు ఎస్‌పీపీలుగా బాధ్యతలు నిర్వహిస్తారు. ప్రాసిక్యూషన్, అప్పీళ్లు, రివిజన్లు తదితర కేసుల్లో సీబీఐ తరఫున వాదనలు వినిపించనున్నారు.

గల్లంతైన ఇద్దరు వైద్య విద్యార్థినుల మృతదేహాలు లభ్యం

- మరొక విద్యార్థి కోసం కొనసాగుతున్న గాలింపు

అమృత మృతదేహం



మారేడుమిల్లి, సెప్టెంబరు 23: జలపాతం వరదనీటిలో గల్లంతైన వైద్యకళాశాల విద్యార్థులలో ఇద్దరి మృతదేహాలు లభ్యమయ్యాయి. అల్లూరి సీతారామరాజు జిల్లా మారేడుమిల్లి జలతరంగిణి జలపాతం వద్ద ఆదివారం అకస్మాత్తుగా వచ్చిన వరదనీటి ప్రవాహంలో ఏలూరు ఆశ్రమ్ వైద్య కళాశాల విద్యార్థులు ఐదుగురు గల్లంతు కావడం, ఇద్దరు ప్రాణాలతో బయటపడ్డ విషయం తెలిసిందే. గల్లంతైన వారికోసం పోలీసు అధికారులు ఎన్డీఆర్ఎఫ్, ఏపీఎస్డీఆర్ఎఫ్, రెవెన్యూ, అగ్నిమాపక, అటవీ అధికారుల సమన్వయంతో రెస్క్యూ ఆపరేషన్ చేపట్టి కొండవాగులలో గాలింపు చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో ఆదివారం అర్ధరాత్రి 12 గంటలకు బాలి అమృత (22) మృతదేహాన్ని కనుగొన్నారు. ఈమె విజయనగరం జిల్లా బొబ్బిలి సమీపంలోని డొంకినవలస గ్రామానికి చెందిన విద్యార్థిని. కాగా, సోమవారం ఉదయ కొసిరెడ్డి సౌమ్య (21) మృతదేహాన్ని కనుగొన్నారు. ఈమె బొబ్బిలికి చెందిన విద్యార్థిని. మరొక విద్యార్థి ప్రకాశం జిల్లా మార్కాపురానికి చెందిన చింతకుంట్ల హరిదీప్ (20) ఆచూకీ సోమవారం రాత్రి వరకూ లభ్యం కాలేదు. సోమవారం కూడా భారీ వర్షం కురిసింది. దీంతో కొండవాగులు పొంగి ఉధృతంగా ప్రవహిస్తుండడంతో గాలింపు చర్యలకు ఆటంకం ఏర్పడింది. వర్షం తగ్గిన తర్వాత రెస్క్యూ ఆపరేషన్ టీం మళ్లీ గాలింపు చర్యలను ముమ్మరం చేశారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

లంకలో అరుణోదయం

శ్రీలంక కొత్త అధ్యక్షుడుగా మార్క్సిస్టు నాయకుడు అనుర కుమార దిస్సనాయకే సోమవారం ప్రమాణస్వీకారం చేశారు. శనివారం జరిగిన ఎన్నికల్లో ఈయన నేతృత్వంలోని ఎన్‌పిపి సంకీర్ణానికి సమీప ప్రత్యర్థి సాజిద్ ప్రేమదాసకంటే పన్నెండు లక్షల ఓట్లు అధికంగా వచ్చాయి. లంకలో పేరున్న రాజపక్సేలు, రణసింఘేలు, ప్రేమదాసల మీద జనం విపరీతమైన ఆగ్రహంతో ఉన్నారని అందుకే బయటి ప్రపంచానికి పెద్దగా తెలియని ఈయనకు పట్టంకట్టారని విశ్లేషకులు అంటున్నారు. ఆర్థికసంక్షోభం అంచున ఉన్న దేశాన్ని ప్రస్తుత విధానాలు బాగుచేయలేవని నమ్మిన ప్రజలు, తమ భవిష్యత్తును ఈ యాభైఐదేళ్ళ వామపక్ష నాయకుడి చేతిలో పెట్టారు.

పదేళ్ళక్రితం జనతావిముక్తి పెరుమన (జేవీపీ)కు అధ్యక్షుడై, ఆరేళ్ల క్రితం ఆ పార్టీ నేతృత్వంలో నేషనల్ పీపుల్స్ పవర్ (ఎన్‌పిపి) కూటమిని ఏర్పాటు చేసి, అప్పటి అధ్యక్ష ఎన్నికల్లో పోటీపడినప్పుడు అనుర కుమార దిస్సనాయకే (ఎకెడి)కు మూడుశాతం ఓట్లు వచ్చాయి. ఇప్పుడు మరో నలభైశాతం ఓట్లు పడటానికి ప్రధాన కారణం ప్రజల ఆర్థిక దుస్థితి, దుర్భరమైపోయిన వారి దైనందిన జీవితాలు. ప్రజల్లో ఉన్న నిరాశానిస్పృహలను ఎకెడి చక్కగా వినియోగించుకున్నారు. ప్రత్యర్థులందరినీ చేతకానివారుగా చీల్చిచండాడి, తాను సచ్ఛీలుడినని చేసిన ప్రచారం జనానికి ఎక్కింది. మిగతావారంతా దోచుకోవడానికి వస్తే, తాను రక్షించడానికి వచ్చానని ఆయన చెప్పుకున్నాడు. కష్టాల్లో ఉన్న జనానికి ఇటువంటి మాటలు సులువుగా ఎక్కుతాయి కనుక, వారికి ఆయన ఓ ఉద్ధారకుడిగా కనిపించాడు. రాజపక్సేలు రగల్చిపోయిన ఆగ్గిని చల్లార్చి, పరిస్థితులను దారికి తెచ్చి, ఇరుగుపొరుగుదేశాల చేయూతతో, ఐఎంఎఫ్ ఆర్థిక సాయంతో దేశాన్ని ఎంతోకొంత గాడినపెట్టాడని మిగతా ప్రపంచమంతా అంటున్న రణిల్ విక్రమసింఘేను కూడా జనం కాదుపొమ్మన్నారు. రాజపక్సేలకు వ్యతిరేకంగా సాగిన ప్రజాఉద్యమంలో చురుకైన పాత్ర పోషించడం, అధ్యక్ష బరిలోకి దిగబోతున్నానని ముందుగానే ప్రకటించడం ఎకెడికి వివిధ వర్గాలను ఆకట్టుకోవడానికి ఉపకరించింది.

ఆయన సారథ్యం వహిస్తున్న జేవీపీకి హింసాత్మక చరిత్ర ఉంది. 1970, 80 దశకాల్లో అది సాయుధ తిరుగుబాట్లు చేసింది, వందలాదిమంది మరణించారు. ఎల్‌టీటీఈ సారథ్యంలో తమిళుల అస్తిత్వపోరాటం మొదలైన తరువాత ఈ పార్టీ లంక జాతీయవాదానికి ప్రతినిధిగా అవతరించి, ఎల్‌టీటీఈతో ప్రత్యక్ష యుద్ధం కూడా చేసింది. భారత్–శ్రీలంక శాంతి ఒప్పందాన్ని వ్యతిరేకిస్తూ జేవీపీ సాగించిన హింసలో వందలమంది మరణించారు. ఈ ఒప్పందం ఆధారంగా ఉనికిలోకి వచ్చిన ప్రాంతీయమండళ్ళకు కొద్దిపాటి అధికారాలు బదలాయించడాన్ని కూడా ఈ పార్టీ తీవ్రంగా వ్యతిరేకించింది. ఎకెడి విజయోత్సవంలో ఎర్రజెండాలు కనిపిస్తున్నా అది మతవాద, మితవాద పార్టీయేనని కొందరి వ్యాఖ్యానం. జేవీపీ అధ్యక్షుడైన తరువాత ఆయన గతకాలపు హింసకు క్షమాపణలు కోరారు కానీ, ప్రాంతీయమండళ్ళు కొనసాగుతాయన్న ఒక్కమాట తప్ప తమిళుల విషయంలో ఆయన వైఖరి పెద్దగా మారలేదు. అయనకూ, ఆయన పార్టీకి భారత వ్యతిరేకి అన్నపేరుంది. చైనా అనుకూలుత గురించి ఇక ప్రత్యేకంగా చెప్పుకోనక్కరలేదు. ఎకెడి రాకతో, అదానీ విండ్ పవర్ ప్రాజెక్టు ప్రమాదంలో పడిందని అంటారు. భారత ప్రధాని నరేంద్రమోదీ గత పాలకులతో నేరుగా మాట్లాడి అదానీకి ఈ ప్రాజెక్టు ఇప్పించారన్న ఆరోపణలు వెల్లువెత్తినప్పటినుంచి పక్షంరోజుల క్రితం వరకూ కూడా ఎకెడి ఈ ప్రాజెక్టు రద్దు విషయంలో ఒకేమాట మీద ఉన్నారు. సోమవారం దేశ 9వ అధ్యక్షుడుగా ప్రమాణం చేస్తున్న సందర్భంలో, తాను మెజీషియన్‌ని కాదని, దేశాన్ని ఆర్థికసంక్షోభం నుంచి బయటపడవేయడానికి తన సైద్ధాంతిక కట్టుబాటుకు భిన్నమైన శక్తులతో కూడా సానుకూలంగా వ్యవహరిస్తానని తన ప్రసంగంలో మాటిచ్చారు.

వివిధ ట్రేడ్‌యూనియన్లు, సామాన్యులు ఆయనకు మద్దతుగా నిలిచిన నేపథ్యంలో, విజయావకాశాలు మెరుగుపడుతున్న తరుణంలో భారతదేశం ఆహ్వానించడం, ఆయన పర్యటించడం కూడా జరిగింది. ఇప్పుడు ఎన్నికల ఫలితాల్లో ఎకెడి అధ్యక్షుడిగా నెగ్గినట్టు తేలిన పదినిముషాల్లోనే భారత ప్రతినిధి బృందం స్వయంగా ఆయనకు పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందనలు తెలిపింది. ఇరుగుపొరుగుదేశాలతో సత్సంబంధాలు కొనసాగుతాయన్న ఆయన హామీలో భారత్ వాటా ఎంతో భవిష్యత్తులో తేలుతుంది. 225సీట్ల పార్లమెంటులో మూడు మాత్రమే ఉన్న దిసనాయకే, ఈ వేడి చల్లారకముందే పార్లమెంటు ఎన్నికలకు పోవడానికి సిద్ధపడుతున్నారు. చట్టసభలో అవసరమైనంత సంఖ్యాబలాన్ని సాధించాక ఆ ఎర్రదనాన్ని పూర్తిగా వదిలేసి, అసలు రంగు ప్రదర్శిస్తాడని కొందరి అంచనా.

ధర్మరక్షణ బోర్డు ప్రతిపాదన ఒక సవాలు!

సనాతన ధర్మ రక్షణకై జాతీయ స్థాయిలో ఒక బోర్డ్ ఏర్పాటు చేయాలని పవన్ కళ్యాణ్ సూచించడం ఆశ్చర్యకరమైన, ఎంతో ఆహ్వానించదగిన విషయం. సాధారణంగా రాజకీయ నాయకులు మతాలకు అతీతంగా ఉన్నట్టు వ్యవహరిస్తుంటారు. అయినా పవన్ కళ్యాణ్ ప్రజానాయకుడిలా ఆలోచించి మాట్లాడారు. ఈ ప్రతిపాదన ద్వారా ఆయన నిద్రపోతున్న హిందూ సమాజానికి, హిందూ మత పెద్దలకు, ప్రభుత్వాలకు అందరికీ ఒక సవాలు విసిరారు అందుకు ఆయన అభినందనీయులు.

సనాతన ధర్మానికి చెందినవారు సుమారు 80శాతం వరకు ఉన్నారు, అల్పసంఖ్యాకులకైతే రక్షణ కావాలి గాని మెజారిటీ వర్గానికి రక్షణ ఏమిటి అని ఒక ప్రశ్న రావచ్చు. అయితే దేశ స్వాతంత్ర్యం తరువాత రాజకీయ ధోరణుల్ని పరిశీలిస్తే అన్నింటికన్నా ఎక్కువ హాని సనాతన ధర్మానికి జరిగిందని చూడగలం. ప్రపంచంలో వందకు పైగా దేశాలు క్రిస్టియన్ దేశాలని, యాభైకి పైగా ఇస్లామిక్ దేశాలని చెప్పుకుంటున్నాయి కానీ 80 శాతం హిందువులు ఉన్న ఈ దేశాన్ని హిందూ దేశమని చెప్పలేం. హిందూ మతాన్ని నిర్మూలించడానికి, దేశాన్ని విడగొట్టడానికి ఎన్ని బయట శక్తులు ప్రయత్నిస్తున్నాయో ఈ వ్యాసంలో చెప్పదలచుకోలేదు. ఒక హిందూ మతాన్ని నిర్మూలించగలిగితే మిగతా మతాలన్నీ వాటంతటవే బలహీనమై కనుమరుగవుతాయి. ఒక హిందూ మతం నశిస్తే భారత్‌లో కూడా ఆఫ్రికా దేశాల్లో లాగా రెండు అబ్రహామిక్ మతాల మధ్య పోరాటాలు, అంతర్యుద్ధాలతో దేశం విడిపోతుంది. అలా చేయాలనే విదేశీ మేధావుల ప్రణాళికలు. అందువల్ల కేవలం హిందూమతం పైనే విదేశీ శక్తుల ప్రయత్నాలన్నీ.



ప్రపంచంలో ఒకే ఒక హిందూ దేశంగా గుర్తించబడిన నేపాల్‌ను వామపక్ష మేధావులు మావోయిస్టుల చేతిలో పెట్టారు. మనదేశంలోని మార్క్సిస్టులు కూడా నేపాల్ మార్క్సిస్టులతో సహకరించి మావోయిస్టు ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి ముఖ్యపాత్ర వహించారు. భారత్‌కు నేపాల్‌కు ఉన్న సాంస్కృతిక సంబంధాలను తెగగొట్టడానికి అన్ని ప్రయత్నాలు చేశారు. నేపాల్‌ను చైనాకు బానిసదేశంగా మార్చిన ఈ మేధావులే భారతదేశాన్ని కూడా అలా చేయాలని దీర్ఘకాలిక వ్యూహాలతో ఉన్నారు.

మత ప్రాతిపదికపై ఏర్పడిన ఓటు బ్యాంకులు రాజకీయ వర్గాలను ప్రభావితం చేస్తాయి. దీనితో రాజకీయ పార్టీలు ఓటు బ్యాంకులను సంతృప్తిపరిచే పథకాలను అమలు చేస్తారు. మెజారిటీ వర్గాన్ని ఏ విధంగా కులాల పేరిట చీలగొట్టారన్నది అందరికీ తెలిసిందే. హిందూ సమాజానికి జరుగుతున్న అన్యాయాన్ని ప్రశ్నించడానికి ఏ వర్గము ముందుకు రాలేదు.

భారతీయ మతాల గురించి మాట్లాడే ఆరెస్సెస్ – విశ్వహిందూ పరిషత్ లాంటి సంస్థలకు మత ఛాందసవాదులు అనే ముద్ర వేసి వాటిని నోరెత్తకుండా చేస్తున్నాం. కానీ అదే సమయంలో ఇతర మతాల సంస్థలకు పెద్దపీట వేసి మన ఉదార స్వభావాన్ని చాటుకుంటున్నాం. సెక్యులరిజం ఇదే అంటున్నాం. ఇతర మతాల రక్షణకై ప్రభుత్వాలు ఏర్పాటు చేసిన సంస్థలను చూస్తే ఇది స్పష్టం అవుతుంది. దేవాలయాల ఆస్తుల్ని రక్షించుకోవడానికి ఉన్న ఎండోమెంట్ లాంటి వ్యవస్థలు నామమాత్రంగానే ఉన్నాయి. వాటిలో పనిచేసేవారు ప్రభుత్వ కీలుబొమ్మలే, అధికార పార్టీల కీలుబొమ్మలే.



ఇతర మతాల పుస్తకాల్ని మనం చదవకపోవడం, మన పుస్తకాల గురించి ఎదుటివాడు చెప్పిన దాన్ని నమ్మడం మన లక్షణం. సొంత బుద్ధితో అన్ని మతాల గూర్చి చదివితే సనాతన ధర్మాన్ని ఎందుకు రక్షించుకోవాలో మనకే తెలుస్తుంది. ప్రపంచ శాంతికి ఒకే ఒక మార్గం సనాతన ధర్మం.

ఇతర మతాల పుస్తకాల్ని మనం చదవకపోవడం, మన పుస్తకాల గురించి ఎదుటివాడు చెప్పిన దాన్ని నమ్మడం మన లక్షణం. సొంత బుద్ధితో అన్ని మతాల గూర్చి చదివితే సనాతన ధర్మాన్ని ఎందుకు రక్షించుకోవాలో మనకే తెలుస్తుంది. ఈ విషయంపై ఎంతో చెప్పవచ్చు. సమాజంలోని వ్యక్తి మతానికి అతీతంగా వెళ్లి తన స్వరూపాన్ని తెలుసుకోవాలని చెప్పే ఒకే ఒక మతం హిందూ మతం. జీవుడే భగవంతుడు అన్న విషయాన్ని తెలుసుకొని అలా వ్యవహరించమని చెప్పే మతం. ఇందులో చెప్పబడిన దేవుడు కూడా ఎవరి పట్ల ద్వేషం లేని వ్యక్తి. నన్నే పూజించు అని ఏ దేవుడు చెప్పడు. నన్ను కాక ఎవరిని పూజించిన నన్ను పూజించినట్లే అని కూడా భగవద్గీతలో శ్రీకృష్ణుడు అంటాడు. మత దురహంకారం లేని ఒకే ఒక మతం హిందూ మతం. వందలాది సంప్రదాయాలు ఉన్నప్పటికీ వాటన్నింటినీ కలిపి ఉంచిన ఉపనిషత్తుల సిద్ధాంతం ప్రపంచానికి ఆదర్శప్రాయమైంది. ఎదుటివాడిని తమ మతంలోకి మార్చాలి అనే ప్రస్తావన ఇందులో లేదు. ప్రపంచ శాంతికి ఒకే ఒక మార్గం సనాతన ధర్మం.

సనాతన ధర్మం అంటేనే కులం అని అసహ్యించుకునే వాళ్ళు ఉంటారు. కానీ హిందూ మతం కులాన్ని సృష్టించలేదన్న విషయం మన పుస్తకాలను చదివితేనే తెలుస్తుంది. హిందూ మతం కుల వ్యవస్థను సృష్టించినట్లు ఏ పుస్తకంలోనూ చూడలేము. సమాజం అవసరాలను బట్టి కులాలు ఏర్పడ్డాయి గాని ఏ దేవుడు గాని, ఏ రుషి గాని కులాన్ని సృష్టించలేదు– అని సవాలు చేసి ఈ విషయంపై నా ఇటీవలి పుస్తకంలో చర్చించడం జరిగింది.

సనాతన ధర్మం పరిధి చాలా విస్తారమైనది. వైదిక సంస్కృతితో మొదలైన ఈ ధర్మానికి బౌద్ధం, జైన మతం సిక్కు మతం కాల క్రమంలో కొత్త శాఖలుగా వచ్చాయి. వీటన్నింటిని ప్రస్తుతం భిన్న మతాలుగా మనం చెపుతున్నప్పటికీ మన సంప్రదాయం ప్రకారం వీటన్నిటిని వివిధ దర్శనాలుగానే పేర్కొన్నారు. వీటన్నింటిలో సిద్ధాంత విషయంలో భేదం కొంత ఉన్నప్పటికీ ధర్మం విషయంలో తేడా లేదు. సనాతన ధర్మం రక్షణ బోర్డ్ పరిధిలోకి హిందూ మతం మాత్రమే కాక బౌద్ధం, జైన మతం, సిక్కు మతాలను కూడా చేర్చవచ్చు. హిందూమతంలోనే వందలకొద్దీ సంప్రదాయాలు మరి వీరందరూ ఈ బోర్డు పరిధిలోకి రావడానికి అంగీకరిస్తారా అన్నది ఒక విషయం. తమ ఉనికిని కాపాడుకోవాలంటే అందరూ ఈ బోర్డు పరిధిలోకి రావడం ఒకటే మార్గం.

○ కె. అరవిందరావు
మాజీ డీజీపీ

ఒకే దేశం ఒకే ఎన్నికకు ఇది సమయం కాదు

కేంద్ర ప్రభుత్వం ఒకే దేశం ఒకే ఎన్నికల విధానానికి అంగీకారం తెలిపింది. అది చట్టమై, కార్యరూపం దాల్చడానికి మొదటిగా అవసరమైన కేబినెట్ ఆమోదం పొందింది. అయితే ఈ దిశగా ఇది మొదటి అడుగు మాత్రమే. వాస్తవ రూపం పొందాలంటే చాలా దూరం, సమయం, కృషి అవసరమౌతాయి. నిజానికి దేశమంతా, రాష్ట్రాల, స్థానిక సంస్థలు సహా ఎన్నికల్ని ఒకేసారి పూర్తి చెయ్యాలనుకోవడం మంచిదే. అది ఆచరణలో పెట్టడానికి మాత్రం ఇప్పుడున్న వాతావరణం గానీ, సంసిద్ధత గానీ సరిపోదు. ఉదాహరణకి ఇప్పుడు జరుగుతున్న ఎన్నికలనే తీసుకుందాం. జమ్ము కాశ్మీరు, హర్యానా, మహారాష్ట్రలకు ఒకేసారి జరపొచ్చు. కానీ పండుగలు, భద్రత పేరుతో మహారాష్ట్ర ఎన్నికల్ని ఎన్నికల సంఘం వెనక్కి పెట్టింది. మూడు రాష్ట్రాల ఎన్నికల నిర్వహణకే ముప్పయిసార్లు ఆలోచించాల్సి వస్తే, దేశమంతా ఒకేసారి ఎన్నికలు నిర్వహించడాన్ని ఆలోచించగలమా? రెండోది అలా చేస్తే ఖర్చు తగ్గుతుందని అంటున్నారు. ఎలా తగ్గుతుంది? ఇప్పుడున్న యంత్రాల్ని వేర్వేరు సమయాల్లో ఎన్నికలు జరుగుతున్నప్పుడు చక్కగా తక్కువ ఖర్చుతో వాడుకోవచ్చు. అదే దేశమంతా అయితే అందుకు సరిపడా కోట్ల కొద్దీ యంత్రాల్ని సమకూర్చుకోవాలి. బలగాల్ని, సిబ్బందినీ ఎక్కువగా నియమించాలి. ఎన్నికల దశల్ని పెంచాలి.

మరో వైపు పంచాయితీ ఎన్నికలకు కూడా జాతీయ అంశాలే అజెండా అవుతాయి. స్థానిక అంశాల్ని, స్థానిక పార్టీల్ని అప్రధానంగా మార్చేస్తాయి. రాష్ట్రాల్లో ఏ పార్టీకీ పూర్తి మెజారిటీ రాకపోయినా, ఒకవేళ వచ్చినా కేంద్రంలో బలమైన పక్షం తలచుకుంటే రాష్ట్ర పాలనలో ఒడిదుడుకులు ఎక్కువవుతాయి. ఎన్నికైన ప్రభుత్వం ఒకవేళ మధ్యలో పడిపోయి ఎన్నికలకు వెళ్తే ఆ ప్రభుత్వానికి ఐదేళ్ల ఆయుష్షు ఉండదన్న భయంతో, ఆ పరిస్థితి తప్పించడానికి పార్టీల్లో కప్పదాట్లు పెరుగుతాయి. వీటన్నింటి కన్నా ముందు ఈ విధానానికి మద్దతుదారు బీజేపీకి పార్లమెంటులో సంపూర్ణ ఆధిక్యం లేదు. మిత్రుల మధ్య కూడా భిన్నాభిప్రాయాలున్నాయి. మూడింట రెండొంతుల మెజారిటీతో అవసరమైన రాజ్యాంగ సవరణలు ఈ విధానానికి కావాలి. ఆ బలం ప్రస్తుతానికి పాలక పక్షానికి లేదు. సగం రాష్ట్రాల మద్దతు సాధించడం కూడా కష్టం. కాబట్టి ప్రస్తుతానికి ఒకే దేశం ఒకే ఎన్నికలకు ఇది సమయం కాదు.

– డి.వి.జి. శంకరరావు

మావోయిస్టులు ఈ దేశ పౌరులు కాదా?

గత నెల ఆగస్టు 24న సాక్షాత్తు దేశ హోంమంత్రి అమిత్‌షా మార్చి 2026 నాటికి మావోయిస్టు కార్యకలాపాలు నిర్మూలిస్తామని, మావోయిస్టులకు వ్యతిరేకంగా నిర్దాక్షిణ్య వ్యూహాన్ని అవలంబిస్తామని రాయ్‌పూర్‌లో ప్రకటించారు. ఆ ప్రేరణతోనే ఛత్తీస్‌గఢ్‌లోని దంతెవాడ సరిహద్దులో 2024 సెప్టెంబర్ 3న ఎన్‌కౌంటర్‌గా చెప్పబడుతున్న ఘటనలో తొమ్మిది మంది మావోయిస్టులను చంపారు. వెనువెంటనే సెప్టెంబర్ 5న భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, కరకగూడెం పరిధిలో ఆరుగురు మావోయిస్టులు పోలీస్ ఎన్‌కౌంటర్‌లో హతమయ్యారు. మొత్తంగా ఒక్క 2024లోనే ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోనే 136 మంది మావోయిస్టులు చంపబడ్డారు. సేఫ్ జోన్‌గా భావించి అటు నుండి వచ్చి తెలంగాణలోని భద్రాద్రి ప్రాంతంలో తలదాచుకుంటున్న వారిని నిర్మూలించే కార్యక్రమంలో భాగమే కరకగూడెంలో జరిగిన ఎన్‌కౌంటర్.

రాజ్యహింసలో భాగంగా అది ఏ ప్రభుత్వమైన గానీ 1996 నుంచి 2018 వరకు దాదాపు 15 వేల మంది మావోయిస్టులను హతం చేశారు. ఈ కాలంలో నక్సల్ దాడుల వలన కానీ, పోలీసుల పొరపాట్లవల్ల కానీ దాదాపు 4000 మంది సామాన్య పౌరులు మరణించారు. నక్సల్స్ అయినా, సామాన్యులైనా మరణించిన వేలాది మంది మృతులు, హతులలో ఎక్కువ భాగం పేద, దళిత, ఆదివాసియులు ఉన్నారనే విషయం గమనార్హం.

నిరుద్యోగం, ఆకలి బాధలు, అణచివేతలు, సామాజిక అవమానాలు, పేదరికం, భూమి సమస్య, చాలీచాలని వేతనాలు, కండ్ల ముందు కనపడే దౌర్జన్యాలు, అక్రమాలపై ఆవేశంతో కూడిన వర్గ కసితోనే పేదవారు నక్సల్‌గా మారుతున్నారు. దీనిని సామాజిక సమస్యగా భావించకుండా శాంతిభద్రతల సమస్యగా చిత్రీకరిస్తూ అణచివేత, నిర్మూలన కార్యక్రమాలకు ప్రభుత్వాలు శ్రీకారం చుట్టడం ఆటవిక రాజ్యాంగాన్ని తలపిస్తుందే గాని, ప్రజాస్వామ్యం భావన మచ్చుకైనా కలగడం లేదు.

ఈ విధమైన నిర్మూలన కార్యక్రమాలు మొదలెట్టి రాజ్యాధికారం, పోలీసు వ్యవస్థ ద్వారా మరెంతమంది నిండు ప్రాణాలు బలితీసుకుంటారు? బలైనవారి భార్య, బిడ్డలు, తల్లిదండ్రులు, వారి ఆక్రందనలు పాలకుల చెవులకు వినపడవా? వారి వేదనలు, బాధలు కనపడవా? కమ్యూనిస్టులు, మావోయిస్టులు, ప్రశ్నించేవారు దేశద్రోహులా? వారిని చంపడానికి ఏ చట్టాలు వర్తిస్తున్నాయి? దేశంలో ఈనాటి సమన్యాయం నినాదం వెనుక ఉన్నది కమ్యూనిస్టులు కాదా? భారతదేశంలోని విప్లవాలకు, సామాజిక ఉద్యమాలకు పెద్ద దిక్కుగా బాసిల్లినటువంటి చండ్ర రాజేశ్వరరావు, పుచ్చలపల్లి సుందరయ్య, అలాగే కమూనిస్టు పార్టీ నాయకులు ఇంద్రజిత్‌గుప్తా, భూపేష్ గుప్తా, హీరేన్ ముఖర్జీ, గురుదాస్ దాస్‌గుప్తా భారతదేశ పార్లమెంటులో ఉత్తమ పార్లమెంటేరియన్లుగా అత్యున్నత పురస్కారాన్ని అందుకున్నారు. తెలంగాణ విముక్తి కోసం ప్రాణాలర్పించిన 4500 మంది యోధులను అందించినది కమ్యూనిస్టు పార్టీ కాదా? తెలంగాణ, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్, అలాగే దేశంలోని అనేక ప్రాంతాల్లోని పేద ప్రజల కొరకు భూ పోరాటాలు, వెట్టిచాకిరి విముక్తి పోరాటాలు, కుల వివక్షకు వ్యతిరేకంగా ఉద్యమాలు ప్రారంభించింది కమ్యూనిస్టులు కాదా? ఇంకా దేశం కోసం, తెలంగాణ సమాజం కోసం సర్వస్వం త్యాగం చేసిన రావి నారాయణరెడ్డి, బద్దం ఎల్లారెడ్డి, మఖ్దూం మొహియుద్దీన్, చాకలి ఐలమ్మ, దొడ్డి కొమరయ్యలాంటి యోధులను అందించింది కమ్యూనిస్టు పార్టీ కాదా? దేశంలోని ప్రతి ప్రగతిగామి చట్టం రూపకల్పన కమ్యూనిస్టుల పోరాట ఫలితం కాదా? ల్యాండ్ సీలింగ్ లాంటి చట్టాల సాధన గానీ, ఎనిమిది గంటల పని హక్కు గానీ, అటవీ హక్కుల చట్టం గానీ, రైతాంగ చట్టాలు గానీ, విద్యా వ్యవస్థలో మార్పులు గానీ, సాంస్కృతిక విప్లవాలు గానీ ఇవన్నీ కమ్యూనిస్టుల ద్వారానే కదా సాధ్యమైంది. తమ కవిత ద్వారా అగ్నిధార కురిపించిన దాశరథి కృష్ణమాచార్య, అలాగే ఆయన సోదరుడు దాశరథి రంగాచార్య, మాటలను తూటాలుగా పేర్చి నిప్పు కణికలు కురిపించి, సామాజిక విప్లవాగ్నిని రగిలించిన శ్రీశ్రీ, సామాన్యుడి వేదన, శోధనకు ప్రతీకగా నిలిచిన ఆరుద్ర లాంటి వారికి ప్రేరణ కల్పించింది కమ్యూనిజం కాదా?



అమిత్ షా చెప్పినట్లుగా 2026 నాటికి మావోయిస్టులను గానీ, ప్రశ్నించే వారిని గానీ హతం చేయవచ్చు. కానీ, మనిషి అలోచనలు, భావాలు, ఆవేదనలు, ఆకలి బాధలు నిరంతరం ఉంటాయి. వాటినుంచే విప్లవాలు పుడుతాయి. కూలిపోయిన సమాజం నుంచి చైతన్య పోరాటాలు విలసిల్లుతాయి. సమాజం ఉన్నంత కాలం ప్రశ్న ఉంటుంది. ప్రజలలో భావాలుంటాయి. ప్రశ్న శాశ్వతం. భావాలను అణచలేరు. అంతిమంగా ప్రజలే విజేతలు.

ఏ తప్పు చేయనటువంటి వరవరరావు, సాయిబాబా లాంటి మేధావులను కూడా జైళ్లలో నిర్బంధిస్తున్నారు. బెయిల్ వచ్చిన వరవరరావును కూడా బయిటికి రాకుండా ఇప్పటికీ అడ్డుకుంటున్నారు. కేంద్ర విజిలెన్స్ సంస్థల ద్వారా ప్రొఫెసర్ హరగోపాల్, జర్నలిస్టు వేణుగోపాల్ లాంటి వారిపైన కూడా ఊపా చట్టాలను ప్రయోగిస్తూ నిర్బంధాలకు గురి చేస్తున్నారు.

రామకృష్ణ, గణపతి, గణేష్ ఇంకా అనేకమంది బాగా చదువుకున్న మేధావులు తమ కుటుంబాలను త్యాగం చేస్తూ అడవిబాటను ఎంచుకున్నారు. వారి మార్గం తప్పుకావచ్చు. కానీ వారి ఆవేశం న్యాయమైనదే. ముక్కుపచ్చలారని రామకృష్ణ కుమారుడు మున్నాను కూడా ఇటీవలే ఎన్‌కౌంటర్ పేరుతో హతం చేశారు. కమ్యూనిస్టు పార్టీకి, నక్సల్స్‌కు విధానపరమైన విభేదాలున్నప్పటికీ, ప్రశ్నను అణిచివేయడం, ప్రశ్నించే వారిని మానవ హననం చేయడాన్ని కమ్యూనిస్టు పార్టీ తీవ్రంగా వ్యతిరేకిస్తున్నది. సీపీఐ రాష్ట్ర పార్టీ కార్యదర్శిగా నలమల్ల గిరిప్రసాద్ ఉన్న కాలంలో అక్రమ కేసులతో జైళ్లలో మగ్గుతూ, ఎటువంటి అండదండలు లేని వారిని విడిపించడం కోసం కామ్రేడ్ సురవరం సుధాకర్ రెడ్డి ఆధ్వర్యంలో ఒక లీగల్ సెల్‌ను, పౌరహక్కుల సంఘాన్ని ఏర్పాటు చేయడాన్ని గుర్తుచేస్తున్నాను.

అమిత్ షా చెప్పినట్టుగా 2026 నాటికి మావోయిస్టులను గానీ, ప్రశ్నించే వారిని గానీ హతం చేయవచ్చు. కానీ, మనిషి అలోచనలు, భావాలు, ఆవేదనలు, ఆకలి బాధలు నిరంతరం ఉంటాయి. వాటి నుంచే విప్లవాలు పుడుతాయి. కూలిపోయిన సమాజం నుంచి చైతన్య పోరాటాలు విలసిల్లుతాయి. సమాజం ఉన్నంత కాలం ప్రశ్న ఉంటుంది. ప్రజలలో భావాలుంటాయి. ప్రశ్న శాశ్వతం. భావాలను అణచలేరు. అంతిమంగా ప్రజలే విజేతలు.



మావోయిస్టు సోదరులకు కూడా ఒక సూచన చేస్తున్నాను. నూతన ప్రజాస్వామిక విప్లవం ద్వారా ప్రజా ప్రభుత్వం స్థాపించాలనే లక్ష్యంగా గల మీ హక్కును ప్రశ్నించలేము. కానీ ఒక సూచన. ప్రజలను సన్నద్ధం చేసి, చైతన్యపరచకుండా విప్లవ బాటను ఎంచుకోవడం వల్ల వృథా త్యాగాలు మిగులుతాయి. అలాగే హింసకు ప్రతిహింసే సమాధానంగా ప్రభుత్వ రాజ్యహింసకు బలం చేకూర్చే విధంగా కోవర్టుల పేరుతో సామాన్యులను హతమార్చడం (ఇటీవలే రాధ అనే మహిళను కోవర్టు అనే పేరుతో హతమార్చారు), పోలీసు అధికారులు, క్రింది స్థాయి పోలీసులను హతమార్చడం వలన ప్రజా సానుభూతిని కోల్పోతున్నారు. క్రింది స్థాయి పోలీసులు కూడా పేదవారే. ప్రజల సానుభూతిని కోల్పోకుండా మద్దతు పొందే విధంగా మన చర్యలు ఉండాలి. అలాగే ప్రభుత్వ బలగాలు, సైన్యం, పోలీసులతో కూడిన రాజ్యంపై తిరుగుబాటు చేసే క్రమంలో మన ప్రజాబలాన్ని మనకున్న ప్రజాసైన్యం బలాన్ని కూడా అంచనా వేసుకోవాలి.

అందువలన లెనిన్ చూపిన మార్గం అనుసరించి ముందుగా ప్రజాశ్రేణులను, బలమైన ఉద్యమాలను రూపొందించుకోవలసిన అవసరముంది. ఓబీసీలు, దళితులు, గిరిజనులు, ఉద్యోగ, కార్మిక, అసంఘటిత, కనీస వేతనం పొందని కోట్లాది మందిలో రైతాంగం, వ్యవసాయ కూలీలులాంటి వర్గాల్లో పట్టును సాధించుకొని విప్లవ పరివర్తన సాధనకు కృషి చేయవలసిన అవసరముంది. ఆ సమయంలో పాలక వర్గాలు అధికారాన్ని అంటిపెట్టుకుని ఉండటానికి అన్ని రకాల దమన చర్యలు, బల ప్రయోగం, హింస కొనసాగిస్తాయి. ఆధునిక టెక్నాలజి గూగుల్ శాటిలైట్ మ్యాప్స్, ఫోన్ సిగ్నల్స్, డ్రోన్స్‌ను ఉపయోగిస్తూ నిర్బంధాన్ని మరింత పెంచుతారు. మనకున్న సమ ప్రజా బలంతో వారి హింసను, బలప్రయోగాన్ని త్రిప్పికొట్టే తిరుగుబాటు మార్గాన్ని ఎంచుకోవచ్చు. 1964లో కమ్యూనిస్టు ఉద్యమ చీలిక ఎవరు అంగీకరించినా, అంగీకరించకపోయినా దేశానికి తీవ్రమైన నష్టాన్ని కలిగించింది. కమ్యూనిస్టులందరూ కలవాల్సిన సమయం ఉత్పన్నమయింది. ఈ దేశంలో పేద ప్రజలు, అణగారిన వర్గాలు, మేధావులు, కమ్యూనిస్టుల ఏకీకరణకు ఎదురు చూస్తున్నారు. ఆ రోజు మరెంతో దూరంలేదని ఆశిద్దాం.

• కూనంనేని సాంబశివరావు
ఎంఎల్ఏ, సీపీఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి

అపవిత్రతకు కారణం పాలకుల అసమర్థతే

తిరుమల పవిత్రత గురించి, ప్రసాదాల గురించి గత కొన్ని రోజులుగా రకరకాల వార్తలు వింటున్నాం. ఏ రోజైతే తిరుమల దేవాలయ ప్రాంగణాన్ని భక్తుల సౌకర్యం కోసం మార్పులు చేయటం జరిగిందో అప్పుడే తిరుమల పవిత్రతకు భంగం కలగటం ప్రారంభమైంది. ఈ సంగతి ఆ కోవెలతో అనుబంధం ఉన్న ప్రతి ఒక్కరికీ తెలుసు. డెబ్బయవ దశకంలో నిత్యం గోవింద నామస్మరణతో ప్రతిధ్వనించిన ఆ గిరుల్లో అణువణువునా ఆధ్యాత్మికతతో మనసు శ్రీవారిపై లగ్నమయ్యేది. మరి ఇప్పుడు, కొందరికి ఓ ప్రముఖ విహారకేంద్రంగా మారింది. కారణం? కాలం తెచ్చిన మార్పా? మన స్వయంకృతమా?

శ్రీవారి ప్రసాదాల విషయానికి వస్తే గతంలో అన్న ప్రసాదాలుగా పిలవబడే పులిహార, కట్టెపొంగలి, చక్రపొంగలి, దద్దోజనం, మహాప్రసాదంగా కీర్తి గాంచిన లడ్డు, అప్పం మొదలైవి కోవెల ప్రాంగణంలోనే భక్తులకు లభ్యమయ్యేవి. ఆ ప్రసాదాలు స్వీకరించిన వారి చేతులు పరిమళంతో గుబాళించేవి. కాలంతో పాటు మార్పులు సహజం. ఇది కాదనలేని సత్యం. తిరుమలలో కొన్ని దశాబ్దాల పాటు అవిచ్ఛిన్నంగా కొనసాగిన వ్యవస్థలు నేడు లేవు. తిరుమల ఏడుకొండలు కాదనే నాయకుడు ఒకరైతే, శ్రీవారి తీర్థప్రసాదాలు పురుగులా చూసే నాయకుడు మరొకరు. ఇటువంటి వారు పాలకులైతే అది అపవిత్రం కాక పవిత్రమవుతుందా?

భగవద్రామానుజులు నిర్ణయించిన విధంగానే అన్ని కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెప్పుకునే పెద్దలు గర్భాలయంలో ఉండే పవిత్రమైన సాలగ్రామాలను కొందరు ధనవంతులు కొండపై విడిది చేసిన సమయంలో వారి బసకు తీసుకువెళ్ళి ఆరాధనలు జరిపారని వార్తలు వచ్చిన సమయంలోనే స్వామి మీద వారికి ఉన్న భక్తి ఎంతటిదో తేటతెల్లమయింది.

2019 ఎన్నికల ముందు శ్రీవారి పింక్ డైమండ్ పోయిందంటూ హడావిడి చేసిన నాటి ప్రధాన అర్చకులు రమణదీక్షితులు గత కొన్ని రోజులుగా మాట్లాడుతున్న మాటలు వింటూ ఉంటే వారి నైజం తెలుస్తోంది. అలాగే నాడు ఎన్నెన్నో మాట్లాడినవారు ఇవాళ నోరు మెదపరేం? తిరుమల శ్రీవారిని యాభై సంవత్సరాలుగా దర్శనం చేసుకుంటున్న నాకు అప్పటికీ ఇప్పటికీ ఎంత తేడా ఉందో తెలుసు. ప్రత్యేకించి గత అయిదు సంవత్సరాల కాలంలో స్వామి ఆలయ ప్రతిష్ఠ ఎలా అయిందో గమనిస్తే, మహంతుల, బ్రిటీష్ పాలన కాలం మళ్ళీ వస్తే బాగుండనిపించేది. అధికారుల ప్రాపకం, లేదా ధనం ఈ రెండూ ఉంటే కొండమీద స్వామిని రోజులో ఎన్నిసార్లు అయినా సేవించవచ్చని గ్రహించాను. కాసు బ్రహ్మానందరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో నాటి దేవాదాయ ధర్మాదాయ మంత్రి తిరుమల దేవాలయానికి సంబంధించిన విషయంలో అందరి ఆమోదముద్రతో తన సొంత పథకం అమలుచేయాలనుకున్నారు. గణపతి స్థపతి ద్వారా ఆ విషయాన్ని తెలుసుకున్న కంచి పరమాచార్యుల వారు ఆ స్థపతి ద్వారానే ఈ పథకం తప్పని ముఖ్యమంత్రికి తెలియపర్చగానే, దాన్ని ఆపేయించారు బ్రహ్మానందరెడ్డి. ఇది ఎందుకు చెప్పానంటే మన పీఠాధిపతుల శక్తి తెలపటానికి.

స్వాతంత్ర్యం వచ్చిన దగ్గర నుంచి ఎందరో అధికారులు తిరుమలలో స్వామి సేవ చేసుకున్నారు, చేసుకుంటున్నారు. ఎన్నడూ జరగనిది ఇప్పుడు జరగటానికి కారణం అధికారంలో ఉన్నవారి అసమర్థత. తమ సర్వస్వాన్ని కోవెల అభివృద్ధికి, శ్రీవారి సేవకు, భక్తుల సౌకర్యాల కోసం తపించిన స్వర్గీయ అన్నారావు లాంటి వారు పాలకమండలి అధ్యక్షులుగా ఉన్న కాలంలో తిరుమల ఎలా ఉండేది. ఓసారి గుర్తు చేసుకోండి. దేవస్థాన చరిత్రలో గత ప్రభుత్వం ఏర్పాటుచేసిన పాలకమండలి ధనార్జనే పరమావధిగా భావించింది. ఆ పాలనలో అన్నీ లోపాలు ఉండక సవ్యంగా ఉంటాయా? పాలకమండలి అధ్యక్షునికి తగ్గవారు కార్యనిర్వహణాధికారి. ఆయన ఇంట్లో అశుచి సమయంలో కొండపైకి రావటంతోనే వారికి ఉన్న భక్తి వెల్లడైంది. ఇటువంటి వారి వల్ల కోవెల ఖ్యాతి పెరుగుతుందా? కొందరు గురువులు జగన్మోహన్‌రెడ్డి హయాంలో తిరుమలలో స్వామివారి సేవలో జరుగుతున్న లోపాల గురించి మాట్లాడారా, లేదు. కారణం– ప్రభుత్వం నుంచి లబ్ధిని పొందటం వల్ల. ఆలయంలో అపచారం జరిగిందని తెలియగానే సంప్రోక్షణ జరపటం ప్రతి ఆలయంలో జరిగే కార్యక్రమం. శ్రీవారి ఆలయ విషయంలో సంప్రోక్షణ జరిపే విషయంపై ఆలోచన ఎందుకు? కొన్ని శతాబ్దాలుగా ఉన్న వానమామలై, శృంగేరి, కాంచీ, శ్రీరంగం, అహోబిలం పీఠాధిపతులు, తిరుమలలో కైంకర్యాలు సక్రమంగా జరపటానికి సాక్షాత్తు రామానుజులు ఏర్పాటు చేసిన తిరుమల జీయర్ పరంపరలోని వారుండగా, మిగిలిన వారి అభిప్రాయాలు అవసరమా? ఇంకా కాలయాపనా?



శ్రీవారి కళ్యాణం అయ్యాక ప్రసాదాలు ఇచ్చేచోట డబ్బులు ఇవ్వందే ప్రసాదం కొంత మంది ఇవ్వరు. కళ్యాణ లడ్డు లేదు, వడ లేదు. వెంగమాంబ అన్నప్రసాద వితరణశాలలో భక్తులకు భక్తిగా వడ్డన చెయ్యటం కాదు, తప్పదు కాబట్టి అనే విధంగా ఉండటమే కాకుండా, వారి సొంత డబ్బుతో భక్తులకు పెడుతున్నామనే భావన చాలా మంది అక్కడ పనిచేసే వారిలో నేనే కాదు చాలామంది గమనించారు. ప్రపంచవ్యాప్తంగా అందరూ ఆరాధించే దేవదేవుని ప్రసాదం కల్తీ కావటానికి కారణం నాటి ముఖ్యమంత్రి, పాలకమండలి నిర్ణయాలే కాదు, ఉద్యోగస్తులు కూడా.

శ్రీవారి కళ్యాణం అయ్యాక ప్రసాదాలు ఇచ్చేచోట డబ్బులు ఇవ్వందే ప్రసాదం కొంత మంది ఇవ్వరు. కళ్యాణ లడ్డు లేదు, వడ లేదు. వెంగమాంబ అన్నప్రసాద వితరణశాలలో భక్తులకు భక్తిగా వడ్డన చెయ్యటం కాదు, తప్పదు కాబట్టి అనే విధంగా ఉండటమే కాకుండా, వారి సొంత డబ్బుతో భక్తులకు పెడుతున్నామనే భావన చాలా మంది అక్కడ పనిచేసే వారిలో నేనే కాదు చాలామంది గమనించారు. ప్రపంచవ్యాప్తంగా అందరూ ఆరాధించే దేవదేవుని ప్రసాదం కల్తీ కావటానికి కారణం నాటి ముఖమంత్రి, పాలకమండలి నిర్ణయాలే కాదు ఉద్యోగస్తులు కూడా. శ్రీవారి పోటులో పనిచేసేవారు ప్రసాద పడికట్టు చూడగానే గ్రహించగలరు. కానీ వారు మాట్లాడితే వారి ఉద్యోగం పోతుందని భయం. ఎన్నికల ముందు ఓ స్వామి నాతో మంచి ప్రభుత్వం రావాలని కోరుకోండి, వీరే వస్తే మన కోవెల ఉండదని కన్నీరు పెట్టుకున్నారు. గత అయిదు సంవత్సరాలుగా ఓ పథకం ప్రకారం భక్తుల్ని శ్రీవారికి దూరం చెయ్యాలని గత పాలకమండలి ఏం చేసిందో భక్తులకు తెలుసు. లైన్‌లోకి వెళ్ళిన భక్తులు కొన్ని సందర్భాల్లో నీటి కోసం ఇబ్బంది పడ్డారు. చంటి పిల్లలకు పాలు లేక సొమ్మసిల్లి పోయారు. మన అదృష్టాన్ని బట్టి అన్నప్రసాదం ఉండేది.

ప్రతిరోజూ వివిధ సేవలతో, నిత్య కళ్యాణంతో విరాజిల్లే స్వామి వారి దివ్య స్వరూపాన్ని రెప్పపాటు కాలం చూసేందుకు ఎక్కడి నుంచో వచ్చే భక్తులకు కావలసింది సౌకర్యాలు కాదు. మనసంతా తృప్తి. ఎన్నో వ్యయప్రయాసలతో దేవాలయం లోపలికి ప్రవేశించిన వెంటనే అవసరం ఉన్నా లేకపోయినా శ్రీవారి సేవకులుగా పిలిపించుకుంటున్నవారు మీద చేయి వేసి లాగటం. వారందరూ అసలు శ్రీవారి భక్తులంటే నమ్మలేం. వారిలో గోవింద నామస్మరణ చేస్తున్న వారిని నేను ఎప్పుడూ చూడలేదు. వారిలో చాలా మందికి శ్రీనివాసుడు అంటే తెలియదు. కొన్ని వర్గాల వారికి కోట్ల రూపాయలు జీతాలుగా ఇస్తున్నా మాట్లాడలేదు. అసలు ఆ సొమ్ము ఏ ఖాతాలో నుంచి వారికి ఇచ్చారో ఇప్పుడు తెలుసుకోవాలనుకోవటం సహజం. ప్రభుత్వం ఆలోచించాలి. స్వామి సన్నిధిలో జరిగిన అవకతవకలపై విచారణ జరిపి, దోషులను సమాజం ముందు నిలపాలి. అసలు రాష్ట్రంలోని అన్ని దేవాలయాల్లో గత అయిదు సంవత్సరాల్లో జరిగిన అవకతవకలపై విచారణ జరిపి దోషులను శిక్షిస్తేనే హిందూ సమాజం ప్రభుత్వాన్ని గౌరవిస్తుంది. ఆ స్వామి వారు ఇచ్చిన ఈ అద్భుత అవకాశాన్ని ప్రభుత్వం ఉపయోగించుకుని రాష్ట్రంలో దేవాలయాలకు పూర్వవైభవం తీసుకురావాలి. మన సనాతన సంప్రదాయాలను పెంపొందించేలా చర్యలు తీసుకోవాలి.

▪ అద్దంకి శ్రీరామకుమార్
ఆకాశవాణి విశ్రాంత వార్తాప్రతినిధి

దేవుని మనసు రుచి తిరుమల లడ్డు

ఓ సనాతన నమ్మకం పునాదిగా
అద్భుత సంప్రదాయం
కలియుగ దైవారాధన
ఈ యుగానికే అభయహస్తం

ఏ చిరు కార్యమైనా
మానవాళి శుభాలకు
సంస్కార సంస్కృతికి నెలవు

అక్కడ ఏ నియంత
అడుగుపెట్టినా భస్మమే
ఏ దుష్టపాలనైనా అంతమే

తెలుగువారి
హైందవ ఆరాధనకు నిలువుటద్దం
తిరుమల క్షేత్రం.

తరాలుగా
కొలిచి తరించిన తీరులో
ఉన్నత ఉత్తమ విలువలకి ఆదర్శం.

ఏడుకొండలవాడుగా
తెలుగువారి భక్తికి
దేవుడు మెచ్చి పంచిన మనసు రుచి
తిరుమల లడ్డు.

ఆ పవిత్రత కన్నీరు పెట్టినా
ఆ ధార్మికతకు అవమానం జరిగినా
జనసంద్రంలో భక్తి సునామీలో
కొట్టుకుపోతుంది
ఎంతటి అహంకారమైనా సరే.

–చందలూరి నారాయణరావు

గోవింద...గోవింద...

నీలమేఘ శ్యామ! నిన్ను వేడెదమయ్యా!
పాపభీతి లేని పాలకులును!
లడ్డు కల్తి జేయ లజ్జ లేకుండను!
శిక్ష వేయరావ! శ్రీనివాస!

శేషతల్పవాస! శ్రీ వెంకటేశుడా!
యోగనిద్రలోన పొగ వేయ!
నీదులడ్డుకల్తినిక్కమేజేసిరి!
శిక్ష వేయ లేవ! శ్రీనివాస!

నమ్మకాల నన్ని నట్టేట ముంచియు!
భక్తి భయము లేక బరితెగించి!
మానవత్వమంత మంటను గలిపిరి!
శిక్ష వేయ రావ! శ్రీనివాస!

– కనకయ్య మల్లముల

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
ఎన్.టి.ఆర్
జిల్లా వార్తలు
మంగళవారం 24 సెప్టెంబరు 2024



ఎంపీ చిన్ని నివాసంలో సమావేశమైన ఎమ్మెల్యేలు, టీడీపీ జిల్లా అధ్యక్షులు

నెలనెలా సమావేశమవుదాం

- వరద నుంచి నగరాన్ని సాధారణ స్థితికి తెచ్చిన ముఖ్యమంత్రికి ధన్యవాదాల తీర్మానం
- ఉమ్మడి కృష్ణాజిల్లాలోని ఎమ్మెల్యేలతో ఎంపీ కేశినేని చిన్ని ప్రత్యేక సమావేశం

వన్‌టౌన్, సెప్టెంబరు 23: ఉమ్మడి కృష్ణాజిల్లాలోని పార్లమెంట్ సభ్యులు, ఎమ్మెల్యేలు సోమవారం రాత్రి ఎంపీ కేశినేని చిన్ని నివాసంలో సమావేశమయ్యారు. నెలకోసారి అందరూ సమావేశం కావాలని తీర్మానించారు. వరదల సమయంలో సీఎం చంద్రబాబు చూపించిన చొరవ, నగరాన్ని సాధారణ స్థితికి తీసుకొచ్చిన విధానం, నష్టపరిహారంపై సంతృప్తి వ్యక్తం చేస్తూ ధన్యవాద తీర్మానానికి ఆమోదం తెలిపారు. దసరా మహోత్సవాల సందర్భంగా దుర్గగుడిలో చేపట్టిన ఏర్పాట్ల గురించి చర్చించారు. జిల్లాలోని ప్రజా సమస్యలు, రాష్ట్రంలో వర్తమాన రాజకీయ పరిస్థితులపై సమీక్షించారు. ఈ సమావేశంలో ఎన్టీఆర్, కృష్ణాజిల్లాల అధ్యక్షులు నెట్టెం రఘురాం, కొనకళ్ల నారాయణ, మంత్రి కొల్లు రవీంద్ర, ఎమ్మెల్యేలు బొండా ఉమామహేశ్వరరావు, వెనిగండ్ల రాము, యార్లగడ్డ వెంకట్రావు, కొలికపూడి శ్రీనివాసరావు, తంగిరాల సౌమ్య, శ్రీరాం రాజగోపాల్, కాగిత కృష్ణప్రసాద్, వసంత కృష్ణప్రసాద్, బోడె ప్రసాద్, వర్ల కుమార్ రాజా, కామినేని శ్రీనివాస్ పాల్గొన్నారు.

నేడు ఇంద్రకీలాద్రికి డిప్యూటీ సీఎం



వన్‌టౌన్, సెప్టెంబరు 23 : డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ మంగళవారం ఇంద్రకీలాద్రిపై కనకదుర్గమ్మను దర్శించుకోనున్నారు. తిరుమల లడ్డూ ప్రసాదంపై అపచారానికి పరిహారంగా ఆయన 11 రోజుల ప్రాయశ్చిత్త దీక్ష చేపట్టిన సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా మంగళవారం ఉదయం 7 గంటలకు ఆయన దుర్గమ్మను దర్శించుకోనున్నారు. ప్రత్యేక పూజల అనంతరం 7.50కు తిరిగి మంగళగిరి వెళ్తారు.

ఎన్యూమరేషన్.. టెన్షన్ టెన్షన్

ఫ్లడ్ ఎన్యూమరేషన్ ప్రక్రియ సోమవారం నగరంలో తీవ్ర ఉద్రిక్తతలకు దారితీసింది. ఓవైపు.. తమను కూడా ఎన్యూమరేషన్ చేయాలంటూ భవానీపురంలోని లోటస్ కాలనీ, కృష్ణా కరకట్ట ప్రాంతాల ప్రజలు ఆందోళన చేపట్టగా, మరోవైపు.. బుడమేరు వరద ప్రభావిత ప్రాంతాల్లోని స్థానిక సచివాలయాల పరిధిలో మ్యాపింగ్ కానివారిని ఎన్యూమరేషన్‌లో గుర్తించకపోవటం గందరగోళానికి దారితీసింది. - (ఆంధ్రజ్యోతి, విజయవాడ/విద్యాధరపురం/అజిత్‌సింగ్‌నగర్)

నగరంలో ఉద్రిక్త పరిస్థితులు



కుమ్మరిపాలెం సెంటర్‌లో జాతీయ రహదారిపై రాస్తారోకో చేపట్టిన 38వ డివిజన్‌వాసులు (ఇన్‌సెట్‌లో) చెదరగొడుతున్న పోలీసులు



న్యూ రాజరాజేశ్వరిపేటలోని సచివాలయం వద్ద వరద బాధితులు

మాకూ ఎన్యూమరేషన్ చేయండి

- కుమ్మరిపాలెంలో జాతీయ రహదారిని దిగ్బంధించిన పేదలు
- రెండు గంటల పాటు ఆందోళన.. భారీగా నిలిచిన ట్రాఫిక్
- పోలీసులు, ఆందోళనకారుల మధ్య తోపులాట, స్వల్ప లాఠీచార్జి

ఎన్యూమరేషన్ పరిధిలోకి తమను కూడా తీసుకురావాలని పేదలు ఆందోళన చేపట్టారు. భవానీపురంలోని లోటస్ కాలనీ, కృష్ణా కరకట్ట ప్రాంతాల్లోని ప్రజలు సోమవారం రాత్రి భారీసంఖ్యలో కుమ్మరిపాలెం సెంటర్‌లో 65వ నెంబర్ జాతీయ రహదారిపైకి వచ్చి ఆందోళన చేశారు. భవానీపురం 38వ డివిజన్‌కు చెందిన పేదలు జాతీయ రహదారిని దిగ్బంధించి పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. కృష్ణానది వరద కారణంగా తమ ప్రాంతం మునిగిపోయిందని, తమకు కూడా న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. పేదలు పెద్ద సంఖ్యలో వచ్చి జాతీయ రహదారిని దిగ్బంధించటంతో ట్రాఫిక్ స్తంభించింది. ఎన్‌హెచ్-65పై గొల్లపూడి వరకు వాహనాలు నిలిచిపోయాయి. ఇటు ప్రకాశం బ్యారేజీ, వన్‌టౌన్ వరకు వాహనాలు ఆగిపోయాయి. పోలీసులు వచ్చి శాంతపరిచినా బాధితులు వినలేదు. పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ ఆందోళనను మరింత ఉధృతం చేశారు. అర్హులైతే అందరికీ న్యాయం జరుగుతుందని, రోడ్డుపై ఆందోళనల వల్ల ట్రాఫిక్‌కు తీవ్ర అవరోధం కలుగుతుందని పోలీసులు వారించారు. వారందరినీ చెదరగొట్టే ప్రయత్నం చేశారు. దీంతో పోలీసులు, ఆందోళనకారుల మధ్య తీవ్ర వాగ్వాదం, తోపులాట జరిగాయి. ఆందోళనకారులు

- మిగతా 6లో

మా మ్యాపింగ్ సంగతేంటి..?

ఎన్యూమరేషన్ కాని వరద బాధితుల ఆవేదన

- సచివాలయాల చుట్టూ ప్రదక్షిణలు
- తొలగని గందరగోళం

బుడమేరు వరద ప్రభావిత ప్రాంతాల్లోని బాధితులు మరో సమస్యతో సోమవారం ఇబ్బందులు పడ్డారు. స్థానిక సచివాలయాల పరిధిలో మ్యాపింగ్ కానివారిని ఎన్యూమరేషన్‌లో గుర్తించకపోవటంపై బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రధానంగా న్యూ రాజరాజేశ్వరిపేట, కండ్రిక, రాజీవ్‌నగర్, శాంతినగర్, వాంబేకాలనీ, భవానీపురం, రామలింగేశ్వరనగర్ ప్రాంతాల్లో నివాసం ఉంటున్నవారు మ్యాపింగ్ సమస్యలతో ఇబ్బందులు పడ్డారు. ఇక్కడి బాధితుల్లో కొందరు సచివాలయ పరిధిలోకి రాకపోవటం, వేరే సచివాలయ పరిధిలో మ్యాపింగై ఉండటంతో ఎన్యూమరేషన్ తీసుకోలేదు. ఇలాంటి వారంతా సోమవారం సచివాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేశారు.

- మిగతా 6లో

మ్యాపింగ్ కానివారు ఆందోళన చెందొద్దు : కలెక్టర్ సృజన

సచివాలయంలో మ్యాపింగ్ కానివారు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని కలెక్టర్ సృజన భరోసా ఇచ్చారు. అర్హులైతే తప్పకుండా న్యాయం జరుగుతుందని, వారిని ఎన్యూమరేషన్‌లోకి తీసుకురాలేమన్నారు. రెవెన్యూ తహసీల్దార్ల ద్వారా వారు అక్కడే ఉంటున్నారా, లేదా అన్నది విచారణ చేయిస్తామని, అధికారులు ధ్రువీకరిస్తే కచ్చితంగా సాయం అందిస్తామని, ఈ విషయంలో కాస్త సంయమనంగా ఉండాలని, ఏదైనా సమస్య ఉంటే తన దగ్గరకు రావాలన్నారు.

పాఠశాల, వైద్యశాల సిబ్బంది నిర్లక్ష్యం

బాలిక దుర్మరణం

మూడు రోజులుగా జ్వరమైనా పట్టించుకోని హాస్టల్ సిబ్బంది

- ఆసుపత్రిలో చేర్చాక కనీసం స్పందించని వైద్యులు
- సెలైన్ పెట్టి చేతులు దులుపుకొన్న సిబ్బంది
- పరిస్థితి విషమించి ప్రాణాలు వదిలిన చిన్నారి
- కారకులను శిక్షించాలని తల్లిదండ్రుల డిమాండ్
- నందిగామ ప్రభుత్వాసుపత్రిలో దారుణం



అపర్ణ మృతదేహం

చందర్లపాడు, సెప్టెంబరు 23 : హాస్టల్ సిబ్బంది, ఉపాధ్యాయులతో పాటు వైద్యశాల సిబ్బంది, వైద్యుల నిర్లక్ష్యం ఓ చిన్నారి ప్రాణాన్ని తీసేసింది. మూడు రోజులుగా జ్వరంతో బాధపడుతున్న బాలిక ఆరోగ్య పరిస్థితిని తల్లిదండ్రులకు వివరించకుండా హాస్టల్ సిబ్బంది ఇష్టానుసారంగా ప్రవర్తించగా, ఆసుపత్రిలో చేర్చిన తరువాత సరైన వైద్యం అందించక వైద్యులు ఆమె మృతికి కారకులయ్యారు. వివరాల్లోకి వెళితే.. మండలంలోని ముప్పాళ్ల గ్రామంలోని ప్రభుత్వ గురుకుల పాఠశాలలో చందర్లపాడుకు చెందిన కస్తాల అపర్ణ (14) 8వ తరగతి చదువుతోంది. మూడు రోజులుగా ఆమె జ్వరంతో బాధపడుతున్నా ఉపాధ్యాయులు కానీ, హాస్టల్ సిబ్బంది కానీ పట్టించుకోలేదు. అపర్ణకు జ్వరం తీవ్రం కావడంతో సోమవారం ఉదయం పాఠశాలలో కుప్పకూలిపోయింది. అపస్మారక స్థితిలోకి చేరిన ఆమెను ఒక ఉపాధ్యాయురాలు నందిగామ ప్రభుత్వ వైద్యశాలలో చేర్చారు. ఆమె పరిస్థితిని సరిగ్గా గమనించని వైద్యశాల సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించారు. సెలైన్ పెట్టి వదిలేశారు. ఏ పరీక్షలు చేయలేదు. పరిస్థితి చేయిదాటుతున్నట్లు గమనించిన ఉపాధ్యాయురాలు ఆ విషయాన్ని అపర్ణ తండ్రి కిషోర్‌కుమార్‌కు ఫోన్‌లో తెలియజేశారు. విజయవాడలో ఒక భవనం వద్ద వాచ్‌మెన్‌గా పనిచేస్తున్న కిషోర్‌కుమార్ చందర్లపాడులో ఉన్న తన భార్యకు సమాచారం ఇచ్చి తానూ నందిగామ బయల్దేరారు. ఈలోగా ఉపాధ్యాయురాలు అక్కడి నుంచి జారుకున్నారు. హుటాహుటిన వైద్యశాలకు చేరుకుని కుమార్తె పరిస్థితిని చూసి బోరున విలపించారు. తన కుమార్తెను కాపాడాలంటూ వైద్యశాల సిబ్బందిని వేడుకున్నారు. అయినా వైద్యులు స్పందించలేదు. సరైన వైద్యం అందించలేదు. సోమవారం సాయంత్రం 4 గంటల సమయంలో తనకు ఊపిరి ఆడట్లేదని అపర్ణ చెప్పడంతో.. తల్లిదండ్రులు వైద్యుల వద్ద రోదించారు. అప్పటికి స్పందించిన వైద్యులు వారితోనే బయటి నుంచి మందులు తెప్పించి చికిత్స ప్రారంభించారు. ఆ సమయంలోనే అపర్ణ కన్నుమూసింది. పరిస్థితి చేయిదాటిందని గమనించిన వైద్యశాల సిబ్బంది హడావిడిగా ఈసీజీ, తదితర పరీక్షలు చేయడం ప్రారంభించారు. అప్పటికే తన కుమార్తె మరణించిన విషయాన్ని తెలుసుకున్న తల్లిదండ్రులు బిగ్గరగా రోదించారు. పాఠశాల, వైద్యశాల సిబ్బంది నిర్లక్ష్యం కారణంగానే తన కుమార్తె చనిపోయిందని గుండెలు బాదుకున్నారు. తన కుమార్తె మరణానికి కారకులైన వారిని శిక్షించాలని వేడుకున్నారు. మృతురాలి తండ్రి కిషోర్ మాట్లాడుతూ మూడు రోజులుగా జ్వరం ఉన్నా హాస్టల్ సిబ్బంది తమకు కనీస సమాచారం ఇవ్వలేదని, చివరకు వైద్యశాల సిబ్బంది కూడా అత్యంత నిర్లక్ష్యంగా వ్యవహరించారని ఆరోపించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జిల్లావ్యాప్తంగా బదిలీల ప్రక్రియ ప్రారంభమైంది. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం కొన్ని శాఖల్లో బదిలీలు జరగ్గా.. మరికొన్ని శాఖలకు కొత్తవారిని తీసుకొచ్చారు. ఒకటి, రెండు శాఖల్లో అయితే ఎక్కడ ఉండేవారు అక్కడే కొనసాగటం గమనార్హం. సోమవారం దాదాపు అన్ని శాఖల్లో పూర్తిస్థాయిలో బదిలీలు జరుగుతాయనుకుంటే, కొన్ని శాఖల పరిధిలోనే జరిగాయి. రిజిస్ట్రేషన్లు, పంచాయతీరాజ్, ఆర్టీసీ, ఆర్‌డబ్ల్యూఎస్ పరిధిలో ఉన్నతస్థాయిలో మాత్రమే బదిలీలు జరగ్గా, రెవెన్యూలో అసలు జరగనేలేదు. ఆర్‌డీవోలు, ఆర్‌ఐలు, డిప్యూటీ తహసీల్దార్లు, వీఆర్వోల బదిలీలకు సంబంధించి జాబితాలు రాలేదు. మంగళవారం పూర్తిస్థాయిలో జాబితాలు అందే అవకాశముంది. - విజయవాడ, ఆంధ్రజ్యోతి



బదిలీల జాతర

కొన్ని శాఖల్లో అత్యున్నత స్థాయిలో స్థానచలనం

- రిజిస్ట్రేషన్లు, ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీరాజ్, ఆర్టీసీ, సివిల్ సప్లయిస్‌లోనే..
- రెవెన్యూలో మాత్రం జరగలేదు..!
- నేడు భారీస్థాయిలో జాబితాలు అందే అవకాశం

రిజిస్ట్రేషన్ శాఖ పరిధిలో..

పటమట సబ్ రిజిస్ట్రార్‌గా రావులపాలెం నుంచి రేవంత్‌ను నియమించారు. గుణదల జాయింట్-1 సబ్ రిజిస్ట్రార్‌గా కృష్ణప్రసాద్ కొనసాగుతున్నారు. కృష్ణప్రసాద్ యూనియన్‌లో ఆఫీస్ బేరర్‌గా ఉండటం వల్ల ఆయన బదిలీ కాలేదు. గుణదల జాయింట్-2 సబ్ రిజిస్ట్రార్‌గా మండవల్లి నుంచి నందీశ్వరరావును నియమించారు. గాంధీనగర్ జాయింట్-2 సబ్ రిజిస్ట్రార్‌గా పనిచేస్తున్న చైతన్యను గుడివాడ సబ్ రిజిస్ట్రార్‌గా బదిలీ చేశారు. ఆయన స్థానంలో ఇంతకుముందు పటమట సబ్ రిజిస్ట్రార్‌గా నియమించిన ఆరిఫ్‌ను నియమించారు. గాంధీనగర్‌లో జాయింట్-1 సబ్ రిజిస్ట్రార్‌గా పనిచేసే ప్రసాద్‌ను గన్నవరం సబ్ రిజిస్ట్రార్‌గా బదిలీ చేశారు. గన్నవరం సబ్ రిజిస్ట్రార్‌గా పనిచేస్తున్న వెంకటేశ్వరరావును గాంధీనగర్ జాయింట్-1 సబ్ రిజిస్ట్రార్‌గా నియమించారు.

ఆర్‌డబ్ల్యూఎస్‌లో..

గ్రామీణ నీటి సరఫరా విభాగం (ఆర్‌డబ్ల్యూఎస్) సూపరింటెండెంట్ ఇంజనీర్ (ఎస్‌ఈ) రమణను నెల్లూరు జిల్లాకు బదిలీ చేశారు. ఆయన స్థానంలో గతంలో ఇక్కడ పనిచేసిన సత్యనారాయణను ఇన్‌చార్జిగా నియమించటం విమర్శలకు దారి తీస్తోంది. రెగ్యులర్ ఎస్‌ఈని కాదని ఇన్‌చార్జి ఎస్‌ఈని నియమించటంపై విమర్శలు వస్తున్నాయి. విజయవాడ ఇన్‌చార్జి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఈఈ)గా పనిచేస్తున్న ధవళేశ్వరపు రామలింగేశ్వర ప్రసాద్‌ను తిరిగి జగ్గయ్యపేట డీఈఈగా బదిలీ చేశారు. విజయవాడ సర్కిల్ ఈఈగా పనిచేస్తున్న ఏ.రంగప్రసాద్‌ను శ్రీకాకుళం జిల్లాకు బదిలీ చేశారు.

పంచాయతీరాజ్‌లో..

జిల్లా డీపీవోగా సెర్ప్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న పసుపుల లావణ్య కుమారికి పోస్టింగ్ ఇచ్చారు. డీఎల్‌డీవోలు, పంచాయతీ కార్యదర్శులకు సంబంధించిన బదిలీలు మంగళవారం వెలువడే అవకాశాలున్నాయి. పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ విభాగానికి సంబంధించి జిల్లా ఎస్‌ఈ రమణారావును బదిలీ చేశారు. ఆయన స్థానంలో కొత్తవారిని నియమించాల్సి ఉంది.

పౌరసరఫరాల శాఖలో..

జిల్లాలో డీటీగా పనిచేస్తున్న ఎం.రంగప్రసాద్‌ను తూర్పుగోదావరి జిల్లా బదిలీ చేశారు. విజయవాడలో జెడ్‌ఎంగా పనిచేసే పి.సుశీలను పల్నాడు జిల్లాకు బదిలీ చేశారు. ఎన్టీఆర్ జిల్లాలో ఏఎంగా పనిచేసే ఆర్.నాగమల్లేశ్వరిని బాపట్ల బదిలీ చేశారు.

ఆర్టీసీలో..

ఆర్టీసీలో బదిలీలు ఎక్కడివారు అక్కడే అన్నట్టుగా సాగాయి. ముఖ్యంగా ఎన్టీఆర్ జిల్లాకు చెందిన డిపో మేనేజర్లను మరో ప్రాంతానికి కదిలించకపోవటం గమనార్హం. వివాదాస్పద వ్యక్తులు, బస్సు ప్రమాద ఘటనల్లో తీవ్ర విమర్శలు ఎదుర్కొన్న వారిని కూడా కదిలించలేదు. విజయవాడ డిప్యూటీ సీటీఎం కె.శ్రీలక్ష్మిని అనంతపురం జిల్లా డిప్యూటీ సీటీఎంగా బదిలీ చేశారు. విజయవాడ జోన్ డిప్యూటీ సీపీవోగా పనిచేస్తున్న కె.రామచంద్రరావును హెడ్డాఫీసుకు బదిలీ చేశారు. హెడ్ క్వార్టర్స్‌లో పనిచేసే ఎం.రత్నావళిని విజయవాడ జోన్ డిప్యూటీ సీపీవోగా నియమించారు.



ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ సృజన, అధికారులు

అర్జీదారులకు సంతృప్తికర పరిష్కారం

» అధికారులకు కలెక్టర్ సృజన సూచన

వన్‌టౌన్, సెప్టెంబరు 23 : ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అర్జీదారులు ఇచ్చిన దరఖాస్తులను సంతృప్తికరంగా పరిష్కరించాలని అధికారులకు ఎన్టీఆర్‌జిల్లా కలెక్టర్ జి.సృజన సూచించారు. సోమవారం విజయవాడలోని కలెక్టరేట్‌లో జేసీ నిధిమీనా, డీఆర్వో శ్రీనివాసరావు, జిల్లా పౌరసరఫరాల జీఎం జి.వెంకటేశ్వర్లు, హౌసింగ్ పీడీ రజనీకుమారిలతో కలిసి అర్జీదారుల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా అధికారుల నుద్దేశించి కలెక్టర్ మాట్లాడుతూ, ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి గడువులోగా పరిష్కరించాలన్నారు. అర్జీలు ఏస్థాయిలోనూ పెండింగ్ ఉండరాదని, సకాలంలో పరిష్కారం చూపాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. మొత్తం 111 అర్జీలు అందగా.. రెవెన్యూ 38, పోలీసు 20, ఎంఎయుడి 16, డిఆర్‌డిఏ 5, పంచాయతీరాజ్ 11, సహకార శాఖ 1, ఆరోగ్యశాఖ 2, విభిన్న ప్రతిభావంతుల సంక్షేమం 1, ఉపాధి హామీ 3, పౌరసరఫరాలు 2, హౌసింగ్ 1, విద్య 6, బీసీ వెల్ఫేర్ 1, మత్స్యశాఖ 1, విద్యుత్ శాఖ 1, గనులు 1, ఆర్‌అండ్‌బి 1 చొప్పున వచ్చాయి.

నులిపురుగుల నివారణ దినోత్సవం రేపు

వన్‌టౌన్ : జాతీయ నులిపురుగుల నివారణా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈనెల 25వ తేదీన అల్బెండజోల్ మాత్రల పంపిణీ పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ సృజన సంబంధిత అధికారులకు సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన కార్యక్రమంలో నులిపురుగుల నిర్మూలన దినోత్సవానికి సంబంధించి పోస్టర్, కరపత్రాలను డీఆర్వో వి.శ్రీనివాసరావు, వైద్య ఆరోగ్య శాఖ అధికారులతో కలిసి ఆవిష్కరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ, ఈనెల 25వ తేదీన ఒకటి నుంచి 19 సంవత్సరాల లోపు వయసున్న పిల్లలు, కిషోర బాలలకు మాత్రలను పంపిణీ చేయనున్నట్టు తెలిపారు. ఒకటి నుండి రెండు సంవత్సరాల వయస్సు గల చిన్నారులకు సగం మాత్ర, ఆ పైన 19 సంవత్సరాల వయస్సు ఉన్నవారికి ఒక మాత్ర తీసుకోవాల్సి ఉంటుందన్నారు. పాఠశాలలు, జూనియర్ కళాశాలలు, ఐటీఐ, పాలిటెక్నిక్, నర్సింగ్ విద్యార్థులకు ఉచితంగా మాత్రలను పంపిణీ చేయనున్నట్టు తెలిపారు. డీఎల్‌ఏటీవో డాక్టర్ జె.ఉషారాణి, డాక్టర్ బీసీకే నాయక్ తదితరులు పాల్గొన్నారు.



ప్రజలనుంచి అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ బాలాజీ, జేసీ గీతాంజలి శర్మ

మీకోసం అర్జీలు పరిష్కరించండి

» కృష్ణా కలెక్టర్ బాలాజీ

మచిలీపట్నం, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : ప్రజాసమస్యల పరిష్కార వేదిక(మీకోసం) కార్యక్రమంలో ప్రజలనుంచి వచ్చిన అర్జీలను సత్వరమే పరిష్కరించాలని కృష్ణా జిల్లా కలెక్టర్ బాలాజీ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని 'మీకోసం' సమావేశపుహాలులో సోమవారం జేసీ గీతాంజలిశర్మ, డీఆర్వో కె.చంద్రశేఖరరావు, కేఆర్‌సీసీ డెప్యూటీ కలెక్టర్ జి.శ్రీదేవితో కలిసి ప్రజలనుంచి ఆయన అర్జీలు స్వీకరించారు. 160మంది వివిధ సమస్యలపై అర్జీలు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఇప్పటివరకు 3,578 అర్జీలు రాగా, వాటిలో 502 అర్జీలు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని వెంటనే పరిష్కరించాలన్నారు. రెవెన్యూశాఖలో ఏడు, పోలీస్‌శాఖలో ఆరు గడువుదాటిన అర్జీలు ఉన్నాయన్నారు. కోర్టు ధిక్కరణ కేసులు 22ఉన్నాయని, వాటికి సంబంధించిన వకాలత్‌లను వెంటనే దాఖలు చేయాలని అధికారులను ఆదేశించారు. కోర్టుకేసులు, మీకోసం అర్జీలపరిష్కారంపై ప్రతివారం సమీక్ష చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో సీపీవో గణేష్, డీఎంఅండ్‌హెచ్‌వో గీతాబాయి అధికారులు పాల్గొన్నారు.

ఎంతకాలం ఉంటానో తెలీదు..!

» నా భూమిని మాజీ మంత్రి జోగి అనుచరులు ఆక్రమిస్తున్నారు

» నాలుగేళ్లుగా కలెక్టరేట్ చుట్టూ తిరుగుతున్నా ఫలితం లేదు

» మీడియా ఎదుట కేన్సర్ రోగి వేదన



మచిలీపట్నం టౌన్ : కేన్సర్ వ్యాధి నాలుగో స్టేజ్‌లో ఉంది. నాకు వివాహం కాలేదు. పూర్వీకుల ద్వారా వచ్చిన 97 సెంట్ల మాగాణి భూమి ఉంది. నా భూమిని ఆక్రమిస్తున్నారు. దానికి రెవెన్యూ అధికారులు వత్తాసు పలుకుతున్నారు.. అంటూ ముంజులూరు గ్రామానికి చెందిన మహిళ అగస్త్య సంపూర్ణ దీనంగా రోధించింది. కలెక్టరేట్ వద్ద సోమవారం మీడియా ఎదుట సంపూర్ణ తన బాధను వెలిబుచ్చింది. నాలుగేళ్లుగా కలెక్టరేట్ చుట్టూ తిరుగుతున్నానని, తన భూమిని మాజీ మంత్రి జోగి రమేశ్ అనుయాయులు ఆక్రమించేందుకు ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించింది. కేన్సర్ నాలుగో స్టేజ్‌లో ఉన్న తన ఆఖరి కోరికగా కలెక్టర్ సత్వరమే స్పందించి న్యాయం చేయాలని కోరుతోంది.

29న కృష్ణా జిల్లా రచయితల మహాసభలు

అవనిగడ్డ, సెప్టెంబరు 23 : కృష్ణా జిల్లా రచయితల 16వ మహాసభలు ఈ నెల 29న అవనిగడ్డలో జరుగుతాయని సంఘ అధ్యక్ష, కార్యదర్శులు గుత్తికొండ సుబ్బారావు, జీవీ పూర్ణచంద్‌లు సోమవారం సంయుక్త ప్రకటనలో తెలిపారు. 'ప్రకృతి వైపరీత్యాలు-పర్యావరణ పరిరక్షణ-రచయితల పాత్ర' అంశంపై 29వ తేదీన అవనిగడ్డ గాంధీక్షేత్రంలో సదస్సు జరుగుతుందని తెలిపారు. సదస్సులో జలవనరుల నిపుణులు, సాహితీ వేత్తలు టి.శోభనాద్రి, అక్కినేని భవానీ ప్రసాద్, ఎ.వ రప్రసాద్, ఎస్.నరసింహరాజు తదితరులు పాల్గొంటారని తెలిపారు. 2024వ సంవత్సరానికి ఏడుగురు సాహితీ ప్రముఖులకు కృష్ణాజిల్లా రచయితల సంఘం పురస్కారాలు అందజేయనున్నట్టు తెలిపారు. హైకోర్టు పూర్వ న్యాయమూర్తి జస్టిస్ అంబటి శంకర్ నారాయణ ముఖ్య అతిథిగా విచ్చేయనున్నారని, ఈ కార్యక్రమంలో గన్నముని, విహారి, మండలి బుద్ధప్రసాద్, యార్లగడ్డ లక్ష్మీప్రసాద్‌లు పాల్గొంటారని తెలిపారు.

బాలుడి వైద్యానికి సీఎంఆర్‌ఎఫ్ నిధులు

» బాక్టీరియల్ ఇన్‌ఫెక్షన్‌తో బాధపడుతున్న బాలుడికి ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య భరోసా

» సీఎంవోకు లేఖ.. బాలుడి ఆరోగ్యంపై కలెక్టర్ ఆరా

జగ్గయ్యపేట : వరద నీటిలో కాళ్లు నానటం వల్ల బాక్టీరియల్ ఇన్‌ఫెక్షన్‌తో కాలు పోగొట్టుకున్న ఆర్టీసీ కాలనీకి చెందిన కొత్తా భవదీప్ (12) వైద్యానికి అయ్యే ఖర్చును ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి ఇప్పిస్తామని ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య తెలిపారు. ఇన్‌ఫెక్షన్‌తో విజయవాడలో చికిత్స పొందుతున్న కొత్తా భవదీప్‌ను శ్రీరాం తాతయ్య సోమవారం పరామర్శించారు. వైద్యానికి అయ్యే ఖర్చును ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి ఇస్తామని అక్కడికక్కడే సంబంధిత ప్రతాలను పూర్తి చేయించి సీఎంవోకు పంపారు. తాతయ్య సూచన మేరకు కలెక్టర్ బాలాజీ, డీఎంహెచ్‌వో సుహాసినిలు బాలుడి ఆరోగ్యంపై ఆరా తీశారు.

పారామౌంట్ ఇండస్ట్రీస్ అధినేత రూ. లక్ష విరాళం

పారామౌంట్ ఇండస్ట్రీస్ అధినేత వెనిగళ్ల సురేష్‌కుమార్‌రూ.లక్ష ఆర్థిక సహాయాన్ని ప్రకటించారు. రెండో కాలుకు ఇన్‌ఫెక్షన్ సోకి విజయవాడలో ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాలుడి కుటుంబసభ్యులకు అందజేస్తామని చెప్పారు. మానవత్వంతో స్పందించిన సురేష్‌కుమార్‌కు బాలుడి తండ్రి నాగరాజు కృతజ్ఞతలు తెలిపారు.

దేవదాయ శాఖలో బదిలీల జాతర!

» దుర్గగుడి డిప్యూటీ ఈవోగా రత్నబాబు

» ఈఈ రమ బదిలీ



విజయవాడ, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : దేవదాయ శాఖలో భారీగా బదిలీలు జరిగాయి. దేవదాయ శాఖ కమిషనర్ కార్యాలయంలోని ఎం.రత్నరాజును దుర్గామల్లేశ్వరస్వామి ఆలయ డిప్యూటీ ఈవోగా బదిలీచేశారు. అక్కడ పనిచేస్తున్న జీవీడీఎన్ లీలాకుమార్‌ను పెదకాకాని మల్లేశ్వరస్వామి ఆలయ ఈవోగా, పెదకాకాని మల్లేశ్వరస్వామి దేవస్థాన ఈవోగా ఉన్న డి.శ్రీరామ వరప్రసాద్‌ను మోపిదేవి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవస్థాన ఈవోగా బదిలీ చేశారు. దుర్గామల్లేశ్వరస్వామి ఆలయ ఈఈగా పనిచేస్తున్న లింగం రమను పెనుగంచిప్రోలులోని తిరుపతమ్మ ఆలయానికి బదిలీ చేశారు. ఇక్కడ పనిచేస్తున్న టి.వైకుంఠరావును దుర్గామల్లేశ్వరస్వామి ఆలయానికి పంపారు. దుర్గామల్లేశ్వరస్వామి ఆలయ ఏఈగా ఉన్న బి.అశోక్‌ను ద్వారకా తిరుమల ఆలయానికి బదిలీ చేశారు. అన్నవరం సత్యనారాయణస్వామి ఆలయంలో పనిచేస్తున్న పి.రాజబాబును దుర్గామల్లేశ్వరస్వామి ఆలయానికి పంపారు. ద్వారకాతిరుమల ఏఈవోగా ఉన్న ఎం.దుర్గారావును ఇంద్రకీలాద్రికి బదిలీ చేశారు. దుర్గామల్లేశ్వరస్వామి ఏఈవోగా ఉన్న బి.వెంకటరెడ్డిని అన్నవరం దేవస్థానానికి బదిలీ చేశారు. దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానంలో సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న కేవీ దుర్గాప్రసాద్‌ను ద్వారకాతిరుమల దేవస్థానానికి బదిలీ చేశారు. ఇక్కడ పనిచేస్తున్న ఎం.శ్రీనివాసరావును దుర్గామల్లేశ్వరస్వామి ఆలయానికి పంపారు. ఇంద్రకీలాద్రిపై పనిచేస్తున్న సీనియర్ అసిస్టెంట్ ఎల్ ఎల్‌వీఎస్‌బీ శర్మ, బి.నాగరాజును పెనుగంచిప్రోలులోని తిరుపతమ్మ ఆలయానికి బదిలీ చేశారు. అన్నవరంలో సీనియర్ అసిస్టెంట్‌గా ఉన్న బి.త్రినాథ్‌ను దుర్గగుడికి బదిలీ చేశారు. దుర్గగుడిలో పనిచేస్తున్న సీనియర్ అసిస్టెంట్ జి.సతీష్‌కుమార్‌ను ద్వారకాతిరుమల దేవస్థానానికి బదిలీ చేశారు. దుర్గగుడిలో జూనియర్ అసిస్టెంట్లు వి.ఉమాశంకర్, టి.లక్ష్మణ్‌కుమార్, టీఎస్ రాంజీని అన్నవరం దేవస్థానానికి బదిలీ చేశారు. అన్నవరంలో పనిచేస్తున్న జీఎల్‌వీఆర్ చౌదరిని దుర్గగుడికి బదిలీ చేశారు. ఇక్కడ పనిచేస్తున్న పలివెల ప్రతాప్‌కుమార్‌ను అన్నవరం దేవస్థానానికి పంపారు. దుర్గగుడిలో ఉన్న జూనియర్ అసిస్టెంట్ పి.శ్రీనివాసరావును ద్వారకాతిరుమలకు, జి.వెంకట అప్పారావు, ఎం.విజయకుమారి, టి.ప్రసాద్‌నాయుడుని అన్నవరం దేవస్థానానికి బదిలీ చేశారు. అన్నవరంలో పనిచేస్తున్న శ్రీరామ రాంబాబు, సీహెచ్ రమేష్‌బాబును దుర్గగుడికి బదిలీ చేశారు. అన్నవరంలో పనిచేస్తున్న గజ్జల ప్రసాద్, కె.నరసింహరావును ఇంద్రకీలాద్రికి పంపారు. ఇక్కడ పనిచేస్తున్న బి.సూరిబాబును అన్నవరానికి పంపారు. తిరుపతమ్మ ఆలయంలో పనిచేస్తున్న ఎన్.రమను దుర్గగుడికి బదిలీ చేశారు. దుర్గగుడిలో ఉన్న డ్రాఫ్ట్‌మ్యాన్ ఎస్.రామకృష్ణను ద్వారకాతిరుమలకు పంపారు.

ఆర్టీసీ ఉద్యోగులకు ఫ్లడ్ లోన్స్

» సీసీఎస్ ద్వారా రుణాలు ఇచ్చేందుకు నిర్ణయం

» వినియోగ రుణాల కింద రూ.25 వేలు నిర్ణయం

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : ఉమ్మడి కృష్ణాజిల్లాలో కృష్ణానది, బుడమేరు ముంపు బాధితులైన ఆర్టీసీ ఉద్యోగులకు కో-ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ (సీసీఎస్) తనవంతుగా రుణాలు ఇవ్వాలని నిర్ణయించింది. దీనిపై ఇటీవల సీసీఎస్ పాలకవర్గం చర్చించింది. ఈ క్రమంలో వరదల కారణంగా నష్టపోయిన సిబ్బందికి వినియోగ రుణాలు అందించాలని నిర్ణయించింది. సీసీఎస్ నిర్ణయాన్ని పాలకవర్గ గుర్తింపు సంఘం ఏపీపీటీడీ ఎన్ఎంయూఏ రాష్ట్ర అధ్యక్షుడు పీవీ రమణారెడ్డి సోమవారం అధికారికంగా ప్రకటించారు. ఉమ్మడి కృష్ణా జిల్లా పరిధిలో ఆటోనగర్, అవనిగడ్డ, గుడివాడ, గవర్నర్ పేట 1, 2, గన్నవరం, ఇబ్రహీంపట్నం, జగ్గయ్యపేట, మచిలీపట్నం, నూజివీడు, పీఎన్‌బీఎస్, తిరువూరు, విద్యాధరపురం, విజయవాడ, ఉయ్యూరు ఆపరేషనల్ యూనిట్లతోపాటు విజయవాడ జోనల్ వర్క్‌షాప్, విజయవాడ టైర్స్, జడ్ఎం, ఆర్ఎం, జోనల్ స్టాఫ్ ట్రైనింగ్ కాలేజీ, విద్యాధరపురం హాస్పిటల్, ఎండీ కార్యాలయం వంటి నాన్ ఆపరేషనల్ విభాగాలకు సంబంధించిన ఉద్యోగులు వినియోగరుణాల కోసం దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. దరఖాస్తు ఫారంను ఆయా డిపోల పరిధిలో పాలకవర్గం అందుబాటులోకి తీసుకువచ్చింది. రుణదరఖాస్తు పత్రాలను ఆర్టీసీ ఉద్యోగులు పూర్తి చేసి.. డిపో మేనేజర్ ద్వారా ధృవీకరించిన తర్వాత దానిని సీసీఎస్‌లో సమర్పించాల్సి ఉంటుంది. దరఖాస్తు పత్రం అందిన రెండు రోజుల్లోగానే వినియోగ రుణాన్ని నేరుగా సభ్యుల ఖాతాలకు జమ చేస్తారు.

ఫైర్‌స్టేషన్లకు త్వరలో కొత్త భవనాలు!

» అగ్నిమాపక శాఖ అదనపు డైరెక్టర్ శ్రీనివాసరెడ్డి

» అగ్నిమాపక కేంద్రాల ఆధునీకరణకు రూ. 252 కోట్లు మంజూరు



స్టేషన్‌లో రికార్డులు పరిశీలిస్తున్న అడిషనల్ డీజీ

పామర్రు, సెప్టెంబరు 23 : రాష్ట్ర వ్యాప్తంగా శిథిలావస్థలో ఉన్న అగ్నిమాపక కేంద్రాల నూతన భవనాల నిర్మాణాలకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని, దీనిలో భాగంగా సంబంధిత కేంద్రాలకు సంబంధించిన ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నట్టు అగ్నిమాపకశాఖ అడిషనల్ డైరెక్టర్ జి.శ్రీనివాసరెడ్డి అన్నారు. పామర్రు అగ్నిమాపక కేంద్రాన్ని సోమవారం ఆయన ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అగ్నిమాపక కేంద్రాల ఆధునీకరణకు ప్రభుత్వం రూ.252 కోట్లను విడుదల చేసినట్టు చెప్పారు. పామర్రుకు రూ1.25 కోట్ల అంచనాలతోపాటు మచిలీపట్నం స్టేషన్ ఆధునీకరణకు రూ2.80 కోట్లతో భవనాల ఆధునీకరణ పనులు త్వరలో ప్రారంభించడం జరుగుతుందన్నారు. ఇటీవల సంభవించిన వరదల్లో అగ్నిమాపక సిబ్బంది విశేష సేవలందించారని అభినందించారు. బహుళ అంతస్థుల నిర్మాణాలు చేపట్టే యాజమానులు తప్పనిసరిగా ముందస్తుగా నిరభ్యంతర పత్రాలు తీసుకోవాలని, లేనిపక్షంలో చట్టపరంగా చర్యలు తప్పవని హెచ్చరించారు. అన్నిజిల్లాల్లో అగ్నిమాపక శాఖకు చెందిన భూముల పరిరక్షణకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. సిబ్బంది నియామకానికి నోటిఫికేషన్ విడుదల చేస్తామన్నారు. తొలుత అగ్నిమాపక కేంద్రం రికార్డులు, వాహనాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. సీసీ రోడ్డు నిర్మాణ పనులకు సంబంధించి ప్రతిపాదనలు కలెక్టర్‌కు పంపాలని ఆదేశించారు. దీపావళి సందర్భంగా ముందుస్తు చర్యలు తీసుకోనేందుకు ప్రజలు సహకరించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అధికారి ఏసురత్నం, పామర్రు ఫైర్ అధికారి రాంబాబు సిబ్బంది పాల్గొన్నారు.

మాకూ ఎన్యూమరేషన్ చేయండి

(5వ పేజీ తరువాయి)

కదలకపోవటంతో పోలీసులు స్వల్ప లాఠీచార్జి చేశారు.

ఆ డివిజన్ ఎన్యూమరేషన్ పరిధిలోకి రాదు : అధికార యంత్రాంగం ప్రకటన

ఎన్యూమరేషన్ ప్రక్రియలో ఎవరికీ అన్యాయం జరగదని, అర్హులైన వారందరికీ న్యాయం చేస్తామని ఎన్టీఆర్ జిల్లా యంత్రాంగం ప్రకటించింది. 38వ డివిజన్ ఎన్యూమరేషన్ పరిధిలోకి రాదని, వారు అర్హులు కాకపోవటం వల్లే సర్వే నిర్వహించలేదని పేర్కొంది. ఈ ప్రాంతం నుంచి వస్తున్న అభ్యంతరాలతో రెండుసార్లు ప్రత్యేక టీమ్‌లను పంపించటం జరిగిందని, వారు అర్హులు కాదని గుర్తించారని స్పష్టం చేసింది.

మా మ్యాపింగ్ సంగతేంటి..?

(5వ పేజీ తరువాయి)

రామలింగేశ్వరనగర్‌లో వైసీపీ హడావిడి

రామలింగేశ్వరనగర్‌లోని వరద బాధితులకు సంబంధించి ఎన్యూమరేషన్ ప్రక్రియలో స్థానిక వైసీపీ కార్పొరేటర్ల జోక్యం ఎక్కువైంది. దీంతో పలువురు అర్హులు అనర్హులుగా మిగిలారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. స్థానికంగా నివాసముంటూ వరద ప్రభావానికి గురైనప్పటికీ.. వారిని అర్హులుగా చేర్చకుండా వేరేప్రాంతంలో ఉన్న వైసీపీ నేతల బంధువులను చేర్పించారన్న విమర్శలు వస్తున్నాయి. ఎన్యూమరేటర్లను ప్రభావితం చేసి స్థానిక వలంటీర్లు చెప్పిన విధంగా అనర్హులను కూడా అర్హులుగా నమోదు చేయించారని తెలుస్తోంది.

సచివాలయాల్లో పట్టించుకోవట్లేదు

అజిత్‌సింగ్‌నగర్ శివాలయం వెనుక వీధిలో గ్రౌండ్‌ఫ్లోర్‌లో నివాసముంటున్నాం. వరద కారణంగా మా ఇల్లు నీట మునిగింది. సచివాలయ సిబ్బంది ఇంటికి వచ్చి మా పేరు రాసుకున్నారు. కానీ, జాబితాలో మా పేరు రాలేదు. సచివాలయానికి వెళ్లి అడిగితే ఎవరూ పట్టించుకోవట్లేదు.

- ఎన్.సునంద, సింగ్‌నగర్

మంత్రి లోకేశ్‌కు దాతల విరాళాలు

అమరావతి, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): విజయవాడ వరద బాధితులను ఆదుకునేందుకు పలువురు దాతలు స్పందిస్తూ ఉన్నారు. సోమవారం ఉండవల్లిలోని నివాసంలో మంత్రి లోకేశ్‌ను పలువురు దాతలు విరాళాల చెక్కులు, డీడీలను అందజేశారు. ఏపీటీపీవోల అసోసియేషన్ ప్రతినిధులు రూ.2 లక్షలు, విజయవాడ టీచర్స్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు రూ.1,13,216, పశ్చిమగోదావరి జిల్లా ఇండోవేదిక్ ఎడ్యుకేషనల్ సొసైటీ నిర్వాహకుడు ఎంఆర్‌కే రెడ్డి రూ.లక్ష, విజయవాడ జేబీ ఎస్టేట్స్ అధినేత జే పాండురంగారావు రూ.లక్ష, డాక్టర్ బీ హనుమయ్య రూ.84 వేలు, మెగా టౌన్‌షిప్ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు రూ.64,700, చీమలపాడుకు చెందిన బెజవాడ శంకర్ రూ.50,117, కేఎస్ నాగమణి రూ.50,116, ఎమ్మిగనూరుకు చెందిన ఎస్‌హేమ రూ.50వేలు అందజేశారు.

పవన్‌కు మద్దతుగా జనసేన నేతల దీక్ష

గుడివాడ : తిరుపతి లడ్డూ అపవిత్రమైన కారణంగా ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చేపట్టిన ప్రాయశ్చిత్త దీక్షకు మద్దతుగా గుడివాడలో జనసేన నాయకులు దీక్ష చేపట్టారు. భీమేశ్వరస్వామి దేవస్థానంలో జనసేన ఇన్‌చార్జ్ బూరగడ్డ శ్రీకాంత్ ఆధ్వర్యంలో 116 కొబ్బరికాయలు కొట్టి దీక్షను ప్రారంభించారు.



చంద్రబాబుకు చెక్కు అందజేస్తున్న డాక్టర్ కేకేఆర్స్ గౌతమ్ చైర్మన్ అవినాశ్

డాక్టర్ కేకేఆర్స్ గౌతమ్ రూ.25లక్షల విరాళం

గుడివాడ : వరద బాధితుల సహాయార్థం సీఎం రిలీఫ్ ఫండ్‌కుడాక్టర్ కేకేఆర్స్ గౌతమ్ విద్యాసంస్థల చైర్మన్ కొసరాజు అవినాశ్ రూ.25లక్షల విరాళాన్ని గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాముతో కలిసి ముఖ్యమంత్రి చంద్రబాబుకు సోమవారం క్యాంపు కార్యాలయంలో అందజేశారు. అలాగే గుడివాడ అభివృద్ధికి మరో రూ.20లక్షల చెక్కును ఎమ్మెల్యే వెనిగండ్ల రాముకు అందజేశారు. చంద్రబాబును కలిసిన వారిలో టీడీపీ నేతలు కొల్లిపెదబాబు, చేవూరు జగన్మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

ఎన్ఎస్ఎం పూర్వ విద్యార్థులు రూ.2లక్షలు..



ఆటోనగర్: ఎన్ఎస్ఎం స్కూల్ ఓల్డ్ స్టూడెంట్స్ అసోసియేషన్ సీఎం రిలీఫ్ ఫండ్‌కు విరాళంగా రూ. 2లక్షల చెక్కును సీఎం చంద్రబాబుకు అందజేసినట్టు అసోసియేషన్ కార్యదర్శి గుర్జీత్‌సింగ్ సాహ్ని సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. స్కూల్ ప్రిన్సిపల్ బ్రదర్ రాయప్పరెడ్డి, ఓల్డ్ స్టూడెంట్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు కె. జయనారాయణ, శ్రీకాంత్, సిహెచ్. ప్రకాష్, టి. అడైకప్పన్ పాల్గొన్నారు.

రేషన్ డీలర్లకు న్యాయం చేయండి

మచిలీపట్నం టౌన్, సెప్టెంబరు 23 : గ్రామీణ ప్రాంతంలో 450, పట్టణ ప్రాంతాల్లో 550 రేషన్ బీపీఎల్ కార్డులు కేటాయించాలని కృష్ణాజిల్లా రేషన్ డీలర్ల సంఘ అధ్యక్షుడు ఖాశీం డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం జేసీ గీతాంజలి శర్మకు వినతిపత్రం ఇచ్చారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ, గ్రామ పంచాయతీని యూనిట్‌గా, మునిసిపాలిటీలోని వార్డును యూనిట్‌గా తీసుకుని అందరికీ సమానంగా కార్డులు కేటాయించాలన్నారు. సుప్రీంకోర్టు ఉత్తర్వుల మేరకు కార్మిక వేతనం చట్టం ప్రకారం రేషన్ డీలర్లకు ఆదాయ వనరులు కల్పించాలన్నారు.

49.17 శాతం బీమా క్లెయిమ్‌ల పరిష్కారం

» రూ.164.95 కోట్ల రుణాల రీషెడ్యూల్

» ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జి.సృజన

వన్‌టౌన్, సెప్టెంబరు 23: ఇటీవల కురిసిన భారీ వర్షాలు, వరదలతో నష్టపోయిన, దెబ్బతిన్న వాహనాలు, ఇళ్లు, దుకాణాలతో పాటు చిన్న, మధ్యతరహా వ్యాపార సముదాయాల వంటి ఆస్తులకు సంబంధించి 49.17 శాతం క్లెయిమ్‌లు పరిష్కారమయ్యాయని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జి. సృజన సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మొత్తంగా 11,046 క్లెయిమ్‌లు రిజిస్టర్ కాగా, 5,399 క్లెయిమ్‌లను సెటిల్ చేసినట్టు చెప్పారు. వాహనేతర కేటగిరిలో 1,343 క్లెయిమ్‌లు రిజిస్టర్ కాగా, వాటిలో 693 క్లెయిమ్‌లు సెటిల్ అయినట్టు తెలిపారు. మొత్తంమీద 49.17 శాతం క్లెయిమ్‌లు పరిష్కరించారని చెప్పారు. బ్యాంకింగ్ సేవలు, బీమా క్లెయిమ్‌ల పై సీఎం చంద్రబాబు నాయుడు ప్రత్యేకంగా దృష్టిపెట్టారని, నిరంతర పర్యవేక్షణతో క్లెయిమ్‌ల పరిష్కారాన్ని వేగవంతం చేస్తున్నామని తెలిపారు. 59,629 మంది అర్బన్ కంపెనీ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకున్నారని, 5,841 సర్వీసు రిక్వెస్టులు నమోదయ్యాయని, వీటిలో 95.6 శాతం మేరకు 5,603 విజ్ఞప్తులకు అటెండ్ అయ్యి సేవలు అందించినట్టు తెలిపారు. నాలుగు రోజుల వ్యవధిలో 3,136 ఖాతాలకు రూ.175.54 కోట్ల విలువైన బ్యాంకింగ్ సేవలు అందించినట్టు కలెక్టర్ తెలిపారు. 2,145 రుణ ఖాతాలకు 164.95 కోట్లు రీ షెడ్యూల్ చేసినట్టు తెలిపారు. కొత్తగా 991 ఖాతాలకు 10.59 కోట్ల రుణాలు మంజూరు చేశారన్నారు. వీటిలో 425 ఖాతాలకు రూ.1.05 కోట్ల వినియోగ రుణాలు మంజూరు చేసినట్టు తెలిపారు. సోమవారం ఒక్కరోజే 245 ఖాతాలకు రూ.16.72 కోట్ల మేరకు రుణాలను రీషెడ్యూల్ చేశారన్నారు. కొత్తగా 151 ఖాతాలకు 1.33 కోట్ల రుణాలను అందచేశారని, వీటిలో 114 ఖాతాలకు సంబంధించి 28 లక్షల మేరకు వినియోగ రుణాలు ఉన్నట్టు తెలిపారు.

స్వర్ణాంధ్ర -2047 మిషన్‌లో భాగస్వాములుకండి

స్వర్ణాంధ్ర ఎట్ ది రేట్ ఆఫ్ 2047 మిషన్‌లో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన పిలుపు నిచ్చారు. సోమవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో సీపీఓ వై.శ్రీలక్ష్మితో కలిసి స్వర్ణాంధ్ర ఎట్ ది రేట్ ఆఫ్ 2047 పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్వర్ణాంధ్ర ఎట్ ది రేట్ ఆఫ్ 2047 మిషన్‌కు ప్రజలతో పాటు వివిధ భాగస్వామ్య పక్షాల నుంచి సూచనలు, సలహాలు, స్పందనను తీసుకోవటం జరుగుతుందన్నారు. క్యూఆర్ కోడ్‌ను స్కానింగ్ చేసి అక్టోబరు 5వ తేదీ వరకు ప్రజలు తమ ఫీడ్ బ్యాక్‌ను అందించాలని సూచించారు. స్మార్ట్ ఫోన్ నుంచి క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి తమ అభిప్రాయాలను పంచుకోవాలని కోరారు.

ఆరోగ్యవంత సమాజం ప్రభుత్వ లక్ష్యం : రవీంద్ర

మచిలీపట్నం టౌన్, సెప్టెంబరు 23 : ఆరోగ్యవంతమైన సమాజం ఏర్పాటు చేయడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఆబ్కారీ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. మచిలీపట్నం శారదానగర్‌లో సోమవారం మహిళా శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో గర్భిణులకు సీమంతం కార్యక్రమం జరిగింది. గర్భిణులకు పండ్లు, నూతన వస్త్రాలను మంత్రి అందజేశారు. చిన్నారులకు అన్నప్రాసన నిర్వహించారు. పోషకాహార మాసోత్సవాల్లో భాగంగా మంత్రి పాల్గొని ప్రసంగించారు. రక్తహీనతను అధిగమిస్తామని, ప్రతి చిన్నారికీ, మహిళకు పోషకాహారం అందించి తీరుతామన్నారు. కార్యక్రమంలో జనసేన ఇన్‌చార్జి బండి రామకృష్ణ, మోటమర్రి బాబా ప్రసాద్, బాపిరాజు, పిప్పళ్ల కాంతారావు, సీడీపీవో గ్లోరీ, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

పథకాల అమలు బాధ్యత అంగన్వాడీలదే : బాలశౌరి

పామర్రు,సెప్టెంబరు 23 : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాలను గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు చేరువ చేసే బాధ్యత అంగన్వాడి టీచర్లపై ఉందని బందరు ఎంపీ వల్లభనేని బాలశౌరి అన్నారు. పెదమద్దాలి గ్రామంలో సోమవారం పామర్రు ఐసీడీఎస్ సీడీపీవో భానుశ్రీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పోషకాహర మాసోత్సవాల్లో బాలశౌరి ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ, పోషన్ అభియాన్ పథకంపట్ల ప్రజల్లో చైతన్యం తీసుకురావలన్నారు. దీనితోపాటు మహిళరక్షణ చట్టాలను వివరించాలన్నారు. ఎమ్మెల్యే వర్లకుమార్ రాజా మాట్లాడుతూ, గ్రామీణ మహిళల్లో కౌమారదశ బాలికల్లో రక్తహీనత సమస్యను అధిగవించడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం ముందుకుసాగుతుందన్నారు. ప్రభుత్వం అమలుచేస్తున్న పోషకాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. తొలుత సామూహిక సీమంతాల కార్యక్రమంలో అతివలను ఆశీర్వదించారు.

న్యూస్ బాక్స్

డీపీవో బాధ్యతల స్వీకారం



మచిలీపట్నం, సెప్టెంబరు23(ఆంధ్రజ్యోతి) : జిల్లా పంచాయతీ అధికారి(డీపీవో)గా జె.అరుణ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. సాధారణ బదిలీల్లో భాగంగా ఆమె కృష్ణా డీపీవోగా నియమితులయ్యారు. ముందుగా ఆమె కలెక్టర్ బాలాజీని మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. ఉద్యోగులు, అధికారులతో సమన్వయం చేసుకుని పంచాయతీరాజ్ విభాగంలో మంచి పరిపాలనను అందిస్తానని ఈ సందర్భంగా ఆమె తెలిపారు.

27న జూనియర్ షూటింగ్ బాల్ జిల్లా జట్ల ఎంపిక

హనుమాన్‌జంక్షన్, సెప్టెంబరు 23 : కృష్ణా జిల్లా షూటింగ్ బాల్ సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 27న విజయవాడ ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ కళాశాలలో రాష్ట్రస్థాయి పోటీలకు జిల్లా జూనియర్ జట్ల ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్టు సంఘం అధ్యక్ష కార్యదర్శులు అట్లూరి రాజశేఖర్, గోగులమూడి విజయ్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు అక్టోబర్ 6, 7 తేదీల్లో జరగనున్న ఏడవ రాష్ట్రస్థాయి షూటింగ్ బాల్ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఆసక్తి ఉన్న క్రీడాకారులు ఆధార్, జనన ధృవపత్రాలతో కళాశాలలోని వాలీబాల్ క్రీడా మైదానంలో రిపోర్టు చేయాలని విజ్ఞప్తి చేశారు.



విద్యార్థిని అభినందిస్తున్న కళాశాల యాజమాన్యం

అంతర్జాతీయ ఆర్చరీ పోటీలకు వీఆర్ సిద్ధార్థ కళాశాల విద్యార్థి

పెనమలూరు : ఈనెల 26నుంచి వచ్చే నెల నాలుగు వరకు చైనీస్ తైపేలో జరగనున్న అంతర్జాతీయ ఆర్చరీ పోటీలకు వీఆర్ సిద్ధార్థ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థి పెండ్యాల త్రినాద్‌చౌదరి ఎంపికైనట్టు కళాశాల పీడీ పోతిన రఘు తెలిపారు. విద్యార్థిని వీసీ వెంకటేశ్వరరావు, ప్రిన్సిపాల్ రత్నప్రసాద్, రిజిస్ట్రార్ రవిచంద్, డీన్ పాండురంగారావులు అభినందించారు.

హ్యూమన్ రైట్స్ కృష్ణాజిల్లా అధ్యక్షుడిగా వక్కపాటి శివప్రసాద్

మచిలీపట్నం టౌన్ : హ్యూమన్‌రైట్స్ కృష్ణాజిల్లా అధ్యక్షుడిగా వక్కపాటి శివప్రసాద్‌ను నియమిస్తూ సోమవారం జాతీయ అధ్యక్షురాలు అమ్మిరెడ్డి రజని నియామక పత్రం అందజేశారు. గాంధీనగరంలో కార్యాలయం వద్ద శివప్రసాద్‌కు నియామక పత్రం ఇస్తూ మానవ హక్కులను పరిరక్షించాలని కోరారు.

క్రైం కార్నర్

వివాహిత హత్యకేసు..


నిందితుడికి జీవిత ఖైదు

మచిలీపట్నం/వీరులపాడు, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : వివాహితపై రోకలిబండతో దాడిచేసి హతమార్చిన అనంతరం ఆమెపై లైంగికదాడి చేసిన నిందితుడిపై నేరం రుజువుకావడంతో జీవితఖైదు, రూ.9వేలు జరిమానా విధిస్తూ 9వ అదనపు జిల్లాసెషన్స్ జడ్జి ఎస్.సుజాత సోమవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. వీరులపాడుగ్రామానికి చెందిన వివాహిత భర్తతో గొడవ పడి, తన సోదరి ఇంటిలో వేరుగా ఉంటోంది. అదే గ్రామానికి చెందిన పొట్టిపోగు యోసేబు 14 ఏప్రిల్ 2023వ తేదీ రాత్రి ఒంటరిగా ఉన్న మహిళపై రోకలిబండతో దాడి చేయడమేగాక మరణించిన ఆమెపై లైంగికదాడికి పాల్పడ్డాడు. ఆమె సెల్‌ఫోన్, బంగారువస్తువులు తీసుకుని పారిపోయాడు. మృతురాలి సోదరి ఫిర్యాదు మేరకు పోలీసులు హత్య, లైంగికదాడి, దొంగతనం కేసునమోదు చేశారు. కేసులో 21మంది సాక్షులను విచారించగా, నిందితుడిపై నేరం రుజువుకావడంతో న్యాయమూర్తి పైవిధంగా తీర్పు చెప్పారు.

భార్యను వేధించిన కేసులో ..

భార్యను వేధించిన కేసులో భర్తపై నేరం రుజువుకావడంతో 10నెలల జైలుశిక్ష, రూ.5 వేల జరిమానా విధిస్తూ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్‌జడ్జి దేవిసాయిశ్రీవాణి సోమవారం తీర్పుచెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం మేరకు.. మచిలీపట్నం మల్కాపట్నంకు చెందిన పి.మధుమోహనప్రసాద్‌కు కృపావాణికి 11ఆగస్టు 2006వ తేదీన వివాహం జరిగింది. కొంతకాలంపాటు సక్రమంగానే ఉన్న ప్రసాద్ అనంతరం తన భార్యను వేధిస్తున్నాడు. దీంతో భర్త వేధింపులు భరించలేని కృపావాణి మచిలీపట్నం పోలీస్‌స్టేషన్‌లో 14జూలై 2018వ తేదీన ఫిర్యాదు చేసింది. కేసులో ప్రాసిక్యూషన్ తరపున ఎనిమిది మంది సాక్షులను విచారించారు. నిందితుడిపై నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి పైవిధంగా తీర్పు చెప్పారు.

కిడ్నీ వ్యాధితో ఒకరి మృతి



గంపలగూడెం: కిడ్నీ వ్యాధితో బాధపడుతూ వ్యక్తి సోమవారం మృతి చెందాడు. అనుములంక గ్రామానికి చెందిన నక్కనబోయిన వెంకటేశ్వర్లు (55) కొంతకాలంగా కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నాడు. డయాలసిస్ చేయించుకుంటున్న అతను విజయవాడలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి భార్య కుమారుడు ఉన్నారు. గత రెండు నెలల వ్యవధిలో అనుముల్లంకలో ఐదుగురు కిడ్నీ రోగులు మృతి చెందారు.

విజయవాడ

●తూర్పు ●సెంట్రల్ ●పశ్చిమ

బ్రాయిలర్ ధరలు

అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	128, 137, 148
చికెన్ విత్ స్కిన్	250
చికెన్ స్కిన్‌లెస్	260



నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 555

లయోలా కళాశాలలో పుస్తక సమీక్ష

భారతీనగర్, సెప్టెంబరు 23 : ఆంధ్రా లయోలా కళాశాలలో ఫాదర్ గార్డెన్ లైబ్రరీ హాల్‌లో ప్రముఖ రచయిత ఎం మహ్మద్ రచించిన రచనలపై సోమవారం పుస్తక సమీక్ష జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఫాదర్ డాక్టర్ పి.ఆర్. జాన్ పాల్గొన్నారు. రచయిత ఎం మహ్మద్ మాట్లాడుతూ భారత, ఇతర ఆర్థిక వ్యవస్థల పనితీరును, స్టాక్ మార్కెట్‌ల విశ్లేషణను పుస్తక రూపంలో వివరిస్తూ ముద్రించామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఫాదర్ డాక్టర్ పి. కిశోర్, లైబ్రేరియన్ సెక్రటరీ డాక్టర్ జి.ఏ ప్రసాద్‌రావు, ఫాదర్ పీటర్, కామర్స్ విభాగాధితి డాక్టర్ శ్యామ్‌సుందర్, ప్రొఫెసర్లు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజా ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించండి

● కమిషనర్ ధ్యానచంద్ర



చిట్టినగర్, సెప్టెంబరు 23: ప్రజల నుంచి వచ్చే సమస్యల అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలని నగర కమిషనర్ హెచ్‌ఎం ధ్యానచంద్ర అధికారులను ఆదేశించారు. సోమవారం నగరపాలక సంస్థ కమాండ్ కంట్రోల్ రూమ్‌లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వివిధ విభాగాలకు చెందిన అధికారులు పాల్గొన్నారు. నగరంలో వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజలు తమ సమస్యలను అర్జీలుగా కమిషనర్‌కు అందజేశారు. మొత్తం 9 అర్జీలు వచ్చాయి. సమస్యలను ఆయా విభాగాలకు చెందిన అధికారులు క్షేత్రస్థాయిలో త్వరితగతిన పరిష్కరించాలని కమిషనర్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమం పలువురు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

గొల్లపూడిలో అక్రమ నిర్మాణాలపై అధికారుల దృష్టికి తీసుకువెళతా

● గొల్లపూడి బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్ హేమంత్

వన్‌టౌన్, సెప్టెంబరు 23: గొల్లపూడిలో అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయని కొన్ని ఫిర్యాదులు తమ దృష్టికి వచ్చాయని సంబంధిత ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి చర్యలు తీసుకుంటానని గొల్లపూడి బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్ హేమంత్ తెలిపారు. సోమవారం 'ఆంధ్రజ్యోతి' లో గొల్లపూడి పరిధిలో జోరుగా అక్రమ నిర్మాణాలు కథనంపై సంబంధిత అధికారులు స్పందించారు. అక్రమ నిర్మాణాలు జరుగుతున్న మాట వాస్తవమేనని, తాను 25 రోజుల క్రితమే బాధ్యతలు తీసుకున్నానని, వీటిపై ఫిర్యాదులు కూడా వచ్చాయని హేమంత్ తెలిపారు. అక్రమ నిర్మాణాల గురించి పైస్థాయి అధికారులకు తెలియపరిచి శాఖాపరమైన చర్యలు తీసుకుంటానని ఆయన ఆంధ్రజ్యోతికి చెప్పారు.

సహాయం కోరిన బాధితులపై లాఠీ దెబ్బలు సిగ్గుచేటు

● సీపీఐ నగర కార్యదర్శి కోటేశ్వరరావు

వన్‌టౌన్, సెప్టెంబరు 23: చేయి చాచి వరద బాధితులు సహాయం కోరితే పోలీసులు లాఠీలతో కొట్టటం సిగ్గుచేటని, సీపీఐ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు సోమవారం ఒక ప్రకటనలో విమర్శించారు. విజయవాడ హెడ్‌వాటర్ వర్క్స్ నుంచి పున్నమి ఘాట్ వరకు ఉన్న కరకట్ట ప్రాంతంలో ఉంటున్న వారికి ఎన్యూమరేషన్ చేయలేదని, న్యాయం చేయాలని కోరుతూ బాధితులు సోమవారం రాత్రి కుమ్మరిపాలెం సెంటర్ వద్ద ధర్నా చేస్తే పోలీసులు వారిపై లాఠీఛార్జి చేయటాన్ని తీవ్రంగా ఖండించారు. బాధితులపై లాఠీచార్జి చేసిన పోలీసుల పై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఎన్యూమరేషన్ చేసి నష్టపోయిన వారికి తక్షణమే సహాయం అందించాలని డిమాండ్ చేశారు. లేకపోతే పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

ఘనంగా ముగిసిన శ్రీ చైతన్య డేస్కాలర్స్ స్పోర్ట్సు మీట్

విజయవాడ స్పోర్ట్సు, సెప్టెంబరు 23 : శ్రీ చైతన్య డేస్కాలర్ కళాశాలలో మూడు రోజుల నుంచి జరుగుతున్న ఇంటర్ స్పోర్ట్సుఅండ్ గేమ్స్ మీట్ సోమవారంతో ముగిసింది. విజేతలకు శ్రీ చైతన్య ఎగ్జిక్యూటివ్ ఏజీఎం మద్దినేని మురళీకృష్ణ బహుమతులు అందజేశారు. గోసాల శ్రీ చైతన్య క్యాంపస్‌లో 100 మీటర్ల పరుగు, బాలుర కబడ్డీని, గాయత్రినగర్ ఒలింపియాడ్ స్కూల్లో బాలికలకు త్రోబాల్, బాలురకు వాలీబాల్ పోటీలను నిర్వహించారు. ఏలూరు రోడ్డు చుట్టుగుంట రవీంద్రనాథ్ ఠాగూర్ క్యాంపస్‌లో బాలికలకు షటిల్ బ్యాడ్మింటన్‌పోటీలు నిర్వహించినట్లు ఆయన వివరించారు. ఈ పోటీల విజయవంతం చేయడంలో ఏజీఎంలు, ఏఏజీఎంలు, ప్రిన్సిపాల్స్ సహకారం అందించారన్నారు.

మైనార్టీ సంక్షేమ పథకాలను పునరుద్ధరించినందుకు కృతజ్ఞతలు

వన్‌టౌన్, సెప్టెంబరు 23: మైనార్టీ సంక్షేమ పథకాలను పునరుద్ధరించినందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబుకు టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఎంఎస్ బేగ్ సోమవారం ఒక ప్రకటనలో కృతజ్ఞతలు తెలిపారు. కడప హజ్ హౌస్, గుంటూరు క్రిస్టియన్ భవన నిర్మాణంతో పాటు నూరుబాషా కార్పొరేషన్ ఏర్పాటు చేయటం మైనార్టీ వర్గాల అభ్యున్నతికి సోపానాలన్నారు. ఇమామ్‌లకు, మౌజాన్‌లకు గౌరవ వేతనం, ఇంకా పలు సంక్షేమ పథకాలను పునరుద్ధరించటం అభినందనీయమని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు తో పాటు సహకరించిన మైనార్టీ శాఖ మంత్రి ఎన్‌ఎండి ఫరూక్‌కు, ఇతర ఉన్నతాధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

9న దివ్య ఖురాన్ ప్రతిభా పోటీలు



ధర్నాచౌక్, సెప్టెంబరు 23: దివ్య ఖురాన్‌తో పటిష్ట సంబంధం ద్వారానే మంచి సమాజ నిర్మాణం సాధ్యమని యునైటెడ్ ఫోరం ఫర్ ఖురానిక్ స్టడీస్ చైర్మన్ మొహమ్మద్ దావూద్ తెలిపారు. గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో ఆయన మాట్లాడారు. బాలబాలికలకు దివ్య ఖురాన్ ప్రతిభా పోటీలు అక్టోబరు 9న నిర్వహిస్తున్నామన్నారు. పోటీల్లో మొదటి బహుమతిగా రూ. 20, వేలు, రెండవ బహుమతి రూ.15 వేలు, మూడవ బహుమతి రూ. 10 వేలు అందజేస్తామన్నారు. ఆటోనగర్‌లోని ది ఆటోమొబైల్ టెక్నీషియన్ అసోసియేషన్ హాల్‌లో ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. ఆసక్తి కలిగిన బాలబాలికలు 98481 51012 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

వరద బాధితుల పేర్ల నమోదులో లోపాలను సరిచేయండి

● సీపీఎం నేత బాబూరావు

అజిత్‌సింగ్‌నగర్, సెప్టెంబరు 23 : వరద బాధితుల పేర్ల నమోదులో లోపాలను సరిచేసి నమోదు గడువు పెంచి అందరికి ఆర్థిక సహాయం అందేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు సీహెచ్ బాబూరావు సోమవారం ఓ ప్రకటనలో కోరారు. బుడమేరు, కృష్ణానది వరదలతో నగర పరిసర ప్రాంత ప్రజలు తీవ్రంగా నష్టపోయారని, వరదలు వచ్చి 23 రోజులు గడిచినా ఇప్పటి వరకు బాధిత కుటుంబాలకు ఆర్థిక సహాయం అందించలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. రెండు రోజులుగా సచివాలయాల వద్ద పేర్ల నమోదు ప్రక్రియతో గందరగోళ పరిస్థితులు నెలకొన్నా యన్నారు. ప్రభుత్వం ప్రజా ప్రతినిధులు చొరవ చూపి అందరికి ఆర్థిక సాయం అందేలా చర్యలు తీసుకోవాలని, నమోదు కాబడిన వారికి తక్షణమే ఆర్థిక సాయం అందించాలని డిమాండ్ చేశారు.

శాంపిల్ బిల్డింగ్‌లో అసాంఘిక కార్యకలాపాలు

● మద్యం, గంజాయి సేవిస్తున్న ఆకతాయిలు
●పోలీసుల నిర్లక్ష్యం ● 17వ డివిజన్‌వాసుల ఇబ్బందులు



రాణిగారితోట, సెప్టెంబరు 23: రాణిగారితోట 17వ డివిజన్‌లోని శాంపిల్ బిల్డింగ్ ఆకతాయిలకు అడ్డాగా మారింది. ఈ ప్రాంత ప్రజలు శుభకార్యాలు, ఇతర కార్యక్రమాల కోసం నిర్మించిన ఈ బిల్డింగ్‌ను ఇటీవలే అభివృద్ధి చేశారు. అయితే శుభకార్యాల కంటే ఆకతాయిల అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిత్యం రాత్రి వేళల్లో స్థానికంగా ఉండే ఆకతాయిలు ఇక్కడికి చేరి మద్యం, గంజాయి సేవించడంతో పాటు ఇతర అసాఘింక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని చెబుతున్నారు. వీరి ఆగడాలు శృతిమించాయని, ఎవరైనా వీరిని ప్రశ్నిస్తే దాడులకు దిగుతున్నారని. ఈ బిల్డింగ్ ప్రాంగణం చుట్టూ తాగిన మందుసీసాలు, ఇతర అశుద్ధ కార్యక్రమాలకు పాల్పడిన వస్తువులు దర్శనమిస్తున్నాయని చెబుతున్నారు. పోలీసులు ఈ ప్రాంతంలో ఉన్న ఆకతాయిలపై దృష్టి సారించకపోవడంతో పాటు సరైన చర్యలు తీసుకోకపోవడంతో వీరి ఆగడాలకు అడ్డులేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వెంటనే కఠిన చర్యలు తీసుకుని తమకు రక్షణ కల్పించాలని శాంపిల్ బిల్డింగ్ చుట్టూ నివసిస్తున్న వారు కోరుతున్నారు.

గత పాలకుల నిర్వాకమే

శాంపిల్ బిల్డింగ్‌లో అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడుతున్న ఆకతాయిలు గత పాలకుల నిర్వాకమే. గత వైసీపీ హయాంలో వారి స్వార్థప్రయోజనాల కోసం ఆకతాయిలను పెంచి పోషించారు. వారే ఇటువంటి కార్యక్రమాలకు పాల్పడుతూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. వెంటనే పోలీసులు వారి ఆగడాలకు అడ్డుకట్ట వేయాలి. బిల్డింగ్ వాచ్‌మన్‌తో పాటు సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి.

\- రాయి రంగమ్మ
(టీడీపీ డివిజన్ అధ్యక్షురాలు)

మందుబాబుల అడ్డాగా గ్రీనరీ పాయింట్



భారతీనగర్: ఏలూరు జాతీయ రహదారి వెంబడి ఏర్పాటు చేసిన గ్రీనరీ మందుబాబులకు అడ్డాగా మారింది. వెటర్నరీ కాలనీ నుంచి రామవరప్పాడు రింగ్ వరకు అధికారులు నగర సుందరీకరణలో భాగంగా సర్వీసు రోడ్డుకు, జాతీయ రహదారికి మధ్యలో ఉన్న స్థలంలో వివిధ రకాల మొక్కలతో ఆహ్లాదాన్ని కలిగించే వాతావరణం ఉండేలా ఏర్పాటు చేశారు. ఈ రోడ్డులో ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి, ప్రైవేట్ ఆసుపత్రులు ఉన్నాయి. వీటి కోసం రోజూ వందల సంఖ్యలో ప్రజలు వస్తూంటారు. రాత్రి సమయంలో ఈ ప్రాంతంలో ఎటువంటి పర్యవేక్షణ లేకపోవడంతో కొందరు ఆకతాయిలు ద్విచక్ర, ఆటోలో మద్యం సీసాలు తెచ్చుకొని మద్యం సేవిస్తున్నారు. ఆ సమయంలో అటుగా వస్తున్న మహిళలను ఇబ్బందులకు గురిచేస్తున్నారు. అధికారులు స్పందించి తక్షణ చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



బొండా ఉమాకు వినతిపత్రం అందజేస్తున్న ఆటో సంఘాల నేతలు

వరద ముంపునకు గురైన ఆటోలకు రూ. 25 వేలు నష్టపరిహారం చెల్లించాలి

● సిటీ ఆటో సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీ

అజిత్‌సింగ్‌నగర్, సెప్టెంబరు 23 : బుడమేరు వరదలో ముంపునకు గురైన ఆటోలకు రూ. 25 వేలు నష్టపరిహారం చెల్లించాలని సిటీ ఆటో సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు ఎమ్మెల్యే బొండా ఉమాకు అజిత్‌సింగ్‌నగర్‌లోని టీడీపీ సెంట్రల్ కార్యాలయంలో సోమవారం వినతిపత్రాన్ని అందజేశారు. ఒక్కో ఆటో రిపేర్‌కు రూ. 15 వేల నుంచి రూ. 40 వేలు ఖర్చు అవుతోందన్నారు. ఫుల్ బీమా ఉన్న ఆటోలకు ఫుల్ ఇన్సూరెన్స్ క్లెయిం చేయాలని, థర్డ్ పార్టీ ఇన్సూరెన్స్‌లకు రూ. 20 వేలు చెల్లించాలని కోరారు. ఆటో ఫైనాన్స్‌లకు ప్రభుత్వం మూడు నెలలు మారిటోరియం ఇవ్వాలని, ఎన్యూమరేషన్ చేయని ఆటోలకు తక్షణమే చేయాలని తదితర డిమాండ్లు పరిష్కరించాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. ఎమ్మెల్యే బొండా ఉమాకు వినతిపత్రం అందజేసిన వారిలో సిటీ ఆటో వర్కర్స్ యూనియన్ సీఐటీయూ ప్రధాన కార్యదర్శి కె. దుర్గారావు, ప్రగతిశీల ఆటో కార్మిక సంఘం ఐఎఫ్‌టీయూ అధ్యక్షుడు దాది శ్రీనివాసరావు, టీఎన్‌టీయూసీ కార్మిక సంఘాల సెంట్రల్ సిటీ అధ్యక్షుడు గరిమెళ్ల చిన్నా, ఏఐసీటీయూ జిల్లా నాయకులు ఈశ్వర్, కనకారావు, హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

'ఇది మంచి ప్రభుత్వం' కరపత్రాల పంపిణీ



కరపత్రాలు పంపిణీ చేస్తున్న టీడీపీ నేతలు

రాణిగారితోట, సెప్టెంబరు 23: 100రోజులు కూటమి ప్రభుత్వం పై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారని 18వ డివిజన్ టీడీపీ అధ్యక్షుడు వేముల దుర్గారావు అన్నారు. డివిజన్‌లో సోమవారం రాష్ట్ర పార్టీ, ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ ఆదేశాలతో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించి ప్రతి ఇంటికి వెళ్లి 100రోజుల కూటమి ప్రభుత్వం చేసిన అభివృద్ధితో పాటు పథకాలను వివరించి ఇది మంచి ప్రభుత్వం కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అడ్మిన్ ఉమా, పగడాల వెంకటేశ్వరరెడ్డి, దుర్గ, దుర్గమ్మ తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో పడాల గంగాధర్

100 రోజుల పాలన సక్సెస్

మాచవరం, సెప్టెంబరు 23 : ఎన్డీయే కూటమి ప్రభుత్వం 100 రోజుల పాలన సక్సెస్ అని 6వ డివిజన్ టీడీపీ అధ్యక్షుడు పడాల గంగాధర్ అన్నారు. ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం డివిజన్‌లో సోమవారం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆయన ఇంటింటికి వెళ్లి సీఎం చంద్రబాబు 100 రోజుల పాలనలో చేసిన సంక్షేమాన్ని స్థానికులకు వివరించారు. అనంతరం ఇంటింటికి ఇది మంచి ప్రభుత్వం స్టిక్కర్లను అంటించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ ఇన్‌చార్జ్ గుమ్మడి గురుప్రసాద్, నేతలు నాగమోతు రాజా, కరుణ, పురుషోత్తం, దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.



నిత్యావసరాలు పంపిణీ చేస్తున్న రవికుమార్, సలోమి, దుప్పట్లు, దుస్తులు పంపిణీ చేస్తున్న జలీల్‌ఖాన్, బాలస్వామి, కారుణ్య హెల్పింగ్ హ్యాండ్స్ వితరణ

బాధితులకు నిత్యావసరాలు, దుస్తుల పంపిణీ

ధర్నాచౌక్, సెప్టెంబరు 23: బుడమేరు వరద కారణంగా నష్టపోయిన ఫొటోగ్రాఫర్లు, వీడియోగ్రాఫర్లకు అండగా ఉంటామని విజయవాడ ప్రొఫెషనల్ ఫొటోగ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు కమ్మిలి రవికుమార్ హామీ ఇచ్చారు. బాధితులకు గాంధీనగర్‌లోని అసోసియేషన్ కార్యాలయంలో సోమవారం నిత్యావసర సరుకులు, వస్తువులు పంపిణీ చేశారు. కార్యవర్గ సభ్యులతో కలిసి క్షేత్రస్థాయిలో విచారించి బాధితులకు తగిన సహాయం అందిస్తామన్నారు. వీపీపీడబ్ల్యూ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు, రాష్ట్ర, నగర అసోసియేషన్ సభ్యులు, ఏపీ ఫొటో అకాడమీ ప్రధాన కార్యదర్శి కే.సుధాకర్‌రెడ్డి, దాతలు తదితర ఫొటోగ్రాఫర్లు పాల్గొన్నారు.

దుప్పట్లు పంపిణీ

భవానీపురం : వరదల వలన నష్టపోయిన ఊర్మిళానగర్‌లోని 150 మందికి దుప్పట్లు, బిస్కెట్లను పశ్చిమ మాజీ ఎమ్మెల్యే జలీల్‌ఖాన్ సోమవారం పంపిణీ చేశారు. కృషి విద్యానికేతన్ నిర్వాహకులు సమకూర్చిన దుప్పట్లు, టీడీపీ పార్లమెంట్ వాణిజ్య విభాగం ఆర్గనైజింగ్ సెక్రటరీ ఇందుకూరి యువరాజ్ సమకూర్చిన బిస్కెట్లను జలీల్‌ఖాన్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఐ దుర్గాప్రసాద్‌శ్, ఆర్ నవీన్, సిద్ధార్థ, ఎన్.నవీన్, బి. వెంకటేష్‌లు పాల్గొన్నారు.

బొమ్మసాని దాతృత్వం

ఊర్మిళానగర్‌లోని 60 మంది పేద కుటుంబాలకు టీడీపీ సీనియర్ నాయకుడు బొమ్మసాని సుబ్బారావు నిత్యావసరాలు, దుప్పట్లు, వస్త్రాలను అందజేయడంపై స్థానిక టీడీపీ నాయకురాలు పువ్వుల సలోమి కృతజ్ఞతలు తెలిపారు. బొమ్మసాని అందజేసిన కిట్లను సలోమి సోమవారం స్థానిక కుటుంబాలకు పంపిణీ చేశారు.

బాధితులకు దుస్తుల పంపిణీ

గవర్నర్‌పేట: బాధిత కుటుంబాలకు సోమవారం 23వ డివిజన్ కార్పొరేటర్ ఎన్. బాలస్వామి ఆధ్వర్యంలో దుస్తులు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. సూర్యారావు పేటలోని టీడీపీ డివిజన్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో మహిళలకు చీరలు, పురుషులకు లుంగీలు, టవల్స్, దుప్పట్లు అందజేశారు. కార్యక్రమంలో స్థానిక నేతలు దుర్గారావు, స్వామినాయుడు, శ్రీను పాల్గొన్నారు.

కారుణ్య హెల్పింగ్ హ్యాండ్స్ ఫౌండేషన్ వితరణ

వన్‌టౌన్: కండ్రిక, పాయకాపురం, సింగ్‌నగర్, రాజీవ్‌నగర్, రాజరాజేశ్వరిపేటలలోని వరద బాధితులకు కారుణ్య హెల్పింగ్ హ్యాండ్స్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు గడ్డం వి జయరాజు, ఫౌండేషన్ సభ్యులు నిత్యావసరాలు, వంటసామాగ్రి, పాత్రలు, తదితరాలను పంపిణీ చేశారు. దాదాపు 100 కుటుంబాలకు వీటిని పంపిణీ చేశారు.

వరద బాధిత ఉద్యోగులకు డీఈవో సహాయం

వియవాడ, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల విజయవాడను అతలాకుతలం చేసిన బుడమేరు వరదల్లో లక్షలాది మంది సర్వం కోల్పోయారు. అన్ని వర్గాల వారు ఈ వరదలకు బాధితులయ్యారు. జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో పనిచేస్తున్న ఉద్యోగులు బాధితులయ్యారు. వారికి డీఈవో సుబ్బారావు, కార్యాలయ సిబ్బంది ఆర్థిక సహాయం చేశారు. ఈ నగదును డీఈవో కార్యాలయంలో సోమవారం అందజేశారు.



స్వచ్ఛతా హి సేవ కార్యక్రమాన్ని జెండా ఊపి ప్రారంభించిన కార్పొరేటర్ చెన్నుపాటి ఉషారాణి

ప్రజల భాగస్వామ్యంతో స్వచ్ఛతా హి సేవ

● కార్పొరేటర్ చెన్నుపాటి ఉషారాణి

భారతీనగర్, సెప్టెంబరు 23: 8వ డివిజన్‌లోని పిన్నమనేని పాలీ క్లినిక్ రోడ్లో సోమవారం ఏర్పాటు చేసిన స్వచ్ఛతా హి సేవ కార్యక్రమాన్ని స్థానిక కార్పొరేటర్ చెన్నుపాటి ఉషారాణి జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో భాగంగా కలరా హాస్పిటల్ షేక్ రాజా రోడ్లో, సిండికేట్ కాలనీ తదితర ప్రాంతాల్లో స్వచ్ఛత, ప్లాస్టిక్ రహిత సమాజం, పబ్లిక్ టాయిలెట్లు పరిశుభ్రం తదితర అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో ఆర్కే పబ్లిక్ స్కూల్ విద్యార్థులు, సిద్ధార్థ కాలేజీ విద్యార్థులు పాల్గొన్నారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో 20 మందికి జరిమానా

విజయవాడ, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి) : మద్యం మత్తులో వాహనాలు నడుపుతున్న 20 మందికి కోర్టు జరిమానాలు విధించింది. మూడో ట్రాఫిక్ స్టేషన్ పోలీసులు మొత్తం 20 మంది రైల్వే కోర్టులో సోమవారం హాజరుపరిచారు. ఒక్కొక్కరికి రూ.10వేల చొప్పున జరిమానా విధిస్తూ న్యాయాధికారి శర్మ తీర్పును ఇచ్చారు.

ఖాళీ ఉద్యోగాలపై శ్వేతపత్రం విడుదల చేయాలి

ఏఐవైఎఫ్ రాష్ట్ర నేతలు


ధర్నాచౌక్, సెప్టెంబరు 23: రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాలపై శ్వేతపత్రం విడుదల చేయాలని అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు పరుచూరి రాజేంద్రబాబు, నక్కి. లెనిన్‌బాబు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక దాసరిభవన్‌లో సోమవారం నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో వారు మాట్లాడారు. విశాఖ పరిశ్రమ పరిరక్షణకు అక్టోబరు ఒకటో తేదీన విద్యార్థి, యువజన సంఘాల ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా నిరసన దీక్షలు చేపట్టనున్నట్టు ప్రకటించారు. రాష్ట్ర ఆఫీస్ బేరర్ ఎంవీ. సుబ్బారావు, జిల్లా అధ్యక్షుడు లంకా గోవిందరాజులు, లంకే సాయి, రాజీవ్, సింగంశెట్టి మోహన్ ప్రసాద్, ఏఐఎస్ఎఫ్ జిల్లా కన్వీనర్ కారేపు కార్తీక్ పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంతోనే స్వర్ణాంధ్ర-2047 సాధ్యం



భవానీపురం, సెప్టెంబరు 23 : ఎన్డీయే ప్రభుత్వంతోనే స్వర్ణాంధ్ర-2047 సాధ్యమవుతుందని, సీఎం చంద్రబాబు ఆధ్వర్యంలోనే రాష్ట్రం అభివృద్ధిలో కొత్త పుంతలు తొక్కుతుందని, రానున్న కాలలో దేశంలోనే రాష్ట్రం నెంబర్ వన్ నిలవడం ఖాయమని 45వ డివిజన్ టీడీపీ కార్పొరేటర్ మైలవరపు మాధురి లావణ్య అన్నారు. డివిజన్ పరిధిలో కబేళా వద్ద 135 నెంబర్ సచివాలయంలో జరిగిన కార్యక్రమంలో సోమవారం ఆమె స్వర్ణాంధ్ర లక్ష్యాలను ప్రజలకు కూలంకషంగా వివరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకుడు మైలవరపు కృష్ణ, వీఎంసీ వాటర్ వర్క్సు ఏఈ అహ్మద్, డ్వాక్రా గ్రూపుల అధికారి రాజేష్‌లు పాల్గొన్నారు.

ఇంకో 75 రోజుల్లో పుష్ప రూల్



'పుష్ప ద రూల్'.. భారతీయ సినీపరిశ్రమ ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్న సినిమా ఇది. అల్లు అర్జున్ నటిస్తున్న ఈ ప్రతిష్ఠాత్మక చిత్రం మరో 75 రోజుల్లో అంటే డిసెంబర్ 6న విడుదల కానుంది. అంటే పుష్ప రూల్‌కు కౌంట్ డౌన్ మొదలైందన్నమాట. అల్లు అర్జున్ నటన కోసం, దర్శకుడు సుకుమార్ టేకింగ్, మేకింగ్ కోసం అంతా ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఈ చిత్రం షూటింగ్ ప్రస్తుతం చివరి దశలో ఉంది. మరోవైపు నిర్మాణానంతర కార్యక్రమాలు శరవేగంగా జరుగుతున్నాయి. కంటెంట్ పరంగానే కాకుండా సాంకేతికంగా కూడా ఈ సినిమా అత్యున్నత స్థాయిలో ఉంటుందని నిర్మాతలు నవీన్ యర్నేని, రవిశంకర్ చెప్పారు. ఇప్పటికే విడుదలైన రెండు పాటలకు, టీజర్‌కు అద్భుతమైన రెస్పాన్స్ వచ్చిందనీ, ఇక వచ్చే ప్రతి ప్రమోషనల్ కంటెంట్ అదిరిపోయే రీతిలో ఉంటుందని వారు తెలిపారు. రశ్మిక కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రంలో ఫహాద్ ఫాజిల్ కీలక పాత్ర పోషిస్తున్నారు.

టిక్కెట్ ధర పెంపునకు ప్రభుత్వ అనుమతి



జూనియర్ ఎన్టీఆర్, జాన్వీ కపూర్ జంటగా నటిస్తున్న దేవర సినిమా ఈ నెల 27న ప్రపంచ వ్యాప్తంగా విడుదల కానుంది. ఈ నేపథ్యంలో తెలంగాణలో దేవర సినిమా టిక్కెట్ల ధరలు పెంచేందుకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతించింది. అంతేకాదు మిడ్ నైట్ షోలకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. మిడ్ నైట్ షోలు ఆడించేందుకు 29 థియేటర్లకు అనుమతించింది. ఈ మేరకు హోం శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి రవిగుప్తా సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. సినిమా రిలీజ్ రోజున ఆరు షోలు ఆడించేందుకు థియేటర్లకు అనుమతి ఇచ్చారు. మరుసటి రోజు నుంచి అక్టోబరు 6 వరకు రోజుకు 5 షోలు ఆడించుకునే వెసులు బాటు కల్పించారు. తొలిరోజు టిక్కెట్ ధరలను రూ. 100 పెంచుకునేందుకు అనుమతించారు. సింగిల్ స్క్రీన్‌లలో టిక్కెట్‌పై రూ. 25, మల్టీప్లెక్స్‌లో రూ. 50 పెంచుకునే అవకాశం కల్పించారు. ఆంధ్రప్రదేశ్‌లోనూ ఈ సినిమాకు టికెట్ రేటు పెంచే సదుపాయం అక్కడి ప్రభుత్వం కల్పించిన సంగతి విదితమే.

అమెరికా వెళ్లిన ఎన్టీఆర్

జూనియర్ ఎన్టీఆర్ తన సతీమణి ప్రణతీతో కలసి అమెరికా బయలుదేరారు. లాస్‌ఏంజిల్స్‌లోని బియాండ్‌ఫెస్ట్‌లో ఈ నెల 26 సాయంత్రం జరిగే దేవర స్క్రీనింగ్‌కి హాజరు కానున్నారు. అలాగే అక్కడ కొన్ని మీడియా సంస్థలకు ఇంటర్వ్యూలు ఇవ్వనున్నారు.




మహేశ్‌బాబు, నమ్రత శిరోద్కర్ సోమవారం తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఆయన నివాసంలో కలిశారు. వరద బాధితుల సహాయార్థం ప్రకటించిన రూ.50 లక్షల చెక్కును సీఎంకు అందజేశారు. అలాగే ఎ.ఎమ్.బి తరఫున మరో రూ. 10లక్షల చెక్కును కూడా మహేశ్‌బాబు అందజేశారు

సెట్‌లో దర్శకుడి బర్త్ డే



సిద్ధు జొన్నలగడ్డ హీరోగా బొమ్మరిల్లు భాస్కర్ దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం 'జాక్'. 'కొంచెం క్రాక్' అనేది ట్యాగ్ లైన్. సీనియర్ ప్రొడ్యూసర్ బి.వి.ఎస్.ఎన్. ప్రసాద్ నిర్మిస్తున్న ఈ చిత్రం షూటింగ్ ప్రస్తుతం నేపాల్‌లో జరుగుతోంది. ఇప్పటికి ఎనభై శాతం చిత్రం పూర్తయిందనీ, ఫ్రెష్ కామెడీతో లాఫింగ్ రైడ్‌లా సినిమా ఉంటుందని నిర్మాత చెప్పారు. సోమవారం దర్శకుడు భాస్కర్ పుట్టినరోజు కావడంతో సెట్‌లో సెలబ్రేట్ చేశారు. ప్రకాశ్‌రాజ్, హీరోయిన్ వైష్ణవి తదితరులు కూడా పాల్గొన్నారు.

చారిత్రక యోధుడి పాత్రలో తొలిసారి!



ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, పవర్‌స్టార్ పవన్‌కల్యాణ్ మళ్లీ ముఖానికి మేకప్ వేసుకుని కెమెరా ముందుకు వచ్చారు. ఆయన తొలిసారిగా చారిత్రక యోధుడి పాత్ర పోషిస్తున్న 'హరి హర వీరమల్లు' సినిమా తాజా షెడ్యూల్ సోమవారం ఉదయం విజయవాడలో మొదలైంది. కళా దర్శకుడు తోట తరణి రూపొందించిన భారీ సెట్‌లో యుద్ధ సన్నివేశాన్ని దర్శకుడు జ్యోతికృష్ణ చిత్రీకరిస్తున్నారు. హాలీవుడ్ యాక్షన్ డైరెక్టర్ నిక్ పావెల్ సారథ్యంలో జరుగుతున్న ఈ చిత్రీకరణలో నాజర్, రఘుబాబు, అయ్యప్ప పి.శర్మ, సునీల్ తదితరులతో పాటు ఫైటర్లు, జూనియర్ ఆర్టిస్టులు పెద్ద సంఖ్యలో పాల్గొంటున్నారు. నిధి అగర్వాల్ చిత్ర కథానాయిక కాగా, బాలీవుడ్ నటులు బాబీ డియోల్, అనుపమ్ ఖేర్ కీలక పాత్రలు పోషిస్తున్నారు.వచ్చే ఏడాది మార్చి 28న 'హరిహర వీరమల్లు' పార్ట్ వన్ విడుదలవుతుందని వెల్లడిస్తూ ఓ పోస్టర్‌ను విడుదల చేశారు. పవన్‌కల్యాణ్‌ను సరికొత్తగా చూడబోతున్నామని ఈ పోస్టర్‌తో హామీ ఇచ్చారు దర్శకనిర్మాతలు. తెలుగు, తమిళ, మలయాళ, కన్నడ, హిందీ భాషల్లో విడుదలయ్యే ఈ చిత్రాన్ని ఎ.ఎం.రత్నం సమర్పణలో ఎ.దయాకరరావు చెప్పారు,

ఆ వీధికి నాన్న పేరు పెట్టండి

స్టాలిన్‌కు ఎస్పీ చరణ్ వినతి



గానగంధర్వుడు, సినీ నేపథ్యగాయకుడు దివంగత ఎస్.పి.బాలసుబ్రమణ్యం నివసించిన కామ్‌దార్‌నగర్‌కు ఆయన పేరును పెట్టాలని ఎస్పీబీ తనయుడు, సినీ నేపథ్యగాయకుడు ఎస్పీ .చరణ్ కోరారు. ఈ మేరకు ఆయన సోమవారం చెన్నై సచివాలయం ప్రాంగణంలో ఉన్న ముఖ్యమంత్రి స్టాలిన్ సెల్‌లో వినతిపత్రం సమర్పించారు. ఇందులో.. 'సంగీత ప్రపంచంలో తన మధురమైన గాత్రంతో కోట్లాదిమంది అభిమానుల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన గాయకుడు ఎస్.పి.బాలసుబ్రహ్మణ్యం జీవించివున్న సమయంలో స్థానిక నుంగంబాక్కంలోని కామ్‌దార్‌నగర్‌లో తన కుటుంబ సభ్యులతో కలిసివుండేవారు. ప్రస్తుతం ఆయన భౌతికంగా లేకపోవడంతో ఆయనను స్మరించుకునేలా ఎస్పీబీ నివసించిన కామ్‌దార్‌నగర్‌కు 'ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం నగర్ లేదా ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం వీధి'గా నామకరణం చేయాలని కోరుతున్నాను. ఈ వినతిని పెద్దమనసుతో అంగీకరించి, తమతో పాటు కోట్లాదిమంది ఎస్పీబీ అభిమానుల కోరికను తీర్చాలని కోరుతున్నాం' అని ఎస్పీ చరణ్ కోరారు. కాగా, ఈ నెల 25వ తేదీన ఎస్పీబీ నాలుగో వర్ధంతి వేడుకలు జరగనున్న విషయం తెల్సిందే.

- చెన్నై(ఆంధ్రజ్యోతి)

ఆస్కార్‌కి వెళ్తున్న లాపతా లేడీస్

వచ్చే ఏడాది జరిగే ఆస్కార్ అవార్డుల వేడుకకు ఇండియా నుంచి వెళ్లే సినిమా ఖరారైపోయింది. ఆ చిత్రమే.. బాలీవుడ్ నటుడు అమీర్ ఖాన్ మాజీ భార్య.. 'ధోబీ ఘాట్' ఫేమ్ కిరణ్ రావు దర్శకత్వం వహించిన 'లాపతా లేడీస్'. 2025 సంవత్సరానికిగాను ఉత్తమ విదేశీ చిత్రాల జాబితాలో మన దేశం నుంచి అధికారిక ఎంట్రీగా 'లాపతా లేడీస్' చిత్రాన్ని నామినేట్ చేస్తున్నట్టు ఫిల్మ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎఫ్ఎఫ్ఐ) ఛైర్మన్ జహ్నూ బారువా ఇతర నిర్వాహకులు రవి కొట్టార్కర, సికళ్యాణ్ తదితరులతో కలసి నిర్వహించిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు. ఈ ఏడాది ఆస్కార్ నామినేషన్ల కోసం తెలుగు, తమిళం, మలయాళం, మరాఠీ, హిందీ భాషలకు చెందిన 29 చిత్రాలను 13 మందితో కూడిన కమిటీ సభ్యులు షార్ట్‌లిస్ట్‌చేయగా, అందులో 'లాపతా లేడీస్'ను అధికారిక ఎంట్రీగా సభ్యులంతా ఎంపిక చేసినట్టు జహ్నూ బారువా వెల్లడించారు. కాగా, మార్చి ఒకటిన విడుదలైన ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద మంచి విజయాన్ని సొంతం చేసుకుంది. ఇప్పటికే పలు ప్రతిష్ఠాత్మక అవార్డులనూ పొందింది.



అలాగే, భారతదేశ అత్యున్నత న్యాయస్థానం 75వ వార్షికోత్సవాల్లోనూ ఆ చిత్రాన్ని ప్రదర్శించడం విశేషం. కొత్తగా పెళ్లైన ఓ గ్రామీణ జంట జీవితాల్లో జరిగిన అనూహ్య సంఘటనల ఆధారంగా ఈ సినిమాను తెరకెక్కించారు. వారు ఎదుర్కొన్న అనేక సమస్యలను ఇందులో మనసుకు హత్తుకునేలా తెరకెక్కించడమే ఈ చిత్ర విజయానికి కారణం. ఈ సినిమాతో పాటు తెలుగు చిత్రసీమ నుంచి 'కల్కి 2898 ఏ.డీ', 'హను-మాన్', 'మంగళవారం' చిత్రాలు.. బాలీవుడ్ నుంచి 'యానిమల్', 'కిల్', 'శ్రీకాంత్', 'ఆర్టికల్ 370', 'మైదాన్'.. మలయాళం నుంచి నేషనల్ అవార్డ్ విన్నర్ "ఆట్టమ్', 'ఆడు జీవితమ్', 'ఆల్ వియ్ ఇమాజిన్ ఆజ్ లైట్'.. తమిళ్ నుంచి 'వాజీ', 'మహరాజా' వంటి 29 చిత్రాలు పోటీ పడ్డాయి.

నమ్మకం నిజమైంది

'లాపతా లేడీస్' ఆస్కార్‌కు ఎంపికైనందుకు దర్శకురాలు కిరణ్ రావు సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ "ఈ చిత్రం ఆస్కార్‌కు నామినేట్ అవుతుందని ఇంతకు ముందే ఓ ఇంటర్వ్యూలో చెప్పాను. నా నమ్మకం నిజమైంది. సినిమా కోసం అహర్నిశలు శ్రమించిన మా చిత్రబృందానికి దక్కిన గుర్తింపు ఇది. భారత్‌లో ఈ సినిమాను ఎలా ఆదరించారో.. అంతర్జాతీయంగానూ అంతే ఆదరిస్తారని ఆశిస్తున్నాను" అని అన్నారు.




అన్నయ్య హగ్ చేసుకున్నాడు



తమిళ నటుడు కార్తీ నటించిన తాజా చిత్రం 'సత్యమ్ సుందరమ్'. '96' ఫేమ్ సి.ప్రేమ్‌కుమార్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమాను సూర్య, జ్యోతిక నిర్మించారు. అరవింద స్వామి కీలక పాత్ర పోషించారు. ఈ నెల 28న సినిమా విడుదలవుతోన్న సందర్భంగా హీరో కార్తీ మీడియాతో ముచ్చటించారు.

"ఈ సినిమా స్క్రిప్ట్‌ను చదవగానే నా కళ్ల వెంట ఆనందభాష్పాలు వచ్చాయి. అద్భుతమైన మానవ విలువలు ఉన్న కథ ఇది. ఈ కథను మొదట దర్శకుడు నవలగా తీసుకువద్దామని రాసుకున్నారు. అదృష్టవశాత్తు ఇది సినిమాగా తెరకెక్కింది. ఇందులో నాది అమాయకత్వం.. చలాకీతనం కలగలసిన క్యారెక్టర్. సున్నితమైన భావోద్వేగాలతో నిండిన ఫీల్ గుడ్ చిత్రమిది. నా పాత్ర, అరవింద స్వామి పాత్ర గుర్తుండిపోతాయి. '96' చిత్రంలాగే.. ఈ సినిమా కథ కూడా ఒక్క రాత్రిలోనే జరుగుతుంది. గ్రామీణ జీవితాన్ని.. మన సంప్రదాయాల్ని.. మూలాల్ని తిరిగి గుర్తుచేసేలా ఉండే ఈ సినిమా ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని ఇస్తుంది. గోవింద్ వసంత్ అందించిన మ్యూజిక్ చాలా వినసొంపుగా ఉంటుంది. ప్రతీ పాట అర్థవంతంగా ఉండి హృదయాల్ని కదిలిస్తుంది. ప్రేక్షకులకు రియల్ ఎమోషన్స్‌ను పరిచయం చేసే ఇలాంటి చిత్రాలు రావడం చాలా అరుదు. ఈ సినిమాను చూసిన అన్నయ్య సూర్య చేసుకుని హగ్ చేసుకుని ప్రశంసించారు. నా మొదటి సినిమా తర్వాత ఇన్నేళ్లకు అన్నయ్య అంతలా ఎక్సైట్ అయిన చిత్రమిదే" అని చెప్పారు.



ఇన్ ప్రోగ్రెస్

సంక్రాంతి బరిలో మరో సినిమా



వచ్చే సంక్రాంతికి విడుదలయ్యే సినిమాల జాబితాలో మరో పేరు చేరింది. సందీప్‌కిషన్ హీరోగా నటిస్తున్న 30వ సినిమా అది. ఈ చిత్రానికి 'మజాకా' అనే పేరు నిర్ణయించారు. త్రినాథరావు నక్కిన దర్శకత్వంలో రాజేశ్ దండా ఈ సినిమా నిర్మిస్తున్నారు. ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతున్న ఈ చిత్రం టైటిల్, ఫస్ట్ లుక్ పోస్టర్, రిలీజ్ టైమ్ ఒకేసారి విడుదల చేసి ప్రమోషన్స్ ప్రారంభించారు నిర్మాత.

నీ జతగా



ప్రముఖ రచయిత పరుచూరి వెంకటేశ్వరరావు మనవడు సుదర్శన్ హీరోగా నటిస్తున్న 'మిస్టర్ సెలెబ్రిటీ' చిత్రంలోని మెలోడీ సాంగ్‌ను హీరో గోపీచంద్ విడుదల చేసి కొత్త హీరోకు, యూనిట్‌కు అభినందనలు తెలిపారు. 'నీ జతగా' అంటూ సాగే ఈ పాటను గణేశా రచించగా, జావెద్ అలీ పాడారు. వినోద్ యాజమాన్య సంగీత దర్శకుడు. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకున్న ఈ చిత్రం త్వరలో ప్రేక్షకుల ముందుకు రానుంది. చందిన రవికిశోర్ దర్శకత్వంలో చిన్న రెడ్డయ్య, ఎన్.పాండురంగారావు ఈ సినిమాను నిర్మించారు.

కుతంత్రమే ఆమె మంత్రం



విష్ణు మంచు హీరోగా డాక్టర్ మోహన్‌బాబు నిర్మిస్తున్న 'కన్నప్ప' చిత్రం నుంచి నటి ఐశ్వర్య పోషిస్తున్న మారెమ్మ పాత్రకు సంబంధించిన లుక్‌ను సోమవారం విడుదల చేశారు. అందరినీ భయపెట్టే విధంగా ఈ లుక్ ఉంది. 'అడవిని పీడించే అరాచకం.. మారెమ్మ, కుతంత్రమే ఆమె మంత్రం' అంటూ రిలీజ్ చేసిన పోస్టర్ అందరినీ ఆకట్టుకునే విధంగా ఉంది. డిసెంబర్‌లో విడుదలయ్యే ఈ పాన్ ఇండియా మూవీకి ముఖేశ్‌కుమార్ సింగ్ దర్శకుడు.

ఏఐ మ్యూజిక్‌తో 'ఐ వాంట్ లవ్'



డైరెక్టర్ ఆర్జీవీ బ్యానర్‌పై గిరి కృష్ణకమల్ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం 'శారీ'. ఈ పాన్ ఇండియా చిత్రాన్ని రవి వర్మ నిర్మిస్తున్నారు. సత్య యాదు, ఆరాధ్య దేవి హీరోహీరోయిన్లుగా నటిస్తున్న ఈ చిత్రంలోని మొదటి గీతం 'ఐ వాంట్ లవ్'ను మేకర్స్ విడుదల చేశారు. ఈ సందర్భంగా దర్శకుడు రామ్‌గోపాల్ వర్మ మాట్లాడుతూ "ఈ సినిమాలోని మొత్తం పాటలను ఏ.ఐను ఉపయోగించే కంపోజ్ చేశాము. నేపథ్య సంగీతానికి కూడా ఏ.ఐతోనే ముందుకు వెళ్లాం. ఇకపై 'ఆర్జీవీ మ్యూజిక్ డెన్' నుంచి వచ్చే ప్రతీ పాటలో ఏ.ఐ యాప్స్‌తో తయారు చేసిన సంగీతం మాత్రమే ఉంటుంది" అని చెప్పారు.

దిక్సూచి DIKSUCHI

ఐఐటీ తిరుపతిలో ఎంఎస్(రీసెర్చ్), పీహెచ్‌డీ



తిరుపతిలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఐఐటీ తిరుపతి)- ఎంఎస్(రీసెర్చ్), పీహెచ్‌డీ కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. రిటెన్ టెస్ట్/ఇంటర్వ్యూ ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. రెగ్యులర్(ఫుల్ టైమ్ స్కాలర్స్), ఎక్స్‌టర్నల్, పార్ట్ టైమ్ కేటగిరీల్లో అడ్మిషన్స్ ఇస్తారు. రెగ్యులర్ విధానంలో ఎంపికైన అభ్యర్థులకు వివిధ స్కీమ్‌ల ద్వారా అసిస్టెంట్‌షిప్ లభిస్తుంది. ఎక్స్‌టర్నల్, పార్ట్ టైమ్ విధానాల్లో చేరాలనుకునే అభ్యర్థులు ఉద్యోగులై ఉండాలి. కనీసం రెండేళ్ల అనుభవం; రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ సంస్థలు/జాతీయ స్థాయి ల్యాబొరేటరీల నుంచి స్పాన్సర్‌షిప్ తప్పనిసరి.

ఎంఎస్(రీసెర్చ్)

విభాగాలు: కెమికల్ ఇంజనీరింగ్, సివిల్ అండ్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీరింగ్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్, మెకానికల్ ఇంజనీరింగ్

అర్హత: ఇంజనీరింగ్/టెక్నాలజీ బ్యాచిలర్స్ డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. లేదా సంబంధిత విభాగంలో మాస్టర్స్ డిగ్రీ(ఎమ్మెస్సీ/ఎంసీఏ)తో పాటు గేట్ వ్యాలిడ్ స్కోర్ ఉండాలి. ఐఐటీల నుంచి కనీసం 8 సీజీపీఏతో బీఈ/బీటెక్ పూర్తిచేసినవారు కూడా అర్హులే.

పీహెచ్‌డీ


విభాగాలు: కెమికల్ ఇంజనీరింగ్, కెమిస్ట్రీ, సివిల్ అండ్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీరింగ్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్, హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్, మేథమెటిక్స్ అండ్ స్టాటిస్టిక్స్, మెకానికల్ ఇంజనీరింగ్, ఫిజిక్స్

అర్హత: ఇంజనీరింగ్ విభాగాలకు ఎంఈ/ఎంటెక్/ఎంఎస్ రీసెర్చ్ లేదా ఇంజనీరింగ్‌లో ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్ మాస్టర్స్ లేదా డ్యూయెల్ డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. కనీసం 8 సీజీపీఏతో ఐఐటీ నుంచి(జామ్ ద్వారా ప్రవేశం పొంది ఉండాలి) రెండేళ్ల ఎమ్మెస్సీ; సీఎఫ్‌టీఐ సంస్థ నుంచి బీఎస్+ఎంఎ స్(ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్) ఉత్తీర్ణులైన వారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. సైన్సెస్ విభాగాలకు సెంట్రల్ ఫండెడ్ టెక్నికల్ ఇన్‌స్టిట్యూట్ నుంచి కనీసం 8 సీజీపీఏతో బీఎస్/బీఈ/బీటెక్ ఉత్తీర్ణులై ఉండాలి. గేట్ వ్యాలిడ్ స్కోర్ ఉండాలి.

హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్ విభాగాలకు సంబంధిత సబ్జెక్టులో మాస్టర్స్ డిగ్రీ/డ్యూయెల్ డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. యూజీసీ నెట్ లేదా జేఆర్ఎఫ్/గేట్ స్కోర్ ఉండాలి.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** జనరల్, ఈడబ్ల్యూఎస్, ఓబీసీ అభ్యర్థులకు రూ.400; మహిళలు, దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.200
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** అక్టోబరు 14
- **రిటెన్ టెస్ట్/ఇంటర్వ్యూలు:** నవంబరు 5 నుంచి 18 వరకు
- **క్యాంపస్ రిపోర్టింగ్:** డిసెంబరు 2
- **వెబ్‌సైట్:** https://iittp.ac.in



పని ఒత్తిడి ప్రాణం తీస్తుందా..?

వ్యక్తిత్వం, స్వభావాలను బట్టి పని ఒత్తిడిని భరించే సామర్థ్యం మారుతూ ఉంటుంది. ఒకే మోతాదు పని, ఇద్దరు వ్యక్తుల మీద భిన్నమైన ప్రభావాన్ని కనబరుస్తుంది. ఒకరు సవాలుగా తీసుకుని, సమర్థంగా పనిని సమయానికి ముగించగలిగితే, ఇంకొకరు ఒత్తిడి, ఆందోళనలకు లోనై ఆలస్యంగా పనిని పూర్తి చేయగలుగుతారు. వ్యక్తిగత సమస్యలు, పని ప్రదేశంలో ఎక్కువ గంటల పాటు గడపడం, సమయానికి ఆహారం తీసుకోలేకపోవడం... ఇలా ఎన్నో అంశాలు పని ఒత్తిడికి తోడవుతూ ఉంటాయి. మరీ ముఖ్యంగా ఎలాగైనా టార్గెట్‌ను అందుకోవాలనే ఆలోచనతో నిద్ర మానుకుని పని చేయడం వల్ల, శరీరం రెట్టింపు ఒత్తిడికి లోనవుతుంది. ఇవన్నీ అంతిమంగా డిప్రెషన్‌కు దారి తీస్తాయి. ఈ కుంగుబాటును ఎవరికి వారు కనిపెట్టలేకపోవడం, కుటుంబసభ్యులు, సహోద్యోగులు పట్టించుకోకపోవడం, సమయానికి అప్రమత్తం అవలేకపోవడం వల్ల, అంతిమంగా పని ఒత్తిడి, ప్రాణాలకు ముప్పుగా పరిణమిస్తుంది.

కారణాలు కోకొల్లలు

చేతిలో ఉద్యోగం పోతే మళ్లీ కొత్త ఉద్యోగం సంపాదించుకోవడం కష్టమైపోతున్న పరిస్థితి కొనసాగుతోంది. దాంతో ఎలాగైనా ఉద్యోగంలో కొనసాగాలనే ఒత్తిడి ప్రతి ఒక్కర్లో ఉంటోంది. మరీ ముఖ్యంగా కొత్తగా ఉద్యోగాల్లో చేరిన వాళ్లు పని ఒత్తిడికి తోడు, కొత్త వర్క్ ప్లేస్‌లో సర్దుకుపోగలగడంలో ఇబ్బందులను కూడా ఎదుర్కొంటూ ఉంటారు. సహోద్యోగుల సహకారం లోపించడం, పోటీతత్వంతో కూడిన వాతావరణం, అస్పష్టతతో కూడిన ఉద్యోగ అంచనాలు, అదనపు బాధ్యతలు, గుర్తింపుకు నోచుకోలేకపోవడం, పెరిగిన ఊరికి, కుటుంబానికి దూరంగా కొత్త ఊళ్లో ఉండవలసిరావడం, కెరీర్‌నూ, వ్యక్తిగత జీవితాన్నీ సమంగా నిర్వహించలేకపోవడం, ఉద్యోగంలో భాగంగా సామర్థ్యానికీ, అనుభవానికీ మించిన పని చేయవలసి రావడం లాంటి ఇబ్బందులన్నీ అప్పటికే ఉన్న పని ఒత్తిడికి తోడవుతూ ఉంటాయి. అయితే కొంతమంది తమలో పెరిగిపోయే ఒత్తిడిని స్వయంగా గ్రహించకపోగా, ఆఫీసు పనిని ఇంట్లో కొనసాగిస్తూ ఒత్తిడిని పెంచుకుంటూ ఉంటారు. ఆఫీసు నుంచి బయటపడినా, మెయిల్స్, వాట్సాప్‌లను చెక్ చేసుకుంటూ, నిరంతరం ఉద్యోగ సంబంధ ఆలోచనలు, పని ప్రణాళికలతోనే రోజంతా గడిపేస్తూ ఉంటారు. ఇలాంటప్పుడు ఒత్తిడి నుంచి స్వాంతన పొందే అవకాశమే ఉండదు.

లక్షణాల మీద కన్నేసి...

ఎంత కష్టపడినా, చేయవలసిన పనుల చిట్టా పెరిగిపోతున్నా, పని నుంచి బ్రేక్ తీసుకున్నప్పటికీ అలసట తగ్గకపోతున్నా, పనిని కొనసాగించలేకపోతున్నా, పని ఒత్తిడితో కుంగుబాటుకు (బర్నవుట్) గురవుతున్నట్టు గ్రహించాలి. ఈ బర్నవుట్ కొన్ని లక్షణాల ద్వారా బయల్పడుతూ ఉంటుంది. నిరాశలో కూరుకుపోవడం, ఇతరులతో డిస్కనెక్ట్ అయిపోవడం, ప్రేరణ, శక్తి లోపించడం, ఇతర పనుల మీద ఆసక్తి కోల్పోవడం లాంటి లక్షణాలు దైనందిన జీవితాన్ని ప్రభావితం చేస్తున్నట్టు గ్రహించిన వెంటనే అప్రమత్తం కావాలి. మరీ ముఖ్యంగా కొన్ని లక్షణాల మీద ఓ కన్నేసి ఉంచాలి. అవేంటంటే...

- పని పట్ల ఆసక్తి సన్నగిల్లడం
- తీవ్రమైన అలసట
- నిద్రాభంగం
- బరువు పెరగడం
- నిరాశ, నిస్సహాయతలు
- మౌనంగా మారిపోవడం
- కోపం, చికాకు పెరగడం
- తీవ్రమైన భావోద్వేగాలు

ఒత్తిడితో, గుండెకు చేటు

పని ఒత్తిడి మానసిక ఆరోగ్యంతో పాటు గుండె ఆరోగ్యాన్నీ దెబ్బతీస్తుంది. కాబట్టి ఒత్తిడితో మొత్తం ఆరోగ్యం మీద పడే ప్రభావం గురించి ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవడం అవసరం. తీవ్రమైన ఒత్తిడి శరీరంలో ఫైట్ ఆర్ ఫ్లైట్ మెకానిజంను ప్రేరేపిస్తుంది. ఫలితంగా గుండె కొట్టుకునే వేగం, రక్తపోటు పెరుగుతాయి. ఇదే పరిస్థితి దీర్ఘకాలం కొనసాగితే, హృద్రోగాలు, జీర్ణసంబంధ రుగ్మతలు తలెత్తుతాయి. ఇమ్యూనిటీ కూడా కుంటుపడుతుంది. ఎక్కువ గంటల పాటు ఒకే చోట కూర్చుని పని చేయడం వల్ల ఊబకాయం, శరీర భంగిమ సమస్యలు కూడా తలెత్తుతాయి. ఎక్కువ పని గంటల వల్ల విశ్రాంతికీ, వ్యాయామానికీ సమయం ఉండకపోవడం, ఇంటి భోజనాలకు బదులుగా జంక్ ఫుడ్‌కు దగ్గరవడం, ఒత్తిడి నుంచి ఉపశమనం కోసం ధూమపానానికి అలవాటు పడడం, నిద్ర కోసం మద్యాన్ని ఆశ్రయించడం లాంటివన్నీ ఆరోగ్య సమస్యలను పెంచుతాయి.

మహిళల మీద ప్రభావం ఎక్కువ



ఉద్యోగ బాధ్యతలతో పాటు కుటుంబ బాధ్యతలు కూడా సమంగా నిర్వహించవలసిన రెట్టింపు ఒత్తిడి మహిళల మీద ఎక్కువగా ఉంటుంది. పైగా నెలసరి సమయంలో తలెత్తే హార్మోన్ల హెచ్చుతగ్గుల ప్రభావం, పని సామర్థ్యాన్ని కుంటుపరచవచ్చు. అలాగే పని ప్రదేశంలో చిన్నా చితకా చివాట్లను సైతం మహిళలు తీవ్రంగా పరిగణించి, మానసికంగా కుంగిపోతూ ఉంటారు. అంచనాలను అందుకోలేక పోయామనే ఆత్మన్యూనతకు లోనయ్యే స్వభావం కూడా మహిళల్లోనే ఎక్కువ. అలాగే ఆఫీసు గందరగోళాన్నంతా ఇంటికి వెంట తెచ్చుకుని, అదే ఆలోచనలతో నిద్రను పాడుచేసుకునే మహిళలూ ఉంటారు. ఇలాంటి వారి మీద ఒత్తిడి, ఆందోళనలు పదింతల ప్రభావాన్ని చూపిస్తాయి.

పరిష్కారాలున్నాయి

మోయలేని బరువును భుజాలకెత్తుకుంటే, ఆ ప్రభావం కచ్చితంగా మనసు, శరీరాల మీద పడుతుంది. ఈ సరళమైన తర్కాన్ని నిర్లక్ష్యం చేసే ఉద్యోగుల, స్వీయ సామర్థ్యాన్ని ఎక్కువగా అంచనా వేసుకుంటూ ఉంటారు. దాంతో సామర్థ్యానికి మించిన పనిని నెత్తిన వేసుకుని, సమయానికి పని పూర్తి చేయలేక ఒత్తిడికి గురవుతూ ఉంటారు. కానీ తమ సామర్థ్యం ఎంతో, ఎంత పనికి పూర్తి న్యాయం చేయగలుగుతారో ఎవరికి వారు తెలుసుకోవాలి. 'నో' చెప్పడానికి వెనకాడి, మొహమాటంకొద్దీ పనిని నెత్తిన వేసుకుని, సతమతమైపోయేవాళ్లూ ఉంటారు. ఇలాంటి వాళ్లు, నేనింత పనిని మాత్రమే చేయలేననీ, ఇంకొకరి సహాయం అవసరమనీ నిర్మొహమాటంగా చెప్పి, పని ఒత్తిడిని తగ్గించుకోవచ్చు. అలాగే అరుదుగా తప్పనిసరి పరిస్థితుల్లోనే రాత్రి పనికి ఒప్పుకోవాలి. రాత్రి ఉద్యోగాలు చేసేవాళ్లు, పగటి వేళ కంటి నిండా నిద్రపోయేలా ప్లాన్ చేసుకోవాలి. భోజన వేళలను కూడా అందుకు తగ్గట్టు సర్దుబాటు చేసుకోవాలి. ధూమపానం, మద్యంతో ఒత్తిడి పెరుగుతుందే తప్ప ఏమాత్రం తగ్గదనే వాస్తవాన్ని గ్రహించాలి. గంటల తరబడి డెస్క్‌లకే అతుక్కుపోకుండా, మధ్యలో లేచి అటూ ఇటూ నడుస్తూ ఉండాలి. నీళ్లు తాగుతూ ఉండాలి.

- **వ్యాయామం:** వ్యాయామం ఒత్తిడిని తగ్గిస్తుంది. కాబట్టి రోజుకు కనీసం అరగంట పాటైనా వ్యాయామం చేయాలి.
- **ధ్యానం:** ధ్యానం, ప్రాణాయామాలతో మనసు నెమ్మదించి, ఒత్తిడి, ఆందోనలు అదుపులోకొస్తాయి.
- **సపోర్ట్:** సహోద్యోగులు, స్నేహితులు, కుటుంబ సభ్యుల తోడ్పాటుతో ఒత్తిడిని తగ్గించుకోవాలి.
- **సరిహద్దులు:** నో చెప్పడం అలవాటు చేసుకోవడంతో పాటు, పని ఒత్తిడిని సమన్వయపరుచుకోవాలి.

డాక్టర్ జ్యోతిర్మయి
సీనియర్ కన్సల్టెంట్ సైకియాట్రిస్ట్,
మనహ క్లినిక్, హైదరాబాద్.



ఐస్ బాత్ మంచిదేనా?

అవగాహన

అథ్లెట్లు, ఫిట్‌నెస్ నిపుణులు, ప్రముఖులు, ఆరోగ్య ప్రయోజనాలను పొందడం కోసం గడ్డకట్టిన నీళ్లలో స్నానం చేస్తున్న సందర్భాలను చూస్తూ ఉంటాం. అయితే ఈ ఐస్ బాత్ నిజంగానే ఆరోగ్యానికి ప్రయోజనం కలిగిస్తుందా?

- **ఏం జరుగుతుంది:** చల్లనీళ్లలో మునగడం వల్ల అకస్మాత్తుగా క్షీణించిన నీటి తాపమానం వల్ల మన రక్తనాళాలు కుంచించుకుపోతాయి. దాంతో శరీర తాపమానాన్ని నిలకడగా ఉంచడం కోసం, ప్రధాన అంతర్గత అవయవాలను కాపాడుకోవడం కోసం, అవయవాల్లోని రక్తం మొత్తం కోర్ దగ్గరకు పరుగులు పెడుతుంది.
- **నొప్పుల తగ్గుదల:** అథ్లెట్లు ఐస్ బాత్స్ తీసుకోడానికి ప్రధాన కారణం ఇదే! ఐస్ బాత్‌తో కండరాల నొప్పులు తగ్గుతాయి. దెబ్బతిన్న కణజాలం తాపమానం తగ్గి రక్తనాళాలు కుంచించుకుపోయి, కండరాల నొప్పులు, వాపులు తగ్గుతాయి. దాంతో తీవ్రమైన వ్యాయామాలు చేసే వాళ్లు, తదనంతర కండర నొప్పుల నుంచి ఉపశమనం పొందడం కోసం ఐస్ బాత్‌ను ఆశ్రయించవచ్చు.
- **కోలుకోవచ్చు:** వ్యాయామ సమయంలో శరీరంలో పేరుకుపోయే లాక్టిక్ యాసిడ్ శరీరం నుంచి బయటకు వెళ్లిపోతుంది. చల్ల నీళ్లలో మునిగి, బయటకు రావడం వల్ల కుంచించుకుపోయి, తిరిగి వ్యాకోచించే రక్తనాళాల ఫలితంగా ఈ ఫ్లషింగ్ మెకానిజం ప్రేరేపితమవుతుంది. దీంతో మెటబాలిక్ వేస్ట్ బయటకు వెళ్లిపోయి కండరాలు త్వరగా కోలుకుంటాయి.
- **వ్యాధినిరోధకశక్తి:** క్రమం తప్పకుండా ఐస్‌బాత్ చేస్తూ ఉంటే, లింఫ్ వ్యవస్థ ప్రేరేపితమై, శరీరంలోని వ్యర్థాలు, విషాలు బయటకు వెళ్లిపోతాయి. చల్లనీళ్లలో మునిగి, బయటకు రావడం వల్ల సంకోచ, వ్యాకోచాలకు గురయ్యే కండరాలతో లింఫ్ ద్రవాలు శరీరమంతా ప్రసరించి, తెల్ల రక్తకణాల ఉత్పత్తిని పెంచుతాయి. ఫలితంగా ఇమ్యూనిటీ పెరుగుతుంది.
- **రక్తప్రసరణ:** ప్రారంభంలో రక్తనాళాలు సంకోచించినా, నీళ్లలో నుంచి బయటకు రాగానే అవి వ్యాకోచిస్తాయి. ఈ ప్రక్రియ, మారిపోయే తాపమానాలకు అలవాటు



పడేలా శరీరాన్ని ప్రోత్సహించి, తద్వారా రక్తప్రసరణను పెంచుతుంది. రక్తప్రసరణ మెరుగవడం వల్ల గుండె ఆరోగ్యం మెరుగు పడుతుంది.

- **మానసిక ఆరోగ్యం:** చల్లనీళ్లతో శరీరంలో ఎండార్ఫిన్లు విడుదలవుతాయి. శరీర సహజసిద్ధ నొప్పి నివారిణులు, మూడ్ ఎలివేటర్లు అయిన ఈ ఎండార్ఫిన్లు విడుదలవడంతో నొప్పులు తగ్గి, మనసు తేలికపడుతుంది.
- **జాగ్రత్తలు:** ఐస్ బాత్స్‌తో ఆరోగ్యకరమైన ప్రయోజనాలు ఉన్నప్పటికీ, చల్లనీటి స్నానాలతో కొన్ని దుష్ప్రయోజనాలు కూడా పొంచి ఉంటాయి. కాబట్టి చల్లనీళ్లలో పరిమిత సమయమే గడుపుతూ, శరీర కోర్ తాపమానం క్షీణించకుండా చూసుకోవాలి. చల్లనీళ్ల ప్రయోజనాలు పొందడం కోసం 10 నుంచి 15 నిమిషాలు చల్లనీళ్లలో మునిగి ఉంటే సరిపోతుంది. చల్లనీళ్లు రక్తపోటును పెంచుతాయి కాబట్టి గుండె జబ్బులున్నవాళ్లు వైద్యుల సలహా మేరకు నడుచుకోవాలి.



ఎంత కష్టపడినా, చేయవలసిన పనుల చిట్టా పెరిగిపోతున్నా, పని నుంచి బ్రేక్ తీసుకున్నప్పటికీ అలసట తగ్గకపోతున్నా, పనిని కొనసాగించలేకపోతున్నా, పని ఒత్తిడితో కుంగుబాటుకు (బర్నవుట్) గురవుతున్నట్టు గ్రహించాలి.

ఆహారం వ్యామోహం

మీకు తెలుసా?

కొన్ని పదార్థాల మీదకు పదే పదే మనసు మళ్లడం, మనం తీసుకుంటున్న ఆహారంలో పోషక లోపానికి సంకేతం. మనందరం సాధారణంగా ఎదుర్కొనే ఏడు రకాల ఫుడ్ క్రేవింగ్స్ వాటికి కారణమైన విటమిన్ లోపాల గురించి తెలుసుకుందాం!

- **చాక్లెట్:** చాక్లెట్లు తినాలనిపిస్తే, మెగ్నీషియం తగ్గిందని అర్థం. కండరాలు, నాడుల పనితీరుకూ, రక్తంలోని చక్కెర నియంత్రణకూ, ఎముకల ఆరోగ్యానికీ మెగ్నీషియం అవసరం. కాబట్టి చాక్లెట్ తినాలనిపించినప్పుడు, మెగ్నీషియం సమృద్ధిగా దొరికే ఆకుకూరలు, నట్స్, సీడ్స్ తింటూ ఉండాలి.
- **తీపి పదార్థాలు:** తీపి తినాలనే యావకు కారణం క్రోమియం లోపం. క్రోమియం, రక్తంలోని చక్కెర మోతాదుల నియంత్రణకు తోడ్పడుతుంది. ఈ ఖనిజ లవణం లోపిస్తే, ఆ లోటును వెంటనే భర్తీ చేసుకోవడం కోసం శరీరం తీపి తినాలనే కోరికను పెంచుతుంది. కాబట్టి క్రోమియం సమృద్ధిగా దొరికే బ్రొకొలి, ద్రాక్ష, బంగాళాదుంపలు, వెల్లుల్లి, లేత మాంసం తింటూ ఉండాలి.
- **ఉప్పు:** మన ఆహారం ద్వారా సరిపడా ఉప్పు అందుతూనే ఉంటుంది. అయినా కొన్నిసార్లు సాల్టీ స్నాక్స్ మీదకు మనసు మళ్లుతూ ఉంటుంది. ఇది సోడియం లోపానికి సూచన. మరీ ముఖ్యంగా ఎక్కువగా చమటను కోల్పోతూ ఉండేవాళ్లు లేదా కొన్ని రకాల మందులను తీసుకుంటున్న వాళ్లలో ఈ లక్షణం సర్వసాధారణం. శరీరంలో ద్రవాలను నిలిపి ఉంచడానికీ, నాడీ పనితీరుకూ సోడియం అవసరం. అయితే ఉప్పు తినాలని అనిపించినప్పుడు, చిప్స్, ఫ్రెంచ్ ఫ్రైస్ లాంటివి ఎంచుకోకుండా, ఆలివ్స్, భోజనంలో సముద్రపు ఉప్పును కలుపుకోవడం ఆరోగ్యకరం.
- **చీజ్:** చీజ్ లేదా ఇతరత్రా పాల ఉత్పత్తుల మీదకు మనసు మళ్లుతూ ఉంటే, క్యాల్షియం లోపంగా భావించాలి. ఎముకల ఆరోగ్యానికీ, కండరాల పనితీరుకూ, నాడీ సంకేత ప్రసారాలకూ క్యాల్షియం అవసరం. కాబట్టి పాలు, పెరుగు, చీజ్ లేదా సోయా, టోఫు, బాదం, ఆకుకూరలను ఆహారంలో చేర్చుకుంటూ ఉండాలి.



- **మాంసం:** రక్తలేమికి గురైన వాళ్లకు మాంసం తినాలనిపిస్తుంది. ఇందుకు కారణం ఐరన్ లోపం. వృక్షాధారిత ఆహారం తినేవాళ్లు, మహిళలు, పిల్లల్లో ఐరన్ లోపం ఎక్కువ. ఈ లోపాన్ని భర్తీ చేయడం కోసం మాంసాహారం మీదే ఆధారపడవలసిన అవసరం లేదు. పప్పులు, చిక్కుళ్లు, పాలకూరల్లో కూడా ఐరన్ పుష్కలంగా దొరుకుతుంది. అయితే ఐరన్ సమృద్ధిగా దొరికే పదార్థాలకు విటమిన్ సిని కూడా జోడించినప్పుడే, శరీరం ఐరన్‌ను సమర్థంగా శోషించుకోగలుగుతుంది.
- **కార్బ్స్:** బ్రెడ్, పాస్తాల మీదకు మనసు మళ్లికే కార్బ్స్ క్రేవింగ్‌గా భావించాలి. కొన్ని సందర్భాల్లో సెరటోనిన్ లోపంలో కూడా ఇదే లక్షణం కనిపిస్తుంది. పిండిపదార్థాలు తినడం వల్ల, భావోద్వేగాలతో సంబంధముండే సెరటోనిన్ అనే న్యూరోట్రాన్స్‌మీటర్ విడుదల పెరుగుతుంది. ఇలా కార్బ్స్ తినడం మనసు తేలికపడినా, శరీరంలోకి అదనపు క్యాలరీలు చేరిపోతూ ఉంటాయి. కాబట్టి సెరటోనిన్ మోతాదును పెంచే సంక్లిష్టమైన పిండిపదార్థాలతో కూడిన పండ్లు, కూరగాయలు, దుంపలు (చిలగడదుంప) తినాలి.

ఈ వ్యాయామంతో శరీరం దృఢం

ఫిట్‌నెస్

స్ట్రెంగ్త్ ట్రైనింగ్‌లో డెడ్ లిఫ్ట్‌కు ప్రత్యేకమైన స్థానం ఉంది. దృఢమైన శరీరాకృతి కోసం ప్రతి రోజూ డెడ్ లిఫ్ట్ సాధన చేయడం అవసరం. అయితే ఈ వ్యాయామం, వయసు, దారుఢ్యం, ఆరోగ్యం... ఈ మూడు అంశాల మీద ఆధారపడి ఉంటుంది.

సాధారణంగా డెడ్ లిఫ్ట్... బాడీ పోశ్చర్, ఎముకల సాంద్రతలను పెంచుతుంది. అయితే ఫిట్‌నెస్ లెవెల్, ఫామ్, తీవ్రత, రికవరీ మొదలైన భిన్నమైన అంశాల మీదే ఈ వ్యాయామం ప్రతికూల, అనుకూల ఫలితాలు ఆధారపడి ఉంటాయి. డెడ్ లిఫ్ట్‌ను ప్రతి రోజూ సాధన చేస్తే..

- **దారుఢ్యం:** పిరుదుల కండరాలు, పిక్కల్లోని కండరాలు, వెన్ను, కోర్ కండరాలను ఈ వ్యాయామం బలపరుస్తుంది. ఈ వ్యాయామంతో ఈ కండర సమూహాలు దృఢపడి, కండరాల బరువు, పరిమాణాలు పెరుగుతాయి.



- **పోశ్చర్:** సరైన పోశ్చర్‌కు తోడ్పడే కండరాలు ఈ వ్యాయామంతో బలపడతాయి. వెన్ను నిటారు గా మారుతుంది. కాబట్టి పట్టు తప్పి పడిపోవడం, తూలిపడడం లాంటి ప్రమాదాలు తప్పుతాయి.
- **ఎముకల సాంద్రత:** ఈ వ్యాయామంతో ఎముకల ఎదుగుదల, సాంద్రత పెరుగుతుంది. దాంతో ఆస్టియొపొరోసిస్ తగ్గి, పెద్ద వయసులో ఎముకలు విరిగే ప్రమాదాలు తగ్గుతాయి.
- **పట్టు:** చేతుల్లో పట్టు పెరుగుతుంది. దాంతో దైనందిన జీవితంలో చేతుల్లో నుంచి వస్తువులు జారి పడిపోవడం, చేతులు పట్టుతప్పడం లాంటి పొరపాట్లకు ఆస్కారం ఉండదు.
- **అతి శిక్షణ:** ఇది తీవ్రమైన వ్యాయామం. కేంద్ర నాడీ వ్యవస్థ, మస్క్యులో స్కెలెటల్ వ్యవస్థల మీద ఒత్తిడి పెంచే వ్యాయామమిది. ప్రతి రోజూ ఈ వ్యాయామం చేసేవారు, తగినంత విశ్రాంతి కూడా తీసుకుంటూ ఉండాలి. లేదంటే అలసట పెరిగి, ప్రమాదాలకు దారి తీసే ప్రమాదం ఉంటుంది.
- **కీళ్ల ఒత్తిడి:** డెడ్ లిఫ్ట్‌తో వెన్ను, పిరుదులు, మోకాళ్ల మీద ఒత్తిడి పడుతుంది. ఊబకాయులు, కీళ్ల సమస్యలు ఉన్నవాళ్లు ఈ వ్యాయామానికి దూరంగా ఉండాలి.

ఆహారాన్ని ఆచితూచి...

హెల్తీ ఫుడ్

చికిత్సలతోనే కాదు సహజసిద్ధమైన పదార్థాలతోనూ ఆరోగ్యాన్ని మెరుగ్గా ఉంచుకోవచ్చు. అందుబాటులో ఉండే పదార్థాలను తగిన రీతిలో వాడుకోగలిగితే మెరుగైన ఆరోగ్యం సమకూరుతుంది.



చక్కెరకు విరుగుడు కాకరకాయ

మధుమేహం అదుపులో ఉంచుకోవడానికి ఎక్కువమంది కాకరకాయ రసం తాగుతూ ఉంటారు. ప్రతిరోజూ పరగడుపునే కాకరకాయ రసం తాగితే రక్తంలో చక్కెర స్థాయులు అదుపులోకొచ్చి, మధుమేహ దుష్ఫలితాలైన ఊబకాయం, హృద్రోగాలు, అధిక రక్తపోటు, అధిక కొలెస్ట్రాల్‌లు తగ్గుముఖం పడతాయి. అయితే కాకర చేదు రుచి కారణంగా ఈ రసాన్ని తాగడానికి అందరూ ఇష్టపడరు. కానీ దీన్లో మధుమేహం మీద ప్రభావం చూపించే పాలీపెప్టైడ్, విసిన్, చరాటిన్ అనే మూడు ప్రధాన కాంపౌండ్లు ఉంటాయి. ఇవి ఇన్సులిన్‌ను అనుకరిస్తూ, కణాలు చక్కెర పరమాణువులను గ్రహించేలా చేస్తాయి. అలాగే ఇన్సులిన్ విడుదలను పెంచి, కాలేయాన్ని ప్రేరేపించి, శరీరం గ్లూకోజ్‌ను పీల్చుకునే సామర్థ్యాన్ని పెంచుతాయి. కాబట్టి కాకర రసంతో మధుమేహాన్ని అదుపులో ఉంచుకునే ప్రయత్నం చేయాలి. అయితే చేదుగా ఉండే ఈ రసాన్ని తాగలేకపోతుంటే.... ఆ జ్యూస్‌ను రుచికరంగా మార్చుకుని తాగాలి. అదెలాగంటే...

కాకర రుచిగా!

కావలసిన పదార్థాలు:
కాకరకాయలు - 2 లేదా 3
నిమ్మకాయ - అర చెక్క
పసుపు - పావు టీస్పూను
ఉప్పు - చిటికెడు

తయారీ ఇలా!

- కాకరకాయలు శుభ్రంగా కడిగి తొక్కు తీయాలి. తొక్కు తీయకుండా కూడా వాడుకోవచ్చు.
- కాకరకాయలును నిలువుగా కోసి, లోపలున్న విత్తనాలు తీసేయాలి.
- తర్వాత చిన్న ముక్కలుగా తరగాలి.
- ఈ ముక్కలను అర చెంచా ఉప్పు కలిపిన నీటిలో 10 నిమిషాలపాటు నానబెట్టాలి.
- తర్వాత ఈ ముక్కలను మిక్సీలో వేసి తిప్పాలి.
- తర్వాత గ్లాసులో పోసి నిమ్మరసం, పసుపు, ఉప్పు, వేసి కలిపి తాగాలి.
- ఇలా తాగలేకపోతే, వడగట్టుకుని కూడా తాగవచ్చు.



చక్కెర కంటే తేనె మేలేనా?

తేనె, చక్కెర రెండూ తీపి వస్తువులే అయినా తేనె ఆరోగ్యకరమైన తీపి పదార్థం అనే నమ్మకం ఏర్పడిపోయింది. దీన్లో నిజమెంత? చక్కెర బదులు తేనె వాడడం ఆరోగ్యకరమా?

తేనె, చక్కెర రెండూ పిండి పదార్థాలే! వీటిలో గ్లూకోజ్, ఫ్రక్టోజ్‌లు వేర్వేరు పరిమాణాల్లో ఉంటాయి. తేనెలో 40% ఫ్రక్టోజ్, 30 % గ్లూకోజ్ ఉంటే, చక్కెరలో 50% ఫ్రక్టోజ్, 50% గ్లూకోజ్ ఉంటాయి.

స్వీట్స్‌లో వాడే శుద్ధిచేసిన ఫ్రక్టోజ్ (సుగర్) కాలేయం సహాయంతో మెటబలైజ్ అయి ఊబకాయం, కాలేయ కొవ్వు, మధుమేహాలకు దారి తీస్తుంది. అయితే ఫ్రక్టోజ్, గ్లూకోజ్‌లు రెండూ శరీరంలోకి చేరుకున్న వెంటనే జీర్ణమై, రక్తంలో చక్కెర స్థాయిలను పెంచుతాయి.


చక్కెర కంటే తేనె మేలు!

నిజమే! ఎందుకంటే చక్కెరలో లేని నీరు, పూల పుప్పొడి, మెగ్నీషియం, పొటాషియం మొదలైన ఖనిజ లవణాలు తేనెలో ఉంటాయి. ఈ అదనపు అంశాలే తేనెకు అదనపు పోషకాలను జోడిస్తున్నాయి. తేనెతో పోలిస్తే చక్కెరకు గ్లైసెమిక్ ఇండెక్స్ ఎక్కువ. అంటే... ఇది రక్తంలోని చక్కెర స్థాయిని వెనువెంటనే పెంచేస్తుంది. ఇందుకు కారణం తేనెలో ఉండే ఖనిజ లవణాలు దీన్లో లేకపోవడమే! అయితే తేనె, చక్కెరకు మించిన కేలరీలను శరీరానికి అందిస్తుంది. ఒక టీస్పూను చక్కెరలో 49 కేలరీలు ఉంటే, అంతే తేనెలో 64 కేలరీలు ఉంటాయి. కాబట్టి ఎలాంటి తీపి అయినా అనర్థదాయకమనే విషయం దృష్టిలో పెట్టుకుని తగుమాత్రంగా వాడాలి.

మాంసకృత్తులు మాంసంలోనే ఉంటాయా?

శాకాహారుల రక్తలేమికి కారణం వారు మాంసం తినకపోవడమే అనుకుంటూ ఉంటారు. కానీ నిజానికి మాంసకృత్తులు పుష్కలంగా పొందగలిగే శాకాహారమూ ఉంది. కాకపోతే వాటి పట్ల అవగాహన లేకపోవడంతో సరిపడా ప్రొటీన్లు పొందలేక రక్తలేమికి గురవుతూ ఉంటాం!

- **మాంసకృత్తులు ఉండే శాకాహారం:** పుట్టగొడుగులు, పచ్చి బఠాణీ, కాలీఫ్లవర్, చిక్కుళ్లు, నట్స్, ఆకుకూరలు, పప్పుల్లో మాంసకృతులు ఎక్కువ. ప్రతిరోజూ ఆహారంలో ఇవి ఉండేలా చూసుకోవాలి. ఆకుపచ్చని కూరగాయలు ఎంచుకోవాలి.



- **శాకాహారమే మేలు:** ప్రొటీన్లు ఎక్కువగా ఉండే మాంసాహారంతో పోలిస్తే శాకాహారం తేలికగా అరుగుతుంది. సమపాళ్లలో మాంసకృత్తులు ఉండే మాంసాహారం కంటే అదే పరిమాణంలో ఉండే శాకాహారంలో అదనంగా పీచు కూడా ఉంటుంది. కాబట్టి మలబద్ధకం సమస్య కూడా తలెత్తదు.

ఈ మెరికలు.. ఆనంద్ 'పిల్లలు'



ఈసారి చెస్ ఒలింపియాడ్‌లో ఒకేసారి రెండు జట్లు బంగారు పతకాలతో సత్తా చాటడం దిగ్గజ ఆటగాడు విశ్వనాథన్ ఆనంద్ చలవే. రెండేళ్ల కిందట చెన్నై ఆతిథ్యమిచ్చిన చెస్ ఒలింపియాడ్‌లో మన పురుషులు, మహిళల జట్లు కాంస్య పతకాలు అందుకొన్నాయి. దాంతో తదుపరి చెస్ ఒలింపియాడ్‌లో భారత జట్లు స్వర్ణం కొల్లగొట్టేస్తాయని విషి అప్పుడే అంచనా కొచ్చేశాడు. గుకేష్, ప్రజ్ఞానంద, అర్జున్, వైశాలి..ఈ నలుగురూ నాలుగేళ్ల కిందట చెన్నైలో విషి ప్రారంభించిన వెస్ట్‌బ్రిడ్జ్ ఆనంద్ చెస్ అకాడమీ తయారు చేసిన తురుపు ముక్కలే కావడం విశేషం. 'విషీ సర్ లేకుండా మేం లేం' అని 18 ఏళ్ల గుకేష్, 19 ఏళ్ల ప్రజ్ఞానంద చెప్పడం..వారి కెరీర్‌లో ఆనంద్ పాత్రను విశదం చేస్తుంది. అందుకే కాబోలు..అంతర్జాతీయ చెస్ సమాఖ్య కూడా ఆనంద్‌ను 'భారత చెస్ బూమ్ పితామహుడి'గా అభివర్ణించింది. అమెరికా గ్రాండ్ మాస్టర్ హికరు నకముర అయితే విషీని ఆకాశానికెత్తేశాడు. భారత్‌లో చెస్‌కు ఏ మాత్రం ఆదరణ లేనిరోజుల్లో ఆట మొదలెట్టిన ఆనంద్ వరల్డ్ చాంపియన్‌గా నిలవడమే గాక, తర్వాతి తరం ఆటగాళ్లలో స్ఫూర్తినింపుతూ చెస్‌ను అగ్రభాగాన నిలిపిన లెజెండ్‌గా అభివర్ణించాడు. మరో చెస్ దిగ్గజం కాస్పరోవ్ కూడా ప్రస్తుత భారత చెస్ ఆటగాళ్లను 'ఆనంద్ పిల్లలు'గా పేర్కొన్నాడు. అవును..ఈ 'గోల్డెన్ జనరేషన్' నిస్సందేహంగా ఆనంద్ పిల్లలే.

'టొరంటోలో భారత భూకంపం.. మారుతున్న చెస్ ప్రపంచ గతికి పరాకాష్ఠ' అని గత ఏప్రిల్‌లో క్యాండేట్స్ టోర్నీలో టీనేజర్ గుకేష్ విజేతగా నిలవడంతో దిగ్గజం గ్యారీ కాస్పరోవ్ చేసిన కామెంట్ ఇది. విశ్వనాథన్ ఆనంద్ కుర్రాళ్లు 64 గళ్ల ఆటలో 'వేటాడడానికి' సిద్ధంగా ఉన్నారంటూ గ్యారీ అప్పుడే డేంజర్ సిగ్నల్స్ పంపాడు. నెలలు గడవక ముందే అతడి మాటలు నిజమయ్యాయి. చెస్ ఒలింపియాడ్‌లో అండర్ డాగ్‌గా బరిలోకి దిగిన భారత పురుషులు, మహిళల జట్లు.. స్వర్ణాలతో పెను ప్రకంపనలు సృష్టించాయి. 2014లో పురుషుల జట్టు తొలి పతకం కాంస్యం సాధించింది. అప్పుడు విషీ అందుబాటులో లేకపోయినా.. మనోళ్లు టాప్-3లో నిలిచి ఔరా అనిపించారు. సుదీర్ఘ విరామం తర్వాత 2022లో చెన్నైలో జరిగిన టోర్నీలో ఇరు జట్లు కంచు మోత మోగించాయి. ఇక, రెండేళ్లు తిరిగేసరికి యువ కెరటాలు సంచలన విజయాలతో నిశ్శబ్ద విప్లవమే సృష్టించారు. చదరంగానికి పుట్టినిల్లుగా చెప్పుకోవడమేగానీ.. ఆ ఆనవాళ్లు లేని దేశంలో నేటి తరం ఆటగాళ్లు అద్భుత ప్రదర్శనతో సువర్ణాధ్యాయాన్ని లిఖించారు.



బంగారు మయం

చెస్ ఒలింపియాడ్‌లో తొలి రౌండ్ నుంచే భారత్ దూసుకెళ్లిన తీరు అద్భుతం. వరల్డ్ టాప్-5లో ఉన్న అర్జున్, ఏడో ర్యాంకర్ గుకేష్ ఇలా 18-21 ఏళ్ల మధ్యనున్న బలమైన జట్టుతో బరిలోకి దిగి.. అపూర్వ ఫలితాలను సొంతం చేసుకొంది. వరుసగా 8 మ్యాచ్‌లు గెలిచిన యువ జట్టు ఒక్కసారిగా టైటిల్ ఫేవరెట్‌గా మారింది. 9వ రౌండ్‌లో ఉజ్బెకిస్థాన్‌తో డ్రా చేసుకొన్నా.. తర్వాత రెండు రౌండ్లలో జయభేరి మోగించారు.

అర్జున్ అదరహో..: ఇంతటి చారిత్రక విజయంలో తెలుగు ఆటగాడు అర్జున్ ఇరిగేసి, గుకేష్ ట్రంప్ కార్డులుగా నిలిచారు. ఓపెన్ కేటగిరీలో 11 రౌండ్లలో 9 మ్యాచ్‌లు గెలిచిన అర్జున్ 10 పాయింట్లతో టాప్ స్కోరర్‌గా నిలిచాడు. ఆఖరిరౌండ్‌లో సుబెల్జ్ (స్లొవేనియా)పై గెలుపుతో అర్జున్ దేశానికి గోల్డ్‌ను ఖరారు చేశాడు. 10వ రౌండ్‌లో బలమైన డొమింగెజ్ (అమెరికా)పై ఇరిగేసి నెగ్గడం టర్నింగ్ పాయింట్‌గానే చెప్పుకోవాలి. మరోవైపు వరల్డ్ చాంపియన్‌ను సవాల్ చేయనున్న టీనేజర్ గుకేష్ కూడా జట్టు బాధ్యతలను అద్భుతంగా మోశాడు. ఆడిన 11 గేముల్లో 9 పాయింట్లు సాధించాడు. వి యి (చైనా), ఫాబియానా (అమెరికా)పై గుకేష్ నెగ్గడం జట్టు పోటీలో నిలవడానికి దోహదం చేసింది. భారీ అంచనాలున్న ప్రజ్ఞానంద కొంత తడబాటుకు లోనైనా.. సరైన సమయంలో సీనియర్ విదిత్ గుజరాతీ ఫామ్‌లోకి రావడం జట్టుకు కలిసొచ్చింది. 3 రౌండ్లు ఆడి రెండు గెలిచి ఒక గేమ్ డ్రా చేసుకొన్న సీనియర్ గ్రాండ్‌మాస్టర్ పెంటేల హరికృష్ణ.. తన అనుభవంతో యువతకు చక్కని మార్గదర్శనం చేశాడు.

ఉత్కంఠ రేపినా.. వదల్లేదు: ఏమాత్రం అంచనాలు లేకుండా బరిలోకి దిగిన భారత మహిళల జట్టు విజయంలో 18 ఏళ్ల ఉమెన్ గ్రాండ్ మాస్టర్ దివ్య దేశ్‌ముఖ్ తిరుగులేని అస్త్రంగా పనిచేసింది. మరో యువ జీఎం వైశాలి కూడా విజయంలో కీలకంగా వ్యవహరించింది. ఆడిన 11 రౌండ్లలో 9 మ్యాచ్‌లు గెలిచిన మన మహిళల జట్టు.. అమెరికాతో డ్రా చేసుకొంది. ఒక్క పోలెండ్ చేతిలోనే ఓడింది. తెలుగు జీఎం హారిక ద్రోణవల్లి, సీనియర్ తానియా సచ్‌దేవ్ తోపాటు వంతిక అగర్వాల్ రొటేషన్‌లో కొన్ని గేమ్‌లు ఆడినా.. దివ్య, వైశాలి ఎక్కువ బాధ్యతలు తీసుకొన్నారు. దేశ్‌ముఖ్ 8 గేమ్‌లు గెలిచి.. 3 డ్రా చేసుకొంది. టోర్నీ ఆసాంతం అమోఘ ప్రదర్శన చేసిన దివ్య టీమ్ స్వర్ణం సాధించడంలో ముఖ్య భూమిక పోషించింది. 18 ఏళ్ల వంతిక కూడా ఆడిన 9 గేమ్‌లో ఒక్కటి కూడా ఓడకపోవడం విశేషం. 10 గేమ్‌లు ఆడిన వైశాలి 6 పాయింట్లు సాధించగా.. తానియా కొన్నిరౌండ్లే ఆడినా.. ఓటమి లేకుండా ముగించింది. 9 రౌండ్లలో 3 గెలిచి 3 డ్రా చేసుకొన్న హారిక.. 3 గేముల్లో ఓడింది. కానీ, 11వ రౌండ్‌లో గునాని (అజర్‌బైజాన్)పై సంచలన విజయంతో జట్టులో ఆత్మవిశ్వాసాన్ని నింపింది. మొత్తంగా చెస్‌లో యువ ప్లేయర్లతో కూడిన భావి భారతం.. ఇక బంగారుమయంగా మారనుందన్న భరోసా కలిగిస్తోంది.

(ఆంధ్రజ్యోతి క్రీడావిభాగం)

చదరంగం చరిత్రలో స్వర్ణ యుగం: చంద్రబాబు

అమరావతి (ఆంధ్రజ్యోతి): భారత బృందం చదరంగం చరిత్రలో స్వర్ణ యుగం సృష్టించిందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రశంసించారు. చెస్ ఒలింపియాడ్‌లో భారత బృందం రెండు స్వర్ణ పతకాలు సాధించడంపై సోమవారం ఆయన ట్వీట్ చేశారు. 'మన చాంపియన్లు మనమంతా గర్వపడేలా చేశారు. విజేతలకు అభినందనలు. భారత పతాకాన్ని ఇలాగే సమున్నతంగా ఎగురవేస్తూ ఉండాలని నా కోరిక' అని ఆయన ట్వీట్‌లో పేర్కొన్నారు.

ప్రభాత 'జయ' సూర్య

ఐదు వికెట్లతో చెలరేగిన స్పిన్నర్

తొలి టెస్ట్‌లో శ్రీలంక గెలుపు



గాలె: తన ఫేవరెట్ గాలె పిచ్‌పై స్పిన్నర్ ప్రభాత జయసూర్య చెలరేగాడు. ఐదు వికెట్లతో (5/68) తిప్పేసిన వేళ..న్యూజిలాండ్‌తో జరిగిన తొలి టెస్ట్‌లో ఆతిథ్య శ్రీలంక 63 పరుగులతో గెలిచింది. రెండు టెస్ట్‌ల సిరీస్‌లో 1-0 ఆధిక్యంలో నిలిచింది. 275 పరుగుల లక్ష్యంతో ఓవర్‌నైట్ స్కోరు 207/8తో చివరిరోజు సోమవారం రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన కివీస్ 211 రన్స్‌కు ఆలౌటైంది. మిగిలిన రెండు వికెట్లనూ జయసూర్య తీశాడు. ఎనిమిదోసారి ఐదు వికెట్ల ప్రదర్శన కనబరచిన ప్రభాత..గాలెలో ఈ ఫీట్‌ను ఏడోసారి సాధించడం విశేషం. ఇక..లంక తొలి ఇన్నింగ్స్‌లో 305, న్యూజిలాండ్ 340 రన్స్ చేశాయి. శ్రీలంక రెండో ఇన్నింగ్స్‌లో 309 రన్స్ చేసింది.

భారత కుర్రాళ్లదే సిరీస్

రెండో వన్డేలో ఓడిన ఆసీస్ అండర్-19 జట్టు

పుదుచ్చేరి: ఆస్ట్రేలియా అండర్-19 జట్టుతో జరిగిన రెండో వన్డేలో యువ భారత్ తొమ్మిది వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. ఓపెనర్ సాహిల్ పరాఖ్ (109 నాటౌట్) అజేయ శతకంతో రాణించాడు. దీంతో రెండు వరుస విజయాలతో భారత్ అండర్-19 జట్టు మరో మ్యాచ్ ఉండగానే 2-0తో సిరీస్ గెలుచుకున్నట్టయ్యింది. ముందుగా ఆసీస్ కుర్రాళ్లు 49.3 ఓవర్లలో 176కు ఆలౌటయ్యారు. ఛేదనలో యువ భారత్ 22 ఓవర్లలో 177/1 పరుగులు చేసి గెలిచింది. అభిగ్యాన్ కుందు (53 నాటౌట్)తో కలిసి రెండో వికెట్‌కు సాహిల్ 153 పరుగుల అజేయ భాగస్వామ్యం నెలకొల్పాడు. చివరి మ్యాచ్ గురువారం జరుగుతుంది.

దక్షిణాఫ్రికాకు ఓదార్పు విజయం

షార్జా: సిరీస్‌ను ఇంతకుముందే కోల్పోయిన సౌతాఫ్రికా..అఫ్ఘానిస్థాన్‌తో జరిగిన మూడో వన్డేలో ఓదార్పు విజయం దక్కించుకుంది. ఆదివారం రాత్రి జరిగిన ఆఖరి మ్యాచ్‌లో తొలుత అఫ్ఘానిస్థాన్ 34 ఓవర్లలో 169 పరుగులకే కుప్పకూలింది. రహ్మనుల్లా (89) హాఫ్ సెంచరీతో మెరిశాడు. ఎంగిడి, పీటర్, పెలుక్వాయో తలా రెండేసి వికెట్లు పడగొట్టారు. అనంతరం 170 పరుగుల లక్ష్యాన్ని దక్షిణాఫ్రికా 33 ఓవర్లలో కేవలం మూడు వికెట్లు కోల్పోయి చేరుకుంది. మార్‌క్రమ్ (69 నాటౌట్) అజేయ అర్ధ శతకంతో రాణించాడు.

బ్రాండ్ వాల్యూలో నెంబర్ వన్ కోహ్లీ

షారుక్, రణ్‌వీర్‌ను దాటేసిన విరాట్



న్యూఢిల్లీ: వరల్డ్ క్రికెట్‌లో విరాట్ కోహ్లీ స్థానం ప్రత్యేకం. అందుకే అతడి బ్రాండ్ విలువ కూడా వందల కోట్లలోనే ఉంటుంది. లెక్కకు మిక్కిలి కంపెనీలు తమ ఉత్పత్తులకు ప్రచారం కల్పించేందుకు అతడితో ఒప్పందాలు కుదుర్చుకుంటాయి. ఈ నేపథ్యంలో 2024లో విరాట్ బ్రాండ్ వాల్యూ రూ.1912 కోట్లకు చేరింది. దీంతో దేశంలోనే అత్యంత విలువైన సెలెబ్రిటీగా నిలిచాడు. ఈ క్రమంలో బాలీవుడ్ స్టార్లు షారుక్‌ఖాన్, రణ్‌వీర్ సింగ్‌లను దాటేశాడు. ఈ వివరాలను క్రోల్ సంస్థ విడుదల చేసిన సెలెబ్రిటీ బ్రాండ్ వాల్యుయేషన్ రిపోర్ట్‌లో పేర్కొంది. గతంతో పోలిస్తే కోహ్లీ బ్రాండ్ వాల్యూ 29 శాతం పెరిగినట్టు తెలిపింది. అలాగే ఇన్‌స్టాగ్రామ్‌లో ఒక్క పోస్ట్ పెట్టేందుకు ఏకంగా రూ.14 కోట్లు వసూలు చేస్తాడట. అతను ప్రమోట్ చేసే జాబితాలో దాదాపు 20 బ్రాండ్లు ఉండడం విశేషం.

సింధు కోచ్‌గా అనూప్ శ్రీధర్





న్యూఢిల్లీ: స్టార్ షట్లర్ పీవీ సింధు తన తాత్కాలిక కోచ్‌గా మాజీ ఒలింపియన్ అనూప్ శ్రీధర్‌ను నియమించుకుంది. వచ్చేనెల ఎనిమిది నుంచి జరిగే ఆర్కిటిక్ ఓపెన్ టోర్నీకోసం ప్రస్తుతం హైదరాబాద్‌లోని గచ్చిబౌలి స్టేడియంలో సింధు సాధన చేస్తోంది. త్వరలో హైదరాబాద్ రానున్న శ్రీధర్.. సింధుకు కోచింగ్ ఇవ్వనున్నాడు. ఆర్కిటిక్‌తో పాటు డెన్మార్క్, కొరియా, చైనా ఓపెన్‌లలో సింధుకు శ్రీధర్ కోచ్‌గా వ్యవహరించనున్నాడు.

రేసింగ్‌లో భారత్‌కు కాంస్యం



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): భారత తొలి ఎలక్ట్రిక్ బైక్ రేసింగ్ జట్టు 'ఇండీ రేసింగ్' అరంగేట్రం సీజన్‌లోనే కాంస్య పతకం సాధించి సంచలనం సృష్టించింది. హైదరాబాద్‌కు చెందిన ఇండీ రేసింగ్ టీమ్ స్విట్జర్లాండ్‌లోని క్రాన్స్ మోంటానాలో జరిగిన ఎఫ్ఐఎం-ఈ ప్రపంచకప్‌లో 479 పాయింట్లతో మూడో స్థానంలో నిలిచింది. నార్వేకు చెందిన బొనెల్ రేసింగ్ జట్టు విజేతగా నిలవగా, జపాన్ హోండా జట్టు రెండోస్థానం దక్కించుకుంది.

ఫెడ్ జోష్.. తగ్గేదేలే!

85,000కు చేరువలో సెన్సెక్స్

26,000 దిశగా నిఫ్టీ

ముంబై: ఫెడ్ రేట్లు తగ్గడంతో ఉత్సాహంతో ఉరకలేస్తున్న ఇన్వెస్టర్లు కొనుగోళ్ల విషయంలో ఏ మాత్రం తగ్గేదేలే అంటున్నారు. సోమవారం ట్రేడింగ్‌లో ఎనర్జీ, బ్యాంకింగ్, ఆటో రంగ షేర్లలో జోరుగా కొనుగోళ్లు జరుపడంతో ప్రామాణిక ఈక్విటీ సూచీలు సరికొత్త గరిష్ఠాలకు ఎగబాకాయి. సెన్సెక్స్ 85,000, నిఫ్టీ 26,000 స్థాయికి చేరువయ్యాయి. సెన్సెక్స్ ఒక దశలో 436.22 పాయింట్లు వృద్ధి చెంది 84,980.53 వద్ద ఆల్‌టైం ఇంట్రాడే రికార్డును, చివరికి 384.30 పాయింట్ల లాభంతో 84,928.61 వద్ద సరికొత్త జీవనకాల గరిష్ఠ ముగింపును నమోదు చేసింది. నిఫ్టీ సైతం 165.05 పాయింట్ల వరకు పెరిగి 25,956 సరికొత్త ఇంట్రాడే గరిష్ఠాన్ని నమోదు చేసినప్పటికీ, చివర్లో 148.10 పాయింట్ల లాభంతో 25,939.05 వద్ద స్థిరపడింది. సూచీకిది సరికొత్త రికార్డు ముగింపు కూడా. ఫెడ్ రేట్ల తగ్గింపు అంశంతో పాటు ఆసియా మార్కెట్ల సానుకూల సంకేతాలు, ఎఫ్ఐఐ పెట్టుబడుల దన్ను కూడా మార్కెట్ ర్యాలీకి దోహపడ్డాయి. గడిచిన మూడు ట్రేడింగ్ సెషన్లలో సెన్సెక్స్ 1,980.38 పాయింట్లు (2.38 శాతం) ఎగబాకింది. దాంతో ఈక్విటీ మదుపరుల సంపదగా పరిగణించే బీఎస్ఈ లిస్టెడ్ కంపెనీల మార్కెట్ క్యాప్ 3 రోజుల్లో రూ.8.30 లక్షల కోట్ల వృద్ధితో మొత్తం రూ.476.04 లక్షల కోట్లకు (5.70 లక్షల కోట్ల డాలర్లు) చేరుకుంది.

నవంబరులో ఎన్‌టీపీసీ గ్రీన్ ఎనర్జీ ఐపీఓ

ప్రభుత్వ రంగ విద్యుత్ ఉత్పత్తి దిగ్గజం ఎన్‌టీపీసీ అనుబంధ విభాగమైన ఎన్‌టీపీసీ గ్రీన్ ఎనర్జీ రూ.10,000 కోట్ల ఐపీఓ నవంబరు తొలివారంలో ప్రారంభమయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఐపీఓ ప్రక్రియలో భాగంగా కంపెనీ ముంబైతో పాటు సింగపూర్ తదితర దేశాల్లో రోడ్‌షోలు నిర్వహించాలని కంపెనీ భావిస్తోంది.

- డిజిటల్ చెల్లింపుల సంస్థ మొబిక్విక్‌తో పాటు సోలార్ ప్యానెళ్ల తయారీదారు వారీ ఎనర్జీస్ ఐపీఓ ప్రతిపాదనలకు సెబీ ఆమోదం తెలిపింది. ఐపీఓలో భాగంగా వారీ ఎనర్జీస్ రూ.3,000 కోట్ల తాజా ఈక్విటీ జారీతో పాటు ప్రస్తుత ప్రమోటర్, వాటాదారులకు చెందిన 32 లక్షల షేర్లను ఆఫర్ ఫర్ సేల్ పద్ధతిన విక్రయించనుంది. కాగా, మొబిక్విక్ రూ.700 కోట్ల తాజా ఈక్విటీని జారీ చేయనుంది.
- రియల్ ఎస్టేట్ కంపెనీ కాసాగ్రాండ్ ప్రీమియర్ బిల్డర్ కూడా ఐపీఓకు రాబోతోంది. పబ్లిక్ ఇష్యూ ద్వారా రూ.1,100 కోట్ల సమీకరణకు అనుమతి కోరుతూ సెబీకి కంపెనీ డీఆర్‌హెచ్‌పీ సమర్పించింది.

ఇంటెల్ కొనుగోలుకు క్వాల్‌కామ్ ఆసక్తి

టెక్నాలజీ ప్రపంచంలో మరో మెగా డీల్ కుదిరే అవకాశం కనిపిస్తోంది. అమెరికాకు చెందిన రెండు అంతర్జాతీయ చిప్ తయారీ దిగ్గజాలు క్వాల్‌కామ్, ఇంటెల్ ఒక్కటయ్యే చాన్స్ ఉంది. ఇంటెల్‌ను కొనుగోలు చేసేందుకు క్వాల్‌కామ్ ఆసక్తిగా ఉన్నట్లు వాల్‌స్ట్రీట్ జర్నల్ కథనం పేర్కొంది. ఇందుకోసం క్వాల్‌కామ్ యాజమాన్యం ఇప్పటికే ఇంటెల్‌ను సంప్రదించిందని వెల్లడించింది. ఈ విషయంపై ఇరువర్గాలు ఇంకా స్పందించాల్సి ఉంది. గత కొన్నాళ్లుగా ఎన్విడియా నుంచి పోటీ పెరగడంతో ఇంటెల్ ఆర్థికంగా సవాళ్లు ఎదుర్కొంటోంది. ఈ ఏడాదిలో ఇంటెల్ షేరు 60 శాతం క్షీణించింది. ఈమధ్య కంపెనీ 160 కోట్ల డాలర్ల నష్టాన్ని ప్రకటించింది. ఆర్థిక కష్టాల నేపథ్యంలో వ్యయాలు తగ్గించుకునేందుకు 10,000 మంది ఉద్యోగులను తొలగించే ఆలోచనలో ఉంది.

ఎఫ్ అండ్ ఓ ట్రేడింగ్ యమ డేంజర్

93 శాతం మదుపరులకు నష్టాలే

- మూడేళ్లలో రూ.1.8 లక్షల కోట్లు హాంఫట్
- సగటున రూ.2 లక్షల వరకు నష్టాలు
- సంస్థాగత ట్రేడర్లకు మాత్రమే లాభాలు
- సెబీ అధ్యయనం వెల్లడి



న్యూఢిల్లీ: వ్యక్తిగత ట్రేడర్లు జరిపే ఈక్విటీ ఫ్యూచర్స్ అండ్ ఆప్షన్స్ (ఎఫ్ అండ్ ఓ) ట్రేడింగ్‌పై మార్కెట్ నియంత్రణ మండలి సెబీ మరోసారి ప్రమాద ఘంటికలు మోగించింది. ఈ ట్రేడింగ్ వ్యక్తిగత ట్రేడర్లకు ఏ మాత్రం లాభదాయకం కాదని హెచ్చరించింది. దీనికి సంబంధించి గత మూడేళ్ల (2022-24) ఎఫ్ అండ్ ట్రేడింగ్ సరళిపై జరిపిన ఒక అధ్యయన నివేదికను సోమవారం విడుదల చేసింది. ఈ నివేదిక ప్రకారం గత మూడేళ్లలో ఈ ట్రేడింగ్‌లో పాల్గొన్న వ్యక్తిగత ట్రేడర్లలో 93 శాతం (కోటి మందికి పైగా) మంది రూ.1.8 లక్షల కోట్లు నష్టపోయారు. ఇక ఈ ట్రేడింగ్‌లో పాల్గొన్న వ్యక్తిగత ట్రేడర్లలో కేవలం 7.2 శాతం మంది మాత్రమే కొద్దిపాటి లాభాలు సంపాదించినట్టు సెబీ అధ్యయన నివేదిక తెలిపింది.

సగటున రూ.2 లక్షల నష్టం

ట్రేడింగ్ లావాదేవీల ఖర్చులతో కలిపి ఎఫ్ అండ్ ఓ ట్రేడింగ్ జరిపిన వ్యక్తిగత ట్రేడర్లు, గత మూడేళ్లలో సగటున రూ.2 లక్షల వరకు నష్టపోయారు. వీరిలో 3.5 శాతం మంది (సుమారు 4 లక్షల మంది) సగటున రూ.28 లక్షల చొప్పున నష్టపోయారు. గత ఆర్థిక సంవత్సరాన్ని (2023-24) మాత్రమే పరిగణనలోకి తీసుకుంటే.. ఈ ట్రేడింగ్‌లో పాల్గొన్న వ్యక్తిగత ట్రేడర్లలో 91 శాతం మంది (73 లక్షల మంది) సగటున రూ.1.2 లక్షల చొప్పున రూ.75,000 కోట్ల వరకు నష్టపోయినట్టు సెబీ అధ్యయనం తెలిపింది.

99.8 శాతం మంది వ్యక్తిగత ట్రేడర్లే

ఈక్విటీ ఎఫ్ అండ్ ఓ ట్రేడింగ్ వద్దు బాబూ అని నిపుణులు ఎంతగా హెచ్చరిస్తున్నా వ్యక్తిగత ట్రేడర్లు వినిపించుకోవడం లేదు. పైగా ఏటికేటికి వీరి సంఖ్య పెరిగిపోతోంది. 2021-22 ఆర్థిక సంవత్సరంలో ఎఫ్ అండ్ ఓ ట్రేడింగ్‌లో పాల్గొనే వ్యక్తిగత ట్రేడర్ల సంఖ్య 51 లక్షలు ఉంటే, గత ఆర్థిక సంవత్సరానికి (2023-24) ఇది 96 లక్షలకు చేరింది. గత ఏడాది ఎఫ్ అండ్ ఓ ట్రేడింగ్ సరళిని పరిశీలించినా ఈ ట్రేడింగ్‌లో పాల్గొన్న ట్రేడర్లలో 99.8 శాతం మంది వ్యక్తిగత ట్రేడర్లని సెబీ నివేదిక పేర్కొంది. లావాదేవీల ఖర్చులు తగ్గడం, అధునాతన ట్రేడింగ్ ప్లాట్‌ఫామ్స్ అందుబాటులోకి రావడం ఇందుకు ప్రధాన కారణమని తెలిపింది.

సంస్థాగత ట్రేడర్లకే లాభాలు

ఎఫ్ అండ్ ఓ ట్రేడింగ్‌లో వ్యక్తిగత ట్రేడర్లు భారీగా నష్టపోతుంటే ప్రొప్రైటరీ ట్రేడర్లు, ఎఫ్‌పీఐలు మాత్రం భారీగానే లాభాలు సంపాదిస్తున్నాయి. గత ఆర్థిక సంవత్సరం (2023-24) ఎఫ్ అండ్ ఓ ట్రేడింగ్‌లో పాల్గొన్న ప్రొప్రైటరీ ట్రేడర్లు రూ.33,000 కోట్లు, ఎఫ్‌పీఐలు రూ.28,000 కోట్ల లాభాలు సంపాదించినట్టు సెబీ నివేదిక పేర్కొంది.

నివేదిక ఇతర ముఖ్యాంశాలు

- గత మూడేళ్లలో 31% నుంచి 43 శాతానికి చేరిన 30 సంవత్సరాలలోపు వ్యక్తిగత ఎఫ్ అండ్ ఓ ట్రేడర్లు
- యువ ఎఫ్ అండ్ ఓ ట్రేడర్లలో 93 శాతానికి నష్టాలు
- వ్యక్తిగత ఎఫ్ అండ్ ఓ ట్రేడర్లలో 75% మంది వార్షిక సగటు ఆదాయం రూ.5 లక్షల కంటే తక్కువ
- రూ.5 లక్షల కంటే తక్కువ వార్షికాదాయం ఉన్న వ్యక్తిగత ఎఫ్ అండ్ ఓ ట్రేడర్ల సంఖ్య, గత మూడేళ్లలో 71% నుంచి 76 శాతానికి పెరుగుదల
- వ్యక్తిగత ట్రేడర్లలో మహిళల శాతం గత మూడేళ్లలో 14.9%నుంచి 13.7 శాతానికి తగ్గుదల
- 2023-24 ఆర్థిక సంవత్సరంలో 91.9% మంది పురుష ట్రేడర్లు నష్టపోతే, మహిళల్లో ఈ శాతం 86.3% మాత్రమే
- ఎఫ్ అండ్ ఓ ట్రేడింగ్ కోసం వ్యక్తిగత ట్రేడర్లు గత మూడేళ్లలో చేసిన లావాదేవీల ఖర్చులు రూ.50,000 కోట్లు
- ఈ రూ.50,000 కోట్లలో 51% బ్రోకరేజీ ఫీజులు, మరో 21%ఎక్స్ఛేంజ్ ఫీజుల కోసం ఖర్చు

2047 నాటికి రియల్టీ మార్కెట్ @ రూ.840 లక్షల కోట్లు

న్యూఢిల్లీ: దేశంలో రియల్ ఎస్టేట్ మార్కెట్ మంచి జోరు మీదుంది. ప్రస్తుతం ఆర్థిక వ్యవస్థ నమోదు చేస్తున్న వృద్ధి రేటును, పట్టణీకరణ జోరును పరిగణనలోకి తీసుకుంటే 2047 నాటికి ఈ మార్కెట్ ఎన్నో రెట్లు పెరిగి జీడీపీలో 14-20 శాతం వాటా అందించవచ్చని క్రెడాయ్, కోలియెర్స్ ఇండియా ఉమ్మడిగా విడుదల చేసిన నివేదికలో అంచనా వేశాయి. క్రెడాయ్-నాట్‌కాన్ సదస్సులో "భారత రియల్ ఎస్టేట్: అద్భుత వృద్ధి" పేరిట రూపొందించిన ఈ నివేదికను విడుదల చేశారు. 2022 నాటికి జీడీపీలో 6-8 శాతం వాటాతో 20 వేల కోట్ల డాలర్లున్న రియల్టీ మార్కెట్ 2030 నాటికి లక్ష కోట్ల డాలర్లను తాకవచ్చని పేర్కొన్నాయి. 2047 నాటికి వాస్తవిక దృక్పథంలో అయితే 5 లక్షల నుంచి 7 లక్షల కోట్ల డాలర్లకు చేరవచ్చునని, ఆశావహమైన వాతావరణంలో 10 లక్షల కోట్ల డాలర్లను (రూ.840 లక్షల కోట్లు) తాకినా ఆశ్చర్యపోనక్కర లేదని తెలిపాయి. అంతే కాదు..మార్కెట్లో వాతావరణం అత్యంత నిరాశావహంగా ఉన్న స్థితిలో అయినా మార్కెట్ పరిమాణం 3 లక్షల కోట్ల నుంచి 5 లక్షల కోట్ల డాలర్లకు చేరుతుందని అంచనా వేశాయి. ప్రధానంగా పట్టణీకరణలో వేగం, మౌలిక వసతుల అభివృద్ధి, డిజిటలైజేషన్, జనాభాలో మార్పులు, సుస్థిరత, రియల్టీలోని విభిన్న విభాగాల్లో పెట్టుబడులు మార్కెట్‌ను పరుగులు తీయించే అంశాలని తెలిపాయి. రియల్టీ మార్కెట్ అన్ని విభాగాల్లోనూ వ్యవస్థీకృతం అవుతుందని, కన్సాలిడేషన్ ఏర్పడుతుందని కూడా అంచనా వేశాయి.

అన్మోల్ అంబానీకి రూ.కోటి జరిమానా

రిలయన్స్ హోమ్ ఫైనాన్స్ వ్యవహారంలో అనిల్ అంబానీ కుమారుడు అన్మోల్ అంబానీపై సెబీ కొరడా ఝుళిపించింది. సాధారణ కార్పొరేట్ రుణాలను ఆమోదించే విషయంలో వాస్తవాలను తెలుసుకోకుండా వ్యవహరించటంతో అన్మోల్‌పై రూ.కోటి జరిమానాను సెబీ విధించింది. అలాగే చీఫ్ రిస్క్ ఆఫీసర్‌గా ఉన్న కృష్ణన్ గోపాలకృష్ణన్‌కు కూడా రూ.15 లక్షల జరిమానా విధించింది. ఇరువురు 45 రోజుల్లోగా ఈ జరిమానాలను చెల్లించాలని ఆదేశించింది.

- హైదరాబాద్ కేంద్రంగా ఉన్న ఎంటార్ టెక్నాలజీస్.. డిఫెన్స్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ లేబొరేటరీ (డీఆర్‌డీఎల్) నుంచి రూ.15.4 కోట్ల ఆర్డర్‌ను అందుకున్నట్లు ప్రకటించింది. ఆర్డర్‌లో భాగంగా రక్షణ రంగం కోసం అభివృద్ధి చేస్తున్న కొత్త తరం ఇంజన్‌కు కంబస్టర్స్ సరఫరా చేయాల్సి ఉంటుందని తెలిపింది.

బిజినెస్

'జీసీసీ'ల టెక్ టాలెంట్ కేంద్రంగా హైదరాబాద్

టీమ్‌లీజ్ డిజిటల్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐటీ) హబ్‌గా ఉన్న హైదరాబాద్ గ్లోబల్ క్యాపబిలిటీ సెంటర్స్ (జీసీసీ)కీ కేంద్రంగా ఎదుగుతోంది. దీంతో ఈ కేంద్రాల్లో పని చేసే డిజిటల్ టెక్నాలజీల నిపుణులకు మంచి డిమాండ్ ఏర్పడింది. దేశంలోని జీసీసీలకు అవసరమైన డిజిటల్ నిపుణుల్లో 45 శాతం మంది హైదరాబాద్ నుంచే వస్తున్నట్టు సోమవారం వెలువడిన టీమ్‌లీజ్ డిజిటల్ నివేదిక తెలిపింది. ఈ ఏడాది తొలి ఆరు నెలల్లో తన సేవలు అందుకున్న క్లయింట్లలో 14 శాతం జీసీసీలు హైదరాబాద్ జీసీసీలని వెల్లడించింది. ఈ కేంద్రాల్లో పనిచేసే క్లౌడ్ కంప్యూటింగ్, కృత్రిమ మేధ (ఏఐ), సైబర్ సెక్యూరిటీ, బ్లాక్ చెయిన్, రోబోటిక్స్, డేటా అనలిటిక్స్ నిపుణుల్లో 45 శాతం మంది హైదరాబాదీలని పేర్కొంది.

ఏఎం గ్రీన్ చేతికి కెమ్‌పొలిస్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): హైదరాబాద్ కేంద్రంగా ఉన్న ఏఎం గ్రీన్ గ్రూప్ అనుబంధ సంస్థ ఏఎం గ్రీన్ టెక్నాలజీ అండ్ సొల్యూషన్స్ బీవీ.. ఫిన్లాండ్‌కు చెందిన కెమ్‌పొలిస్ ఓవై, ఫోర్టమ్ 3 బీవీ చేజిక్కించుకున్నట్లు వెల్లడించింది. ఈ మేరకు ఇరు సంస్థలతో ఒప్పందం కుదుర్చుకున్నట్లు తెలిపింది. ఈ కొనుగోలుతో ఏవియేషన్, ఇంధన, కెమికల్స్ సహా ఇతర రంగాలకు అవసరమైన అధిక విలువతో కూడిన పర్యావరణహిత (గ్రీన్) ఇంధనాలను ఉత్పత్తి చేసే అవకాశం లభిస్తుందని పేర్కొంది. అంతే కాకుండా పెద్దఎత్తున బయో రిఫైనరీలను ఏర్పాటు చేసే వీలు కలుగుతుందని తెలిపింది. అంతర్జాతీయ విమానయాన కంపెనీల కోసం 0.5 ఎంటీపీఏ సస్టెయినబల్ ఏవియేషన్ ఇంధనాన్ని ఉత్పత్తి చేసేందుకు వచ్చే మూడేళ్లలో రూ.8,400 కోట్ల (100 కోట్ల డాలర్లు)కు పైగా పెట్టుబడులు పెట్టనున్నట్లు ఏఎం గ్రీన్ వెల్లడించింది.

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	76,150 ▲	69,800 ▲	98,000 ▲
ముంబై	74,467 ▲	68,212 ▲	87,756 ▼

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

24వ తేదీ			
హైదరాబాద్	525	విజయవాడ	555
వరంగల్	527	గోదావరి	550
చిత్తూరు	543	విశాఖపట్నం	555
		దజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర		వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్	
హైదరాబాద్	125	విజయవాడ	121
వరంగల్	125	గుంటూరు	126
కరీంనగర్	125	ఒంగోలు	126
మహబూబ్‌నగర్	125	చిత్తూరు	118
కర్నూలు	125	నెల్లూరు	118
విశాఖపట్నం	107	అనంతపురం	118
గోదావరి	121		

శాస్త్రోక్తంగా శాంతిహోమం



ఏలూరు జిల్లాలోని ద్వారకాతిరుమల వేంకటేశ్వరస్వామి ఆలయంలో మహాశాంతి హోమం నిర్వహిస్తున్న అర్చకులు

(మొదటి పేజీ తరువాయి)

ఆలయం, అఖిలాండం వద్ద ప్రోక్షణ చేశారు. ప్రోక్షణం అనంతరం శ్రీవారి ఆలయం ప్రధాన అర్చకుడు వేణుగోపాల దీక్షితులు, ఆగమ సలహాదారుడు మోహన రంగాచార్యులు మాట్లాడుతూ.. శాంతిహోమంలో భాగంగా వైదిక కార్యక్రమాలను ఆగమోక్తంగా నిర్వహించామన్నారు. ఈ హోమాలతో లడ్డూప్రసాదాలు, నైవేద్యాలకు ఎలాంటి దోషాలు ఉండవని, భక్తులు సంతోషంగా స్వీకరించవచ్చన్నారు. సాయంత్రం ఆరు గంటలకు శ్రీవారి భక్తులు తమ ఇంటిలో దీపారాధన చేసే సమయంలో క్షమా మంత్రాలైనా..'ఓం నమో నారాయణాయ, ఓం నమో భగవతే వాసుదేవాయ, ఓం నమో వేంకటేశాయ'ను పఠించి శ్రీవారి అనుగ్రహం పొందాలని సూచించారు. టీటీడీ ఈవో శ్యామలరావు మాట్లాడుతూ.. రుత్వికులు వాస్తుశుద్ధి, కుంభజాల సంప్రోక్షణ నిర్వహించారన్నారు. ఈ శాంతిహోమం ద్వారా భక్తులు లడ్డూప్రసాదం, నాణ్యతపై ఉన్న భయాలను, అపోహలను పక్కన పెట్టవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఈవో వెంకయ్య చౌదరి, ప్రధాన అర్చకులు గోవిందరాజదీక్షితులు, కృష్ణశేషాచల దీక్షితులు, ఆగమ సలహాదారు రామకృష్ణదీక్షితులు, సీతారామ దీక్షితులు, వేదపారాయణదారులు, రుత్వికులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.



లడ్డూలు నిల్వ చేసిన కేంద్రంలో సంప్రోక్షణ చేస్తున్న అర్చకులు

ద్వారకాతిరుమల క్షేత్రంలో

తిరుమల తిరుపతి లడ్డూ ప్రసాదంలో అపచారం జరిగిన నేపథ్యంలో ఏలూరు జిల్లాలోని ద్వారకాతిరుమల వేంకటేశ్వర స్వామి ఆలయంలో లఘు సంప్రోక్షణ, మహాశాంతి హోమం నిర్వహించారు. అపచారాల పరిహారం కోసం ఆలయంలో ఆగమ శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారని గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు తెలిపారు.

తిరుమల పవిత్రత కాపాడటమే లక్ష్యం

- నెయ్యిలో జంతువుల కొవ్వు ఉన్నట్లు నివేదిక వెల్లడి
- విచారణ పూర్తయ్యాక సీఎంకు అందజేస్తాం: ఆనం



తిరుమలలో శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయ పవిత్రతను కాపాడటమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని దేవదాయ, ధర్మాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి స్పష్టం చేశారు. నెల్లూరు జిల్లా ఆత్మకూరులోని శ్రీదేవి భూదేవి సమేత అలఘునాథస్వామి ఆలయ సంప్రోక్షణ, పూజా కార్యక్రమాల్లో మంత్రి పాల్గొన్నారు. తిరుమలలో 2022 నుంచి టెండరు నిబంధనలను మార్చి గత ప్రభుత్వం ఇష్టానుసారంగా వ్యవహరించిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. మూడేళ్ల అనుభవం ఉన్న కంపెనీలకు టెండర్లు ఇవ్వాల్సి ఉన్నా, నిబంధనలను పక్కన పెట్టి ఏడాది లోపు అనుభవం ఉన్న కంపెనీలకు ఇచ్చారని తెలిపారు. భక్తులు పవిత్రంగా భావించే శ్రీవారి లడ్డూ ప్రసాదంలో ఉపయోగించే నెయ్యి, ఇతర పదార్థాలు నాణ్యత లేనివి వినియోగించారని ఆవేదన వ్యక్తం చేశారు. లడ్డూ తయారీలో వాడే నెయ్యిలో వివిధ జంతువుల కొవ్వు ఉన్నట్లు ల్యాబ్ రిపోర్టులో తేలిందని, దీనిపై విచారణ పూర్తయ్యాక నివేదికలను ముఖ్యమంత్రికి అందిస్తామని తెలిపారు. భక్తులను దోపిడీ, మోసం చేయడమే లక్ష్యంగా గత ప్రభుత్వ పాలన కొనసాగిందని మండిపడ్డారు. తిరుమలలో జరిగిన అపచారం నుంచి మన్నించమని భగవంతుడిని ప్రార్థిస్తూ రాష్ట్రవ్యాప్తంగా అన్ని ఆలయాల్లో మహా సంప్రోక్షణ, ఆలయ శుద్ధి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తిరుమల ఆలయ పవిత్రను కాపాడటమే లక్ష్యంగా ప్రక్షాళనకు శ్రీకారం చుట్టామని పేర్కొన్నారు. సోమశిలలోని శ్రీ సోమేశ్వరస్వామి ఆలయంలో రూ.12 కోట్లతో అభివృద్ధి పనులు త్వరలోనే మొదలు పెడతామని వివరించారు.

స్పెషల్ దందా!

(మొదటి పేజీ తరువాయి)

వెంకటేశ్వరస్వామి ఆలయం, మొత్తంగానే తిరుమలను తన సొంత సామ్రాజ్యంగా సుబ్బారెడ్డి మార్చుకున్నారు. తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) తన సొంత జాగీరన్నట్లుగా వ్యవహరించారు. తిరుమలేశుడి భక్తిలో తరించాల్సిన ఆయన వీవీఐపీల సేవలో రాణించారు. నిబంధనలు, పద్ధతులు అన్నవేవి ఆయనకు పట్టవన్నట్లుగా చెలరేగిపోయి, సిఫారసు లేఖలు జారీ చేశారు. అంతేనా ఆ లేఖలకు పక్కాగా దర్శనం, సేవలు దక్కేలా దగ్గరుండి చూసుకున్నారు. ఆయన చైర్మన్‌గా ఉన్న కాలంలో ఏకంగా 3.60 లక్షలమందికి వీవీఐపీ ప్రత్యేక దర్శనాలు, సేవలు కల్పించారు. దేశం అంతా కరోనాతో ఇంటికే పరిమితమైన కాలంలో కూడా ఆయన వీఐపీ సేవలు అందించారు. రోజుకు సగటున 364 మందికి ఆయన వీఐపీ భాగ్యం కల్పించారు. టీటీడీ చరిత్రలో ఇంతలా వీవీఐపీ లేఖలు ఇచ్చి తరించిన చైర్మన్ వైవీ తప్ప మరొకరు లేరు. ఇంతలా వీఐపీ దర్శనాలు చేయించడంలోని మర్మం ఏమిటి? అన్న ప్రశ్నలు ఇప్పుడు తలెత్తుతున్నాయి. నిజంగా తిరుమలేశుడి సేవే చైర్మన్‌గా ఆయన పనితీరులో చూపించాలి. ఆధ్యాత్మికతను మరింత పెంపొందించాలి. తిరుమల ప్రతిష్ఠను మరింత పెంపొందించాలి. దానికి భిన్నంగా లక్షల మందికి వీఐపీ దర్శనాలు ఇప్పించారు. దీనివెనక ఉన్న మర్మం ఏమిటి? వీఐపీ దర్శనాల పేరిట వైవీ సుబ్బారెడ్డి ఏమైనా వ్యాపారం చేశారా? సిఫారసు లేఖలకు ధరకట్టి వ్యాపారం నిర్వహించారా? అన్న అనుమానాలు కూడా కలుగుతున్నాయి. ఈ అనుమానాల వెనుక ఉన్న నిజాలేవిటో తెలిస్తే అసలు విషయం బోధపడుతుంది..

వీవీఐపీల సేవలో...

2019లో ముఖ్యమంత్రి అయిన వెంటనే జగన్ తన బాబాయి వైవీ సుబ్బారెడ్డిని తిరుమల తిరుపతి దేవస్థానం చైర్మన్‌గా నియమించారు. ఆ తర్వాత తన అవసరాలకు తగినట్లుగా బోర్డు సభ్యులను నియమించుకున్నారు. వైవీ సుబ్బారెడ్డి టీటీడీకి 2019 జూన్ 21 నుంచి 2021 ఆగస్టు వరకు తొలి దఫా చైర్మన్‌గా పనిచేశారు. ఆ తర్వాత 2021, ఆగస్టు 8 నుంచి 2023 ఆగస్టు 27 వరకు రెండో దఫా చైర్మన్‌గా ఉన్నారు. చైర్మన్ హోదాలో ఆయన ప్రధాన విధి తిరుమల తిరుపతి దేవస్థానం ఆలనా, పాలనా వ్యవహారాలు చూసుకోవడం, దేవస్థానం అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం, ఉద్యోగుల సంక్షేమం కోసం పనిచేయడం. వీటితోపాటు తిరుమలేశుడి సేవ ఎలాగూ ఉంటుంది. నిబంధనల ప్రకారం తనకు తెలిసిన వ్యక్తులు, నియోజకవర్గ ప్రజలు, ఇతరులకు చైర్మన్ హోదాలో వెంకన్న దర్శనం కల్పించవచ్చు. ఇలా రోజుకు ఎంత మందికి దర్శనం కల్పించాలన్న దానిపై కొన్ని నియమ నిబంధనలున్నాయి. చైర్మన్ కోటా కింద రోజుకు సగటున ఆరుగురు లేదా 12 మందికి దర్శనం కల్పించవచ్చు. ఒక్కో సిఫారసు లేఖపై ఆరుగురికి 300 రూపాయలు, లేదా వీవీఐపీ దర్శనం ఉంటుంది. మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఇతర ప్రజాప్రతినిధులు, న్యాయమూర్తులు, అధికారులకు కూడా ఎంతమందికి దర్శనం లేఖలు ఇవ్వాలన్నదానిపై నిర్దిష్ట పరిమితి ఉంటుంది. వైవీ జమానాలో ఈ పరిమితికి గండికొట్టారు. రోజుకు ఎంత మందికి అంటే అంత మందికి వీవీఐపీ దర్శన భాగ్యం కల్పించారు. ఆయన రెండు దఫాలుగా చైర్మన్‌గా పనిచేసిన కాలంలో 3,60,338 మందికి వీవీఐపీ ప్రత్యేక ప్రవేశ దర్శనాలు, తిరుమలేశుడి సేవలు (కల్యాణం, నిజపాదదర్శనం, వస్త్రాలంకరణ) కల్పించారు. రోజుకు సగటున 364 మందికి చైర్మన్ హోదాలో సిఫారసు లేఖలు జారీ చేశారు. సగటున ఒక్క లేఖపై ఆరుగురికి దర్శనం అంటే, రోజుకు సగటున 60 లేఖలు ఇచ్చారు.

కరోనాలోనూ తగ్గని 'సిఫారసు'

2020 ఫిబ్రవరి నుంచి కరోనా ప్రభావం నెలకొంది. ఆ తర్వాత మార్చినుంచి ఆగస్టు వరకు లాక్‌డౌన్ కొనసాగింది. ఆ సమయంలో ఆలయంలోకి భక్తులను అనుమతించలేదు. సెప్టెంబరు నుంచి మళ్లీ ఫిబ్రవరి వరకు దర్శనాలను అనుమతించారు. భౌతిక దూరం పాటిస్తూ భక్తులను వెంకన్న దర్శనానికి అనుమతించారు. ఆ తర్వాత 2021 మార్చి తర్వాత మరోసారి లాక్‌డౌన్ విధించారు. ఆ సమయంలో భౌతికదూరంతో కూడిన దర్శనాలను అనుమతించారు. ఈ సమయంలో కూడా వైవీ సిఫారసుల దర్శనాలు సాగాయి. అంటే, ఆయన రెండేళ్ల తొలి దఫా చైర్మన్‌గిరిలో సింహభాగం కరోనాకాలమే. ఆ తర్వాత రెండో దఫాలోనూ లెక్కలేని దర్శనాలు చేయించారు. కోటా, పరిమితి, నియమనిబంధనలు పట్టకుండా తోచినట్లుగా సొంత మనుషులకు ప్రత్యేక ప్రవేశ దర్శనాలు కల్పించారు. అయితే ఆ జాబితాపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సగటున రోజుకు 12 మందికి మించి అనుమతించరాదని వైవీకి తెలియని విషయం కాదు అయినా ఆ నియమం పక్కనపెట్టి రోజుకు 364 మందికి ప్రత్యేక ప్రవేశ దర్శనాలు కల్పించడం అనేక అనుమానాలకు తావిస్తోంది. ప్రత్యేక దర్శనాల పేరిట ఆయన ఏమైనా వ్యాపారం చేశారా? సిఫారసు లేఖలకు ధరకట్టి వ్యాపారం నిర్వహించారా? అన్న అనుమానాలు ఇప్పుడు బలంగా వ్యక్తమవుతున్నాయి. చైర్మన్ కోటాలో ప్రత్యేక ప్రవేశ దర్శనం అంటే ఇచ్చితంగా ప్రోటోకాల్ కిందే ఉంటుంది. సకల మర్యాదలు ఉంటాయి. సామన్యులకు ఇది సాధ్యమయ్యేది కాదు.

నాడు జాతరలా దర్శనాలు

ధనికులు, సంపన్నవర్గాలు, రాజకీయ పలుకుబడి కలిగిన వారికే ఇలాంటివి దక్కుతాయి. లేదంటే, వైవీ కుటుంబీకులు, సన్నిహిత బంధువులకే ఇలాంటి అవకాశాలు వస్తుంటాయి. కానీ వైవీ మనుషులు మహా అంటే 50వేల మంది ఉన్నా, మిగిలిన 3.10 లక్షల మంది ఎవరన్నదే అతిపెద్ద ప్రశ్న. ఆయన లేఖల వెనుక వ్యాపార కోణం ఏమైనా ఉందా అని సందేహించడానికి ఇదీ ఓ కారణమని అధికారవర్గాలు చెబుతున్నాయి. ఇదిలా ఉంటే, చైర్మన్ బాటలోనే అధికారులు, సభ్యులు నడిచారు. మంత్రులయితే ఇక లెక్కేలేదు. మాజీ మంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, రోజా, చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి సిఫారసుల లేఖలకు లెక్కేలేదు. ఒక్కో మంత్రి రోజుకు సగటున 50-70 మందిపేర్లు ప్రత్యేక దర్శనాలకు సిఫారసు చేశారు. రోజా మంత్రిగా ఉండగా తిరుమల దర్శనానికి కనీసం 40-60 మందితో వెళ్లేవారు. ఆమె వచ్చారంటే కొండపై ఓ జాతరలాగనే ఉండేది.

భూమనదీ అదే దారి

జగన్‌కు సన్నిహితుడు, వైసీపీ నేత భూమన కరుణాకర్‌రెడ్డి 2023 సెప్టెంబరు నుంచి తొమ్మిది నెలల పాటు తిరుమల దేవస్థానం చైర్మన్‌గా పనిచేశారు. దైవభక్తిని పెంపొందించేందుకు, ఆధ్యాత్మికను నలుదిశలా వ్యాప్తింప చేసేందుకు అనేక చర్యలు తీసుకున్నట్లుగా చెబుతున్న ఆయన సిఫారసు లేఖలు, వివిపీ దర్శనాల విషయంలో వైవీకి ఏమాత్రం తీసిపోలేదు. తొమ్మిది నెలల కాలంలో భూమన 43 వేల మందికి ప్రత్యేక దర్శనాలు కల్పించారు. తిరుమలపై రద్దీ ఉన్న రోజుల్లో, వీఐపీల తాకిడి ఎక్కువగా ఉన్న సమయంలో ఆయన సగటున 172 మందికి ప్రత్యేక దర్శనాలు కల్పించారు. ఆయన కోటాలో దర్శన భాగ్యం పొందిన వారిలో అత్యధికులు రాష్ట్రేతరులే ఉండటం గమనార్హం.

టీటీడీ ఆస్తుల రక్షణ.. ప్రభుత్వ బాధ్యత



- గత పాలక మండళ్ల నిర్ణయాలపై సమగ్ర విచారణ చేయాలి
- సీఎం చంద్రబాబుకు డిప్యూటీ సీఎం పవన్ విజ్ఞప్తి

అమరావతి, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆస్తులను తనఖాలు పెట్టేసిన గత పాలకులు.. దేవుడి మాన్యాలు, ఆస్తుల జోలికి వెళ్లకుండా ఉంటారా? అనే సందేహం ప్రజల్లో ఉందని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. 'టీటీడీ ఆస్తులు, ఆభరణాలతో పాటు దేవదాయ శాఖ పరిధిలోని అన్ని ఆలయాలూ, సత్రాల ఆస్తుల వివరాలు, సదరు ఆస్తుల ద్వారా వస్తున్న రాబడినీ ప్రజలకు తెలియజేయాల్సిన అవసరం ఉంది. తద్వారా దేవుడి ఆస్తులు అన్యాక్రాంతం కాకుండా ఉండటంతో పాటు ఆలయాల పాలక మండళ్లు జవాబుదారీతనంతో పని చేస్తాయి. ఆ దిశగా కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తుంది' ఆయన ప్రజలకు హామీ ఇచ్చారు. టీటీడీకి సంబంధించిన ఆస్తులే కాకుండా దేవదాయ శాఖ పరిధిలోని అన్ని ఆలయాలు, సత్రాల ఆస్తుల విషయంలోనూ ఒక సమీక్ష అవసరమని సీఎం చంద్రబాబును కోరారు. 'తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామిపై అచంచల విశ్వాసంతో భక్తులు ఎంతో విశ్వాసంతో ఇచ్చిన ఆస్తులను నిరర్థకం అంటూ విక్రయించాలని వైసీపీ పాలనలోని టీటీడీ పాలక మండలి నిర్ణయించి ప్రకటన కూడా ఇచ్చింది. అసలు నాటి పాలక మండలి స్వామి వారి ఆస్తులను పరిరక్షణ కంటే పప్పుబెల్లాల్లా అమ్మేయడానికే ఎందుకు ఉత్సాహపడింది? వారిని ఆ విధంగా నడిపించింది ఎవరనేది బయటకు తీస్తాం. స్వామి వారి ఆస్తులను గత పాలక మండళ్లకు నేతృత్వం వహించిన వారు కాపాడారా? అమ్మేశారా? అన్న సందేహాలు వస్తున్నాయి. తిరుమల శ్రీవారి ఆస్తులను పరిరక్షించే బాధ్యతను కూటమి ప్రభుత్వం తీసుకొంటుంది. ఈ క్రమంలో గత పాలక మండళ్లు టీటీడీ ఆస్తుల విషయంలో చేసిన నిర్ణయాలపై సమగ్ర విచారణ చేయించాలని ఈ సందర్భంగా సీఎం చంద్రబాబును విజ్ఞప్తి చేస్తున్నా' అని పేర్కొన్నారు. 'వైసీపీ హయాంలో టీటీడీ పాలక మండలి తమిళనాడులో 23 ఆస్తులను వేలం ద్వారా విక్రయించాలని, ఆ ఆస్తుల విలువ రూ.23.92 కోట్లుగా లెక్కగట్టారు. నిరర్థక ఆస్తుల విక్రయం ద్వారా రూ.100 కోట్ల ఆదాయాన్ని సమకూర్చుకోవాలని ప్రయత్నించింది. ఆ రోజు ప్రతిపక్షంలో ఉన్న మేము బలంగా, బాధ్యతగా స్పందించడంతో వేలం ఆగింది' అని గుర్తు చేశారు. తిరుమల శ్రీవారికి కొన్ని శతాబ్దాలుగా రాజులు, భక్తులు ఇచ్చిన నగలు, ఆభరణాల జాబితాను కూడా పరిశీలించి, వాటి పరిస్థితిని కూడా గణించాలని టీటీడీ అధికారులకు డిప్యూటీ సీఎం సూచించారు. ఎందుకంటే స్థిరాస్తులను అమ్మేయాలని చూసిన వాళ్లు ఆభరణాలు, బంగారం విషయంలో కూడా కచ్చితంగా పెడపోకడలతో ఏవైనా అవాంఛనీయ నిర్ణయాలు తీసుకున్నారా? అనేది తేల్చాల్సి ఉందన్నారు.



యాగంలో పాల్గొన్న మంత్రి మనోహర్

భక్తుల మనోభావాలను పట్టించుకోలేదు

దోషులపై చర్యలు తప్పవు: మంత్రి నాదెండ్ల ఫైర్

తెనాలి అర్బన్, సెప్టెంబరు 23: గత ప్రభుత్వం తిరుమలలో భక్తుల మనోభావాలు పట్టించుకోకుండా పాలన వ్యవహారాలు నడిపిందని పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ మండిపడ్డారు. గుంటూరు జిల్లా తెనాలి వైకుంఠపురంలోని శ్రీలక్ష్మీపద్మావతీ సమేత శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో సోమవారం యాగం నిర్వహించారు. ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ప్రాయశ్చిత్త దీక్షకు సంఘీభావంగా టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులతో కలిసి ఆయన యాగంలో పాల్గొన్నారు. అనంతరం విలేకర్లతో మంత్రి మాట్లాడారు. వందల ఏళ్ల నుంచి తిరుమల పవిత్రతను కాపాడుకుంటూ వస్తున్నారని, కానీ గత వైసీపీ ప్రభుత్వం బాధ్యత లేని వారిని పదవులలో నియమించి హిందూ ధర్మానికి భిన్నంగా వ్యవహరించిందని ఆవేదన వ్యక్తంచేశారు. దోషులపై చర్యలు తప్పవని మనోహర్ హెచ్చరించారు.

లడ్డూ కల్తీపై సీబీఐతో విచారించాలి

- నెల్లూరు కలెక్టరేట్ ఎదుట స్వామీజీల ఆందోళన

నెల్లూరు (హరనాథపురం), సెప్టెంబరు 23 : శ్రీవారి లడ్డూలో జంతువుల అవశేషాలు కలిపిన వ్యవహారాలపై సీబీఐతో విచారణ జరిపించాలని కోరుతూ నెల్లూరు జిల్లాకు చెందిన పలువురు స్వామీజీలు సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. ఈ కార్యక్రమంలో రామయణం మహేష్ స్వామి, దయానంద స్వామి, రామానందగిరి స్వామి, శ్రీ శ్యామానందస్వామి, శ్రీ రాజ రాజేశ్వరి రంగనాథ భక్త మండలి సభ్యులు పాల్గొన్నారు. లడ్డూను అపవిత్రం చేయడమేగాక ఆ లడ్డూలను అయోధ్య బాల రాముడికి పంపించి మరింత అపచారానికి ఒడిగట్టారని మండిపడ్డారు.

ఆవు నెయ్యి కన్నా పంది కొవ్వు విలువైందట!

- పొన్నవోలు వ్యాఖ్యలు వైసీపీ బరితెగింపునకు నిదర్శనం
- బ్రాహ్మణ చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు శ్రీధర్ శర్మ

గుంటూరు, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): తిరుమల లడ్డూ అపచారంపై దేశంలోని ప్రముఖ పీఠాధిపతులు స్పందించినా, తెలుగు రాష్ట్రాల్లో పెట్టుడు పీఠాలు పెట్టుకున్న చిన్న జీయర్ స్వామిజీ, విశాఖ శారద పీఠాధిపతులు స్వరూపానంద, స్వాత్మానంద స్వామీజీలు ఎందుకు నోరు మెదపట్లేదని బ్రాహ్మణ చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు సిరిపురపు శ్రీధర్ శర్మ ప్రశ్నించారు. ఇక, వైసీపీతో అంటకాగిన మాజీ అడ్వకేట్ జనరల్ పొన్నవోలు సుధాకర్ ఈ అంశంపై సోమవారం ఢిల్లీలో మాట్లాడుతూ.. పంది కొవ్వు ప్రపంచంలోనే అత్యంత విలువైనదని, అది బంగారంతో సమానమని, ఆవు నెయ్యి రాగి, ఇత్తడి వంటి వస్తువు అని.. బంగారంలో రాగి కలిపితే తప్పేమిటని వ్యాఖ్యానించడం వైసీపీ నాయకుల అహంకారానికి, బరితెగింపునకు నిదర్శనమని శ్రీధర్ దుయ్యబట్టారు. అయన వ్యాఖ్యలను బట్టి ఆవు నెయ్యిలో పంది కొవ్వు కలిపి కల్తీచేసిన మాటవాస్తవమేనని పరోక్షంగా అంగీకరించినట్లయిందన్నారు.

ఏఆర్ ఫుడ్స్‌కు కేంద్రం నోటీసులు

- తిరుమల లడ్డూలో నెయ్యి కల్తీపై సీరియస్

న్యూఢిల్లీ, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): తిరుమల లడ్డూలో వాడే నెయ్యి కల్తీ వ్యవహారాన్ని కేంద్రం తీవ్రంగా పరిగణిస్తోంది. నెయ్యి సరఫరా చేసిన ఏఆర్ ఫుడ్స్ కంపెనీకి భారత ఆహార భద్రత-ప్రమాణాల విభాగం (ఎఫ్ఎస్ఎస్ఏఐ) నోటీసులు జారీ చేసినట్లు తెలిసింది. నాలుగు కంపెనీల నుంచి నమూనాలను ఈ విభాగం సేకరించిందని, నాణ్యత పరీక్షలో ఏఆర్ ఫుడ్స్‌కు చెందిన నెయ్యి విఫలం కావడంతో గత శుక్రవారమే నోటీసులు ఇచ్చినట్లు సంబంధిత వర్గాల ద్వారా సమాచారం అందింది. మరికొన్ని సంస్థలకు కూడా షోకాజ్ నోటీసులు పంపినట్లు తెలిసింది. సంస్థల సమాధానం, రాష్ట్ర ప్రభుత్వ నివేదిక మేరకు చర్యలు తీసుకుంటామని ఎఫ్ఎస్ఎస్ఏఐ వర్గాలు తెలిపాయి.

లడ్డూపై సుప్రీంకోర్టులో పిటిషన్లు

- స్వతంత్ర కమిటీ ఏర్పాటు చేయండి : సుబ్రమణ్య స్వామి
- సిట్టింగ్ లేక రిటైర్డు జడ్జీతో విచారణ: వైవీ సుబ్బారెడ్డి
- ఇప్పటివరకు దీనిపై సుప్రీంకోర్టులో నాలుగు పిటిషన్లు
- 'ఎఫ్ఎస్ఎస్ఏఐ' రిపోర్టు రాగానే చర్యలు : కేంద్రం

న్యూఢిల్లీ, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : ఎద్దు, పంది తదితర జంతువుల కొవ్వులు కలిపిన నెయ్యితో తిరుమల లడ్డూలను తయారుచేసిన వ్యవహారంపై సుప్రీంకోర్టులో కొత్తగా మరో రెండు పిటిషన్లు దాఖలయ్యాయి. సోమవారం బీజేపీ సీనియర్ నేత సుబ్రమణ్య స్వామి, టీటీడీ మాజీ చైర్మన్, వైసీపీ ఎంపీ వైవీ సుబ్బారెడ్డి వేర్వేరుగా సుప్రీంకోర్టును ఆశ్రయించారు. తిరుమల లడ్డూ వ్యవహారంలో సుప్రీంకోర్టు పర్యవేక్షణలో విచారణ కోసం ఒక కమిటీని ఏర్పాటు చేయాలని సుబ్రహ్మణ్యస్వామి పిల్ దాఖలు చేశారు. "ల్యాబ్, టెస్టింగ్ ఏజెన్సీ ద్వారా నమూనా జరిగిందా? శాంపిల్స్ నైవేద్యాల్లో ఉపయోగించిన నెయ్యి నుంచి తీసుకున్నారా? లేదా తిరస్కరించబడిన నమూనాల నుంచి తీసుకున్నారా?." అనేది తేలాల్సి ఉన్నదని సుబ్రమణ్య స్వామి పేర్కొన్నారు. దీనిపై విశ్రాంత లేదా సిట్టింగ్ న్యాయమూర్తి నేతృత్వంలో నిపుణుల కమిటీని ఏర్పాటు చేయాలని వైవీ సుబ్బారెడ్డి మరో పిటిషన్‌లో సుప్రీంకోర్టును కోరారు. కాగా, దీనిపై ఇప్పటికే రెండు పిటిషన్లు సుప్రీంకోర్టులో దాఖలయ్యాయి. కాగా, లడ్డూ కల్తీ వ్యవహారంపై కేంద్ర వినియోగదారుల వ్యవహారాల విభాగం కార్యదర్శి నిధి ఖారే స్పందించారు. ఆహార భద్రత- ప్రమాణాల భారతీయ సంస్థ (ఎఫ్ఎస్ఎస్ఏఐ) నివేదిక అందగానే చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఈ వ్యవహారం తన దృష్టికి వచ్చిన తొలిరోజునే కేంద్ర ఆరోగ్యశాఖ మంత్రి నడ్డా.. 'ఎఫ్ఎస్ఎస్ఏఐ'తో దీనిపై విచారణ జరిపిస్తామని ప్రకటించిన విషయం తెలిసిందే.

తిరుమల లడ్డూ రాగి చెంబు.. పంది కొవ్వు బంగారం!!

- మాజీ ఏఏజీ పొన్నవోలు భాష్యం
- కిలో నెయ్యి రూ.319 మాత్రమే
- పందికొవ్వు ఖరీదు 1,200
- భూమన జమానాలో ఒక్క ట్యాంకరూ సరఫరా చేయలేదు



న్యూఢిల్లీ, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): జగన్ హయాంలో తిరుమల లడ్డూ ప్రసాదంలో జంతువుల కొవ్వు కలిపిన నెయ్యి వాడారంటూ దేశవిదేశాల్లో భక్తులు ఆగ్రహావేశాలతో రగిలిపోతుంటే.. వైసీపీకి చెందిన సీనియర్ న్యాయవాది, మాజీ అదనపు అడ్వకేట్ జనరల్ (ఏఏజీ) పొన్నవోలు సుధాకర్‌రెడ్డి దేశ రాజధాని వేదికగా వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. తిరుమల లడ్డూను రాగి చెంబుతో, పంది కొవ్వును బంగారంతో పోల్చి కలకలం రేపారు. నెయ్యి కంటే పంది కొవ్వే ఖరీదని, అలాంటి ఖరీదైన పందికొవ్వును లడ్డూలో ఉపయోగించే నెయ్యిలో ఎవరైనా కలుపుతారా అని వ్యాఖ్యానించారు. తిరుమల లడ్డూ వ్యవహారంలో సుప్రీంకోర్టు సిట్టింగ్ లేదా విశ్రాంత న్యాయమూర్తి నేతృత్వంలో దర్యాప్తు చేయాలని కోరుతూ టీటీడీ మాజీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి తరఫున పొన్నవోలు సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఆ తర్వాత ఆయన కోర్టు ఎదుట మీడియాతో మాట్లాడారు. తిరుపతి లడ్డూలో కలిపే నెయ్యి ఖరీదు కిలో రూ.319 అని, అదే పంది కొవ్వు మార్కెట్ ధర కేజీ రూ.1,200 వరకు ఉంటుందని తెలిపారు.

'లడ్డూ తయారీలో నెయ్యి కంటే విలువైన పంది కొవ్వును ఎవరైనా కలుపుతారా? రాగి చెంబు తయారీలో ఎవరైనా బంగారాన్ని వాడతారా? బంగారంలో ఇత్తడి కలుపుతారు గానీ ఇత్తడిలో పుత్తడి కలుపుతారా' అని ఎద్దేవాచేశారు. ఏఆర్ ఫుడ్స్ కంపెనీ నెయ్యి సరఫరా చేసే సమయానికి వైసీపీ అధికారంలో లేదన్నారు. అప్పుడు ఎన్నికల కోడ్ ఉందన్నారు. ఆ కంపెనీ సరఫరా చేసిన 4 టాంకర్లలో కల్తీ జరిగినట్లు టీటీడీ ప్రస్తుత ఈవో శ్యామలరావు తెలిపారన్నారు. వాటిని వెనక్కి పంపించామనీ చెప్పారని తెలిపారు. టీటీడీ వద్ద కల్తీని నిర్ధారించే టెస్టింగ్ ల్యాబ్ లేదని చెప్పడం పూర్తిగా అవాస్తవమన్నారు. శర్మిష్ఠ అనే అధికారి టీటీడీకి వచ్చే నెయ్యిని ఎలా పరీక్షిస్తారో వివరించారన్నారు. వైవీ సుబ్బారెడ్డి హయాంలో ఏఆర్ ఫుడ్స్ ఎలాంటి టెండర్ దక్కించుకోలేదన్నారు. కరుణాకర్‌రెడ్డి హయాంలో ఒక్క ట్యాంకర్ కూడా సరఫరా జరగలేదని తెలిపారు.

విజిలెన్స్ నోటీసులకు వివరణ ఇవ్వండి

- వైసీపీ ఎంపీ వైవీ సుబ్బారెడ్డికి హైకోర్టు ఆదేశం

అమరావతి, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): టీటీడీ బోర్డు చైర్మన్‌గా తాను తీసుకున్న నిర్ణయాలు, నిధుల దుర్వినియోగం ఆరోపణలపై విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ జరుపుతున్న విచారణను కొట్టివేయాలని వైసీపీ రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డి దాఖలు చేసిన వ్యాజ్యంలో పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని హైకోర్టు ప్రభుత్వాన్ని ఆదేశించింది. తీర్పు కాపీ అందిన వారం రోజుల్లో నోటీసులకు వివరణ ఇచ్చేందుకు వీలుగా చట్టం అనుమతించిన మేరకు దస్త్రాలను సుబ్బారెడ్డికి అందజేయాలని విజిలెన్స్ అధికారులకు స్పష్టం చేసింది. ఆ తర్వాత మూడు వారాల్లో విజిలెన్స్ అధికారుల నోటీసులకు వివరణ ఇవ్వాలని సుబ్బారెడ్డిని ఆదేశించింది. రాష్ట్ర విజిలెన్స్ విచారణాధికార పరిధిని తేల్చాలంటే ప్రభుత్వ కౌంటర్ అవసరమని అభిప్రాయపడింది. వ్యాజ్యంలో ప్రతివాదులుగా ఉన్న ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, సాధారణ పరిపాలన శాఖ (విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్) ముఖ్య కార్యదర్శి, డైరెక్టర్, విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్పీ, టీటీడీ ఈవోలకు నోటీసులు జారీ చేసింది. విచారణను నవంబరు నాలుగో తేదీకి వాయిదా వేసింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బి.కృష్ణమోహన్ సోమవారం ఉత్తర్వులు జారీచేశారు.

సమష్టి నిర్ణయాలు పిటిషనర్‌కు ఆపాదించడం సరికాదు

టీటీడీ బోర్డు చైర్మన్‌గా తాను తీసుకున్న నిర్ణయాలపై విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విచారణను కొట్టేస్తూ ఆదేశాలివ్వాలని కోరుతూ వైసీపీ రాజ్యసభ ఎంపీ వైవీ సుబ్బారెడ్డి హైకోర్టును ఆశ్రయించారు. ఈ వ్యాజ్యం సోమవారం విచారణకు రాగా వైవీ సుబ్బారెడ్డి తరఫున న్యాయవాది వై.నాగిరెడ్డి వాదనలు వినిపించారు. బోర్డు చైర్మన్‌గా తీసుకున్న పలు నిర్ణయాలపై వివరణ ఇవ్వాలని కోరుతూ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్పీ మొత్తం ఏడు నోటీసులు ఇచ్చారన్నారు. పిటిషనర్ ప్రస్తుతం టీటీడీ బోర్డు చైర్మన్‌గా లేరన్నారు. ఆరోపణలపై వివరణ ఇచ్చేందుకు సంబంధిత డాక్యుమెంట్లు ఇవ్వాలని కోరినప్పటికీ ఎస్పీ స్పందించలేదన్నారు. పిటిషనర్‌పై చేస్తున్న ఆరోపణలకు ఎలాంటి ఆధారాలూ లేవన్నారు. విచారణకు ఆటంకం కలిగించే ప్రయత్నం అడ్వకేట్ జనరల్ (ఏజీ) దమ్మాలపాటి శ్రీనివాస్ స్పందిస్తూ.. విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విచారణ జరిపి సంబంధింత శాఖకు నివేదిక సమర్పిస్తుందన్నారు. చర్యలు చేపట్టే అధికారం విజిలెన్స్‌కు లేదన్నారు. విజిలెన్స్ సమర్పించిన నివేదికను పరిశీలించిన అనంతరం, అవినీతి జరిగిందని నిర్ధారణకు వస్తే సంబంధిత శాఖ చర్యలు ప్రారంభిస్తుందన్నారు. విచారణ ప్రాథమిక దశలో ఉందని, ఈ దశలో పిటిషనర్‌కు నోటీసులు ఇవ్వాల్సిన అవసరమే లేదన్నారు. విచారణలో పారదర్శకత పాటించాలనే ఉద్దేశంతో ఎస్పీ నోటీసులు ఇచ్చి ఉండొచ్చన్నారు. పిటిషనర్ తనకు తెలిసిన సమాచారం చెబితే సరిపోతుందన్నారు. విచారణకు ఆటంకం కలిగించేందుకు పిటిషనర్ ప్రయత్నిస్తున్నారని, ఆయన అపరిపక్వ దశలో కోర్టును ఆశ్రయించారని అన్నారు. రాజ్యాంగంలోని అధికరణ 162 ద్వారా సంక్రమించిన అధికారాలతో టీటీడీ నిర్ణయాలపై విచారణ జరిపే అధికారం విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ శాఖకు ఉందన్నారు. పిటిషనర్ కోరుతున్న దస్త్రాలలో సందేహాస్పదమైనవి ఏమైనా ఉండవచ్చన్నారు. ఇరువైపులవాదనలు పరిగణనలోకి తీసుకున్న న్యాయమూర్తి... విజిలెన్స్ ఎస్పీ అడిగిన ప్రశ్నలకు ఏమి సమాధానాలు ఇవ్వాలో ఈ కోర్టు సలహా ఇవ్వలేదన్నారు. పిటిషనర్ తనకు తెలిసిన సమాచారాన్ని సమాధానంగా ఇస్తే సరిపోతుందన్నారు.

తిరుమలలో భూమన అత్యుత్సాహం

- రాజకీయాలు మాట్లాడనంటూనే ఉల్లంఘన
- బలవంతంగా తరలింపు.. కేసు నమోదు

తిరుమల/తిరుపతి, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): తిరుమల లడ్డూ ప్రసాదం నెయ్యిలో జంతువుల కొవ్వు కల్తీ అంశం తీవ్ర దుమారం రేపుతున్న నేపథ్యంలో టీటీడీ మాజీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి సోమవారం అత్యుత్సాహం ప్రదర్శించారు. తిరుమలలో రెచ్చగొట్టేలా ఎలాంటి రాజకీయ వ్యాఖ్యలు చేయనంటూనే నిబంధనలను ఉల్లఘించి మాట్లాడారు. గత ప్రభుత్వంలో టీటీడీ బోర్డు, అధికారులు రివర్స్ టెండరింగ్‌తో నెయ్యి టెండర్ల నిబంధనలు మార్చారని, అనుభవం లేని వ్యక్తులకు నెయ్యి సరఫరా అప్పగించడంతో నెయ్యిలో కల్తీ జరిగిందని సీఎం చంద్రబాబు మాట్లాడిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో భూమన కరుణాకరరెడ్డి తాను ఏ తప్పు చేయలేదని స్వామి సన్నిధిలోనే ప్రమాణం చేయడానికి వస్తున్నారనే సమాచారంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. తిరుమల అదనపు ఎస్పీ రామకృష్ణ, డీఎస్పీ విజయ్‌శేఖర్, విజిలెన్స్ అధికారులు, సిబ్బంది భారీగా ఆలయం వద్దకు చేరుకున్నారు. తిరుమలలో రెచ్చగొట్టేలా రాజకీయాలు మాట్లాడకూడదంటూ భూమనకు నోటీసులు ఇవ్వాలని భావించిన పోలీసులు తిరుమల జీఎస్సీ టోల్‌గేట్ వద్దకు చేరుకున్నారు. ఎంపీ గురుమూర్తి, తన కుమారుడు అభినయ్‌రెడ్డితో కలిసి జీఎస్సీ వద్దకు చేరుకున్న భూమనను పోలీసులు అడ్డుకున్నారు. తిరుమలలో రాజకీయాలు మాట్లాడటానికి వీలులేదని నోటీసులు అందజేశారు. తాను రాజకీయాలు మాట్లాడేందుకు రాలేదని, కేవలం పుష్కరిణిలో స్నానం చేసి కొబ్బరికాయ కొట్టి వెళ్లిపోతానని భూమన పోలీసులకు చెప్పి నోటీసుపై సంతకం చేసిచ్చారు. దీంతో పోలీసులు ఆయన్ను అనుమతించారు. నేరుగా వరాహస్వామిని దర్శించుకుని పుష్కరిణిలో స్నానం చేశారు. అక్కడి నుంచి మాడవీధిలోకి రాగానే తిరుమల టీడీపీ నేతలు ఎదురుగా వచ్చి 'గోవిందా గోవిందా' అంటూ నినదించారు. అక్కడి నుంచి ఆలయం ముందున్న అఖిలాండం వద్దకు చేరుకున్న కరుణాకరరెడ్డి హారతినిచ్చి కొబ్బరికాయ కొట్టారు. పోలీసులు, విజిలెన్స్ అధికారులు పక్కనే ఉన్నప్పటికీ నోటీసుల నిబంధనలకు విరుద్ధంగా కరుణాకర రెడ్డి రాజకీయ ప్రసంగం చేశారు.



అఖిలాండం వద్ద రూల్స్‌కు విరుద్ధంగా రాజకీయ వ్యాఖ్యలు చేసిన భూమనను అడ్డుకుంటున్న పోలీసులు

హారతి పడుతూ దేవుడిని ప్రార్థిస్తున్నట్టుగా రాజకీయ వ్యాఖ్యలు చేశారు. 'నమో వెంకటేశాయా, వేలవేల దండాలు, అఖిలాండకోటి బ్రహ్మాండనాయకుడికి దండాలు. మూడు సార్లు టీటీడీ బోర్డు చైర్మన్‌గా అవకాశమిచ్చిన స్వామికి దండాలు. గత కొద్ది రోజులుగా నా మనసు కలత చెందుతోంది. నిప్పుల కొలిమిలో నిలబడినట్టుగా ఉంది. సర్వజగత్ రక్షకుడైనా ఈ క్షేత్రంలో క్షుద్ర రాజకీయ మాటలు మాట్లాడటం నిషేధం, అపచారం. పవిత్రమైన క్షేత్రంలో నీ ఆలయంలో.. దేవదేవ లడ్డూ కళంకితమైనదని కలుషిత రాజకీయమనసు ఉండే వ్యక్తులు అత్యంతదారుణంగా ప్రవర్తిస్తున్నారు' అంటూ వ్యాఖ్యలు చేస్తుండగా డీఎస్పీ విజయ్‌శేఖర్ అడ్డుకున్నారు. తిరుపతికి తరలించారు. భక్తుల మనోభావాలు దెబ్బతీశారనే కారణంతో దాదాపు ఐదు సెక్షన్ల కింద భూమన కరుణాకర్‌రెడ్డిపై తిరుమల వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది.

మేం తప్పు చేసుంటే రక్తం కక్కి చనిపోవాలి: భూమన

'కల్తీ నెయ్యిలో తప్పు చేసి ఉంటే మా కుటుంబం సర్వనాశనమై, రక్తం కక్కి చనిపోవాలని, పుష్కరిణిలో మునిగి పంచభూతాల సాక్షిగా ఏ తప్పూ చేయలేదని ప్రమాణం చేశా. శుద్ధి చేయాల్సింది శ్రీవారి ఆలయాన్ని కాదు, చంద్రబాబు నాలుకను' అని భూమన అన్నారు.

జెత్వానీ కేసులో ఆ ముగ్గురు

(మొదటి పేజీ తరువాయి)

కేసు వెలుగు చూశాక పరారైన విద్యాసాగర్‌ను డెహ్రాడూన్‌లో పోలీసులు అరెస్టు చేసిన విషయం తెలిసిందే. అక్కడి కోర్టులో హాజరుపరిచి ట్రాన్సిట్ వారెంట్ తీసుకున్నారు. ఢిల్లీ నుంచి తీసుకొచ్చి ప్రభుత్వాసుపత్రిలో వైద్య పరీక్షలు చేయించారు. అనంతరం న్యాయాధికారి ముందు హాజరు పరిచారు. విద్యాసాగర్‌కు వచ్చే నెల నాలుగో తేదీ వరకు రిమాండ్ విధించారు. అతడిని పోలీసులు విజయవాడ జిల్లా జైలుకు తరలించారు. విద్యాసాగర్‌ను మరింతగా విచారించేందుకు ఐదు రోజులు కస్టడీకి ఇవ్వాలని పోలీసులు పిటిషన్ దాఖలు చేశారు. జెత్వానీ ఫిర్యాదు చేశాక విద్యాసాగర్ అజ్ఞాతంలోకి వెళ్లిపోయాడు. ఢిల్లీలో నివాసం ఉన్నాడు. ఉత్తరాది మహిళతో సహజీవనం చేస్తున్నాడు. కేసు విషయం తెలియడంతో సెల్‌ఫోన్లు స్విచ్ఛాఫ్ చేసుకుని కారులో ఢిల్లీ నుంచి డెహ్రాడూన్‌కు రాకపోకలు సాగించాడు. బళ్లారిలో ఉన్న తన బంధువుతో నిరంతరం టచ్‌లో ఉన్నట్టు పోలీసులు సాంకేతికంగా గుర్తించారు. డెహ్రాడూన్‌లో ట్రీ ఆఫ్ లైఫ్ రీసార్ట్‌లో బస చేస్తున్నాడని పోలీసులకు సమాచారం అందింది. దీంతో ఇక్కడి నుంచి ప్రత్యేక బృందం అక్కడికి వెళ్లి నిఘా పెట్టింది. కారులో రిసార్ట్‌లోకి వెళ్తుండగా విద్యాసాగర్‌ను పట్టుకున్నారు.

జెత్వానీపై తప్పుడు కేసు

"ముంబైకి చెందిన కాదంబరి నరేంద్రకుమార్ జెత్వానీ ఎంబీబీఎస్ పూర్తిచేసింది. ముంబై, అహ్మదాబాద్, హైదరాబాద్‌లో నటిగా, మోడల్‌గా పనిచేసింది. ముంబై, హైదరాబాద్‌లో మోడలింగ్ చేస్తున్నప్పుడు విద్యాసాగర్ పరిచయం చేసుకున్నాడు. ఈ సమయంలోనే విద్యాసాగర్ భార్య కోర్టులో విడాకుల పిటిషన్ దాఖలు చేసింది. కాదంబరితో పరిచయం బాగా పెరిగాక విద్యాసాగర్ పెళ్లి ప్రతిపాదన చేశాడు. 2015లో ఆమె తిరస్కరించింది. దీంతో ఆమెపై అసత్య ఆరోపణలు చేస్తూ, అసభ్యకర ఫొటోలను పంపి వేధించాడు. విద్యాసాగర్ వైసీపీ నాయకుడు. అతడికి పార్టీలో ప్రధాన నేతలతో సంబంధాలు ఉన్నాయి. కాదంబరిపై పగ తీర్చుకోవడానికి రాజకీయ అధికారాన్ని ఉపయోగించుకున్నాడు. రాష్ట్రస్థాయి పోలీసు అధికారులు, కమిషనరేట్ అధికారులపై ఒత్తిడి చేసి నేరపూరిత కుట్రకు స్కెచ్ వేశారు. విద్యాసాగర్ ఇబ్రహీంపట్నం పోలీసులకు ఫిర్యాదు చేసి ఆమెపై తప్పుడు కేసును బనాయించాడు. ప్రస్తుత కేసులో నిందితులుగా ఉన్న పోలీసు అధికారులు అతడికి సహకరించారు. ఫోకల్ పోస్టింగ్‌లు, బదిలీలు లేకుండా చేసుకోవడం కోసం పోలీసు అధికారులు అతడితో చేతులు కలిపారు" అని రిమాండ్ రిపోర్టులో పేర్కొన్నారు.

పోలీసులు నిబంధనల ఉల్లంఘన

"విద్యాసాగర్ మహారాష్ట్రలో రూ.100 స్టాంపు పేపరుపై ఒక నకిలీ డాక్యుమెంట్‌ను తయారు చేశాడు. 80ఏఏ14164 నంబరు గల ఈ డాక్యుమెంట్‌ను 2018 నవంబరు 30న రాసినట్టుగా చూపించాడు. స్టాంపు పేపరును 2018 నవంబరు 20న అమ్మినట్టుగా దానిపై ఉంది. దీనిపై ఒక కథనాన్ని రాశారు. చింద వీరవెంకట నాగేశ్వరరాజు, భరత్‌కుమార్ నుంచి ఆమె రూ.5 లక్షలు తీసుకున్నట్టు పేర్కొన్నారు. భూమి అమ్మకానికి సంబంధించి ఈ డబ్బులు తీసుకున్నట్టు రాశారు. తర్వాత విద్యాసాగర్‌కు మేలు చేసేలా పోలీసు అధికారులు తప్పుదారిలో దర్యాప్తు చేశారు. ముంబైలో ఈ ఏడాది ఫిబ్రవరి 3న కాదంబరి కుటుంబ సభ్యులను చట్టవిరుద్ధంగా అరెస్టు చేశారు. జగ్గయ్యపేటలో విద్యాసాగర్‌కు సంబంధించిన సర్వేనంబరు 396/2ఏ2హెచ్/1ఎలో ఐదు ఎకరాల భూమి విక్రయం చేస్తున్నట్టుగా నకిలీ డాక్యుమెంట్‌ను తయారు చేశారు. అందులో ఎక్కడా కాదంబరి సంతకం లేదు. దీన్నిబట్టి డాక్యుమెంట్ నకిలీదని నిర్ధారించాం. క్రైం నంబరు 90/2024 కేసులో ఇబ్రహీంపట్నం పోలీసులు చింద వీరవెంకట నాగేశ్వరరాజు, భరత్‌కుమార్‌ను పిలిపించి ఫిబ్రవరి 2న వాంగ్మూలం నమోదు చేశారు. తాము కాదంబరిని ఎప్పుడూ చూడలేదని, ఆమెకు డబ్బులు ఇవ్వలేదని చెప్పారు. కొండపల్లి ఖిల్లా వద్ద కాదంబరిని వారు కలిశారా లేదా అన్నదానిపై అప్పటి దర్యాప్తు అధికారి విచారణ చేయలేదు. ఏ2 (పీఎస్ఆర్ ఆంజనేయులు), ఏ3(కాంతిరాణా), ఏ6(విశాల్‌గున్నీ)కి కాదంబరి అరెస్టు గురించి చెప్పారు. కాంతిరాణా, ఏ4(అప్పటి ఏసీపీ హనుమంతరావు), ఏ5(అప్పటి దర్యాప్తు అధికారి ఎం.సత్యనారాయణ) విద్యాసాగర్‌తో కలిసి తప్పుడు కేసు నమోదు చేశారు. కేసు నమోదుకు ముందే కాంతిరాణా ఫిబ్రవరి 1న ముంబైకి వెళ్లే పోలీసు బృందానికి విమానం టికెట్లు బుక్ చేశారు. నకిలీ డాక్యుమెంట్‌ను విద్యాసాగర్, పీఎస్ఆర్ ఆంజనేయులు, ఏ5(న్యాయవాది) తయారు చేశారు. ఏ2 దగ్గర నుంచి ఏ4 వరకు తప్పుడు దర్యాప్తు చేసి కాదంబరి కుటుంబ సభ్యులను అరెస్టు చేసి జైలుకు పంపారు. తర్వాత కోర్టు రిమాండ్‌ను పొడిగించడంతో 42 రోజులు ఆమె కుటుంబ సభ్యులు జైల్లో ఉన్నారు. అందులో ఐదు రోజులు పోలీసులు కస్టడీకి తీసుకున్నారు. ఏ1 నుంచి ఏ5 వరకు ఐపీసీ 220, 342 సెక్షన్లను ఉల్లంఘించి కాదంబరిని జైల్లో ఉంచారు" అని రిమాండ్ రిపోర్టులో పేర్కొన్నారు.

దర్యాప్తునకు సహకరించండి

- ఐపీఎస్ కాంతిరాణాకు హైకోర్టు ఆదేశం
- ఆయనపై నేటి వరకు తొందరపాటు చర్యలు తీసుకోవద్దని పోలీసులకు స్పష్టీకరణ



అమరావతి, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): సినీనటి కాదంబరి జెత్వానీ ఫిర్యాదు ఆధారంగా నమోదైన కేసు దర్యాప్తునకు సహకరించాలని ఐపీఎస్ అధికారి, బెజవాడ మాజీ పోలీసు కమిషనర్ కాంతి రాణా తాతాను హైకోర్టు ఆదేశించింది. మంగళవారం వరకు ఆయనపై తొందరపాటు చర్యలు తీసుకోవద్దని పోలీసులకు స్పష్టం చేసింది. విచారణను మంగళవారానికి వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ వీఆర్‌కే కృపాసాగర్ ఉత్తర్వులిచ్చారు. తన ఆధార్ కార్డు, ఇతర డాక్యుమెంట్లను ఫోర్జరీ చేయడమే కాకుండా.. తప్పుడు క్రిమినల్ కేసు పెట్టి పోలీసులతో అరెస్టు చేయించి వేధించారని వైసీపీ నేత కుక్కల విద్యాసాగర్‌పై జెత్వానీ ఇబ్రహీంపట్నం పోలీసులకు ఫిర్యాదు చేసిన కేసులో తనకు ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ కాంతిరాణా హైకోర్టును ఆశ్రయించారు. ఈ వ్యాజ్యం సోమవారం విచారణకు వచ్చింది. ఆయన తరఫున సీనియర్ న్యాయవాది ఎస్.శ్రీరామ్ వాదనలు వినిపించారు. నటి జెత్వానీ వ్యవహారంలో ఐపీఎస్ అధికారుల ప్రమేయంపై డీజీపీ విజయవాడ పోలీసు కమిషనర్ నుంచి నివేదిక తెప్పించుకున్నారని.. దాని ఆధారంగా వారిని సస్పెండ్ చేయాలని ప్రభుత్వానికి సిఫారసు చేశారని.. డీజీపీ సమర్పించిన వివరాలతో సంతృప్తి చెందిన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) ముగ్గురు ఐపీఎస్‌లనూ సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారని తెలిపారు. కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న విద్యాసాగర్‌ను పోలీసులు మేజిస్ట్రేట్ ముందు హాజరుపరిచారని.. రిమాండ్ రిపోర్టులో ఆయన పేరుతో పాటు కేసును పర్యవేక్షించిన అధికారులు అని పేర్కొన్నారని.. అందుచేత పిటిషనర్‌ను ఏ నిమిషంలోనైనా అరెస్టు చేసే ప్రమాదం ఉందని.. అరెస్టు చేస్తే తమ వ్యాజ్యం నిరర్థకమవుతుందని.. రక్షణ కల్పించాలని కోరారు. అడ్వకేట్ జనరల్(ఏజీ) దమ్మాలపాటి శ్రీనివాస్ స్పందిస్తూ.. వ్యాజ్యం మొదటిసారి విచారణకు వచ్చిందని.. వివరాలు తెప్పించుకుని వాదనలు వినిపించేందుకు మంగళవారం వరకు సమయం ఇవ్వాలని అభ్యర్థించారు. 'ఈ ఏడాది ఫిబ్రవరి 2న జెత్వానీపై విద్యాసాగర్ ఫిర్యాదు చేశారు. అంతకు ముందు రోజు ఫిబ్రవరి 1నే ఆమెను అరెస్టు చేసి ఏపీకి తీసుకొచ్చేందుకు వీలుగా పోలీసులు ముంబై వెళ్లడానికి విమాన టికెట్లు బుక్ చేయాలని పిటిషనర్ మౌఖిక ఆదేశాలిచ్చారు. పోలీసులు ముంబై వెళ్లేందుకు ఎలాంటి పాస్‌పోర్ట్‌లు ఇవ్వలేదు. శాఖాపరమైన విచారణ జరిపి డీజీపీ ఇచ్చిన నివేదిక ఆధారంగా పిటిషనర్‌పై ప్రభుత్వం సస్పెన్షన్ వేటు వేసింది. కాంతిరాణా ఈ నెల 20నే ముందస్తు బెయిల్ కోరుతూ పిటిషన్ వేశారు. అరెస్టు చేస్తారనే ఆందోళన ఉంటే ఆ రోజే లంచ్ మోషన్ లేదా హౌస్ మోషన్ కోరి ఉండాల్సింది. ఆయన్ను నిందితుడిగా చేర్చారో లేదో సమాచారం తెప్పించుకోవలసి ఉంది. ఈ వ్యవహారంలో ఎలాంటి మధ్యంతర ఉత్తర్వులూ జారీ చేయొద్దు' అని కోరారు. జెత్వానీ తరఫున న్యాయవాదులు వాసిరెడ్డి ప్రభునాథ్, నర్రా శ్రీనివాస్ వాదనలు వినిపిస్తూ.. ఈ కేసులో తాము ఇంప్లీడ్ పిటిషన్ వేశామని, వాదనలు వినిపించేందుకు అనుమతించాలని విజ్ఞప్తి చేశారు.

పెట్టుబడులపై పచ్చి అబద్ధాలు

- గోబెల్స్‌ను తలదన్నేలా జగన్ రోతమీడియా
- ఆర్టీఐ 'సాక్షి'గా వైసీపీ సర్కారు నిజస్వరూపం బట్టబయలు
- అయినా రోత పత్రికలో అవే కట్టుకథలు
- 171 భారీ ప్రాజెక్టులతో రూ.61,295 కోట్ల పెట్టుబడులట!
- 18 ఎంవోయూలతో 5,710 కోట్లే వచ్చాయని 'ఆర్‌టీఐ' ప్రశ్నకు పరిశ్రమల శాఖ జవాబు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

కింద పడినా తమదే పైచేయి అంటోంది జగన్ రోతమీడియా. పరిశ్రమలను తన్ని తరిమేసిన జగన్ సర్కారు హయాంలోనే రాష్ట్రానికి విపరీతంగా పెట్టుబడులు వచ్చాయంటూ పచ్చి అబద్ధాలు ప్రచారం చేస్తోంది. జగన్ కష్టాల్లో ఇరుక్కున్న ప్రతిసారీ ఆయన హయాంలో అద్భుతాలు జరిగాయంటూ కథనాలను వండి వార్చడం రోత మీడియాకు అలవాటే. ఒకే అబద్ధాన్ని పదూపదే చెబితే జనం నమ్ముతారేమోనన్న ఉద్దేశంతో.. లేనివి.. జరగనివి తెరపైకి తెచ్చి కథనాలు రాస్తూ జనాన్ని నమ్మించడానికి రోత పత్రిక ఆపసోపాలు పడుతోంది. కేంద్ర వాణిజ్యం-పరిశ్రమల శాఖలోని పరిశ్రమలు-అంతర్గత వాణిజ్య ప్రోత్సాహక విభాగం (డీపీఐఐటీ) విడుదల చేసిన తాజా గణాంకాల ప్రకారం.. తమ అధినేత పాలనలో భారీగా పెట్టుబడులు వచ్చాయంటూ గ్రాఫిక్కులతో గిమ్మిక్కులు చేసింది. 'కొవిడ్ అనంతరం 2021 నుంచి ఈ ఏడాది మే వరకు రాష్ట్రంలో కొత్తగా 171 భారీ ప్రాజెక్టుల ద్వారా రూ.61,295 కోట్ల పెట్టుబడులు వచ్చాయి. అదే సమయంలో మరో 179 భారీ పరిశ్రమలు నిర్మాణం పూర్తి చేసుకుని ఉత్పత్తి కూడా ప్రారంభించాయి. దీంతో గడచిన మూడున్నరేళ్లలో రూ.76,278 కోట్ల పెట్టుబడులు వాస్తవ రూపంలోకి వచ్చాయి' అని తెలిపింది. కానీ ఆ 179 భారీ ప్రాజెక్టులను రాష్ట్రంలో ఎక్కడెక్కడ నెలకొల్పారు.. ఎంత మంది యువత ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలు పొందారనే వివరాలను ప్రచురించలేదు. దీంతో రోత పత్రిక వండివార్చిన కథనంలోని డొల్లతనం బయటపడింది.

నాడే తేల్చేసిన పరిశ్రమల శాఖ

జగన్ ప్రభుత్వం వచ్చాక 2019 జూన్ 1 నుంచి ఈ ఏడాది జనవరి వరకు పారిశ్రామిక పెట్టుబడులపై కుదిరిన ఒప్పందాలపై పూర్తి వివరాలు ఇవ్వాలని కోరుతూ సమాచార హక్కు సంఘం జాతీయ అధ్యక్షుడు టి.గంగాధర్ సమాచార హక్కు చట్టం (ఆర్‌టీఐ) ద్వారా అప్పటి వైసీపీ ప్రభుత్వాన్నే కోరారు. దీనికి రాష్ట్ర పరిశ్రమల శాఖ విశాఖ గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ సదస్సులో వచ్చిన ఒప్పందాల వివరాలు మాత్రమే వెల్లడించింది. ఈ సమాచారంతో ఆ సర్కారు నిజస్వరూపం బట్టబయలైంది. గత ఏడాది మార్చి 3, 4 తేదీల్లో విశాఖలో నిర్వహించిన ఈ సదస్సులో మొత్తం 6 శాఖలు.. 18 రంగాలు.. 386 ఒప్పందాలు.. రూ.13.11 లక్షల కోట్లకు పైగా పెట్టుబడులు.. 6 లక్షలకు పైగా ఉద్యోగాలంటూ నాటి ముఖ్యమంత్రి జగన్ డబ్బా కొట్టుకున్నారు. అయితే తమతో కుదిరిన ఎంవోయూలు 99 మాత్రమేనని.. వాటిలో ఇప్పటి వరకు 18 ఎంవోయూల ద్వారా రూ.5,710 కోట్ల పెట్టుబడులు మాత్రమే రాష్ట్రానికి వచ్చాయని పరిశ్రమల శాఖ తేల్చేసింది. కొత్తగా నెలకొల్పిన చిన్నా చితకా పరిశ్రమలు కూడా పూర్తి స్థాయిలో పని ప్రారంభించలేదు. కాగా.. కొత్తగా నెలకొల్పిన ఆ పారిశ్రామిక యూనిట్లు ఉత్పాదక/వాణిజ్య కార్యకలాపాలను ప్రారంభించిన తేదీలు, ఆయా సంస్థల వారీగా కల్పించిన ఉద్యోగాల వివరాలను కూడా రోతపత్రిక వెల్లడించలేదు. జగన్ ప్రభుత్వం చేసుకున్న ఒప్పందాల్లో ఎన్ని అమలయ్యాయి.. ఎన్ని పెట్టుబడులు వచ్చాయి.. ఎంత మందికి ఉపాధి కల్పించారో వివరాలు వెల్లడించకుండా రూ.లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయంటూ కట్టుకథలతో ఇప్పటికీ సొంత డబ్బా కొట్టుకుంటుండడంతో విశాఖ గ్లోబల్ సమ్మిట్‌లో కుదుర్చుకున్న ఎంవోయూలన్నీ ఉత్తుత్తివేనని తేలిపోయింది. అంతేకాదు.. జగన్ సర్కారు పారిశ్రామికవేత్తలను నమ్మించి గొంతు కోసింది. సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమ(ఎంఎస్ఎంఈ)లకు ఏటా ఆగస్టులో ప్రోత్సాహకాలు అందజేస్తామంటూ సంక్షేమ కేలెండర్‌లో ప్రకటించింది. కానీ అమలు చేయలేక చేతులెత్తేసింది. ఫలితంగా ఎంఎస్ఎంఈలకు చెల్లించాల్సిన పారిశ్రామిక ప్రోత్సాహకాల పాత బకాయిలే రూ.4 వేల కోట్లకుపైగా పేరుకుపోయాయి. కొత్తగా వచ్చిన క్లెయిములు మరో రూ.4 వేల కోట్ల వరకు ఉన్నాయి. దీనికితోడు ఇంధన ధరలు, ముడిసరుకులు, లాజిస్టిక్స్, లేబర్ చార్జీలు విపరీతం పెరిగిపోవడంతో ఈ మూడేళ్లలోనే ఉత్పత్తి వ్యయం రెట్టింపైంది. యూనిట్లు నడపలేని స్థితిలో ఎస్సీ, ఎస్టీ పారిశ్రామికవేత్తలైతే రోడ్ల మీదకు వచ్చి ఆందోళనకు దిగారు. జగన్ ప్రభుత్వం కనీసం స్పందించలేదు. ప్రోత్సాహకాలు ఇవ్వకపోగా.. విద్యుత్ ట్రూఅప్ చార్జీలు, విద్యుత్ డ్యూటీ, గ్రిడ్ మద్దతు చార్జీలంటూ రకరకాల పేర్లతో మోయలేని భారం మోపిందని, దాంతో పరిశ్రమలను నడపలేక, బ్యాంకులకు అప్పుల వాయిదాలు చెల్లించలేక ఇప్పటికీ నలిగిపోతున్నామని పారిశ్రామికవేత్తలు గగ్గోలు పెడుతున్నారు.

..ఉన్నవాటినే వెళ్లగొట్టారు

జగన్ ప్రభుత్వ విధానాలతో కొత్త పరిశ్రమలు రాకపోగా.. రాష్ట్రంలో అంతకుముందే రూ.వేల కోట్ల పెట్టుబడులు పెట్టిన పరిశ్రమలు పారిపోయాయి. లక్షల మంది ఉద్యోగాలు కోల్పోయారు. అంతర్జాతీయంగా పేరొందిన 'అమర్‌రాజా' కంపెనీ ఉదంతమే ఇందుకు ఉదాహరణ. ఆ కంపెనీ టీడీపీ మాజీ ఎంపీ గల్లా జయదేవ్ కుటుంబానికి చెందినది కావడంతో జగన్ సర్కారు కక్షకొద్దీ వెళ్లగొట్టింది. శ్రీకాకుళం నుంచి చిత్తూరు దాకా ఆయా జిల్లాల్లో ఏర్పాటు చేసిన ఫుడ్ ప్రాసెసింగ్, ఆక్వా, ఐటీ, స్టార్టప్ కంపెనీలు, ప్రకాశంలో ఏషియన్ పేపర్ మిల్స్, నెల్లూరులో విండ్-సోలార్ కంపెనీలు, చిత్తూరులో రిలయన్స్ జియో, హోలీటెక్, అమర్‌రాజా, రాజపాలయం మిల్స్, ట్రైటన్ సోలార్, కర్నూలులో మెగాసీడ్ పార్క్, అనంతపురంలో కియా అనుబంధ సంస్థలు, జాకీ, కడపలో జువారి సిమెంట్స్.. ఇలా చెబుతూ పోతే వారి హయాంలో పారిపోయిన కంపెనీలే ఎక్కువ. ఈ వాస్తవాలను మరుగునపెడుతూ.. రాష్ట్రానికి కొత్తగా రూ.లక్షల కోట్లు పెట్టుబడులు తెచ్చాం.. ఉపాధి అవకాశాలు పెంచేశామంటూ జగన్ తన రోత పత్రికలో పచ్చి అబద్ధాలతో జనాన్ని నమ్మించడానికి చేస్తున్న ప్రయత్నాలు చూసి పారిశ్రామికవేత్తలంతా విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

అనర్హులు స్వచ్ఛందంగా పింఛన్లు వదులుకోవాలి

- విభిన్న ప్రతిభావంతుల సంక్షేమంపై సమీక్షలో సీఎం చంద్రబాబు

అమరావతి, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): విభిన్న ప్రతిభావంతుల విషయంలో ప్రభుత్వం మానవీయ కోణంలో వ్యవహరిస్తున్నదని ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పారు. దివ్యాంగులకు అధికారం చేపట్టిన తొలి నెలలోనే పింఛన్ రూ.3 వేల నుంచి రూ. 6 వేలకు పెంచామన్నారు. దీర్ఘకాలిక అనారోగ్యంతో బాధపడుతూ, మంచానికే పరిమితమైన వారికి రూ.15 వేలు పింఛన్ ఇస్తున్నామని తెలిపారు. అర్హులైన ఏ ఒక్కరికీ పింఛన్ అందకుండా ఉండడానికి వీల్లేదని స్పష్టం చేశారు. గత ప్రభుత్వంలో తప్పుడు సర్టిఫికెట్లతో దివ్యాంగుల కోటాలో పింఛన్ పొందిన ఘటనలు ఉన్నాయని అధికారులు వివరించారు. అనర్హులు ఎవరైనా తప్పుడు పద్ధతిలో పింఛన్లు పొందుతుంటే స్వచ్ఛందంగా వదులుకోవాలని సీఎం స్పష్టం చేశారు. ప్రత్యేకంగా గ్రామసభలు పెట్టి అర్హులకు పింఛన్లు ఇవ్వడంతోపాటు, అనర్హులను తొలగించాలని.. కార్యాచరణ సిద్ధం చేయాలని ఆదేశాలు ఇచ్చారు. అనర్హులు దివ్యాంగుల పేరుతో పింఛను పొందడం అంటే అర్హులకు అన్యాయం చేయడమేనన్నారు. కాగా, వృద్ధులకు పింఛను ఇవ్వడంతోపాటు వారికి ఇతరత్రా ఏం చెయ్యవచ్చనేది కూడా ఆలోచన చేయాలని సీఎం సూచించారు. డిజిటల్ లిట్రసీ ద్వారా వారు సులభంగా సేవలు పొందే అవకాశాన్ని కల్పించాలన్నారు. వృద్ధులకు పింఛన్ ఇచ్చి వదిలేయడం కాకుండా వారి జీవన ప్రమాణాలను ఎలా పెంచవచ్చనే విషయంలో ఆలోచనలు చేసి కార్యక్రమాలు చేపట్టాలన్నారు. దివ్యాంగుల కోసం స్పోర్ట్స్ సెంటర్ ఏర్పాటుకు విశాఖలో 30 ఎకరాలు కేటాయించాలని ఆదేశించారు. కేంద్రం దాదాపు రూ.200 కోట్లు ఈ సెంటర్‌కు మంజూరు చేసిందని, అయితే వైసీపీ హయాంలో పనులు జరగలేదన్నారు. సింగిల్‌గా ఉండే ట్రాన్స్‌జెండర్లకు రేషన్ కార్డులు ఇవ్వాలన్నారు. పిల్లలకు వైద్య పరీక్షలు చేసి, వారు భవిష్యత్‌లో దివ్యాంగులు కాకుండా అరికట్టవచ్చన్నారు.

విద్యార్థినికి 4 లక్షల ఆర్థిక సాయం

- డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఔదార్యం
- చదువులో రాణించాలంటూ ఆశీర్వాదం

పిఠాపురం, సెప్టెంబరు 23: వైద్యవిద్యలో చేరేందుకు ఆర్థిక సమస్యలు ఆటంకంగా ఉన్న విద్యార్థినికి డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అండగా నిలిచారు. కాకినాడ జిల్లా పిఠాపురం నియోజకవర్గం నవఖండ్రవాడ గ్రామానికి చెందిన రైతు చక్రవర్తుల శ్రీనివాస్ కుమార్తె సత్య జగదీశ్వరి నీట్ పరీక్ష రాసి ఎంబీబీఎస్ సీటు సాధించింది. అయితే, ఆమె కాలేజీలో చేరేందుకు ఆర్థిక సమస్యలు ఉన్న విషయం పవన్ కల్యాణ్ దృష్టికి వచ్చింది. ఆయన తక్షణం స్పందించి రూ.4 లక్షలు ఆర్థిక సాయం అందించారు. మంగళగిరిలోని జనసేన పార్టీ కేంద్ర కార్యాలయంలో సోమవారం సత్య జగదీశ్వరి, ఆమె తండ్రి చక్రవర్తుల శ్రీనివాస్‌లకు పవన్ చెక్కును అందజేశారు. చదువులో రాణించాలని ఆశీర్వదించారు. పవన్‌కల్యాణ్ చేసిన సహాయం మరువలేనిదంటూ విద్యార్థిని, ఆమె తండ్రి కృతజ్ఞతలు తెలిపారు.

పేదల భూములతో బంతాట!

(మొదటి పేజీ తరువాయి)

ఆరు మండలాల్లో 29,997 ఎకరాల అసైన్డ్ భూమి రికార్డులను అధికారులు పరిశీలించారు. వీటిపై 1,838 లావాదేవీలు జరిగినట్లు గుర్తించారు. ఇలా అడ్డగోలుగా పరాధీనమైన భూములను పీఓటీ చట్టంలోని సెక్షన్ 4(బి) ప్రకారం వెనక్కి తీసుకోవచ్చు. లావాదేవీలు, ఇతర మార్పులను నిలిపివేయవచ్చు. ఈ విషయంలో ప్రభుత్వమే నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. నిబంధనలకు విరుద్ధంగా ఫ్రీహోల్డ్ చేసిన అసైన్డ్ భూములను వెనక్కి తీసుకుంటారా? రిజిస్ట్రేషన్లను రద్దు చేస్తారా? అన్నది ప్రభుత్వ నిర్ణయానికే వదిలివేస్తూ రెవెన్యూ శాఖ నివేదిక సమర్పించినట్లు తెలిసింది.

జిల్లాల వారీగా భూముల దందా తీరిదీ..

- ప్రకాశం జిల్లా కనిగిరి మండలంలో 11,931 ఎకరాల అసైన్డ్ భూములను నిషేధ జాబితా నుంచి తొలగించి పూర్తి హక్కులు(ఫ్రీ హోల్డ్) కల్పించారు. ఇందులో 591 ఎకరాల భూమిని జీవో 596కు విరుద్ధంగా ఫ్రీహోల్డ్ చేశారు. వీటిలోని 263 కేసుల్లో భూములను రిజిస్ట్రేషన్ చేసేశారు. 162 కేసుల్లో భూమిని గిఫ్ట్‌డీడ్ రూపంలో అక్రమార్కులు దక్కించుకున్నారు.
- అన్నమయ్య జిల్లా వీరబల్లి మండలంలో 2,022 ఎకరాల భూమిని జీవో 596కు విరుద్ధంగా ఫ్రీహోల్డ్ చేశారు. కొన్ని సర్వే నంబర్ల కింద ఉన్న భూములు చుక్కల భూముల పరిధిలోకి వస్తాయి. వాటిని చుక్కల భూముల చట్టం కింద సెటిల్ చేయాల్సి ఉండగా.. అసైన్డ్ భూముల చట్టం కింద ఫ్రీహోల్డ్ చేసేశారు.
- సత్యసాయి జిల్లా బత్తలపల్లి మండలంలో 8,227 ఎకరాలను ఫ్రీహోల్డ్ చేశారు. ఇందులో 30 శాతం నిబంధనలకు విరుద్ధంగా ఫ్రీహోల్డ్ చేశారు. 21 శాతం నిబంధనలకు విరుద్ధంగా రిజిస్ట్రేషన్లు చేశారు.
- కడప జిల్లా మైదుకూరు మండలంలో 2,788 ఎకరాలను నిషేధ జాబితా నుంచి తొలగించి యాజమాన్య హక్కులు కల్పించారు. ఇందులో 576 ఎకరాలను ఫ్రీహోల్డ్ చేశారు.
- తిరుపతి జిల్లా శ్రీకాళహస్తి మండలంలో 9,316 ఎకరాల భూమిని నిషేధ జాబితా నుంచి తొలగించి యాజమాన్య హక్కులు కల్పించారు. ఇందులో 1,914 ఎకరాల అసైన్డ్ భూమిని నిబంధనలకు విరుద్ధంగా నిషేధ జాబితా నుంచి తొలగించారు.



టీడీపీ కార్యాలయంలో ప్రజల నుంచి వినతి పత్రాలు స్వీకరిస్తున్న ప్రభాకర్ చౌదరి

నా స్థలాన్ని పిన్నెల్లి దౌర్జన్యంగా లాక్కున్నాడు

- టీడీపీ కార్యాలయంలో మాచర్ల బాధితుడి ఫిర్యాదు
- కర్నూలు జిల్లాలో దేవుడి భూమినీ మింగేశారని ఆవేదన

అమరావతి, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): మాచర్ల వైసీపీ మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి తన స్థలాన్ని కబ్జా చేశాడని మాచర్లకు చెందిన తాటిపర్తి సాంబశివారెడ్డి ఫిర్యాదు చేశారు. 'మాచర్లలో 1160 గజాల స్థలాన్ని కొనుగోలు చేసి రిజిస్ట్రేషన్ చేయించుకొన్నాం. పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, అతని తమ్ముడు వెంకట్రామిరెడ్డి కలిసి దానిని ఆక్రమించారు. మమ్మల్ని కొట్టి బలవంతంగా రిజిస్ట్రేషన్ చేయించుకొన్నారు. ఆ రిజిస్ట్రేషన్ రద్దు చేసి మా స్థలం అప్పగించాలి' అని బాధితుడు కోరారు. అక్కడి రెవెన్యూ అధికారులకు టీడీపీ నేతలు ఫోన్ చేసి దీనిపై విచారణ జరిపి న్యాయం చేయాలని సూచించారు. సోమవారం టీడీపీ కేంద్ర కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే వైకుంఠం ప్రభాకర్ చౌదరి, పార్టీ అధికార ప్రతినిధి జీవీ రెడ్డి ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. అనంతపురం జిల్లా రాప్తాడు మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాశ్‌రెడ్డి, అతని సోదరుడు చంద్రశేఖరరెడ్డి భూ కబ్జాపై టీడీపీ న్యాయ విభాగం రాష్ట్ర కార్యదర్శి పి.లక్ష్మన్న ఫిర్యాదు చేశారు. 'నేను కొనుగోలు చేసిన భూమిని మాజీ ఎమ్మెల్యే, ఆయన అనుచరులు కబ్జా చేసి రాళ్లు పాతారు. వారి కబ్జా నుంచి ఆ భూమిని విడిపించాలి' అని కోరారు. అన్నమయ్య జిల్లా రాజంపేట మండలం పోలి గ్రామంలో వైసీపీ నేతలు తమ భూమిని ఆక్రమించుకొన్నారని భోనం అనురాధ ఫిర్యాదు చేశారు. 'ఇటీవలి ఎన్నికల సమయంలో వైసీపీ నేతలు తమ ఇళ్లపై దాడి చేసి కొట్టారు. ఎస్సీ ఎస్టీ కేసులు పెట్టారు. కొందరు టీడీపీ నేతలపై రౌడీషీట్లు కూడా తెరిపించారు' అని సత్తెనపల్లి మండలం భట్లూరుకు చెందిన మల్లికార్జున రావు ఫిర్యాదు చేశారు. అక్రమ కేసులు ఎత్తివేయించాలని కోరారు. అన్నమయ్య జిల్లా రాజంపేట మండలం యార్లగడ్డలో తమ భూమికి కొందరు వ్యక్తులు నకిలీ డాక్యుమెంట్లు సృష్టించి విక్రయించారని, న్యాయం చేయాలని పోకూరి సుబ్బయ్య, వెంకటయ్య, నల్లగండ్ల సుబ్బయ్య విజ్ఞప్తి చేశారు. పల్నాడు జిల్లా దాచేపల్లి మండలం రామాపురంలో తమ సొంత భూమిని రెండేళ్ల కిందట అప్పటి ప్రభుత్వం వేరేవారికి కేటాయించిందని, న్యాయం చేయాలని కోటా హరిప్రసాద్ కోరారు. కర్నూలు జిల్లా ఆలూరు మండలం అనేకుర్తిలో తొమ్మిదిన్నర ఎకరాల దేవాలయ భూమికి నకిలీ పాస్ పుస్తకాలు సృష్టించి వైసీపీ నేతలు విక్రయించారని, ఆ అమ్మకాన్ని రద్దు చేయాలని గ్రామస్థులు కోరారు.

ఎత్తు నుంచి మినహాయింపు ఇవ్వండి

పోలీస్ కానిస్టేబుళ్ల నియామకంలో తమకు ఎత్తు నుంచి మినహాయింపు ఇప్పించాలని కొందరు హోంగార్డులు కోరారు. 'హోం గార్డులకు 165 సెంటీమీటర్ల ఎత్తు సరిపోవడంతో మమ్మల్ని తీసుకొన్నారు. ఇప్పుడు కానిస్టేబుళ్ల నియామకంలో 167.6 సెంటీమీటర్ల ఎత్తు ఉండాలని నిబంధన పెట్టారు. దీంతో 25% కోటా ఉన్నా అనర్హులం అవుతున్నాం' అని తెలిపారు.

ఉద్యోగం ఇచ్చారు... జీతాలు ఇవ్వడం లేదు

విజయనగరం జీజీహెచ్, జీఎంసీల్లో ఆప్కాస్ ద్వారా నియామకం పొందిన తమకు 12 నెలల నుంచి జీతాలు ఇవ్వడం లేదని వైద్య శాఖ ఉద్యోగులు ఫిర్యాదు చేశారు. నంద్యాల మెడికల్ కళాశాలలో ఇదే మాదిరిగా నియామకం పొందిన వారికి 21 నెలల నుంచి జీతాలు ఇవ్వడం లేదని, పీహెచ్‌సీ, కేజీహెచ్‌లో పనిచేస్తున్న మరో 54 మందికి 12 నెలలుగా జీతాలు రావడం లేదని సంబంధిత ఉద్యోగులు చెప్పారు. విద్యుత్ వైర్లు తగిలి తన రెండు చేతులూ పోయాయని, ఆదుకోవాలని బాపట్ల జిల్లా మార్టూరు మండలం తాటివారిపాలెంకు చెందిన నాగరాజు విజ్ఞప్తి చేశారు.

కామన్వెల్త్ మహిళా పార్లమెంటరీ స్టీరింగ్ కమిటీ చైర్‌పర్సన్‌గా ఎంపీ పురందేశ్వరి



రాజమహేంద్రవరం అర్బన్, సెప్టెంబరు 23: బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు, రాజమండ్రి ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరికి అరుదైన గౌరవం దక్కింది. ఆమె కామన్వెల్త్ పార్లమెంటరీ అసోసియేషన్ (సీపీఏ) ఇండియా రీజియన్ ప్రతినిధిగా, కామన్వెల్త్ మహిళా పార్లమెంటేరియన్స్ స్టీరింగ్ కమిటీ చైర్‌పర్సన్‌గా నామినేట్ అయ్యారు. దీనికి సంబంధించి లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లా ఉత్తర్వులు ఇచ్చారు. 2026 చివరి వరకూ ఆమె ఈ పదవుల్లో ఉంటారు. ఈ మేరకు సోమవారం రాజమండ్రి ఎంపీ కార్యాలయం కూడా ఒక ప్రకటన విడుదల చేసింది.

పీఆర్ ఇంజనీరింగ్ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ఊరట

- ఏడాదిగా జీతాలు రాక ఇబ్బందులు.. విధులకు గైర్హాజరై నిరసన
- స్పందించిన ఉపముఖ్యమంత్రి కార్యాలయం

అమరావతి, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ విభాగంలోని సుమారు 670 మంది ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ఊరట కలిగించే నిర్ణయాన్ని ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తీసుకున్నారు. పీఆర్ ఇంజనీరింగ్ విభాగంలో ఉపాధి పనులు చేపట్టేందుకు టెక్నికల్ అసిస్టెంట్లు, కంప్యూటర్ ఆపరేటర్లు, డ్రైవర్లు, అటెండర్లను నియమించారు. ఇంజనీరింగ్ విభాగంలో సిబ్బంది కొరత ఉండటంతో ఈ సిబ్బందిని నియమించుకున్నారు. అప్పట్లో ఉపాధి హామీ పథకంలో మెటీరియల్ నిధులతో చేపట్టే పనులకు కన్సల్టెన్సీ ద్వారా 3 శాతం నిర్వహణా వ్యయం అందజేశారు. ఆ నిధులతో పంచాయతీరాజ్ ఈఎన్సీ ఔట్‌సోర్సింగ్ సిబ్బందికి జీతాలు చెల్లించేవారు. ఈఎన్సీ కార్యాలయంలో సుమారు 60 మంది పనిచేస్తున్నారు. అయితే గత ప్రభుత్వం ఈఎన్సీ విభాగానికి 3 శాతం నిధులను నిలిపేసింది. అప్పటి నుంచి ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు జీతాలు ఇవ్వలేని పరిస్థితి ఏర్పడింది. దీంతో ఒక దశలో ఈ సిబ్బందిని తొలగించాలని ఈఎన్సీ నిర్ణయించారు. అయితే ఒకేసారి 670 మంది సిబ్బందిని తొలగిస్తే వ్యతిరేకత వస్తుందని వెనకాడారు. జిల్లాల్లో ఇంజనీరింగ్ విభాగానికి సంబంధించిన నిర్వహణ బడ్జెట్ నుంచి వారికి కొంతవరకు జీతాలు చెల్లించారు. అయితే ఈఎన్సీ కార్యాలయంలో పనిచేసే సిబ్బందికి ఏడాది నుంచి జీతాలు అందడం లేదు. దీనిపై ఈ సిబ్బంది పలు దఫాలు ఈఎన్సీ బాలూనాయక్‌కు విన్నవించుకున్నారు. ఈఎన్సీ కూడా పలు దఫాలు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. జీతాలు రాకపోవడంతో తమ జీవనం దుర్లభం అయిందని సోమవారం ఈఎన్సీ కార్యాలయం వద్ద సిబ్బంది విధులు ఆపేసి నిరసనకు దిగారు. కార్యాలయంలో విధులకు హాజరుకాకుండా దారిలో కూర్చొని నిరసన తెలిపారు. వెంటనే జీతాలు చెల్లించాలని నినాదాలు చేశారు. ఈ విషయం ఉపముఖ్యమంత్రి కార్యాలయానికి తెలియడంతో అధికారులను అప్రమత్తం చేసినట్లు సమాచారం. దీంతో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ కమిషనరేట్ కార్యాలయం ద్వారా ఉపాధి మెటీరియల్ నిధులను వారి జీతాల కోసం సర్దుబాటు చేస్తున్నట్లు తెలిసింది. ఒకటి రెండో రోజుల్లో వారికి జీతాలు సర్దుబాటు చేయాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది.

బదిలీల ప్రక్రియ సంతృప్తికరం

- అప్రాధాన్య పోస్టుల్లో ఉన్నవారికి ఊరట
- అధికారులతో సమీక్షలో ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్

అమరావతి, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖలో బదిలీల ప్రక్రియ పారదర్శకంగా నిర్వహించడంపై ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ సంతృప్తి వ్యక్తం చేశారు. మార్గదర్శకాలు, నిబంధనలను అనుసరించి పారదర్శకంగా బదిలీలు చేపట్టడంపై ఆయన ఆ శాఖ అధికారులతో సోమవారం సమీక్ష నిర్వహించారు. బదిలీల ప్రక్రియలో మాతృశాఖలో ఉన్న అధికారులకే పోస్టింగ్స్ ఇవ్వడం చెప్పుకోదగిన పరిణామమని పవన్ కల్యాణ్ అన్నారు. ఇప్పటి వరకూ అప్రాధాన్యమైన స్థానాల్లో ఉన్నవారికి జిల్లాస్థాయి పోస్టింగ్స్ ఇచ్చిన విషయాన్ని అధికారులు ఉపముఖ్యమంత్రి దృష్టికి తీసుకొచ్చారు. నెల్లూరు జడ్పీ సీఈవోగా బదిలీ అయిన ఎస్.ఖాదర్ బాషా 1999 నుంచి ఉద్యోగంలో ఉన్నా... జిల్లాస్థాయి పోస్టులో చేయలేదని తెలిపారు. ఎనిమిదేళ్లు విజిలెన్స్ విభాగంలోనే పని చేశారని, దీన్ని పరిగణనలోకి తీసుకుని జిల్లాస్థాయి అధికారిగా బాధ్యతలు ఇచ్చామని తెలిపారు. కృష్ణా జిల్లా డీపీవోగా బదిలీ అయిన అరుణ.. కుటుంబపరమైన ఇబ్బందులు తెలుపుతూ వినతి ఇచ్చారని దానిని పరిగణనలోకి తీసుకున్నామని అధికారులు చెప్పారు. ఈ బదిలీల ద్వారా నూతన బాధ్యతల్లోకి వెళ్లిన అధికారులకు రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీ వ్యవస్థ బలోపేతానికి ఇస్తున్న ప్రాధాన్యాన్ని తెలపాలని ఉప ముఖ్యమంత్రి ఆదేశించారు. పల్లెల అభివృద్ధికి, మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యమిస్తున్నామని, ఉపాధి హామీకి రూ.4500 కోట్లు మంజూరయ్యాయని తెలిపారు.



బదిలీలను సంతృప్తికరంగా పూర్తి చేసినందున పంచాయతీరాజ్ కమిషనర్ కృష్ణతేజకు కృతజ్ఞతలు చెబుతున్న ఉద్యోగ జేఏసీ నేతలు

పంచాయతీరాజ్‌లో పారదర్శకంగా బదిలీలు

అమరావతి, సెప్టెంబర్ 23(ఆంధ్రజ్యోతి): పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల్లో డ్వామా పీడీలు, జడ్పీ సీఈవోలు, డిప్యూటీ సీఈవోలు, డీపీవోల బదిలీలు రాజకీయ జోక్యం లేకుండా పారదర్శకంగా నిర్వహించడంపై హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. ఆ శాఖలో పనిచేస్తున్న ఏపీ పంచాయతీరాజ్ ఉద్యోగుల జేఏసీ నేతలు సోమవారం కమిషనర్ కృష్ణతేజను కలిసి ఈ విషయమై ధన్యవాదాలు తెలిపారు. అనంతరం జేఏసీ నేతలు విలేకరులతో మాట్లాడుతూ ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ చొరవతో ఒక్కపైసా చేతులు మారకుండా, ఎమ్మెల్యే, మంత్రుల సిఫారసులు లేకుండా పలువురు అధికారులు డ్వామా పీడీ, డీపీవో, జడ్పీ సీఈవో పోస్టులు పొందగలిగారని తెలిపారు. 40 వేల మంది పైచిలుకు ఉద్యోగులు, అధికారులు ఉన్న పెద్ద శాఖలో ఎలాంటి ప్రతికూల వార్తలకు తావులేకుండా బదిలీల ప్రక్రియ పూర్తి చేయడం అభినందనీయమని జేఏసీ నేతలు కేఎస్‌వీ ప్రసాద్, వైవీడీ ప్రసాద్ తెలిపారు.

విద్యుత్తు శాఖ బదిలీల్లో ఇంకా వైసీపీ విధానాలేనా?

- ఏపీ ఎలక్ట్రిసిటీ బీసీ, ఓసీ ఉద్యోగ సంఘాల జేఏసీ ఆగ్రహం

విద్యుత్తు శాఖ బదిలీల్లో ఇంకా వైసీపీ విధానాలే అమలవుతున్నాయని ఏపీ ఎలక్ట్రిసిటీ బీసీ అండ్ ఓసీ ఎంప్లాయీస్ జాయింట్ యాక్షన్ కమిటీ ఆగ్రహం వ్యక్తం చేసింది. గత వైసీపీ ప్రభుత్వంలో అధికారాన్ని వెలగబెట్టిన అధికారులనే ఇప్పటికీ కొనసాగిస్తున్నారని జేఏసీ చైర్మన్ పోలాకి శ్రీనివాసరావు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విద్యుత్తు పంపిణీ సంస్థలలో గతంలో తెలుగుదేశం ప్రభుత్వం అమలు చేసిన ఉద్యోగ సానుకూల ప్రక్రియను ప్రస్తుతం అమలు చేయడం లేదన్నారు. డిస్కమ్‌లలో బ్రేక్ ఇన్ సర్వీస్‌తో బదిలీల్లో ఉద్యోగులకు అన్యాయం జరుగుతోందని చెప్పారు. కూటమి ప్రభుత్వంలోనైనా జేఏసీ ప్రతిపాదనలను పరిగణలోకి తీసుకోవాలన్నారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : K. Srinivas, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.

పాత ప్రభుత్వాసుపత్రిలో మరో శిశువు మృతి

● ఆందోళనకు దిగిన బాధిత కుటుంబ సభ్యులు, బంధువులు ● హాస్పిటల్ వద్ద ఉద్రిక్త పరిస్థితి

వన్‌టౌన్, సెప్టెంబరు 23: నగరంలోని పాత ప్రభుత్వాసుపత్రిలో మృత శిశువులు పెరుగుతున్నారు. స్వల్పకాలంలోనే అనేకమంది తల్లులకు గర్భశోకం కలిగింది. ఈ నేపథ్యంలో సోమవారం సైతం మరో శిశువు మృతి చెందింది. వైద్యులు, వైద్య సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా శిశువు మృతిచెందిందనే కారణంతో బాధిత కుటుంబ సభ్యులు, బంధువులు ఆసుపత్రి వద్ద ఆందోళనకు దిగారు. వైద్య సిబ్బంది, ప్రైవేట్ సెక్యురిటీ గార్డులకు ఆందోళనకారులకు వాదోపవాదాలు జరిగాయి. దీంతో ఆసుపత్రి వద్ద ఉద్రిక్తపరిస్థితి నెలకొంది. సమాచారం తెలుసుకున్న సౌత్‌జోన్ ఏసీపీ యూ బంగార్రాజు, గవర్నర్‌పేట ఇన్‌చార్జి సీఐ, కృష్ణలంక సీఐ నాగరాజు హాస్పటల్‌కు వెళ్లి ఆందోళనకు దిగిన వారితో మాట్లాడారు. వివరాల ప్రకారం మాచవరం కార్మికనగర్‌కు చెందిన తమ్మిశెట్టి ఏసు కూలిపనులు చేసుకుంటూ భార్య శివపార్వతి (25), కుమార్తెతో ఉంటున్నాడు. శివపార్వతి రెండోకాన్పు నిమిత్తం ఈనెల 20న మధ్యాహ్నం ఆసుపత్రిలో చేరింది. వైద్యులు పరీక్షలు నిర్వహించారు. 22న శివపార్వతికి సిజేరియన్ చేసి మగబిడ్డను తీసి ఐసీయూలో ఉంచారు. సోమవారం చూస్తే శిశువు మరణించిందని వైద్యులు శివపార్వతి కుటుంబ సభ్యులకు వివరించారు. దీంతో శివపార్వతి కుటుంబ సభ్యులు, బంధువులు ఒక్కసారిగా అవాక్కైయ్యారు. శిశువు ఎందుకు మరణించిందని వైద్య సిబ్బందిని ప్రశ్నించగా సరైన సమాధానం చెప్పకపోవటంతో వారు ఆందోళనకు దిగారు. ఇరు వర్గాల మధ్య వాదోపవాదాలు జరిగాయి. శివపార్వతి బంధువులు, కుటుంబ సభ్యులు ఆగ్రహంతో అక్కడున్న కుర్చీలు, ఇతర వస్తువులను ధ్వంసం చేశారు. రెయిలింగ్ స్టీలు రాడ్లను విరగొట్టేందుకు ప్రయత్నించారు. దీంతో పోలీసు సిబ్బంది వారిని అడ్డుకోవటానికి ప్రయత్నించారు. సమాచారం తెలుసుకున్న సౌత్ ఏసీపీ యూ బంగార్రాజు, గవర్నర్‌పేట ఇన్‌చార్జి సీఐ నాగరాజు హాస్పిటల్ వద్దకు వెళ్లి ఆందోళనకారులతో మాట్లాడారు. వైద్యులు, సిబ్బంది నిర్లక్ష్యం వల్లే శిశువు మృతిచెందిందని, పైగా ప్రైవేట్ సెక్యూరిటీ సిబ్బంది సైతం ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారని, వారిపై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఏసీపీ వారికి సర్దిచెప్పి వైద్య సిబ్బంది, ప్రైవేటు సెక్యూరిటీపై చర్యలు తీసుకునేలా ఉన్నతాధికారులతో మాట్లాడతామని హామీ ఇచ్చారు. అయితే శివపార్వతి స్వల్ప అనారోగ్యానికి గురివటం వల్లే శిశువు మృతి చెందినట్టు వైద్యులు తెలిపారు.



పాత ప్రభుత్వాసుపత్రి వద్ద ఆందోళన చేస్తున్న బాధిత కుటుంబ సభ్యులు, బంధువులు

27 నుంచి యూబీఐ ఉద్యోగుల సమ్మె



విజయవాడ, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఉద్యోగులు ఈనెల 27 నుంచి సమ్మెలోకి వెళ్తున్నట్టు ఉద్యోగ సంఘాల నేతలు ప్రకటించారు. ఉద్యోగ సంఘాలు బ్యాంక్ యాజమాన్యంతో జరిపిన చర్చలు విఫలం కావడంతో వన్‌టౌన్‌లోని జోనల్ కార్యాలయం వద్ద ఉద్యోగులు సోమవారం రాత్రి నిరసన ప్రదర్శన చేశారు. బ్యాంకులో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేయకపోవడంతో ఉద్యోగులపై పని భారం పెరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఖాతాదారులకు సరైన సేవలు అందజేయలేకపోతున్నామన్నారు. ఉద్యోగులు ఇళ్లకు వెళ్లే సరికి రాత్రి 8 గంటలు దాటిపోతుందన్నారు. ఖాళీగా ఉన్న 5వేల సబ్‌స్టాఫ్ ఉద్యోగాలు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగ సంఘాల నేతలు రాజేష్‌కన్నా, మణిగోపాల్, చాన్ ఖాన్, కాలే శ్రీనివాసరావు, ఎన్.సుబ్బారావు, ఆనంద్‌కిషోర్ పాల్గొన్నారు.

లడ్డూ ప్రసాదం కేంద్రంలో తనిఖీలు

దుర్గగుడికి ఇచ్చే సరుకుల ప్యాకెట్లపై వివరాలు లేకపోవటంతో తిప్పి పంపేసిన అధికారులు

వన్‌టౌన్, సెప్టెంబరు 23: దుర్గగుడి లడ్డూ ప్రసాద తయారీ కేంద్రంలో ఆహార భద్రతా అధికారులు సాధారణ తనిఖీల్లో భాగంగా సోమవారం సాయంత్రం తనిఖీలు నిర్వహించారు. ఆహార భద్రతా జిల్లా అధికారి ఎన్.పూర్ణచంద్రరావు, సహాయ అధికారి రమేష్ లడ్డూ ప్రసాద తయారీ కేంద్రంలో సరుకులను, వాటికి సంబంధించిన బిల్లులు, దేవస్థానం రికార్డులను పరిశీలించారు. జీడిపప్పు, కిస్‌మిస్, యాలకులు, పంచదార, శనగపిండి, చింతపండు, బెల్లం, పచ్చి శనగపప్పు, వేరుశనగగుండ్లు, కుంకుమపువ్వు, పటికబెల్లం సిప్స్, నెయ్యి, ఇతర వస్తువులను తనిఖీ చేసి, శాంపిల్స్ తీసుకున్నారు. నెయ్యి ఏ కంపెనీ నుంచి ఎంత రేటు, టెండర్ కాలపరిమితి వివరాలు తెలుసుకుని వాటికి సంబంధించిన కమిషనర్, ఈవో అనుమతి పత్రాలను పరిశీలించారు. జీడిపప్పు ముక్క వాసన వచ్చినట్టు అధికారులు గుర్తించారు. సాయిమణికంఠ సంస్థ దేవస్థానానికి సరఫరా చేసిన కిస్‌మిస్, జీడిపప్పు, యాలకుల ప్యాకెట్లపై కంపెనీ పేరు, తయారీ తేదీ, గడువు, ఇతర వివరాలు, నాణ్యతా ప్రమాణాలకు దీటుగా లేకపోవటంతో 600 కేజీల కిస్‌మిస్, జీడిపప్పు సుమారు 600 కేజీల పైన, యాలకులు 600 కేజీల పైన సరుకులను వెంటనే తిప్పి పంపేశారు. బెల్లం, చింతపండు, పచ్చి శనగపప్పు, తదితర సరుకులు నాణ్యత లేదని గుర్తించినట్టు తెలిసింది. వీటిని మంగళవారం తిప్పి పంపేయాలని ఫుడ్ సేఫ్టీ అధికారులు ఆదేశించినట్టు తెలిసింది. ఫుడ్ సేఫ్టీ అధికారుల వెంట దేవస్థానం ఏఈవో చంద్రశేఖర్, సిబ్బంది ఉన్నారు.



దుర్గగుడి లడ్డూ ప్రసాదం తయారీ కేంద్రం నుంచి తిప్పి పంపుతున్న కిస్‌మిస్ బాక్స్‌లు

గోపుర స్వర్ణతాపడానికి విరాళం

వన్‌టౌన్, సెప్టెంబరు 23: దుర్గగుడి గోపుర స్వర్ణతాపడం పనుల నిమిత్తం అయోధ్యనగర్‌లోని ఇంద్రప్రస్థ అపార్టుమెంట్ నివాసి డి.మధు, ఆయన కుటుంబ సభ్యులు సోమవారం ఆలయానికి విచ్చేసి రూ.1,01,116ల విరాళాన్ని చెక్కురూపంలో డిప్యూటీ ఈవో లీలాకుమార్‌కు అందజేశారు. అనంతరం దుర్గమ్మను దర్శించుకున్నారు. వీరికి అమ్మవారి చిత్రపటం, ఆశీస్సులు, శేషవస్త్రం, ప్రసాదం అందజేశారు. అలాగే అమ్మవారి అలంకరణకు గుంటూరు శ్రీనగర్ కాలనీకి చెందిన కె.కిరణ్ బాబు, కుటుంబ సభ్యులు సోమవారం ఆలయానికి విచ్చేసి 53 గ్రాముల బరువు గలిగిన బంగారు లక్ష్మీకాసుల పేరును ఈఈ కోటేశ్వరరావు ద్వారా దేవస్థానానికి కానుకను అందచేసి అమ్మవారిని దర్శించుకున్నారు. వీరికి ఆశీర్వచనం, ప్రసాదం, శేషవస్త్రం, చిత్రపటం అందజేశారు.

అలరించిన సంగీత విభావరి



దుర్గగుడి కళావేదికపై సోమవారం విశాఖపట్నానికి చెందిన ఎన్.వి.ఎస్.ఎన్. ప్రసన్న, ఎస్.కృష్ణప్రియ సోదరీమణులు కర్ణాటక గాత్ర కచేరి చేసి ఆహుతులను అలరించారు. చక్కటి గాత్రానికి తోడు వయోలిన్‌పై బి.సుబ్రహ్మణ్యరాజు, మృందంగంపై సి.హెచ్.సూర్య సహకారం అందించారు. అలాగే నగరానికి చెందిన నటరాజ నృత్యాలయం, రాయన శ్రీనివాసరావు శిష్య బృందం ఆంధ్ర నాట్య ప్రదర్శన చేసి ఆహుతులను ఆకట్టుకున్నారు.



కేంద్ర మంత్రి నిర్మలకు మొక్కను అందజేస్తున్న సభ్యులు, ఎంపీ పురందేశ్వరి

పౌల్ట్రీరంగాన్ని ఆదుకోండి..!

కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్‌కు వినతి

ఆటోనగర్, సెప్టెంబరు 23: ఆంధ్రప్రదేశ్ లేయర్ పౌల్ట్రీ ఫార్మర్ ఎదుర్కొంటున్న సమస్యలను కూలంకుశంగా వివరించి, కేంద్ర ప్రభుత్వం కోళ్ల రైతులకు సాయం అందించాలని ఏపీ పౌల్ట్రీ ఫెడరేషన్ కేంద్రమంత్రిని కోరింది. ఫెడరేషన్ అధ్యక్షుడు కె. సుబ్బారావు, ఉపాధ్యక్షుడు టి. కుటుంబరావు, కమిటీ సభ్యులు జి.గంగాధరరావు, సుబ్రహ్మణ్యం, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరితో కలిసి కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్‌ను పార్లమెంట్‌లో కలిసి ఈ వినతిప్రతం అందజేసినట్టు సోమవారం ఫెడరేషన్ ఓ ప్రకటనలో తెలిపింది.

కౌలు రైతులకే పరిహారం ఇవ్వాలి

● సీపీఎం డిమాండ్



ఏచూరికి నివాళులర్పిస్తున్న రాఘవులు

గవర్నర్‌పేట, సెప్టెంబరు 23: వరదల్లో పంట నష్టపోయిన కౌలు రైతులకే నేరుగా పరిహారం ఇస్తామని సీఎం ఇచ్చిన హామీని వెంటనే అమలు చేయాలని సీపీఎం రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. సీపీఎం రాష్ట్ర కమిటీ సమావేశం సోమవారం ఎంజీ రోడ్డులోని ఆ పార్టీ రాష్ట్ర కార్యాలయంలో జరిగింది. సీపీఎం రాష్ట్ర కా ర్యదర్శి వర్గ సభ్యుడు వై.వెంకటేశ్వరరావు అధ్యక్షత వహించిన ఈ సమావేశానికి పార్టీ పొలిట్ బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు, రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివాసరావు హాజరయ్యారు. తొలుత ఇటీవల మృతి చెందిన సీపీఎం జాతీయ ప్రధాన కార్యద ర్శి సీతారాం ఏచూరి చిత్రపటానికి బీవీ రాఘవులు పూలమాల వేసి నివాళులర్పించారు. రాష్ట్ర కమిటీ సమావేశంలో పలు తీర్మానాలు ఆమోదించినట్టు రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివాసరావు తెలిపారు. భూయజమాని సమ్మతంతో సంబంధం లేకుండా వాస్తవ సాగుదారుల పేర్లతోనే ఈ-క్రాప్ చేయాలని, వారికే నష్టపరిహారం, పంటల బీమా, ఇన్‌పుట్ సబ్సిడీ ఇవ్వాలని, వరికి ఎకరానికి రూ.25వేలు, కంద, పసుపు వంటి పంటలకు రూ.లక్ష నష్టపరిహారం ఇవ్వాలని తీర్మానించారు.

సెంట్రింగ్ మేస్త్రీలకు నష్టపరిహారం ఇవ్వాలి

● ఐఎఫ్‌టీయూ వినతి



కలెక్టర్ సృజనకు వినతిపత్రం అందజేస్తున్న ఐఎఫ్‌టీయూ నేతలు

గవర్నర్‌పేట, సెప్టెంబరు 23: బుడమేరు ముంపు కారణంగా నష్టపోయిన సెంట్రింగ్ మేస్త్రీలకు నష్టపరిహారం చెల్లించేందుకు వీలుగా సచివాలయ సిబ్బంది సెంట్రింగ్ మేస్త్రీలకు జరిగిన నష్టం వివరాలు నమోదు చేసుకునేలా ఆదేశాలివ్వాలని ఐఎఫ్‌టీయూ నేతలు సోమవారం జిల్లా కలెక్టర్ సృజనకు వినతిపత్రం అందజేశారు. సింగ్‌నగర్, పాయకాపురం, రాజరాజేశ్వరీపేట ప్రాంతాల్లో బిల్డింగ్ కనస్ట్రక్షన్‌కు సంబంధించిన సెంట్రింగ్ సామగ్రి వరదల్లో కొట్టుకుపోయాయని, లక్షలాది రూపాయలు నష్టం జరిగిందన్నారు. ఒక్కో మేస్త్రీ సుమారుగా రూ.3 నుంచి రూ.4 లక్షల వరకు పెట్టుబడి పెట్టి సామగ్రి కొనుగోలు చేశారని, వరద కారణంగా అవి పనికిరాకుండా పోయాయన్నారు. ప్రభుత్వం వీరి పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించడం బాధాకరమని, సిబ్బంది వీరి వివరాలు సేకరించేలా ఆదేశాలివ్వాలని కలెక్టర్‌ను కోరారు. ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.రామకృష్ణ, జిల్లా అధ్యక్షుడు ఏపీ రమణ, జిల్లా నేతలు షేక్ మీరావలీ, బాజీ, సుబ్బారావు పాల్గొన్నారు.

జగన్‌ను తక్షణం అరెస్టు చేయాలి: ఎంపీ చిన్ని

వన్‌టౌన్, సెప్టెంబరు 23: మాజీ సీఎం జగన్ జీవితమంతా అబద్ధాలమయమేనని అన్ని మతాల ప్రజల మనోభావాలను దెబ్బతీసిన అతడిని తక్షణమే అరెస్టు చేయాలని ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) అన్నారు. గురునానక్ కాలనీ ఎన్టీఆర్ భవన్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జగన్ డబ్బు సంపాదనకు ఎలాంటి దారుణాలు చేయడానికైనా వెనుకాడడన్నారు. ఎవరి మనోభావాలు అతడికి అవసరం లేదన్నారు. అందుకే తిరుపతి లడ్డూ ప్రసాదంలో కల్తీ నెయ్యి వినియోగించాడన్నారు. ప్రధాన మంత్రి మోదీకి రాసిన ఉత్తరంలో సీబీఐ ఎంక్వయిరీ కావాలని ఎందుకు కోరలేదో సమాధానం చెప్పాలన్నారు. కల్తీ నెయ్యి విషయంలో నాటి దేవదాయశాఖ మంత్రి వెల్లంపల్లి శ్రీనివాస్ కూడా బాధ్యుడేనన్నారు. నగరంలో హజ్ హౌస్‌ను ప్రారంభించేందుకు కృషి చేస్తామన్నారు. వరదల్లోనూ బురద రాజకీయం చేసిన ఘనత జగన్‌కే చెల్లుతుందన్నారు. వరద బాధితులకు రూ. కోటి ప్రకటించి కమిటీ వేశాడని, ఆ కమిటీ ఎప్పుడు నిర్ణయిస్తుందో తెలియదన్నారు. కూటమి ప్రభుత్వ వంద రోజుల పాలనపై ప్రజల నుంచి అపూర్వ స్పందన వస్తుందని, 56వ డివిజన్‌లో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తే అక్కడి ప్రజలు, బాధితులు స్వచ్ఛందంగా ముందుకొచ్చి వాళ్లే తమ ఇళ్లకు స్టిక్కర్లు అంటించుకుంటున్నారన్నారు. దుర్గగుడిలో దసరా ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తామన్నారు. ఆలయాభివృద్ధికి కేంద్ర పథకం ప్రసాద్ కింద రూ.100 కోట్లను అడిగామన్నారు. దూండీ రాకేష్, ఫతాఉల్లా, చొంగా సంజయ్ వర్మ పాల్గొన్నారు.

వాస్తవాలు గ్రహించాలి..

పాత రాజరాజేశ్వరిపేట: ఎన్నికలు పూర్తయ్యాక కూడా ఎమ్మెల్యే జగన్‌మోహన్‌రెడ్డి ఇంకా రాజకీయాలు చేస్తున్నాడని ఇప్పటికైనా నీచ రాజకీయాలు మాని వాస్తవాలు గ్రహించి మాట్లాడాలని ఎంపీ కేశినేని చిన్ని హితవుపలికారు. 56వ డివిజన్‌లోని పాత రాజరాజేశ్వరిపేటలో ఇది మంచి ప్రభుత్వం అనే కార్యక్రమం సోమవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికీ వెళ్లి ఎన్డీయే ప్రభుత్వంలో సీఎం చంద్రబాబు వంద రోజుల్లో చేసిన సంక్షేమం, అభివృద్ధిని స్థానిక ప్రజలకు వివరించి స్టిక్కర్లు అంటించారు. టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి నాగుల్‌మీరా, మాజీ ఎమ్మెల్యే జలీల్‌ఖాన్, నేతలు ధనేకుల సుబ్బారావు, ఈశ్వర్ పాల్గొన్నారు.

వంద రోజుల పాలనపై అభినందనలు

రాణిగారితోట: వంద రోజల కూటమి ప్రభుత్వంపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారని టీడీపీ 18వ డివిజన్ అధ్యక్షుడు వేముల దుర్గారావు అన్నారు. డివిజన్‌లో సోమవారం పార్టీ, ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ ఆదేశాలతో ఇది మంచిప్రభుత్వం అనే కార్యక్రమం నిర్వహించి ప్రతి ఇంటికి వెళ్లి 100 రోజుల్లో కూటమి ప్రభుత్వం చేసిన అభివృద్ధితోపాటు పథకాలను వివరించి కరపత్రాలు పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడుతూ ప్రతి నెల 1న పెన్షన్ల పంపిణీ, పేదవాడి ఆకలి తీర్చే అన్నా క్యాంటీన్ ప్రారంభం, అనుకోని వరదలతో విలవిలలాడుతున్న ప్రజలక సీఎం చంద్రబాబు సహాయంపై ప్రజలు సంతోషం వక్తం చేశారన్నారు. అడ్మిన్ ఉమా, పగడాల వెంకటేశ్వరరెడ్డి, దుర్గ, దుర్గమ్మ పాల్గొన్నారు.

జాతీయ గేమ్స్‌కు షూటర్ అభిరామ్

విజయవాడ స్పోర్ట్సు: నగరంలోని అంబిటస్ వరల్డ్ స్కూల్‌లో 9వ తరగతి చదువుతున్న షూటర్ వెన్నం అభిరామ్ సీబీఎస్ఈ నేషనల్ గేమ్స్‌కు అర్హత సాధించాడు. ఇటీవల తమిళనాడులోని ఇస్కి విద్యాశ్రమంలో జరిగిన సౌత్ జోన్ -1 సీబీఎస్ఈ గేమ్స్‌లో 10 మీటర్ల రైఫిల్ షూటింగ్‌లో 400 పాయింట్లకు 396 పాయింట్లతో స్వర్ణం వశం చేసుకున్నాడు. ఇది సౌత్‌జోన్ పోటీల్లో రికార్డుస్కోర్‌తో జాతీయపోటీలకు ఎంపికయ్యాడు. అభిరామ్ గ్లోరియస్ షూటింగ్ అకాడమీలోని భరత్ వద్ద శిక్షణ పొందుతున్నట్టు తల్లిదండ్రులు డాక్టర్ ధర్మేంద్రకుమార్, డాక్టర్ కే రాధా లావణ్య తెలిపారు.

రేపటి నుంచి ఉమ్మడి కృష్ణా స్కూల్ గేమ్స్ ఎంపికలు

విజయవాడ స్పోర్ట్సు: ఎస్‌జీఎఫ్ ఉమ్మడి కృష్ణా అండర్-19 స్కూల్ గేమ్స్‌కు బాలబాలికలకు జిల్లా జట్ల ఎంపికలను ఈ నెల 25 నుంచి 28వ వరకు వివిధ ప్రాంతాల్లో చేపడుతున్నట్టు జిల్లా స్కూల్ గేమ్స్ అండర్-19 సెక్రటరీ వేమూరి రవికాంత ఒక ప్రకటనలో తెలిపారు. 25న ఉదయం 9 గంటలకు మొగల్రాజపురం పీబీ సిద్ధార్థలో సాఫ్ట్ బాల్, బేస్‌బాల్, అదేరోజు మధ్యాహ్నం 2 గంటలకు నున్న జెడ్పీ హైస్కూల్‌లో రెజ్లింగ్, 26న ఉదయం 9 గంటలకు కేబీఎన్ కాలేజీలో హ్యాండ్‌బాల్, చెస్, 27న ఉదయం 9 గంటలకు మొగల్రాజపురం పీబీ సిద్ధార్థలో రగ్బీ, హాకీ, 28న ఉదయం 10 గంటలకు పటమట జెడ్పీ బాలుర హైస్కూల్‌లో సెపక్‌తక్రా, అదేరోజు ఉదయం 10 గంటల నుంచి నూజివీడు ఐఐటీలో యోగా జిల్లా జట్ల ఎంపికలను చేపడతామన్నారు. పాల్గొనే క్రీడాకారులు టెన్త్ ఒరిజినల్ మార్కులిస్టు, చదువుతున్న కాలేజీ ప్రిన్సిపాల్‌తో సంతకం చేయించిన స్టడీ సర్టిఫికెట్, ఆధార్‌కార్డులతో హాజరుకావాలని రవికాంత వివరించారు. పాలిటెక్నిక్, ఐటీఐ, ఓపెన్ ఇంటర్ చదివే క్రీడాకారులకు అవకాశం లేదన్నారు.

బీజేపీ ప్రాయశ్చిత్త ప్రదక్షిణలు

విజయవాడ: తిరుమల శ్రీవారి లడ్డూ తయారీలో కల్తీ నెయ్యిను ఉపయోగించడంపై బీజేపీ మహిళలు ప్రాయశ్చిత్త ప్రదక్షిణలు చేశారు. సత్యనారాయణపురంలోని శివరామకృష్ణ క్షేత్రంలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో సోమవారం సాయంత్రం 11 ప్రదక్షిణలు చేశారు. అనంతరం పరిహార పూజలు చేశారు. బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సాధినేని యామిని పాల్గొన్నారు.



టీటీలో ఆగిరిపల్లి విద్యార్థుల సత్తా

విజయవాడ స్పోర్ట్సు: తెలుగు రాష్ట్రాలకు సంబంధించి ఈ నెల 20 నుంచి 22 వరకు పెద్దాపురంలో జరిగిన సీబీఎస్ఈ క్లస్టర్ టేబుల్ టెన్నిస్ టోర్నమెంట్‌లో ఆగిరిపల్లిలోని హ్యాపీవ్యాలీ స్కూల్ విద్యార్థులు పతకాలతో మెరిశారు. అండర్-19 బాలుర టీమ్ ఈవెంట్‌లో జె యశ్వంత్, ఆర్ ధనుష్, పి లీలాధర్, ఎస్,యోహాన్‌లు కాంస్యం, బాలికల టీమ్ ఈవెంట్‌లో జి సృజన, ఎన్ మహాలక్ష్మి, ఎన్ తేజశ్రీ కాంస్యంతో సత్తా చాటారు. సింగిల్స్‌లో జె.యశ్వంత్ కాంస్యం, ఏ అభిరామ్ రజతం వశం చేసుకున్నారు. డి రుత్విక్ బెస్ట్ ప్లేయర్ అవార్డును సాధించారు. స్కూల్ ఆవరణలో జరిగిన అభినందన సభలో స్కూల్ చైర్మన్ డాక్టర్ కేకేఆర్, డైరెక్టర్లు కే అవినాష్, కె. శ్రీ తేజ, డీన్ రఘురామ్, ప్రిన్సిపాల్ కే శ్రీదేవి, కోచ్ బీ శ్రీనివాస్, పీఈటీ వై హసినా విద్యార్థులు అభినందించారు.



నాసా చేపట్టే పరిశోధనలను వివరిస్తున్న కృష్ణమూర్తి

భూగోళ పరిస్థితులపై శాస్త్రవేత్తల కృషి అభినందనీయం

కంకిపాడు, సెప్టెంబరు 23: భూగోళ స్థితిగతులపై అధ్యయనం చేసేందుకు ఇస్రో చేస్తున్న కృషి అభినందనీయమని రాష్ట్ర కౌన్సిల్ ఫర్ సైన్స్ అండ్ టెక్నాలజీ మెంబర్ సెక్రటరీ కృష్ణమూర్తి అన్నారు. విజ్ఞాన భారతి, ఇస్రో సంయుక్తంగా నిర్వహిస్తున్న స్పేస్ ఆన్ వీల్స్‌ను మండలంలోని ఈడుపుగల్లు జిల్లా పరిషత్ పాఠశాలలో సోమవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన కృష్ణమూర్తి మాట్లాడుతూ శాటిలైట్స్, వాటి ఉపయోగాలను విద్యార్థులకు తెలియజేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. మాజీ ఎంపీపీ దేవినేని రాజా, ఎంపీపీ నెరుసు రాజ్యలక్ష్మీ, సర్పంచ్ పందిపాటి ఇందిర, ఎంఈవో వై ప్రసాద్, హెచ్ఎం పద్మా భాయ్ ధనేకుల ఇంజినీరింగ్ కాలేజ్ ప్రొఫెసర్ రావి సురేష్ బాబు, సీఆర్‌పీలు, ఉపాధ్యాయులు, టీడీపీ నేతలు పందిపాటి సుధాకర్, షేక్ షకార్ పాల్గొన్నారు.



సచివాలయంలో వరద బాధితులతో మాట్లాడుతున్న కమిషనర్

లబ్ధిదారుల జాబితాపై అభ్యంతరాల స్వీకరణ

సత్యనారాయణపురం, పాయకాపురం, సెప్టెంబరు 23: వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర సోమవారం కండ్రిక, శాంతినగర్, అయోధ్యనగర్ రాజీవ్‌నగర్ ప్రాంతాల్లో పర్యటించి సచివాలయాల్లో స్వీకరిస్తున్న అభ్యంతరాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. వరద ప్రాంత ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు కమిషనర్ స్వయంగా నమోదు ఎలా స్వీకరించాలో రాసి చూపించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వరద ప్రభావిత ప్రాంతాలైన 32 వార్డుల్లోని అన్ని సచివాలయాల్లో నష్టగణన లబ్ధిదారుల జాబితాను ప్రదర్శించిన తర్వాత అభ్యంతరాలను స్వీకరిస్తున్నామన్నారు. ఈ పర్యటనలో అసిస్టెంట్ కలెక్టర్ శుభం నోఖ్వాల్ పాల్గొన్నారు.



అవార్డులను అందజేస్తున్న రైల్వే జీఎం అరుణ్ కుమార్ జైన్

డివిజన్‌లోని ముగ్గురికి మ్యాన్ ఆఫ్ ది మంత్ అవార్డు

రైల్వేస్టేషన్, సెప్టెంబరు 23: రైల్వే డివిజన్‌లో ముగ్గురు ఉద్యోగులకు మ్యాన్ ఆఫ్ ది మంత్ అవార్డులు దక్కాయి. హైదరాబాద్ రైలు నిలయంలో సోమవారం వర్చువల్ సేఫ్టీ సమావేశం జరిగింది. దక్షిణ మధ్య రైల్వే జీఎం అరుణ్ కుమార్ జైన్ నిర్వహించిన ఈ సమావేశంలో డివిజన్ నుంచి డీఆర్ఎం నరేంద్ర ఏ పాటిల్, సికింద్రాబాద్‌లోని రైలు నిలయం నుంచి ఆయా విభాగాధిపతులు, గుంతకల్, గుంటూరు, సికింద్రాబాద్, హైదరాబాద్, నాందేడ్ డివిజన్ల డీఆర్ఎంలు వర్చువల్‌గా పాల్గొన్నారు. ఈ సమావేశంలో అరుణ కుమార్ జైన్ రైల్వే ట్రాక్‌ల భద్రతా సేఫ్టీ డ్రైవ్, రాత్రిపూట గస్తీలు, తనిఖీల గురించి ప్రస్తావించారు. అనంతరం విజయవాడ రైల్వే డివిజన్‌లోని ముగ్గురు ఉద్యోగులకు మ్యాన్ ఆఫ్ ది మంత్ అవార్డులను ప్రకటించారు. రాజమండ్రి సీనియర్ టెక్నీషియన్ కె.శ్యామ్‌కుమార్, మరో టెక్నీషియన్ వై.చంద్రకుమార్, హంసవరం పాయింట్స్‌మెన్ ఆదినారాయణకు ఈ అవార్డులు లభించాయి.



లేబర్ కోడ్స్ రద్దు కోరుతూ కార్మిక, రైతు సంఘాల నిరసన ప్రదర్శన

లేబర్ కోడ్స్ రద్దు చేయాలి

● కార్మిక, రైతు సంఘాల నిరసన

గవర్నర్‌పేట, సెప్టెంబరు 23: కార్మికుల్ని కట్టుబానిసలుగా మార్చే లేబర్ కోడ్స్ రద్దు చేయాలని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ నర్సింగరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కేంద్ర కార్మిక, రైతు సంఘాలు లేబర్ కోడ్స్ రద్దుకోసం బ్లాక్ డే పాటించాలని ఇచ్చిన పిలుపు మేరకు కేంద్ర కార్మిక సంఘాల రాష్ట్ర శాఖలు, సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో ఆదివారం లెనిన్ సెంటర్‌లో నిరసన ప్రదర్శన జరిగింది. ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.రవీంద్రనాథ్ మాట్లాడుతూ లేబర్ కోడ్స్ రద్దు కోసం మరిన్ని ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలని కోరారు. రైతు సంఘాల సమాఖ్య కన్వీనర్ వడ్డే శోభనాద్రీశ్వరరావు మాట్లాడూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేకంగా మారిందన్నారు. రైతు సంఘ నేతలు ఎం. సూర్యనారాయణ, కేవీబీ ప్రసాద్, డి.హరినాథ్, ఐఎఫ్‌టీయూ నేతలు రవిచంద్ర, ఎం. రామకృష్ణ, కిసాన్ ఫెడరేషన్ రాష్ట్ర నేతలు ఎం. వెంకటరెడ్డి, వివిధ కార్మిక సంఘాల నేతలు పాల్గొన్నారు.

త్రోబాల్ చాంప్‌లో ఉమ్మడి కృష్ణా జట్ల సత్తా

● హోరాహోరీ ఫైనల్స్‌లో ఓడి రజతాలు కైవసం

విజయవాడ స్పోర్ట్సు, సెప్టెంబరు 23: విశాఖపట్నం ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో రెండు రోజుల పాటు సాగిన రాష్ట్రస్థాయి అండర్-19 త్రోబాల్ చాంపియన్‌షిప్‌లో ఉమ్మడి కృష్ణా బాలబాలికల జట్లు హోరాహోరీగా జరిగిన ఫైనల్స్ ఓడి రజతాలను వశం చేసుకున్నాయి. ఏపీఎస్ కాలేజీ ప్రిన్సిపాల్ సింహాద్రి నాయుడు, సీఐ ఎయిర్‌పోర్టు ఆర్ దుర్గాప్రసాద్‌లు ట్రోఫీలు, మెడల్స్, ప్రశంసాపత్రాలు బహూకరించారు. జిల్లా జట్లు రాష్ట్ర త్రోబాల్ అసోసియేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ ఈదా సుచోచన, ఏపీ జనరల్ సెక్రటరీ గౌస్‌బాబు అభినందించారు.

చిన్నారి గుండె శస్త్రచికిత్సకు

రూ.5లక్షల ఎల్‌వోసీ అందజేత

పూణే నుంచి సీఎంతో మాట్లాడిన ఎమ్మెల్యే గద్దె




సీఎంఆర్ఎఫ్ పత్రాన్ని అందిస్తున్న ప్రసాద్

పటమట, సెప్టెంబరు 23: ఐదేళ్ల జియాకు వైద్య ఖర్చుల నిమిత్తం రూ.5 లక్షలను సీఎంఆర్ఎఫ్ నిధులను మంజూరు చేయించారు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్. స్థానిక పంటకాల్వరోడ్డులోని పీఅండ్‌టీ కాలనీలో రాజస్థాన్‌కు చెందిన రింకు కుమారి, ఆమె కుమార్తె జియా(5)తో నివాసం ఉంటున్నారు. జియా తర చూ అనారోగ్యానికి గురవుతుండటంతో పరీక్షలు చేయించగా గుండెకు రంధ్రం పడిందని వెంటనే ఆపరేషన్ చేయించాలని సూచించారు. దీంతో దిక్కుతోచని స్థితిలో అశోక్‌నగర్‌లోని ఎమ్మెల్యే కార్యాలయానికి వెళ్లి తన గోడును వెళ్లబోసుకుంది. పూణేలో ఉన్న ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్‌కు వీడియో కాల్‌లో పాప ఆరోగ్య పరిస్థితిని వివరించారు. వెంటనే స్పందించిన ఆయన సీఎం చంద్రబాబుతో ఫోన్‌లో మాట్లాడి చిన్నారి జియా శస్త్రచికిత్సకు అవసరమైన రూ.5లక్షలను సీఎంఆర్ఎఫ్ ద్వారా మంజూరు చేయించగా, నిధులు విడుదల పత్రాన్ని కార్పొరేటర్ ముమ్మనేని ప్రసాద్ రింకు కుమారి కుటుంబానికి అందజేశారు.

రిటైర్డ్ ఎంప్లాయీస్ మెడికల్ స్కీమ్‌ను అమలు చేయండి

బస్టేషన్: రిటైర్డ్ ఎంప్లాయిస్ మెడికల్ స్కీమ్‌ను అమలు చేయాలని ప్రజా రవాణా సంస్థ ఎండీకి ఎంప్లాయిస్ యూనియన్ సోమవారం వినతిప్రతం అందజేసింది. ప్రజా రవాణా సంస్థలో రిటైర్ అయిన ఉద్యోగులకు 2003లో మెడికల్ స్కీమ్ ప్రారంభమైందని, ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసిన చేశాక మూసివేశారన్నారు. 2020 జనవరి తరువాత రిటైర్డ్ ఉద్యోగులు, స్వచ్ఛంద పదవీ విరమణ పెట్టుకున్నవారు, మెడికల్‌గా అన్‌ఫిట్ అయిన వారు మొత్తంమీద 3వేల మంది ఉంటారని, వీళ్లంతా వైద్య సౌకర్యాలు, మందులు పొందలేక ఇబ్బంది పడుతున్నారన్నారు. ఈ స్కీమ్‌ను అమలుకు ప్రభుత్వం ఎంత చెల్లించమంటే అంత చెల్లించేందుకు సిద్ధంగా ఉన్నారని, ఆర్టీసీ ఆసుపత్రుల్లోని వైద్య సౌకర్యాలు, మందుల పంపిణీతో పాటు ఎంప్లాయిస్ హెల్త్ స్కీమ్ అందుబాటులోకి తేవాలని కోరారు. పలిశెట్టి దామోదరరావు, వి.వి. నరసయ్య సంతకాలు చేశారు.

రాజ్యలక్ష్మికి అవుట్ స్టాండింగ్ లీడర్‌షిప్ లెగసీ అవార్డు



మంగళగిరి, సెప్టెంబరు 23: విజయనగరంలోని గురజాడ జవహర్‌లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్సిటీ ఇన్‌చార్జి వైస్‌చాన్సలర్ ఆచార్య డి.రాజ్యలక్ష్మికి కౌన్సిల్ ఫర్ స్కిల్స్ అండ్ కంపిటెన్సీస్ (సీఎస్‌సీ ఇండియా) నీతి ఆయోగ్ అవుట్ స్టాండింగ్ లీడర్‌షిప్ లెగసీ అవార్డును ప్రకటించింది. జాతీయ ఇంజనీర్ల దినోత్సవం సందర్భంగా జరిగిన వేడుకల్లో వర్చువల్‌గా ఈ అవార్డును ప్రదానం చేశారు. ఇంజనీరింగ్ విద్యా రంగంలో విశేష సేవలందించినందుకు గాను రాజ్యలక్ష్మికి ఈ అవార్డు లభించింది. ఈ సందర్భంగా సీఎస్‌సీ ఇండియా సీనియర్ లెర్నింగ్ కన్సల్టెంట్ వై.రామమోహనరావు మాట్లాడుతూ ఇంజనీరింగ్ విద్యా రంగంలో రాజ్యలక్ష్మి అందించిన దీర్ఘకాలిక సేవలను ప్రశంసించారు. ఆమె అంకితభావం, దార్శనికత, నాయకత్వం భవిష్యత్ తరాలకు ప్రేరణగా నిలుస్తుందని పేర్కొన్నారు. రాజ్యలక్ష్మి ఆధ్వర్యంలో వర్సిటీ అనేక విభాగాల్లో ప్రగతి సాధించిందన్నారు. యూనివర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య జీ.జయసుమ, డైరెక్టర్లు, అధ్యాపకులు, సిబ్బంది అవార్డు అందుకున్న రాజ్యలక్ష్మికి అభినందనలు తెలియజేశారు.



లింగాయపాలెంలో జరిగిన సమావేశంలో వరల్డ్ బ్యాంకు, ఏడీబీ బ్యాంకు సభ్యులతో సీఆర్డీఏ అదనపు కమిషనర్ ప్రవీణ్‌చంద్

రాజధానికి స్వచ్ఛందంగా భూములిచ్చాం

- వైసీపీ మోసం చేసింది.. చంద్రబాబు రాకతో అమరావతికి పునరుజ్జీవం
- వరల్డ్ బ్యాంకు, ఏడీబీ బృందంతో లింగాయపాలెం రైతులు

తుళ్లూరు, సెప్టెంబరు 23: రాజధాని నిర్మాణం కోసం మూడు పంటలు పండే భూమిని స్వచ్ఛందంగా ప్రభుత్వానికి ఇచ్చామని లింగాయపాలెం రైతులు ప్రపంచబ్యాంకు, ఏడీబీ బృందానికి స్పష్టం చేశారు. రాజధాని రైతులు, కూలీలతో బృందం సభ్యులు, సీఆర్డీఏ అధికారులు లింగాయపాలెంలో సమావేశమయ్యారు. వైసీపీ ప్రభుత్వం తమను మోసం చేసిందని రాజధాని రైతులు తెలిపారు. తిరిగి చంద్రబాబు సీఎం కావడంతో అమరావతికి పునర్జీవం వచ్చిందని చెప్పారు. అసైన్డ్ రైతులకు జమ చేయాల్సిన కౌలు నగదును వైసీపీ ప్రభుత్వం పెండింగ్ పెట్టిందని ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వంలోనైనా ఈ నగదును జమ చేయాలని కోరారు. రాజధాని రైతుల ఆర్థిక పరిస్థితి, భూమిలేని నిరుపేదలకు జీవన భృతి పింఛను, కూలీల ఉపాధి, వైద్యం, విద్య తదితర విషయాలపై వరల్డ్ బ్యాంకు ప్రతినిధులు, ఏడీబీ బ్యాంకు సభ్యులు రైతులను వాకబు చేశారు. అమరావతి వైద్య కార్డులు అమలులో ఉన్నాయని, ఉచిత వైద్యం అందుతోందని అదనపు కమిషనర్ చెప్పారు. భూ సేకరణ కింద తీసుకోవాల్సిన భూములు ఇంకా కొద్దిగా ఉన్నాయని వాటిని ఇవ్వడానికి రైతులు ముందుకొస్తున్నారని కమిషనర్ తెలిపారు. వరల్డ్ బ్యాంకు సభ్యులు రంజన్‌వర్మ, వెంకట సుబ్బారావు, అశోక్ శశిధర్, ఆసియా డెవలప్‌మెంట్ బ్యాంకు సభ్యులు స్వాతిఘోష్ తులసీచంద్ర, హెచ్‌ఎస్‌వీ సింగ్, జానీ మాథ్యూస్, సీఆర్డీఏ సోషల్ డెవలప్‌మెంట్ గ్రూపు డైరెక్టర్లు కిశోర్ మోహన్, బి.శ్రీనివాసరావు ఉన్నారు. అనంతరం విట్, ఎస్ఆర్ఎం యూనివర్సిటీల ప్రదేశాలను బృందం సభ్యులు పరిశీలించారు.

దేవదాయ శాఖలో ముగిసిన బదిలీలు

- కె.బి.శ్రీనివాసరావు బదిలీపై రాజకీయ ఒత్తిళ్లు

అమరావతి, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): దేవదాయ శాఖలో బదిలీల ప్రక్రియ ముగిసింది. జాయింట్ కమిషనర్ల దగ్గర నుంచి జూనియర్ అసిస్టెంట్ల వరకూ అన్ని కేడర్ల ఉద్యోగులను బదిలీ చేశారు. డిప్యూటీ కమిషనర్ల బదిలీలు ఉన్నతాధికారులకు పెద్ద తలనొప్పిగా మారాయి. తొలుత 15 మంది డిప్యూటీ కమిషనర్లను వివిధ ఆలయాలకు ఈవోలుగా, కొన్ని ముఖ్యమైన పోస్టులకు బదిలీ చేశారు. ప్రధాన కార్యాలయంలో డిప్యూటీ కమిషనర్లుగా ఉన్న రత్నరాజును విజయవాడ కనకదుర్గమ్మ ఆలయానికి డిప్యూటీ ఈవోగా నియమించారు.

శోభారాణిని మహానంది ఆలయానికి ఈవోగా బదిలీ చేశారు. పోస్టింగ్ కోసం ఎదురుచూస్తున్న ఎం.విజయరాజును కర్నూలు జిల్లా ఉరవకొండలోని శ్రీనారసింహస్వామి ఆలయ ఈవోగా నియమించారు. నెల్లూరు జిల్లా మాలకొండ శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం ఈవో కె.బి.శ్రీనివాసరావును ప్రధాన కార్యాలయానికి బదిలీ చేశారు. ఉరవకొండ దేవస్థానం ఈవోగా ఉన్న హెచ్.జి.వెంకటేష్‌ను కూడా ప్రధాన కార్యాలయానికి బదిలీ చేశారు. అయితే ఈ బదిలీల ఉత్తర్వుల్లో కొన్ని మార్పులు చేశారు. రాజకీయ ఒత్తిళ్లతో కె.బి.శ్రీనివాసరావును ప్రధాన కార్యాలయంలో కాకుండా గుంటూరు డిప్యూటీ కమిషనర్‌గా నియమిస్తూ ఉత్తర్వులు మార్చారు. ప్రస్తుతం గుంటూరు డిప్యూటీ కమిషనర్‌గా ఉన్న బి.మహేశ్వరరెడ్డిని ప్రధాన కార్యాలయానికి బదిలీ చేశారు. మరోవైపు స్టేషన్ సీనియారిటీ విషయంలో కూడా నిబంధనలు పాటించలేదన్న విమర్శలు వస్తున్నాయి.

యూనివర్సిటీ లేకుండానే అడ్మిషన్లు

- ఏఎన్‌యూకి అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ బాధ్యత
- విమర్శలతో నిర్ణయంపై వెనకడుగు యోచన

అమరావతి, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): యూనివర్సిటీ లేకుండానే దూరవిద్యా కోర్సుల్లో అడ్మిషన్లు చేపట్టాలని ఉన్నత విద్యాశాఖ ఆదేశాలు జారీ చేయడంపై విమర్శలు వస్తున్నాయి. 2024-25 అడ్మిషన్ల బాధ్యతను ఆచార్య నాగార్జున యూనివర్సిటీ (ఏఎన్‌యూ)కి అప్పగిస్తూ తాజాగా ఉత్తర్వులు జారీచేసింది. రాష్ట్ర విభజన జరిగి పదేళ్లు పూర్తైనందున ఏపీలోని స్టడీ సెంటర్లకు హైదరాబాద్‌లోని అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ సేవలు నిలిచిపోయాయి. ఈ నేపథ్యంలో ఏపీలో విద్యార్థులకు అడ్మిషన్ల కోసం ఉన్నత విద్యామండలి సలహాతో ఉన్నత విద్యాశాఖ హడావుడిగా ఈ నిర్ణయం తీసుకుంది. అయితే అసలు యూనివర్సిటీని ఏర్పాటు చేయకుండా అడ్మిషన్లు ఎలా చేపడతారనే విమర్శలు పెరగడంతో ఆ నిర్ణయాన్ని ఉపసంహరించుకునే యోచనలో పడింది.

మొక్కజొన్న దిగుమతిపై సుంకం రద్దు చేయండి

- పౌల్ట్రీ రైతులను ఆదుకోండి: పురందేశ్వరి

న్యూఢిల్లీ, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): కోళ్ల మేతకు రెండు లక్షల టన్నుల మొక్కజొన్నలు విదేశాల నుంచి దిగుమతి చేసుకుంటున్నామని, వాటిపై సుంకం రద్దు చేయాలని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌ను బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు, ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి కోరారు. ఏపీలో ఆక్వా తర్వాత పౌల్ట్రీ రంగమే అతిపెద్దదని తెలిపారు. సోమవారం ఢిల్లీలో నిర్మలా సీతారామన్‌ను పురందేశ్వరి కలిశారు. ఏపీ పౌల్ట్రీ రైతులతో కలిసి పలు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. రాష్ట్రంలో సుమారు 5 కోట్ల కోళ్లను మూడువేల మందికిపైగా రైతులు పెంచుతున్నారని తెలిపారు.

పరువు నష్టం వ్యవహారంలో.. జగన్ పిటిషన్‌పై మంత్రి నారాయణకు నోటీసులు

అమరావతి, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): పురపాలక మంత్రి పి.నారాయణ తనపై వేసిన పరువునష్టం కేసును కొట్టివేయాలని కోరుతూ మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి దాఖలుచేసిన పిటిషన్ సోమవారం హైకోర్టులో విచారణకు వచ్చింది. వ్యాజ్యంలో ప్రతివాదిగా ఉన్న పి.నారాయణకు కోర్టు నోటీసులు జారీ చేసింది. విచారణను అక్టోబరు 15కి వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ వీఆర్‌కే కృపాసాగర్ సోమవారం ఉత్తర్వులు ఇచ్చారు. రాజధాని భూముల వ్యవహారంలో తన పరువుకు భంగం కలిగించేలా జగన్ పత్రిక సాక్షిలో వార్త ప్రచురించారని పేర్కొంటూ 2018లో మంత్రి నారాయణ విజయవాడ ఎంపీ, ఎమ్మెల్యేల ప్రత్యేక కోర్టులో జగన్ తదితరులపై పరువునష్టం కేసు వేశారు. ఈ కేసును కొట్టివేయాలని, ప్రత్యేక కోర్టులో తదుపరి చర్యలన్నింటినీ నిలుపుదల చేస్తూ మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వాలని జగన్ హైకోర్టులో పిటిషన్ వేశారు. సోమవారం విచారణ సందర్భంగా జగన్ తరఫున సీనియర్ న్యాయవాది ఎస్.శ్రీరామ్ వాదనలు వినిపించారు. పిటిషనర్‌కు సాక్షి పత్రికతో సంబంధం లేదని, అందులో వచ్చిన కథనానికి బాధ్యుడిని చేస్తూ పరువు నష్టం కేసు వేశారని తెలిపారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ మెండ లక్ష్మీనారాయణ స్పందిస్తూ.. కేసు మొదటిసారి విచారణకు వచ్చిందని, ఫిర్యాదుదారుకు నోటీసులు వెళ్లాల్సి ఉందన్నారు.

'చిత్తూరు- తచ్చూరు' హైవేపై నిరసన వాయిదా



రోడ్డుపైనే నిద్రిస్తున్న సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ

నగరి, సెప్టెంబరు 23: చిత్తూరు-తచ్చూరు జాతీయ రహదారికి సర్వీసు రోడ్డు కావాలంటూ సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ ఆధ్వర్యంలో ఆదివారం చేపట్టిన నిరసన కార్యక్రమాన్ని సోమవారం వాయిదా వేశారు. ఆది, సోమవారాల్లో పాదిరి వద్ద హైవేపై వంటావార్పు నిర్వహించారు. ఆదివారం రాత్రి రైతులతో కలిసి రోడ్డుపైనే నారాయణ నిద్రించారు. కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశాలతో జాతీయ రహదారి ప్రాజెక్టు డైరెక్టర్ కార్తీక్‌రెడ్డి సోమవారం నారాయణతో చర్చించి సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతానని హామీ ఇవ్వడంతో నిరసన వాయిదా వేస్తున్నట్లు నారాయణ తెలిపారు.

రోగుల్లో కనిపిస్తున్న లక్షణాలివే...

ప్రస్తుతం జ్వరాల బారిన పడుతున్న వారిలో అనేక లక్షణాలు బయటపడుతున్నాయి. చలిజ్వరం, తీవ్రమైన తలనొప్పి, నోరంతా చేదు, వాంతులు, వికారం, కడుపునొప్పి, విరేచనాలు, ముక్కు నుంచి నీరు కారడం, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, నీరసం, తల తిరుగుడు, తూలు రావడం, విపరీతమైన దగ్గు, ఆకలి మందగించడం, కీళ్ల నొప్పులు, కాళ్లు, చేతులు బిగుసుకుపోవడం వంటి లక్షణాలు కనిపిస్తాయి.



'కాక్‌టెయిల్' వైరస్ కలకలం!

- ఇంటింటా వైరల్ ఫీవర్ బాధితులు
- జ్వరం తగ్గినా తీవ్ర దగ్గుతో ఇబ్బందులు

గుంటూరు (మెడికల్), సెప్టెంబరు 23: వర్షాకాలంలో జ్వరాలు విజృంభించడం సహజం. ముఖ్యంగా వైరల్ ఫీవర్లు ఎక్కువగా ఇబ్బంది పెడుతుంటాయి. మలేరియా, డెంగీ, చికున్ గున్యాతోపాటు టైఫాయిడ్, ఫ్లూ జ్వరాలు కూడా దాడి చేస్తుంటాయి. ఆయా జ్వరాలను బట్టి రోగుల్లో లక్షణాలు వేర్వేరుగా ఉంటాయి. అయితే వీటికి భిన్నంగా కోస్తా, ఉత్తరాంధ్రల్లో ప్రస్తుతం వింత జ్వరాలు విజృంభిస్తున్నాయి. వీటి బారిన పడిన వారిలో పలు రకాల వ్యాధి లక్షణాలు కనిపిస్తున్నాయి. అంటే.. వైరల్ ఫీవర్, డెంగీ, చికున్ గున్యా, డయేరియా, స్వైన్‌ఫ్లూ వంటి వ్యాధుల లక్షణాలన్నీ ఒకే రోగిలో బయటపడుతున్నాయి. అసలు ఈ జ్వరాలు దోమల ద్వారా వస్తున్నాయా...? కలుషిత నీరు, ఆహారం ద్వారా వ్యాపిస్తున్నాయా...? లేక ఒకరి నుంచి మరొకరికి గాలి ద్వారా (డ్రాప్‌లెట్ ఇన్‌ఫెక్షన్స్) సంక్రమిస్తున్నాయా...? అనేది మాత్రం అంతుబట్టడం లేదు. మొత్తమ్మీద వైరల్ ఫీవర్లు మాత్రం వణికిస్తున్నాయి. వాతావరణంలో వైరస్ కాక్‌టెయిల్ (పలురకాల వైరస్‌ల కలయిక) కనిపిస్తున్నట్లు వైద్య వర్గాలు చెబుతున్నాయి. పలు రకాల వ్యాధుల లక్షణాలు ఇలా ఒకే రోగిలో కనిపించడాన్ని వైద్య పరిభాషలో మిక్స్‌డ్ ఫీవర్స్‌గా పిలుస్తారు.

జ్వర పీడితుల్లో మొదటి మూడు రోజులు చలి జ్వరం ఉంటోంది. దీంతో పాటు విపరీతమైన తలనొప్పి, వాంతులు, విరేచనాలు, వికారం, అతిసారం (డయేరియా) వంటి లక్షణాలు కూడా కనిపిస్తున్నాయి. వారం తర్వాత కీళ్ల నొప్పులు, కాళ్లు చేతులు బిగుసుకుపోవడం వంటి చికున్ గున్యా లక్షణాలు కనిపిస్తున్నాయి. కొందరిలో తెల్లరక్త కణాలు, ప్లేట్‌లెట్లు తగ్గిపోతున్నాయి. ఇవి డెంగీ లక్షణాలు. కొందరిలో లివర్ ఎంజైమ్‌లైన బైలిరూబిన్, బైలివర్డిన్‌తో పాటు ఎస్‌జీవోపీ, ఎస్‌జీపీటీ స్థాయిలు బాగా పెరుగుతున్నాయి. ఇవి హెపటైటిస్-ఏ లక్షణాలని వైద్యులు చెబుతున్నారు. మరికొందరికి శ్వాస సంబంధ సమస్యలు, ముక్కు కారడం వంటి ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఇవి స్వైన్‌ఫ్లూ, కొవిడ్-19 లక్షణాలను పోలి ఉంటున్నాయి. కొంతమందిలో జ్వరం తగ్గినా దగ్గు ఇబ్బంది పెడుతూనే ఉంది. పల్మనాలజిస్టులను కలిసి తగిన చికిత్స తీసుకుంటే తప్ప దగ్గు తగ్గడం లేదు.

హెపటైటిస్ విజృంభణ...

మిక్స్‌డ్ ఫీవర్లతో పాటు వైరల్ హెపటైటిస్ కూడా విజృంభిస్తోంది. కలుషిత నీరు, ఆహారం తీసుకోవడమే దీనికి ప్రధాన కారణం. ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా నీటి వనరులు కలుషితం కావడం వల్ల హెపటైటిస్-ఏ విజృంభిస్తోందని చెబుతున్నారు. ఏది వైరల్ జ్వరమో.. ఏదీ హెపటైటిస్-ఏ ఇన్‌ఫెక్షనో.. తెలియక రోగులు ఆందోళన చెందుతున్నారు. ప్రతి పది మంది జ్వర పీడితుల్లో కనీసం ఇద్దరిలో హెపటైటిస్ నిర్ధారణ అవుతోంది. గతంలో రోగుల్లో ఈ తరహా లక్షణాలు చూడలేదని వైద్యులే ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. దీంతో ప్రతి రోగికీ మలేరియా, డెంగీ, టైఫాయిడ్ హెపటైటిస్-ఏ, స్వైన్‌ఫ్లూ వంటి వ్యాధి నిర్ధారణ పరీక్షలు రాయక తప్పడం లేదు. ఫలితంగా రోగులపై ఆర్థిక భారం పడుతోంది.

మాస్కు ధరించడం మేలు..

రాష్ట్రంలో వైరల్ ఫీవర్లు విజృంభిస్తున్న నేపథ్యంలో కొవిడ్-19 సమయంలో పాటించిన విధంగా ప్రజలు కొంత కాలం మాస్కులు ధరించడం, సామాజిక దూరం పాటించడం ఉత్తమమని ప్రభుత్వ ఛాతీ వ్యాధుల వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్ రఘు తెలిపారు. దీనివల్ల గాలి ద్వారా వ్యాపించే ఇన్‌ఫెక్షన్ల నుంచి రక్షణ లభిస్తుందని పేర్కొన్నారు. పెద్ద వయస్కులు ముందు జాగ్రత్తగా ఇన్‌ఫ్లుయెంజా వ్యాక్సీన్ తీసుకోవడం మేలని అంటువ్యాధుల వైద్యనిపుణులు డాక్టర్ రేవూరి హరికృష్ణ తెలిపారు. మధుమేహ రోగులు, వృద్ధులు, వ్యాధి నిరోధకత తక్కువగా ఉన్న వారు ఏటా ఒకసారి ఫ్లూ వ్యాక్సిన్ తీసుకుంటే చాలా వరకు రక్షణ లభిస్తుందని ఆయన తెలిపారు.

'సెకీ' విద్యుత్.. నెలాఖరులోగా కష్టమే!

- 3 వేల మెగావాట్లు రాష్ట్రానికి ఇవ్వాలి
- అయితే సరఫరా చేయలేని స్థితిలో కంపెనీ?

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

వ్యవసాయ విద్యుత్ అవసరాల కోసమంటూ గత ప్రభుత్వం సోలార్ ఎనర్జీ కార్పొరేషన్ ఇండియా లిమిటెడ్ (సెకీ)తో 7,000 మెగావాట్ల సౌర విద్యుత్ కొనుగోలు ఒప్పందం కొనసాగింపుపై సందేహాలు నెలకొన్నాయి. ఏకంగా పాతికేళ్లకు కుదుర్చుకున్న ఈ ఒప్పందం ప్రకారం ఈ నెలాఖరులోగా మొదటి విడతగా 3,000 మెగావాట్ల సౌరవిద్యుత్‌ను సరఫరా చేయాల్సి ఉంది. అయితే ఇప్పటికిప్పుడు ఇందుకు అవకాశాల్లేవని, సరఫరా చేసే పరిస్థితిలో సెకీ లేదని నిపుణులు చెబుతున్నారు. అసలీ దీర్ఘకాలిక ఒప్పందం కారణంగా రాష్ట్రంపై రూ.లక్ష కోట్లకుపైగా భారం పడుతుందని వారితో పాటు విద్యుత్ శాఖ, డిస్కంలు కూడా ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. అదానీ, అజూర్ పవర్ నుంచి 7 వేల మెగావాట్ల విద్యుత్‌ను సెకీ కొనుగోలు చేసి.. యూనిట్ రూ.2.49కే రాష్ట్ర డిస్కంలకు పాతికేళ్లపాటు సరఫరా చేసేలా 2021 డిసెంబరు 1వ తేదీన రాష్ట్ర ఎస్పీడీసీఎల్, ఈపీడీసీఎల్, విద్యుత్ శాఖ.. సెకీ, కేంద్ర విద్యుత్ శాఖ.. ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వ్యవసాయ విద్యుత్ సరఫరా సంస్థకూ మధ్య ఒప్పందం కుదిరింది. ఆ రోజున జగన్ ప్రభుత్వం.. దేశంలోనే అత్యంత చౌకగా యూనిట్ రూ.2.49కే కొంటున్నామని ఆర్భాటంగా ప్రకటించింది. అయితే.. అప్పటికే వేరే రాష్ట్రానికి యూనిట్ రూ.1.99కే సెకీ విక్రయించింది. అయినప్పటికీ రూ.2.49కి ఒప్పందం చేసుకుని చౌకగానే కొంటున్నామని జగన్ సర్కారు దబాయించింది. ఈ ఒప్పందం మేరకు తొలి దశలో ఈ నెల నుంచే 3,000 మెగావాట్లను డిస్కంలకు సెకీ సరఫరా చేయాలి. వచ్చే ఏడాది మరో 3,000 మెగావాట్లు, 2026లో మిగిలిన వెయ్యి మెగావాట్లను సరఫరా చేస్తామని కంపెనీ తెలిపింది. రాజస్థాన్ నుంచి సరఫరా అయ్యే ఈ విద్యుత్‌కు అంతర్రాష్ట్ర ట్రాన్స్‌మిషన్ చార్జీల నుంచి మినహాయింపు ఉంటుందని జగన్ ప్రభుత్వం ప్రజలకు నమ్మించే ప్రయత్నం చేసింది. సార్వత్రిక ఎన్నికల్లో ఘోర ఓటమితో జగన్ దిగిపోయాక.. యూనిట్‌కు 70 పైసల చొప్పున అంతర్రాష్ట్ర ట్రాన్స్‌మిషన్ చార్జీలు చెల్లించాల్సి ఉంటుందన్న విషయం వెలుగుచూసింది. కానీ అంతా కలుపుకొని యూనిట్ ధర ఏకంగా రూ.3.19కు చేరింది.

ఫీడర్ల పరిధిలోనే దొరుకుతుంటే..

వ్యవసాయం, గిరిజన ప్రాంతాల్లో గృహ విద్యుత్ కోసం.. బ్యాటరీ చార్జింగ్ సౌర విద్యుదుత్పత్తి చేపట్టే సంస్థలను విద్యుత్ శాఖ ప్రోత్సహిస్తోంది. జిల్లాలో ఫీడర్ల వారీగా ఈ విద్యుదుత్పత్తి కేంద్రాల ఏర్పాటుకు టెండర్లు పిలిచేందుకు సంప్రదాయేతర ఇంధన వనరుల ఉత్పత్తి సంస్థ సిద్ధమవుతోంది. ఈ టెండర్లకు కంపెనీలు గనుక స్పందిస్తే.. ఎక్కడికక్కడ ఫీడర్ల పరిధిలోనే సౌర విద్యుత్ లభ్యమవుతుంది. ఇలా కరెంటు స్థానికంగానే దొరికితే.. సెకీ నుంచి రూ.3.19 చెల్లించి అధిక ధరకు కొనాల్సిన అవసరం ఏమిటని నిపుణులు ప్రశ్నిస్తున్నారు. ఒకవైపు సౌర, పవన విద్యుత్ ధరలు తగ్గిపోతుంటే.. సెకీతో పాతికేళ్లపాటు కొనుగోలు ఒప్పందాన్ని కొనసాగించాల్సిన అవసరం ఉందా అని అడుగుతున్నారు. అయితే ఈ ఒప్పందాన్ని రద్దు చేసుకుంటే.. గతంలో జగన్ చేసిన తప్పును పునరావృతం చేసినట్లు అవుతుందని రాష్ట్ర విద్యుత్ శాఖ భావిస్తోంది. ఎటూ నిర్ణయం తీసుకోలేక సందిగ్ధావస్థలో ఉంది.

మీకూ ఏపీ పోలీసుల గతే!

- టీ పోలీసులకు హరీశ్ రావు హెచ్చరిక
- అధికార పార్టీకి కొమ్ముకాయొద్దంటూ హితవు
- రామచంద్రా.. రేవంత్‌ను క్షమించి, రైతులను కాపాడు: హరీశ్‌రావు

హైదరాబాద్, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌లో ప్రస్తుతం జరుగుతున్న పరిణామాలను గమనించాలని, ఏడీజీ స్థాయి నుంచి పోలీసు శాఖలోని ఉన్నత అధికారులపై వేటు వేస్తున్నారని బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. అధికార పార్టీకి కొమ్ముకాస్తే ఇక్కడి పోలీసులకూ ఏపీ పోలీసులకు పట్టిన గతే పడుతుందని హెచ్చరించారు. సోమవారం తెలంగాణ భవన్‌లో ఎంపీ వద్దిరాజు రవిచంద్ర; పువ్వాడ అజయ్, సండ్ర వెంకటవీరయ్యతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. వరద బాధితులను పరామర్శించేందుకు ఖమ్మం వెళ్లిన తమపై కాంగ్రెస్ శ్రేణులు దాడికి పాల్పడితే.. వారిని వదిలేసి, బీఆర్ఎస్ నేతలపై తప్పుడు కేసులు పెట్టడం సరికాదని చెప్పారు. ఏ పార్టీకీ అధికారం శాశ్వతం కాదన్న విషయాన్ని గుర్తించాలని సూచించారు. ప్రభుత్వానికి కొమ్ము కాస్తే.. భవిష్యత్తులో ఏపీలో మాదిరిగానే సస్పెన్షన్లు ఎదుర్కోవాల్సి వస్తుందని హరీశ్ హెచ్చరించారు.



ఖమ్మం జిల్లాలో ప్రజలు 9 ఎమ్మెల్యే సీట్లిచ్చి, కాంగ్రెస్‌కు అధికారం కట్టబెడితే.. వరదల్లో హెలికాప్టర్ ఏర్పాటు చేయకుండా 9 మందిని పొట్టన పెట్టుకున్నారని ఆరోపించారు. ఇప్పుడు సాగర్‌లో నీరున్నా.. 3 లక్షల ఎకరాల్లో పంటలను ఎండబెడతారా? అని ప్రశ్నించారు. కాంగ్రెస్‌ను గెలిపించడం ఖమ్మం ప్రజలకు శాపంగా మారిందన్నారు. సీఎం రేవంత్ నిర్లక్ష్యం, ముగ్గురు మంత్రుల సమన్వయ లోపం కారణంగా.. రైతులు ఇబ్బంది పడుతున్నారన్నారు. 22 రోజుల నుంచి కాల్వ గండి పూడ్చడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని దుయ్యబట్టారు. భద్రాద్రి సీతారామచంద్ర స్వామి మీద ఒట్టేసి చెప్పిన రేవంత్ రెడ్డి రుణమాఫీ పూర్తిచేయకుండా మాట తప్పారని.. ఆయన్ను క్షమించి, కష్టాల్లో ఉన్న రైతులను కాపాడాలని ఆ రామచంద్రుడ్ని వేడుకుంటున్నానని హరీశ్ అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక 10 నెలల్లో 2 వేల అత్యాచార ఘటనలు జరిగాయని హరీశ్ ధ్వజమెత్తారు.

పాఠశాల నుంచి 60 మంది పరార్

- గోడ దూకి బయటకు వెళ్లిపోయిన విద్యార్థులు
- వెతికి తీసుకొచ్చిన పోలీసులు, ఉపాధ్యాయులు
- ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్ వేధిస్తున్నారని పిల్లల ఫిర్యాదు
- పల్నాడు జిల్లాలోని గురుకుల పాఠశాలలో ఘటన



విద్యార్థులతో మాట్లాడి సమస్యలు తెలుసుకుంటున్న డీఎస్పీ నాగేశ్వరరావు

యడ్లపాడు, సెప్టెంబరు 23: పల్నాడు జిల్లా యడ్లపాడు మండలం కొండవీడు కొండల సమీపంలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఎస్సీ బాలుర గురుకుల పాఠశాలలో 6 నుంచి 10 తరగతుల విద్యార్థులు 450 మంది ఉన్నారు. సోమవారం ఉదయం 8 గంటలకు ప్రార్థన ముగియగానే పదో తరగతికి చెందిన 67 మంది విద్యార్థుల్లో 60 మంది వరకు ప్రహరీ గోడ దూకి పక్కనే ఉన్న కొండవీడు కొండలవైపు పరారయ్యారు. తరగతి గదిలో విద్యార్థులు తక్కువగా ఉండడాన్ని గమనించిన ఉపాధ్యాయులు మిగిలిన వారి గురించి ఆరా తీశారు. పారిపోయారన్న సంగతి తెలుసుకుని కొంతమందిని పట్టుకుని పాఠశాలకు తీసుకొచ్చారు. కొండలపైకి వెళ్లిపోయిన మిగతా వాళ్లను వెతికేందుకు ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు వెళ్లారు. ఈ విషయం బయటకు పొక్కకుండా ఉండేందుకు ఉపాధ్యాయులు గోప్యత పాటించినప్పటికీ, స్థానికుల ద్వారా విషయం బయటకు పొక్కింది. కొందరు సోషల్ మీడియాలో పెట్టడంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. చిలకలూరిపేట రూరల్ సీఐ సుబ్బనాయుడు, ఎస్ఐ బాలకృష్ణ కొండవీడు కొండల చుట్టుపక్కల ప్రాంతాల్లో వెతుకులాట ప్రారంభించారు. తుమ్మలపాలెం పరిధిలోని హైవేకు సమీపంలో గల పైపుల తయారీ కంపెనీ పక్క మార్గంలో విద్యార్థులను పోలీసులు గుర్తించారు. పోలీసులు విద్యార్థులకు నచ్చజెప్పి, పాఠశాలకు తెచ్చారు.

వేధిస్తూ అసభ్యకరంగా మాట్లాడుతుంటారు..

నరసరావుపేట డీఎస్పీ నాగేశ్వరరావు పాఠశాల వద్దకు చేరుకున్నారు. తహసీల్దార్ జయశ్రీతో కలసి విద్యార్థులతో సమావేశం నిర్వహించారు. విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రధానంగా తమకు నాణ్యమైన ఆహారం, సరిపడా నీరు అందించడం లేదని విద్యార్థులు ఫిర్యాదు చేశారు. ఆటలు ఆడుకునేందుకు అవకాశం కల్పించడం లేదని, తమతో బాత్రూంలు కడిగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రిన్సిపాల్ హనుమంతరావు, వైస్ ప్రిన్సిపాల్ శిరీష్‌బాబు వేధిస్తూ అసభ్యంగా మాట్లాడుతున్నారన్నారని చెప్పారు. అనారోగ్యానికి గురైనా ఇంటికి పంపడం లేదని, తల్లిదండ్రులను కూడా కలవనీయడం లేదని విద్యార్థులు పేర్కొన్నారు. ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్‌ను బదిలీ చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల సమస్యలను విన్న డీఎస్పీ నాగేశ్వరరావు వాస్తవాలు విచారించి, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేస్తామన్నారు. సాంఘిక సంక్షేమ శాఖ జిల్లా కో-ఆర్డినేటర్ పద్మజ విద్యార్థులతో మాట్లాడి జరిగిన విషయం గురించి వివరాలు తెలుసుకున్నారు. ప్రిన్సిపాల్‌తోపాటు టీచర్లు అందరినీ బదిలీ చేస్తామని ఆమె తెలిపారు.

లబ్ధి పొందాలంటే... చేయి తడపాల్సిందే

- మంత్రి పేషీలో ఓ అధికారి నిర్వాకం
- వ్యవసాయ శాఖలో ఏవోల ఆగ్రహం

అమరావతి, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వ హయాంలో రాష్ట్ర వ్యాప్తంగా పలువురు వ్యవసాయ విస్తరణాధికారులు బీఎస్సీ అగ్రికల్చర్ అర్హతతో మండల ఏవోగా అడ్‌హాక్ ప్రమోషన్లు పొందారు. వారి ఇంక్రిమెంట్లు, ఇతర ఆర్థిక ప్రయోజనాలను గత ప్రభుత్వం ఏళ్ల తరబడి పెండింగ్ పెట్టింది. ప్రభుత్వం మారింది. దీంతో తమకు రావాల్సిన ప్రయోజనాలు వస్తాయని ఆశించిన ఏవోలకు నిరాశే ఎదురయింది. వారి నిధులు విడుదల కాకుండా మంత్రి పేషీలోని ఉద్యోగి మోకాలు అడ్డు పెట్టినట్లు తెలిసింది. ఆర్థిక ప్రయోజనాలను అందుకుంటున్నందున తలకు ఇంత అని ముట్టజెప్పాలని సదరు ఉద్యోగి డిమాండ్ చేసినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. నానా తిప్పలు పడి, పదోన్నతులు తెచ్చుకుంటే.. న్యాయబద్ధంగా అందాల్సిన ఆర్థిక ప్రయోజనాలు పొందటానికి ముడుపులు చెల్లించాల్సి వస్తోందని పలువురు ఏవోలు వాపోతున్నారు. బీఎస్సీ అగ్రికల్చర్ పట్టా ఉన్న గ్రేడ్ 1 ఏఈవోలకు 2022 ఏవోలుగా అడ్‌హాక్ పదోన్నతులిచ్చింది. గతంలో నేరుగా బీఎస్సీ చేసిన వారిని ఏవోలుగా నియమించే వారు. కానీ గత ప్రభుత్వంలో మంజూరైన ఏవో పోస్టుల్లో 40% డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ కింద, 60% ఏజీ బీఎస్సీ చేసిన ఏఈవోల పదోన్నతుల ద్వారా భర్తీ చేశారు. ఈ విధంగా రాష్ట్రంలో 170 మంది ఏఈవోలను ఏవోలుగా తీసుకున్నారు. ఇందులో 144 మందికి అడ్‌హాక్ పదోన్నతులు ఇచ్చారు. కానీ వీరికి ఇంక్రిమెంట్లు, ఇతర ప్రయోజనాలను చెల్లించట్లేదు. ప్రభుత్వం మారాక నిధుల విడుదలకు సదరు ఏవోలు ఆర్థిక శాఖను సంప్రదించారు. వ్యవసాయ శాఖ కార్యదర్శి నుంచి ప్రతిపాదనలు వస్తే పరిశీలిస్తామని ఆర్థిక శాఖ పేర్కొన్నట్లు వారు చెప్తున్నారు. ఇదే అదనుగా సంబంధిత మంత్రి పేషీలోని ఓ అధికారి కొర్రీ వేశారని సమాచారం.



విశాఖలో సమావేశానికి హాజరైన కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు, ఎంపీలు, రైల్వే ఉన్నతాధికారులు

దక్షిణ కోస్తా రైల్వే జోన్ కార్యకలాపాలు ప్రారంభించండి

- అధికారులకు కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు ఆదేశాలు

విశాఖపట్నం, సెప్టెంబరు 23: విశాఖ కేంద్రంగా వీలైనంత త్వరగా దక్షిణ కోస్తా రైల్వే జోన్ కార్యకలాపాలు ప్రారంభించాలని కేంద్ర విమానయాన శాఖా మంత్రి రామ్మోహన్‌నాయుడు అధికారులను కోరారు. వాల్తేరు డివిజన్ పరిధిలోని వివిధ రాష్ట్రాలకు చెందిన పార్లమెంట్ సభ్యుల కమిటీ సోమవారం విశాఖపట్నంలోని వాల్తేరు డివిజన్ ప్రధాన కార్యాలయంలో సమావేశమైంది. దీనికి కేంద్ర మంత్రి రామ్మోహననాయుడు ఛైర్మన్‌గా వ్యవహరించగా, భేటీకి తూర్పు కోస్తా రైల్వే జనరల్ మేనేజర్ పరమేశ్వర్ పంక్వాల్ హాజరయ్యారు. ఏపీతో పాటు ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల ప్రయాణికులకు కల్పించాల్సిన మౌలిక సదుపాయాలపై చర్చించారు. వివిధ ప్రాంతాలకు రైలు సర్వీసులు పెంచాలని, కొన్ని స్టేషన్లలో హాల్ట్‌లు ఏర్పాటు చేయాలని జీఎం, డీఆర్ఎంలను ఎంపీలు కోరారు. కొత్త రైల్వే లైన్లు, రోడ్డు అండర్ బ్రిడ్జిలు, రోడ్డు ఓవర్ బ్రిడ్జిలను అభివృద్ధి చేయాలని సూచించారు. ప్రయాణికుల సౌకర్యార్థం కొన్ని రైళ్ల ఫ్రీక్వెన్సీ పెంచాలని కోరారు. వాల్తేరు డివిజన్‌లో చేపడుతున్న అభివృద్ధి పనులు, ప్రయాణికుల సదుపాయాల కల్పనకు ఇస్తున్న ప్రాధాన్యం అభినందనీయమన్నారు. వాల్తేరు డివిజన్ మరింత అభివృద్ధి చెందేందుకు తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామని ఎంపీలు హామీ ఇచ్చారు. జీఎం పరమేశ్వర్, డీఆర్ఎం సౌరభ్‌ప్రసాద్ మాట్లాడుతూ కమిటీ సూచనలు, సలహాలు పరిగణనలోకి తీసుకుని ప్రాధాన్యతపరంగా చేపట్టాల్సిన పనులపై దృష్టి సారిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో పార్లమెంటు సభ్యులు ఎం.శ్రీభరత్ (విశాఖపట్నం), సీఎం రమేష్ (అనకాపల్లి), డాక్టర్ చెట్టి తనూజరాణి (అరకు), కలిశెట్టి అప్పలనాయుడు (విజయనగరం), బలభద్ర మాఝీ (నవరంగపూర్), సప్తగిరి శంకర్ ఉలాక (కోరాపుట్), డాక్టర్ ప్రదీప్‌కుమార్ పాణిగ్రహి (బ్రహ్మపూర్), మహేష్ కశ్యప్ (బస్తర్), రాజ్యసభ ఎంపీలు గొల్ల బాబూరావు, ముజిబుల్లా ఖాన్‌తో పాటు వాల్తేరు రైల్వే ఏడీఆర్ఎంలు సుధీర్‌కుమార్ గుప్తా, మనోజ్‌కుమార్ సాహు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

26, 27 తేదీల్లో 'మానవ అక్రమ రవాణా'పై సదస్సు

అమరావతి, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): మానవ అక్రమ రవాణా అంశంపై ఈ నెల 26, 27 తేదీల్లో రెండు రోజులపాటు ఏపీ ప్రభుత్వం, ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో విజయవాడలో నోవాటెల్‌లో సదస్సు నిర్వహించనున్నట్లు రాష్ట్ర మహిళా,శిశు సంక్షేమశాఖ డైరెక్టర్ వేణుగోపాల రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సదస్సుకు వివిధ రాష్ట్రాల నుంచి ప్రతినిధులు హాజరు కానున్నట్లు తెలిపారు. మానవ అక్రమ రవాణా నిరోధక చర్యలపై పోలీసు, ప్రాసిక్యూటర్లు, జ్యుడీషియల్, మహిళా, శిశు సంక్షేమశాఖ అధికారులు వారి వారి అభిప్రాయాలు తెలియజేసి తగిన కార్యాచరణ ప్రణాళికను రూపొందించనున్నారని తెలిపారు.



గుజరాత్‌లో పర్యటిస్తున్న రాష్ట్ర ఆర్‌అండ్‌బీ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి, అధికారులు

నేడు గుజరాత్ సీఎంతో మంత్రి జనార్దన్‌రెడ్డి భేటీ

- పీపీపీ రోడ్లపై అధ్యయనం కోసం ఆ రాష్ట్రంలో పర్యటిస్తున్న ఏపీ బృందం

అమరావతి, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): రహదారుల అభివృద్ధిపై అధ్యయనం కోసం రాష్ట్ర రోడ్డు రవాణా శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి నేతృత్వంలోని ఉన్నతస్థాయి కమిటీ గుజరాత్‌లో పర్యటిస్తోంది. ఇందులో భాగంగా ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి భూపేంద్రభాయ్ పటేల్‌తో జనార్దన్‌రెడ్డి బృందం మంగళవారం భేటీ కానుంది. ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని రాష్ట్ర ప్రధాన రహదారులను(స్టేట్ హైవేలు) పబ్లిక్ ప్రైవేటు భాగస్వామ్యం(పీపీపీ) విధానంలో అభివృద్ధి చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన సంగతి తెలిసిందే. గుజరాత్‌లో ఈ విధానం బాగా అమలవుతోంది. ప్రపంచ బ్యాంకు నిధులతో 1,038 కిలోమీటర్ల మేర రాష్ట్ర ప్రధాన రహదారులను పీపీపీ విధానంలో అభివృద్ధి చేశారు. ఈ నేపథ్యంలో అక్కడి అభివృద్ధి నమూనాను అధ్యయనం చేయడానికి రాష్ట్ర ఆర్ అండ్‌బీ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి, ఆ శాఖ కార్యదర్శి కాంతిలాల్ దండే, ఈఎన్‌సీ నయీముల్లా, ఏపీఆర్డీసీ సీఈ శ్రీనివాసరెడ్డి సోమవారం నుంచి గుజరాత్‌లో పర్యటిస్తున్నారు. గుజరాత్ ఆర్‌అండ్‌బీ ముఖ్యకార్యదర్శి, ఈఎన్‌సీ, ఇతర అధికారులతో ఏపీ బృందం భేటీ అయింది. పీపీపీ మోడల్‌పై పలు ప్రజంటేషన్లను పరిశీలించింది.

స్కూల్ పిల్లలపై రేప్ కేసు నిందితుడి ఎన్‌కౌంటర్

ముంబయి, సెప్టెంబరు 23: మహారాష్ట్రలో సంచలనం సృష్టించిన బద్లాపూర్ పాఠశాలలో జరిగిన అత్యాచారం కేసులో నిందితుడిగా ఉన్న అక్షయ్ షిండే సోమవారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో మరణించాడు. బద్లాపూర్‌లోని ప్రైవేటు పాఠశాలలో క్లీనర్‌గా పనిచేసే అతడు ఆగస్టు 12న నాలుగు, ఆయిదేళ్ల వయసు ఉన్న ఇద్దరు బాలికలను మరుగుదొడ్ల వద్దకు తీసుకువెళ్లి అత్యాచారం చేసినట్టు కేసు నమోదయింది. దీనిపై ప్రజాగ్రహం వెల్లువెత్తడంతో ప్రభుత్వం సిట్ ఏర్పాటు చేసింది. విచారణ నిమిత్తం సాయంత్రం 5.30 గంటల ప్రాంతంలో బద్లాపూర్ నుంచి తాలోజా జైలుకు పోలీసు వాహనంలో తీసుకొని వెళ్తుండగా ఎన్‌కౌంటర్ జరిగింది. నిందితుడు అక్షయ్ షిండే ఆకస్మికంగా ఓ అధికారి చేతిలో ఉండే తుపాకీని లాక్కొని కాల్పులు జరిపినట్టు పోలీసులు తెలిపారు. వెంటనే ఆత్మరక్షణ కోసం పోలీసులు ఎదురు కాల్పులు జరపగా అతడు తీవ్రంగా గాయపడ్డాడని, ఆస్పత్రికి తరలించగా అక్కడ ప్రాణాలు కోల్పోయినట్టు వివరించారు.

కాస్త ముందంజలో కమలా హారిస్

వాషింగ్టన్, సెప్టెంబరు 23: అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో డెమొక్రాటిక్ పార్టీ అభ్యర్థి కమలా హారిస్, రిపబ్లికన్ పార్టీకి చెందిన డొనాల్డ్ ట్రంప్‌ల మధ్య హోరాహోరీగా పోటీ నెలకొంది. ప్రజాదరణ కమలా హారిస్‌కే కాస్త అధికంగా ఉన్నట్టు సర్వేలు వెల్లడిస్తున్నాయి. ఫలితాలను నిర్ణయించే కీలక రాష్ట్రాల్లో మాత్రం నువ్వా నేనా అన్న పరిస్థితి ఉండడంతో ఉత్కంఠ నెలకొంది. ఎన్‌బీఎస్ న్యూస్ సంస్థ తాజాగా 1,000 మంది రిజిస్టర్డ్ ఓటర్లతో సర్వే నిర్వహించింది. ఇందులో 49% మంది కమలకు, 44% మంది ట్రంప్‌నకు అనుకూలంగా ఓటు వేస్తామని తెలిపారు.

ప్రజల మనోభావాలు దెబ్బతీయడమే జగన్ లక్ష్యం: అనగాని

రేపల్లె, సెప్టెంబరు 23: 'సనాతన ధర్మాన్ని కాపాడడంలో వైసీపీ ప్రభుత్వం పూర్తిగా విఫలమయింది. తిరుమల లడ్డూకు ఉన్న ప్రతిష్ఠను జగన్ ప్రభుత్వం దిగజార్చింది' అని మంత్రి అనగాని సత్యప్రసాద్ విమర్శించారు. సోమవారం బాపట్ల జిల్లా రేపల్లెలో ఆయన మాట్లాడుతూ... 'ఎంతో ప్రాచుర్యం కలిగిన తిరుమల లడ్డూను వైసీపీ పాలనలో బోర్డు అప్రతిష్ఠపాలు చేసింది. ప్రజల మనోభావాలు దెబ్బతినే విధంగా లడ్డూను కల్తీ చేయడం హేయమైన చర్య. జగన్ చేస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను సొంత పార్టీవారే జీర్ణించుకోలేకపోతున్నారు. ఒక్కొక్కరుగా ఆ పార్టీని వీడి వేరే పార్టీల్లోకి చేరుతున్నారు. త్వరలో వైసీపీ ఖాళీ అవ్వడం ఖాయం' అని అన్నారు.

ఆంధ్రజ్యోతి
దిక్సూచి
విజయవాడ ● మంగళవారం 24 సెప్టెంబరు 2024
diksuchi@andhrajyothy.com

కరెంట్ అఫైర్స్ / జనరల్ ఎస్సే

వరదలు - ఒక హెచ్చరిక



ఆది మానవుని నుంచి నేటి వరకు మనిషి నాగరికత, ఆధునికత సంతరించుకునే క్రమంలో అనేక సవాళ్లను అధిగమిస్తూ ముందుకు వెళ్తున్నాడు. నేటి ఆధునిక సమాజంలోనూ భిన్నమైన సవాళ్లు అతని ఎదుట పొంచి ఉన్నాయి. అతిచేస్తే గతి చెడుతుందంటారు. అవసరానికి మించిన వేగంతో వెళ్తున్న మానవాళికి ప్రకృతి నుంచి నేడు ప్రతిఘటన ఎదురవుతోందన్న పరిశీలనలు, వాదనలు ప్రపంచవ్యాప్తంగా వెల్లువెత్తుతున్నాయి. గ్లోబల్ వార్మింగ్ వాటిలో ఒకటి. విపరీతమైన నగరీకరణ మరోటి. పగ్గాలు లేని దూకుడుతో వెళ్తున్న మానవ జీవనశైలి మూడోది. వెరసి మనిషి ప్రకృతిని పరిహాసం చేస్తున్నాడా అనిపిస్తుంది. ప్రకృతి ప్రకోపిస్తే ఏమవుతుందో ఇటీవల ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్న పరిణామాలు తేటతెల్లం చేస్తున్నాయి.

వియత్నాంలో తాజాగా చూసిన 'యాగి' పెను తుపాను బీభత్సం ఒక ఉదాహరణ. మనదేశంలో పడగ విప్పుతున్న ప్రకృతి బుసలు అనేకం తస్మాత్ జాగ్రత్త అని హెచ్చరికలు పంపుతున్నాయి. ప్రకృతి పోకడల విషయంలో మానవాళి ముఖ్యంగా భారతీయ నిపుణులు అనేక సమీక్షలు జరపాల్సిన అవసరం కనిపిస్తోంది.

మానవుని ప్రతీ అవసరాన్ని తీర్చగల శక్తి ప్రకృతికి ఉంది. కానీ, వారి అత్యాశను అది తీర్చలేదని అంటారు మహాత్మాగాంధీ. ప్రకృతి అందచేసింది తీసుకోవాలి కాని ఎగబడి లాక్కోరాదని గతంలో పెద్దలు హెచ్చరించేవారు. మనం జరుపుకునే ప్రతి పండుగ వెనక ప్రకృతి ఆరాధన అంతర్లీనంగా ఇమిడి ఉంటుంది. కానీ నేడు ప్రకృతి వనరులను విచ్చలవిడిగా కొల్లగొడుతున్నారు. భూమి, సముద్రం, గాలి, నీరు, అంతరిక్షం ఇలా యావత్ పర్యావరణం మనిషి ఆధునిక అరాచకాలకు బలైపోతోంది. కాలాలు గతి తప్పుతున్నాయి. నెలకు మూడు వానలు కురవాల్సిన రోజులు పోయి 30 నిమిషాల్లో మొత్తం వాన ఒకే ప్రదేశంలో క్లౌడ్ బరస్ట్ రూపంలో కురుస్తున్న విధానాలు ఎన్నడూ చూడని వరదల సవాళ్లను విసురుతున్నాయి. సముద్ర, నదీ తీరాలు, వాగులు, ఏరులు, వంకలు, కొండ జలపాతాలు అన్నీ తమ ఉనికిని ప్రశ్నిస్తున్న మానవాళిని పునరాలోచనలో పడేలా చేస్తున్నాయి. కేదార్‌నాథ్ మహా ఉత్పాతం మొదలు మొన్నటి కేరళ వయనాడ్‌లో కొండ వరదలు అనేక మందిని కబళించి తమ ఆగ్రహాన్ని చూపాయి. చెన్నై, ముంబయి, ఢిల్లీ, హైదరాబాద్ నగరాలు వరదల్లో తరచూ మునుగుతుండటం చూస్తూనే ఉన్నాం. కృష్ణా నదికి ఉపనది అయిన మున్నేరు వాగు, చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా భీకరంగా పొంగి ఖమ్మం జిల్లాను కన్నీటిలో ముంచెత్తగా, ఒక చిన్న బుడమేరు వాగు విజయవాడ వాసులను వారం రోజులపాటు బావురుమనిపించింది. 11.20 లక్షల క్యూసెక్కుల మహా జలప్రవాహంతో కృష్ణానది ఉధృతంగా ప్రవహించి భవిష్యత్తులో పొంచి ఉన్న ప్రమాదాలకు సంకేతంగా నిలిచింది. ఈ విపరిణామాలకు విరుగుడు- ప్రగతిపథంలో ప్రకృతి పర్యావరణ అంశాలకు ప్రథమ ప్రాధాన్యం ఇవ్వడమే.

వరదలు ఎందుకు వస్తాయి?

అధిక వర్షాలు వరదలకు ప్రధాన కారణమని తెలిసిన విషయమే. ప్రకృతి తన పని సాధారణ స్థితిలో చేసుకుపోతుంటే నెలకు మూడు వానలు కురిసి మానవాళికి మేలు చేస్తాయి. అడవులు, వ్యవసాయం వంటి పచ్చదనం గల ప్రాంతాల్లో చల్లని వాతావరణంలో మేఘాలు పిలిచినట్లు వచ్చి వానలు కురిపిస్తాయి. గ్రామాల్లో చెరువులు, కుంటలు జలాలతో కళకళలాడతాయి. ఇది ప్రకృతి. కానీ పరిశ్రమలు, వాహనాలు వెదజల్లుతున్న కాలుష్యం, అడవుల నరికివేత, నగరీకరణ పేరిట ఇంటింటా చెట్లు నరికివేత, సామాజిక వనాల కనుమరుగు వంటి వాటివల్ల భూమి వేడెక్కుతోంది. దీనిని భూతాపం(గ్లోబల్ వార్మింగ్) అంటారు. ఈ ప్రక్రియ వల్ల వానాకాలం తీరుతెన్నులే మారిపోతున్నాయి. రుతుపవనాల రాకపైనా ప్రభావం పడుతోంది. ఇదంతా వికృతి. ఫలితంగా వానలు ఎప్పుడు ఎక్కడ భళ్లుమని కురుస్తాయో కూడా అంచనా వేయలేని పరిస్థితి వచ్చింది. మేఘాల కదలికలు కూడా అనూహ్యంగా మారుతున్నాయి. నగర ప్రాంతాల్లో క్లౌడ్ బరస్ట్ అనే ఫినామినా కొన్నేళ్లుగా బాగా వినిపిస్తుంది. ఏడాదంతా కురవాల్సిన వాన ఒకచోట ఒకేరోజున కొన్ని గంటల్లో భళ్లున కురుస్తోంది. దీనివల్ల నదులు, చెరువులు, వాగులు, వంకలు ఉన్న ప్రాంతాల్లో సాధారణంగా కనిపించే వరదలు నేడు నగరాలను ముంచేస్తున్నాయి. కొండ పర్వత ప్రాంతాల్లో వాణిజ్య వ్యాపార కార్యక్రమాలు, రహదారుల నిర్మాణం వల్ల అవి పటుత్వం కోల్పోయి కొండ చరియలు జారి పడిపోతున్నాయి. మైదాన ప్రాంతాలు కనుమరుగు అవుతున్నాయి. ఆయా ప్రాంతాల్లోని గుంతలు, కుంటలు నీటిని తమలో ఇముడ్చుకుంటాయి. ప్రస్తుతం ఆ వెసులుబాటు లేదు. గ్రామాలు, పట్టణాలు, నగరాలు వీధి వీధినా సిమెంట్ రోడ్లు వచ్చేశాయి. కానీ వాననీరు ఇంకేవిధంగా లేదా స్థానికంగా ఒడిసిపట్టి ఆపడానికి మరికొన్ని ఏర్పాట్లు అవసరమని తాజా పరిణామాలు హెచ్చరిస్తున్నాయి. ఆక్రమణలకు గురైన చెరువులు, కుంటలను మళ్లీ సాధారణ స్థితికి తీసుకురావాలి. అందుకు తెలంగాణ ప్రభుత్వం చొరవగా 'హైడ్రా' వ్యవస్థను తీసుకువచ్చింది. చెరువుల్లో ఆక్రమణలను తొలగిస్తోంది. అంతేకాదు కొన్ని లక్షల లీటర్ల సామర్థ్యం గల లోతైన బావులను తవ్వించి వరద నీటిని నిల్వచేసి, మూసీనదికి మళ్లించే వ్యవస్థను తెస్తామని తెలంగాణ ముఖ్యమంత్రి చేసిన ప్రకటన రాజధాని హైదరాబాద్ ప్రజలకు ఊరటేనని చెప్పాలి. కకు అనేక రకాలుగా ఉపయోగపడతాయి. జీవవైవిధ్యానికి దోహదం చేస్తాయి. భూగర్భ జలాల పెంపుదలకు సహకరిస్తాయి. పూర్వకాలంలో ప్రతి చెరువు ఆవిర్భావం వెనుక ఆసక్తికరమైన కథలు కూడా ఉంటాయి. అనేకమంది త్యాగఫలంగా వాటిని పిలుస్తారు. జానపద కథగా గౌరవిస్తారు.

అదేవిధంగా సముద్ర తీరాలను కూడా కాపాడుకోవాలి. మడ అడవుల సంరక్షణ ఇందుకు ఎంతో అవసరం. కానీ అభివృద్ధి పేరిట వాటిని నరికివేసి, రిసార్టుల నిర్మాణం చేపడుతుండటం మరో విపరిణామం.

ఇంటింటా ఇంకుడు గుంతలకు బదులు ఇంటింటా ఇంకుడు బావి అవసరం అన్నది నగర ప్రజల వరద కష్టాలు నేర్పుతున్న పాఠం.

చెత్త, మురుగునీటి వ్యవస్థల విఫలం

అంతేకాదు మురుగునీటి పారుదల వ్యవస్థలను ఎప్పటికప్పుడు శుభ్రపరచాలి. డ్రైనేజీల పూడిక కూడా నగర వరదలకు కారణమవుతున్నాయి. చెత్త నిర్వహణలోనూ పాలనపరంగా, ప్రజలపరంగా అనేక మార్పులు రావాల్సి ఉంది. వివిధ రకాల చెత్తను ఎలా పారవేయాలన్న దానిపై ప్రజలకు ఒక అవగాహన అన్నది లేదు. చెత్త తీసుకువెళ్లడం ప్రభుత్వ బాధ్యత అనే ఆలోచన నుంచి చెత్త తగ్గింపు, అదో ఆదాయ వనరుగా మార్చడం అనే విషయాలపై అవగాహన పెంచడానికి ఎంతో ప్రచారం జరగాలి. చెత్త పునర్వినియోగం లేదా నియంత్రణ విధానాలపై పరిశోధన - అభివృద్ధి జరగాలి. నగర వరదల నివారణకు నేటి తరం యువత కొత్త కొత్త ఆలోచనలతో ముందుకు రావాల్సిన సమయమిది. ఉదాహరణకు పాత చెప్పులు మళ్లీ అదే షాపు వారికి ఇవ్వడం. అలా సేకరించిన వాటిని రీసైక్లింగ్ విధానంలో పునర్వినియోగానికి తీసుకురావడం. ఆన్‌లైన్ షాపింగ్ ప్యాకింగ్ నుంచి పెళ్లి భోజనాల వ్యర్థాల వరకు అన్నీ కలిసి మురుగునీటి పారుదల నుంచి పర్యావరణ సమస్యలను తీసుకువస్తున్నాయి. సముద్రాలు, నదులు, కాలువలు, కుంటలు కూడా వ్యర్థాల బారిన పడుతున్నాయి. ఈతరహా చిన్న చిన్న సమస్యలు ముదిరి నగర వరదలకు కారణమవుతున్నాయి.

వాననీరు వెళ్లే దారి లేక పట్టణాలు, నగరాలు చిన్నపాటి వానకే రహదారి నదులుగా మారిపోతున్నాయి. చెరువుల నిర్వహణ కూడా సమస్యాత్మకమవుతోంది. ఏళ్ల తరబడి పూడిక తీయకపోవడం వల్ల క్రమేణా అవి మైదానాలుగా మారిపోతున్నాయి. పట్టించుకునే వారు కానరాక కాలక్రమంలో ఆక్రమణలకు గురవుతున్నాయి. అక్కడ ఫామ్‌హౌస్‌లు, నిర్మాణాలు, వ్యాపార, విద్యాసంస్థలు రావడం హైదరాబాద్‌లో తాజా చరిత్ర. అందువల్లే హైదరాబాద్‌కు వరద కష్టాలు.

నీటి పారుదల విభాగాల లోపం

ఇక గ్రామాల్లోని చెరువుల పరిస్థితి భిన్నంగా లేదు. నిర్వహణ లేక అవి పూడిపోతున్నాయి. వాటిలోని పూడిక తీస్తూ ఎప్పటికప్పుడు గట్లను పటిష్టీకరించుకుంటే చెరువులు జలాలను ఒడిసిపట్టి మానవాళి జీవి

బుడమేరు

కృష్ణాజిల్లా మైలవరం ప్రాంతంలోని కొండల్లో పుట్టిన బుడమేరు విజయవాడ, గుడివాడ, ఆకివీడు ప్రాంతాల మీదుగా ప్రవహించి కొల్లేరు సరస్సులో కలుస్తుంది. పొడవు 164 కిలోమీటర్లు. వర్షాకాలంలో ఇది విపరీతంగా పొంగి విజయవాడ సమీపంలోని పొలాలు, నివాస ప్రాంతాలను ముంచెత్తుతుంది. అందువల్ల దీనిని విజయవాడ దుఃఖదాయిని అని పిలుస్తారు. ఆగస్టు నెలాఖరు రోజుల్లో కురిసిన భారీవర్షాలకు బుడమేరు పొంగింది. కాలువ పరిసరాల్లో ఆక్రమణలు విపరీతంగా రావడంతో మూడుచోట్ల గట్టు తెగి, సింగ్‌నగర్ పరిసర ప్రాంతాలను ముంచెత్తింది. 15 శాతం మేర విజయవాడ మునకకు గురైందని అంచనా. ఇదే సమయంలో కర్ణాటక నుంచి ఎగువ అన్ని ప్రాజెక్టులు నిండి నీళ్లు వదలడం, ఉపనది మున్నేరు పరీవాహక ప్రాంతంలో భారీ వర్షాలు కురవడం వల్ల వరదలు పోటెత్తి విజయవాడ వద్ద కృష్ణానదిలో చరిత్రలోనే రికార్డు స్థాయిలో 11.48 క్యూసెక్కుల జల ప్రవాహం ఉధృతంగా మహోగ్రంగా కదిలింది. అదృష్టవశాత్తు నెమ్మదిగా శాంతించడంతో సాధారణ పరిస్థితులు నెలకొన్నాయి. కానీ బుడమేరు ప్రజలకు కలిగించిన కష్టాలు అన్నీ ఇన్నీ కావు. ఒకేసారి బుడమేరు, కృష్ణానది తెచ్చిన కష్టాలు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాన్ని మేలుకొలిపాయి. అలాగే ఖమ్మంలో మున్నేరు బీభత్సం సృష్టించింది. దీంతో అక్కడ ఆక్రమణలపై తెలంగాణ సర్కారు దృష్టి సారించాల్సిన అవసరం ఏర్పడింది.

ఒక్కసారి ప్రకృతి ప్రకోపిస్తే, ఒక దశాబ్దం అభివృద్ధి కొట్టుకుపోయినట్లే అన్న నిపుణుల హెచ్చరికలను తాజా పాలకులు గుర్తుచేసుకోవాలి. మున్నేరు వాగు, బుడమేరులు ఒకే సమయంలో కలిసి చేసిన నష్టం అందుకు తాజా దాఖలా! ప్రపంచంలో పేరుపొందిన న్యూయార్క్, సిడ్నీ, లండన్ వంటి మహానగరాలు కూడా నదుల ఒడ్డునే ఉన్నాయి. కానీ మన నగరాలు ఎదుర్కొంటున్న సమస్యలు వాటికి లేవు. ప్రణాళికాబద్ధమైన నగర నిర్మాణం, క్రమశిక్షణాయుతమైన ప్రజా జీవనవిధానాలు అందుకు కారణం.

దేశంలో వరదపీడిత ప్రాంతాలు చాలా ఎక్కువ. 329 మిలియన్ హెక్టార్ల(32.9 కోట్ల హెక్టార్ల) విస్తీర్ణం గల భూమిలో 40 మిలియన్ హెక్టార్ల(4కోట్ల హెక్టార్ల) ప్రాంతం వరద తాకిడికి గురవుతోంది. సముద్ర, నదీ, తటాక తీరాలు, కొండవాలు, ముంపు ప్రాంతాలు వీటి కిందకు వస్తాయి. వరదల వల్ల ప్రాణ, ఆస్తి నష్టాలు అపారంగా ఉండి, దేశ ఆర్థికవ్యవస్థ ఎదుగుదలకు చేటుచేస్తాయి. దేశంలో సంభవించే అన్ని ప్రకృతి వైపరీత్యాల మరణాల్లో 40 శాతం వరదల వల్లే నమోదవుతున్నాయి. బంగ్లాదేశ్ తరవాత వరదలు సంభవించే దేశాల్లో భారత్ రెండోస్థానంలో ఉంది. 1980-2024 మధ్య దేశంలో దాదాపు 250 సార్లు వరదలు సంభవించాయి. వీటివల్ల దాదాపు 60 బిలియన్(అరువేల కోట్ల) డాలర్ల మేర ఆర్థిక నష్టాలు వాటిల్లాయని ప్రభుత్వం రాజ్యసభలో తెలిపింది. లక్షా 30వేలమంది మృత్యువాత పడగా, ప్రజలకు ఆస్తి నష్టం, పశుసంపద నష్టం మరో కోణం. దేశంలోని నాలుగు కోట్ల హెక్టార్ల వరద ప్రమాద ప్రాంతం మొత్తం దేశ విస్తీర్ణంలో 12వ శాతం. కనుక వరద ముప్పు, ముంపు దేశంలో ఎక్కడైనా ముంచుకొస్తుందంటే ఒక శత్రుదేశం దండెత్తి వస్తున్నట్లే లెక్క. 2013 నాటి కేదార్‌నాథ్ పర్వత వరదలు, 2018 నాటి కేరళ వరదలు జాలికి నేర్పిన పాఠమిది. వరదల వల్ల వ్యవసాయం దెబ్బతింటుంది. పంట కోల్పోవడమే కాకుండా, ఇసుక మేటల తొలగింపు రైతులకు మోయలేని కష్టమవుతుంది. అవి పంటకు పనికిరాకుండా పోతాయి కూడా. రోడ్లు, రైలు పట్టాలు కొట్టుకుపోవడం, వంతెనలు కుంగిపోవడం, విద్యుత్ స్తంభాలు పడిపోవడం వంటివి మౌలిక సౌకర్యాల రంగానికి వాటిల్లే నష్టాలు. ఇవన్నీ ఆర్థికవ్యవస్థపై ప్రతికూల ప్రభావం చూపే పరిణామాలే. ఈ ఏడాది కజిరంగా జాతీయ ఉద్యానవనం వరద బారిన పడినప్పుడు ఒంటికొమ్ము ఖడ్గ మృగాలు అనేకం చనిపోవడం జీవ వైవిధ్య నష్టం.

ప్రతి అయిదేళ్లకు ఒకసారి లేదా అంతకన్నా ఎక్కువ పర్యాయాలు వరద బారిన పడే ప్రాంతాలను వరద పీడిత ప్రాంతాలుగా పేర్కొంటారు. బ్రహ్మపుత్ర నదీలోయ ప్రాంతం(అసోం), గంగానదీ లోయ ప్రాంతం(బిహార్, పశ్చిమ్‌బంగ), దామోదర నదీలోయ ప్రాంతం, గోదావరి, కావేరి, కృష్ణానది డెల్టా అలాగే సింధునది, ఉపనదుల ప్రాంతాలు వీటిలో ఉన్నాయి. పశ్చిమ కనుమలైన కేరళ, మహారాష్ట్ర కూడా వరద పీడిత ప్రాంతాల కిందకు వస్తాయి.

వరద అంచనా, నియంత్రణ, పునరావాసం

నిన్న మొన్నటి వరకు వాన రాకడ తెలిసేది. వరుణ పూజలు, కప్పల పెళ్లిళ్లు జరిపేవారు. వానదేవుడి ప్రార్థన పాటలు సినిమాల్లో చూసేవాళ్లం. ఇప్పుడు రోజులు మారాయి. టెక్నాలజీ వచ్చింది. ఉపగ్రహాలు మేఘాల కదలికలను, వాతావరణ సూచనలను వివరిస్తున్నాయి. ముందుగానే పొంచి ఉన్న ప్రమాదాలను అవి హెచ్చరిస్తున్నాయి. ఇందుకోసం ప్రభుత్వపరంగా కొన్ని వ్యవస్థలు కూడా ఆవిర్భవించాయి. వాటిలో ఒకటి భారత వాతావరణ వ్యవస్థ(ఇండియన్ మెటిరియాలజికల్ డిపార్ట్‌మెంట్).

యాగి తుపాను

2024 సెప్టెంబరు 17న వియత్నాంలో 'యాగి' తుపాను విలయాన్ని సృష్టించింది. గంటకు 149 కిలోమీటర్ల వేగంతో గాలులు వీయడం, ఆకస్మికంగా కురిసిన కుండపోత వర్షం వల్ల భారీగా ప్రాణ, ఆస్తి నష్టాలు సంభవించాయి. ఈ తుపాను ఫిలిప్పీన్స్, చైనా, లావోస్, మయన్మార్, థాయ్‌లాండ్, చైనా దేశాలపై కూడా ప్రభావం చూపించింది.

మిషన్ మౌసం

పర్యావరణ మార్పుల కారణంగా ఊహించని వాతావరణ పరిస్థితులు ఏర్పడుతున్నాయి. కృత్రిమమేధ, మిషన్ లెర్నింగ్ వంటి సాంకేతికతలను వీటిని అంచనా వేయడానికి భారత ప్రభుత్వం సంకల్పించింది. ముందస్తు, కచ్చితమైన అంచనాలు వేయడానికి భారత వాతావరణశాఖ, ఉష్ణమండల వాతావరణ కేంద్రం, మధ్యస్థశ్రేణి వాతావరణ ముందస్తు అంచనాల కేంద్రం కలిసి పనిచేస్తాయి. దీనికోసం భారత ప్రభుత్వం రానున్న అయిదు సంవత్సరాల్లో రెండువేల కోట్లతో కార్యాచరణ అమలుకు రంగం సిద్ధం చేసింది.

హైడ్రా

హైదరాబాద్ నగరంలో ఆక్రమణలకు గురైన చెరవులు ఎఫ్‌టిఎల్, బఫర్‌జోన్ పరిధుల్లో నిర్మించిన అక్రమ కట్టడాలను కూల్చి చెరువుల పునరుద్ధరణకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఒక సంస్థనే హైడ్రా(హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీ). ఇటీవల ఈ సంస్థ అనేక అక్రమ నిర్మాణాలను కూల్చి, చెరువుల స్థలాలను పునరుద్ధరించడం మనం చూశాం. ఇది రాష్ట్రంలో ఇతర పట్టణాలకు, దేశానికి కూడా అవసరం.



ఎం.బాలలత,
సివిల్స్ మెంటార్

ఎన్‌డీఎంఏ

భారత భూశాస్త్ర మంత్రిత్వశాఖ పరిధిలోని ఐఎండీ దేశంలోని వర్షపాతం, తుపానులు వంటి వాటిని ముందే పసిగట్టి అప్రమత్తం చేస్తుంది. తుపానులు, వరదల వంటి ఉపద్రవాలను ఎదుర్కొనే కార్యకలాపాలను నేషనల్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అథారిటీ(ఎన్‌డీఎంఏ) పర్యవేక్షిస్తుంది. కష్టకాలంలో కార్యరంగంలోకి దూకడానికి సహాయ కార్యకలాపాలు అందచేయడానికి నేషనల్ డిజాస్టర్ రెస్పాన్స్‌ఫోర్స్(ఎన్‌డీఆర్‌ఎఫ్) సిద్ధంగా ఉంటుంది. నదుల్లో నీటి ప్రవాహం, జలాల విడుదల వ్యవహారాలను హైడ్రాలజీ డేటాతో సహా రాష్ట్రాలకు నివేదించి నిర్వహణ పర్యవేక్షణ బాధ్యతలను సెంట్రల్ వాటర్ కమిషన్(సీడబ్ల్యూసీ) చూస్తుంది. నేషనల్ ఫ్లడ్ రిస్క్ మేనేజ్‌మెంట్ ప్రాజెక్టు(ఎన్ఎఫ్ఆర్ఎంపీ) ద్వారా ప్రజలకు అవగాహన కల్పించడం, ఉపశమనం, పునరావాసం, పునర్నిర్మాణం వంటి కార్యక్రమాలు చేపడతారు.

ఎన్‌డీఎంఏ బాధ్యతలు

- రిజర్వాయర్లు, డ్యామ్‌లను ఎప్పటికప్పుడు తనిఖీ చేసి భద్రతను నిర్ధారించాలి.
- వర్షాకాలానికి ముందే రిజర్వాయర్లు, డ్యామ్‌లలో పూడికతీత కార్యక్రమాలు చేపట్టాలి.
- చెట్ల పెంపకం, వాటర్‌షెడ్ కార్యక్రమాలు చేపట్టాలి.
- వరదనీరు జనావాసాల్లోకి రాకుండా ఆనకట్టలు, గోడలు నిర్మించి దారి మళ్లింపు చర్యలు చేపట్టాలి.
- వరద ప్రాంతాలను ప్రత్యేకంగా జోనింగ్ చేసి, అక్కడ ప్రజలను వరద ప్రభావానికి ముందే జాగ్రత్తలు తీసుకునే చర్యలు చేపట్టాలి.
- వరద నష్టాలు వీలైనంత తక్కువ ఉండేలా జాగ్రత్తలు పాటించడం.
- వరద నియంత్రణలో సామాజిక భాగస్వామ్యం పెరిగేలా శిక్షణ కార్యక్రమాలు నిర్వహించడం, స్వచ్ఛంద సేవలకులకు ఎన్‌డీఎంఏ శిక్షణ అందించడానికి ఆపదమిత్ర అనే ప్రాయోజిత కార్యక్రమం చేపట్టడం.
- వరద సమాచారాన్ని ఎప్పటికప్పుడు అందించడానికి కేంద్ర జలసంఘం(సీడబ్ల్యూసీ) ఒక మొబైల్ యాప్ ఫ్లడ్‌వాచ్‌ను అభివృద్ధి చేసింది.


లిటిల్స్

దేవుని ఏర్పాటు




ముకుందాపురంలో ఉండే రవి అనే యువకుడికి దేనికైనా, ఎవరికైనా వంకలు పెడుతూ అది అలా ఎందుకుంది? ఇది ఇలా ఎందుకు ఉంది? అని వాదించడం అలవాటు. ఊరి వారంతా ఏదో రకంగా అతనికి మంచి బుద్ధి వస్తే బాగుండు అనుకునే వారు. ఒకరోజు రవి అడవి మార్గంలో నడిచి వెళుతూ, ఒక పెద్ద మర్రి చెట్టును, ఇంకా ఆ పక్కనే నేలమీద పాకుతున్న గుమ్మడి తీగను, దానికి కాసిన కాయలను చూసాడు. వెంటనే తన సహజమైన బుద్ధితో ఇదేమి సృష్టి? ఇలా ఉంది? అంత పెద్ద చెట్టుకు అంత చిన్న కాయలు కాయడం, ఇంత సన్నని తీగకు ఇంత పెద్ద కాయలు కాయడం ఏమీ బాలేదు అనుకున్నాడు. ఆ చెట్టు నీడ, దాని చల్లదనం చూసి, కాసేపు విశ్రాంతి తీసుకుందాం అని ఆ చెట్టు కింద పడుకొని అలాగే నిద్ర పోయాడు. రవి నిద్ర లేచేసరికి, తన మీద కొన్ని చిన్న చిన్న మర్రి కాయలు పడి ఉన్నాయి. అవి తను నిద్ర పోతూ ఉండగా చెట్టు మీదనుండి రాలి తన మీద పడ్డాయని గ్రహించాడు రవి. వెంటనే అతనికి హఠాత్తుగా నిద్ర పోవడానికి ముందు తాను సృష్టి గురించి తప్పుగా అనుకున్నది గుర్తు వచ్చింది. 'నిజంగా అంత పెద్ద గుమ్మడికాయలు ఈ మర్రిచెట్టుకు కాసి ఉంటే, అంత ఎత్తునుండి అవి నామీద ఈ మర్రి పళ్ల లాగా పడి ఉంటే నేను ఏమైపోయేవాడినో' అనుకొని, దేవుని సృష్టి ఆయన చేసిన ఏర్పాట్లు వంక పెట్టడానికి వీలు లేనంత మంచివి అనుకొని లేచి, తన ఊరికి వెళ్లిపోయాడు. ఆ రోజు మొదలుకొని అన్నిట్లో లోపాలు వెతకడం మానుకున్నాడు రవి.

10 తేడాలను కనిపెట్టండి




ఎన్ని జంతువులు ఉన్నాయి?



సరైన నీడ ఏది?



దారి కనుక్కోండి



డైలీ సుడోకు - 417

			9	4			5	
8	4						3	7
	5	9			8			3
5				1		2	7	
	3	8		5				1
3			8			9	4	
4	2						8	6
	9			3	5			

సుడోకు - 416 సమాధానం

2	1	7	4	6	8	3	9	5
4	3	9	5	7	2	8	6	1
5	8	6	1	3	9	2	7	4
3	9	2	6	4	5	1	8	7
6	4	5	8	1	7	9	2	3
8	7	1	2	9	3	4	5	6
1	6	8	9	5	4	7	3	2
7	2	4	3	8	6	5	1	9
9	5	3	7	2	1	6	4	8

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.